

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 167

SUNDAY Special | ఆదివారం 7-9-2025



సినెర్ X అల్‌కరాజ్

నేడు జరిగే యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్-2 ఆటగాళ్లు యానిక్ సినెర్, కార్లోస్ అల్‌కరాజ్ తలపడనున్నారు. సెమీస్‌లో అలియసిమ్‌పై సినెర్, జొకోవిచ్‌పై అల్‌కరాజ్ గెలిచారు. -12లో



ఓల్డ్ ఈజ్ గోల్డ్

వయసైపోయి, శక్తి ఉడిగిందని గ్రాండ్ పేరెంట్స్‌ని చులకనగా చూడకండి. ఇంటి నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్ దాకా కావల్సినంత ఇన్ఫో ఇస్తున్నారు. వారితో కనెక్టివిటీని పెంచే ఉద్దేశంతోనే 'గ్రాండ్‌పేరెంట్స్ డే' సెలబ్రేషన్ మొదలైంది. -11లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మూడ్రోజుల్లో ముగియలేదు

పాక్‌తో ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ మొదలెట్టిన పోరు మూడ్రోజుల్లో ముగిసిపోలేదని భారత ఆర్మీ చీఫ్ జనరల్ చెప్పారు.

- వివరాలు 6లో▶



ఎర్రకోటలో భారీ చోరీ

ఢిల్లీ ఎర్రకోటలో ఓ దొంగ జైన గురువు వేషధారణలో వచ్చి రూ.కోటి విలువైన బంగారు కలశాన్ని ఎత్తుకెళ్లిపోయాడు.

- వివరాలు 6లో▶



కెనడా నుంచే ఆర్థిక దన్ను

రెండు స్థానిక ఖలిస్తానీ అతివాద సంస్థలకు కెనడా నుంచే ఆర్థిక మద్దతు అందుతున్నట్టు కెనడా ప్రభుత్వ నివేదిక తేల్చింది.

- వివరాలు 6లో▶



మరణించినా 'మోస్ట్‌వాంటెడ్'లే!

టాప్ మావోయిస్టు నేతలంతా ఎన్‌కౌంటర్లలో చనిపోయినా.. వారి పేర్లు ఇంకా ఎన్‌ఐఏ మోస్ట్ వాంటెడ్ జాబితాలోనే ఉన్నాయి.

- వివరాలు 14లో▶

రూ. 12 వేల కోట్ల డ్రగ్స్ సీజ్

కెమికల్ ఫ్యాక్టరీ మాటున భారీగా నిషేధిత మెఫిడ్రోన్ డ్రగ్ తయారీ

హైదరాబాద్ చర్లపల్లిలోని ఫ్యాక్టరీపై మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసుల దాడి



హైదరాబాద్ చర్లపల్లిలోని డ్రగ్స్ ఫ్యాక్టరీ

5.968 కిలోల మెఫిడ్రోన్ | **35,500** లీటర్ల రసాయనాలు

950 కిలోల మిథైలిన్ డైక్లోరైడ్ పొడి, ఇతర పదార్థాలు స్వాధీనం

- ఫ్యాక్టరీ నిర్వాహకుడు సహా మరొకరి అరెస్ట్.. వేర్వేరు చోట్ల 11 మందిని పట్టుకున్న మహారాష్ట్ర పోలీసులు
- దేశవ్యాప్తంగా ఈ డ్రగ్స్ సరఫరా...
- బంగ్లాదేశీ మహిళ అరెస్ట్‌తో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరం శివారులో కొంతకాలంగా భారీ స్థాయిలో సాగుతున్న డ్రగ్స్ తయారీ రాకెట్ గుట్టురట్టయింది. రసాయన కర్మాగారం మాటున డ్రగ్ మాఫియా నడుపుతున్న డ్రగ్స్ ఫ్యాక్టరీపై మహారాష్ట్ర క్రైం బ్రాంచి పోలీసుశాఖ మెరుపుదాడి చేసింది. ఏకంగా రూ. 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ తయారీ ముడిపదార్థాలను స్వాధీనం చేసుకుంది. చర్లపల్లి పారిశ్రామికవాడలోని నవోదయ కాలనీలో ఉన్న వాగ్దేవి ల్యాబ్స్ కెమికల్ ఫ్యాక్టరీలో శుక్రవారం సోదాలు చేపట్టి 5.968 కిలోల నిషేధిత మెఫిడ్రోన్ (ఎండీ) మాదక ద్రవ్యంతోపాటు 35,500 లీటర్ల ఇతర రసాయనాలు, 19 పెట్టెల్లోని 950 కిలోల మిథైలిన్ డైక్లోరైడ్ (ఎండీసీ) పొడి, ఎండీ తయారీకి వాడే ఇతర రసాయనాలను పట్టుకుంది. అలాగే వాగ్దేవి ల్యాబ్స్ నిర్వాహకుడు శ్రీనివాస్ విజయ్ వోలేటి, అతనితో కలిసి పనిచేస్తున్న తానాజీ పండరినాథ్ పట్వారీలను అరెస్టు చేసింది. ఈ మేరకు మహారాష్ట్రకు చెందిన మిరా-భయందర్, వసాయ్-విరార్ (ఎంబీవీవీ) పోలీసు కమిషనరేట్ సీపీ నికేత్ కౌశిక్ శనివారం స్థానిక మీడియాకు వెల్లడించారు. నెల రోజులుగా కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌లో చర్లపల్లిలో పట్టుబడిన ఇద్దరితో సహా మొత్తం 13 మందిని

మిగతా 14వ పేజీలో ▶

ఇంత జరుగుతున్నా..

- మహారాష్ట్ర పోలీసుల ఆపరేషన్‌తో ఉలిక్కిపడ్డ తెలంగాణ పోలీసులు
- రాష్ట్రం డ్రగ్స్ తయారీకి అడ్డాగా మారినా పసిగట్టలేకపోవడంపై సర్వత్రా చర్చ

- వివరాలు 14లో


గోవిందప్ప


ధనుంజయరెడ్డి


కృష్ణమోహన్‌రెడ్డి

మద్యం అక్రమ కేసులో ముగ్గురికి బెయిల్

గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు మంజూరు చేసిన ఏసీబీ కోర్టు

డీఫాల్ట్ బెయిల్ రాకుండా ఉండేందుకు అసంపూర్ణ చార్జిషీట్ దాఖలు చేయడం రాజ్యాంగ విరుద్ధం

డీఫాల్ట్ బెయిల్ అన్నది ప్రాథమిక హక్కే కాకుండా చట్టబద్ధమైన హక్కు అని సుప్రీంకోర్టు చెప్పింది

సంపూర్ణ చార్జిషీట్ లేకుండా 60/90 రోజులకు మించి రిమాండ్ పొడిగించడానికి వీల్లేదు

ప్రతి నిందితునికి వేర్వేరుగా చార్జిషీట్ దాఖలు చేసి బెయిల్‌ను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం

నేరాన్ని పరిగణనలో తీసుకోకుండా నిందితుల రిమాండ్ పొడిగించడం సాధ్యం కాదు: ఏసీబీ కోర్టు

10లో

కూటమి కుతంత్రం

అబద్ధాల గోడలతో అడ్డగోలుగా భేతాళ కథలు అల్లిన సిట్

వాటిని నిజం చేయడానికి అనుబంధ కథలతో తంటాలు

- వివరాలు 10లో

మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్ 10లో

న్యూస్‌రీల్

జిల్లాల పర్యటనకు కేటీఆర్



స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జిల్లాల పర్యటనకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దిశగా పార్టీ కేడర్‌ను సమాయత్తం చేయడంపైనా దృష్టి పెట్టనున్నారు.

- వివరాలు 2లో▶

10న రాష్ట్ర బీజేపీ నేతలతో ప్రధాని భేటీ



ఈ నెల 10, 11 తేదీల్లో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ముఖ్యనేతలతో ఢిల్లీలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, జేపీ నడ్డా సమావేశం కానున్నారు. ఈ భేటీలో బీజేపీ 'యాక్షన్ ప్లాన్'ను ఖరారు చేయనున్నారు.

- వివరాలు 2లో▶

'స్థానికం'పై కాంగ్రెస్‌లో తండ్లాట



స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అగ్ని పరీక్షగా మారాయి. బీసీలకు 42 % కోటా కల్పన అంశం కొరకరాని కొయ్యగా మారింది. అసలు ఎన్నికలకు వెళ్లాలో, వద్దో అర్థం కాని పరిస్థితుల్లో అధికార పార్టీ చిక్కుకుంది.

- వివరాలు 2లో▶

'సమ్మక్క సాగర్' చిక్కులు వీడేనా?



సమ్మక్క సాగర్ ప్రాజెక్టు చిక్కుల్లో పడింది. ఛత్తీస్‌గఢ్ ఎన్‌ఓసీ ఇచ్చేందుకు నిరాకరించగా ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన ఆయకట్టుకు బదులుగా మరోచోట 2 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించాలని సీడబ్ల్యూసీ కోరింది.

- వివరాలు 13లో▶

ఇదండీ సంగతి




హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం

ఆలస్యమైనా.. త్వరగా ముగిశాయి!

ప్రశాంతంగా ఖైరతాబాద్, బాలాపూర్ గణేశుల నిమజ్జనం 2లో

సాగర్ తీరంలో సీఎం సందడి

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన రేవంత్‌రెడ్డి



ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం సందర్భంగా భక్తుల మధ్యన సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన 2లో

ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా!


శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఎమ్మెల్సీ కవిత విమర్శలపై బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు

తన రాజకీయ ప్రస్థానం తెరిచిన పుస్తకమని వ్యాఖ్య

బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధిలో తన నిబద్ధత అందరికీ తెలుసని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. లండన్ పర్యటన ముగించుకొని శనివారం హైదరాబాద్ చేరుకున్న ఆయన శంషాబాద్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన కల్వకుంట్ల కవిత తనపై చేసిన విమర్శలపై హరీశ్‌రావు స్పందించారు. 'నా 25 ఏండ్ల రాజకీయ ప్రస్థానం తెలంగాణ ప్రజల ముందు తెరిచిన పుస్తకం లాంటిది. గత కొంతకాలంగా మా పార్టీపై, నాపై కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలనే ఆమె (కవిత) కూడా చేశారు. ఆ వ్యాఖ్యలు ఎందుకు చేశారో ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా. కేసీఆర్ నాయకత్వంలో గడిచిన రెండున్నర దశాబ్దాలుగా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా రాష్ట్ర సాధనలో, తెలంగాణ అభివృద్ధిలో నేను నిర్వహించిన పాత్ర, చూపిన నిబద్ధత అందరికీ తెలుసు'అని పేర్కొన్నారు.

ఎరువులు దొరక్క రైతుల ఇబ్బందులు

బీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని హరీశ్‌రావు తెలిపారు. 'ఈ రోజు రాష్ట్రంలో ఎరువులు దొరక్క ఒకవైపు రైతులు, మరోవైపు అనేక ప్రాంతాల్లో వరదల మూలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ దశాబ్దకాలంగా నిర్మించిన వ్యవస్థలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కూల్చే ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవడం, తెలంగాణ ద్రోహుల చేతి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడంపైనే మా దృష్టి ఉంటుంది. కేసీఆర్ నాయకత్వంలో తిరిగి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తెచ్చి ప్రజల కష్టాలను తొలగించడానికి అందరం కలిసికట్టుగా పనిచేస్తాం'అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన హరీశ్‌రావు బీహెచ్‌ఈఎల్ కార్మిక సంఘం నేత ఎల్లయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇటీవలే మాతృ వియోగం పొందిన తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని జగదేవ్‌పూర్ మండలం దౌలాపురంలో పరామర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి నివాసానికి హరీశ్‌రావు వెళ్లారు.

దోస్త్ మేరా దోస్త్!




మోదీ, నేను భాయీ భాయీ

భారత్‌ను మేం చైనాకు కోల్పోలేదు

ఒక్కరోజుకే ప్లేట్ ఫిరాయించిన ట్రంప్

మోదీ గొప్ప ప్రధాని అంటూ కితాబు

ఇప్పుడాయన చేస్తున్నదే నచ్చడం లేదు!

రష్యా, చైనాతో భారత్ నెయ్యంపై ఆక్రోశం

మారిన వైఖరిని అభినందిస్తున్నా: మోదీ

భారత్-అమెరికాలది వ్యూహాత్మక బంధం

అత్యంత హుందాగా స్పందించిన ప్రధాని 6లో

ఐరాస సర్వప్రతినిధి సభకు ప్రధాని మోదీ వెళ్లరు

వార్షిక సమావేశాలకు విదేశాంగ మంత్రి జై శంకర్

- వివరాలు 6లో▶

సివిల్స్‌పై సర్వే తప్పనిసరి!



- యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలో 0.1 శాతమే సక్సెస్ రేటు
- తొలి ప్రయత్నంలోనే సత్తా చాటేవారు 7 శాతమే
- ఒకటి కంటే ఎక్కువ ప్రయత్నాల్లోనే 93 శాతం మంది విజయం... లక్షల్లో అభ్యర్థులు పెరుగుతున్నా ఖాళీల సంఖ్య స్వల్పమే
- ఏటా 1,000కి మించి పెరగని పోస్టులు
- ప్రిపరేషన్‌కు సుదీర్ఘకాలం వెచ్చించాలి

- వివరాలు 3లో▶

అక్షరం తేడా ఉన్నా బిల్లు రాదాయె!

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కొత్త చిక్కు

- ఆధార్ ఆధారంగా బిల్లుల చెల్లింపు విధానం
- వాటిల్లో చాలా మంది మహిళలకు పుట్టింటి పేరు
- ఇందిరమ్మ రికార్డుల్లో అత్తింటి పేరు
- ఇలాంటి వాటితో నిలిచిపోతున్న బిల్లులు



జనగామ జిల్లాకు చెందిన వెంకటమ్మ పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఆమె పదేళ్ల క్రితం పుట్టింటి పేరుతో తీసుకున్న ఆధార్ కార్డునే ప్రస్తుతం వినియోగిస్తోంది. ఇటీవల ఆధార్ నంబర్ ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లించేలా అధికారులు మార్పులు చేశారు. అయితే వెంకటమ్మ ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రంలో అత్తింటివారి పేరు ఉండటంతో ఆధార్ వివరాలతో సరిపోలట్లేదంటూ అధికారులు బిల్లు చెల్లింపు నిలిపేశారు.

నల్లగొండకు చెందిన పెదబోయిన ఈశ్వరి పేరును గ్రామ కార్యదర్శి బృందం ఇందిరమ్మ ఇళ్ల రికార్డులో పి.ఈశ్వరిగా పేర్కొంది. కానీ ఆధార్‌లో ఉన్నట్టుగా పేరు లేకపోవటంతో ఆమెకు ఇందిరమ్మ బిల్లు అందలేదు. అప్పు తెచ్చి పనులు మొదలుపెట్టానని.. బిల్లు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నానని ఈశ్వరి వాపోతోంది.

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో సమస్యలు తలెత్తుతున్నాయి. తొలుత లబ్ధిదారులు అందించిన వివరాల ఆధారంగా వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా బిల్లులు జమ చేస్తూ వచ్చిన అధికారులు.. ఆయా వివరాలు తప్పుగా నమోదవటం వల్ల బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆధార్ నంబర్ ఆధారంగా చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టారు. అయినా సమస్యలు తగ్గకపోగా కొత్త ఇబ్బందులు మొదలయ్యాయి.

పొడి అక్షరాలతో పేర్లు...

గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలోని బృందాలు ఇందిరమ్మ లబ్ధిదారుల పూర్తి పేర్లను ఆధార్ కార్డుల్లోని వివరాల ప్రకారం నమోదు చేయాల్సి ఉండగా కొంత మంది లబ్ధిదారుల విషయంలో సిబ్బంది పొడి అక్షరాలతో సరిపుచ్చారు. ఇంకొందరి ఇంటిపేర్లను పూర్తిగా

మిగతా 5వ పేజీలో ▶

వర్కింగ్ మదర్.. ఎంతో ప్రెజర్!



- ఇంటా, బయటా నలిగిపోతున్న మహిళలు.. ఇల్లు, పిల్లలు ఉద్యోగంతో తీవ్రమైన ఒత్తిడి
- 'మగాళ్లు అర్థం చేసుకుంటే అదే పదివేలు'.. గుర్తింపు, గౌరవం ఇస్తే చాలంటున్న అతివలు

- వివరాలు 14లో▶



నిమజ్జనానికి తరలివెళ్తున్న ఖైరతాబాద్ గణేశుడు

సాగర్ తీరంలో సీఎం సందడి

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి

భక్తులతో స్వయంగా మాట్లాడి ఆనందాన్ని పంచుకున్న రేవంత్

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ వేదికపై నుంచి అభివాదం



గణేశ్ ఉత్సవ కమిటీ వేదికపై నుంచి భక్తులకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో రోహిన్‌రెడ్డి

ఖైరతాబాద్/కవాడిగూడ (హైదరాబాద్): వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుసేన్‌సాగర్ తీరంలో సాగుతున్న కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. హంగు, ఆర్భాటం లేకుండా సామాన్యుడిలా వచ్చిన సీఎం వేడుకల్లో పాల్గొన్న భక్తులు, సందర్శకులతో కలిసి నినాదాలు చేశారు. భక్త జనంతో కలిసిపోయి ముందుకు సాగిన ముఖ్యమంత్రితో భక్తులు ఫొటోలు తీసుకోవడంతో పాటు కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపారు. సాదాసీదాగా మూడు కార్లలో వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రేన్ నం–4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం అయిన చోటును పరిశీలించారు. నిమజ్జన ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయనే విషయాలను అధికారులు, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుగుతుండటంతో సిబ్బందిని, పోలీసులను ముఖ్యమంత్రి అభినందించారు. తెలుగుతల్లి చౌరస్తాలో ఏర్పాటుచేసిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ స్వాగత వేదికపైకి వచ్చి నిర్వాహకులతో కలిసి భక్తులకు అభివాదం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉత్సవాల్లో నేరుగా పాల్గొనడంతో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ముఖ్యమంత్రి వినాయక నిమజ్జనోత్సవాలకు రావడంతో అధికారులు, భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.

ఆలస్యమైనా.. త్వరగా ముగిశాయి!

ప్రశాంతంగా ఖైరతాబాద్, బాలాపూర్ గణేశుల నిమజ్జనం


సాక్షి, హైదరాబాద్: ఖైరతాబాద్ మహా గణపతి, బాలాపూర్ వినాయకుడి శోభాయాత్రలు ప్రశాంతంగా ముగిశాయని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన ఐసీసీసీలో మాట్లాడుతూ 'ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్ర ఉదయం 6.30కి ప్రారంభించాల్సి ఉండగా, 7.30కి ప్రారంభమైంది. నిమజ్జనం మధ్యాహ్నం 1.30కి పూర్తికావాలని టార్గెట్‌గా పెట్టుకున్నా 1:05 గంటలకే పూర్తి చేయగలిగారు. ఇక, బాలాపూర్ గణపతి శోభాయాత్ర కొన్ని అడ్డంకుల వల్ల రెండు గంటలు ఆలస్యమైనా సాయంత్రం 6:11 గంటలకు నిమజ్జనం పూర్తి చేశారు. నగరంలో మొత్తం 12,030 విగ్రహాలు నమోదు కాగా శుక్రవారం వరకు 7,500, శనివారం సాయంత్రానికి మరో 650 నిమజ్జనమయ్యాయి. పెద్ద విగ్రహాల్లో ఇంకా 4,500 విగ్రహాల నిమజ్జనం కావాల్సి ఉంది' అని వివరించారు.

ప్రశాంతంగా నిమజ్జనాలు: డీజీపీ

రాష్ట్రంలో గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుగుతోందని డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జనాల ప్రక్రియను.. శనివారం డీజీపీ తన కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో సమీక్షించారు. అనంతరం శాంతి భద్రతల అదనపు డీజీ మహేశ్ ఎం భగవత్, పీఅండ్ ఎల్ఐజీ ఎం.రమేశ్, శాంతి భద్రతల ఏఐజీ రమణకుమార్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో నిమజ్జనోత్సవాలను సీనియర్ అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వే చేస్తూ, డీజీపీ కార్యాలయం, బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. భద్రత విధుల్లో పోలీసులతో పాటు ఎక్సైజ్, అటవీ, ఆర్పీఎఫ్, టీజీఎస్పీ బెటాలియన్ల తదితర శాఖల సిబ్బంది కూడా పాల్గొంటున్నారని చెప్పారు. ఈసారి ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా నిమజ్జనం విధులు నిర్వహిస్తున్నారన్నారు.

బాలాపూర్ లడ్డూ రూ.35 లక్షలు

సొంతం చేసుకున్న దశరథ్‌గౌడ్



బడంగ్‌పేట్: ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసిన బాలాపూర్ గణనాథుడి లడ్డూను కర్మన్‌ఘాట్‌కు చెందిన చైతన్య స్టీల్, సిమెంట్ వ్యాపారి లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు వేలంపాటలో సొంతం చేసుకున్నారు. గతేడాది కన్నా ఈసారి రూ.5 లక్షలు అధికంగా పలకడం విశేషం. ఈ సందర్భంగా బాలాపూర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి.. లడ్డూ గ్రహీతను ఘనంగా సన్మానించారు.

'స్థానికం'పై కాంగ్రెస్‌లో తండ్లాట

ఏ మార్గంలో వెళ్లాలన్న దానిపై కొరవడిన స్పష్టత

- రోజుకో మలుపు తిరుగుతున్న బీసీ రిజర్వేషన్ల అంశం
- పూటకో ఆలోచనతో స్థానిక నాయకత్వంలో గందరగోళం
- అభిప్రాయ సేకరణ కోసం రేపు టీపీసీసీ కార్యవర్గం భేటీ



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అగ్ని పరీక్షగా మారాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశం పార్టీకి కొరకరాని కొయ్యగా మారింది. అసలు ఎన్నికలకు వెళ్లాలో, వద్దో అర్థం కాని పరిస్థితుల్లో అధికార పార్టీకి చిక్కుకుంది. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు సంబంధించి రాష్ట్రపతి వద్ద ఆర్డినెన్స్, గవర్నర్ వద్ద ఉన్న బిల్లుల భవితవ్యం ఎటూ తేలకపోవటంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో అధికార పార్టీ పడిపోయింది. ఒక దశలో వెంటనే ఎన్నికలకు వెళ్లాలని భావించినా.. తర్వాత ప్రభుత్వం మనసు మార్చుకుంది. గవర్నర్లు, రాష్ట్రపతి వద్దకు వెళ్లే బిల్లుల ఆమోదం విషయంలో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసు విచారణ తేలేవరకు వేచి ఉందామని నిర్ణయించింది. సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తే తమ ఆర్డినెన్స్ చట్టం అవుతుందని, అప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో చట్టబద్ధత చేకూరుతుందనే ఆలోచనకు వచ్చింది. దీంతో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), మంత్రివర్గ సమావేశం, పార్టీ అంతర్గత భేటీలు, సీఎం, పీసీసీ చీఫ్, ఇతర సీనియర్ మంత్రుల సమావేశాల్లో వచ్చిన అభిప్రాయాలన్నింటినీ పక్కన పెట్టి ఎన్నికలకు మరికొంత సమయం వేచి ఉండాలనే నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

కిందిస్థాయిలో గందరగోళం

రాష్ట్ర పార్టీ నాయకత్వంతో పాటు ప్రభుత్వ పెద్దల ఆలోచన, నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ కింది స్థాయి నాయకత్వాన్ని గందరగోళంలోకి నెడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికలకు వెళ్లడమేనన్న సంకేతాలు పార్టీ నుంచి వస్తుండగా, ఉన్నట్టుండి ఎన్నికలు వాయిదా పడతాయనే సమాచారంతో కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో స్థానికంగా వస్తున్న రాజకీయ విమర్శలను తిప్పికొట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంత చేసిన తర్వాత పార్టీపరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఎన్నికలకు వెళ్లడం మంచిది కాదని అభిప్రాయపడుతున్నారు. స్థానిక ఎన్నికల విషయంలో ఓ టైమ్‌లైన్ ఏర్పాటు చేసుకుని వెళ్లడమే మంచిదని సూచిస్తున్నారు.

రేపు కార్యవర్గ సమావేశం

స్థానిక ఎన్నికలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేయడంతో పాటు వారి అభిప్రాయాలు సేకరించేందుకు టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. గాంధీభవన్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హాజరు కానున్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీలు, అనుబంధ సంఘాల చైర్మన్‌లు, కార్పొరేషన్ల చైర్మన్లు ఇతర నాయకులకు ఈ సమావేశానికి రావాలని ఇప్పటికే సమాచారం అందింది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టులు, పార్టీ కమిటీలు, జైబాపూ–జైభీం–జై సంవిధాన్ కార్యక్రమ నిర్వహణపై చర్చ జరుగుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

17న 'హైదరాబాద్ లిబరేషన్ డే'

హాజరు కానున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాల్లో (హైదరాబాద్ లిబరేషన్ డే) భాగంగా.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. ఈ ఏడాది కూడా కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో.. పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్, మహారాష్ట్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొంటారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ పార్కులో దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహావిష్కరణ, ఇతర కార్యక్రమాల షెడ్యూల్ ఖరారైంది. తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధుల గాథలు, ఉద్యమ గాథలను వివరిస్తూ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుతో పాటు సమరయోధులను సన్మానించనున్నారు. ఈ మేరకు నగర బీజేపీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా.. 17న లిబరేషన్ డే వేడుకల నిర్వహణకు సంబంధించి సమగ్ర ప్రణాళిక, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కాగా, ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి చైర్మన్‌గా.. తెలంగాణ విమోచన ఉత్సవాల నిర్వహణ కమిటీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఏర్పాటు చేశారు.

సీఎంతో టీపీసీసీ అధ్యక్షుడి భేటీ

స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పదవులపై చర్చ



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్‌గౌడ్ శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిశారు. పీసీసీ అధ్యక్షుడిగా నియామకమై ఏడాది పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రిని పీసీసీ చీఫ్ కలిశారని, ఈ సందర్భంగా పీసీసీ చీఫ్‌ను సీఎం అభినందించారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఈ ఇద్దరి భేటీలో మరోమారు స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో పార్టీ క్షేత్రస్థాయి నాయకత్వానికి స్పష్టమైన సమాచారం పంపాలని, ఈ మేరకు సోమవారం జరిగే రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పార్టీ నేతలకు స్పష్టత ఇవ్వాలనే నిర్ణయానికి వారు వచ్చినట్టు తెలిసింది. ఇక, నామినేటెడ్ పోస్టులను వీలున్నంత త్వరగా భర్తీ చేయాలని, ముందుగా క్షేత్రస్థాయి నాయకులకు కార్పొరేషన్ డైరెక్టర్లు, బోర్డు సభ్యుల నియామకాలు ఇవ్వాలని కూడా ఇరువురు నిర్ణయించినట్టు సమాచారం. ఇక, పీసీసీ అధ్యక్షుడిగా ఏడాదికాలం పూర్తి చేసుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అభినందించారు.

జిల్లాల పర్యటనకు కేటీఆర్

10, 11న కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లో పర్యటన

- 13న గద్వాల నియోజకవర్గంలో ర్యాలీ, బహిరంగ సభ
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాలపై ఫోకస్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జిల్లాల పర్యటనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దిశగా పార్టీ కేడర్‌ను సమాయత్తం చేయడంపైనా దృష్టి పెట్టనున్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేలా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 10, 11 తేదీల్లో కొత్తగూడెం, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేటీఆర్ పర్యటించనున్నారు. 13న గద్వాల నియోజకవర్గంలో జరిగే ర్యాలీ, బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొంటారు. సుమారు వారం రోజులుగా ఎర్రవల్లి నివాసంలోనే ఉంటున్న కేటీఆర్.. కేసీఆర్‌తో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. తన సోదరి, ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేయడంతో పార్టీలో నెలకొన్న గందరగోళానికి తెరపడిందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరుగనున్న ఎన్నికలపై కేటీఆర్ దృష్టి కేంద్రీకరించారు. దసరా పండుగ లోపు వీలైనన్ని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు షెడ్యూలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన నియోజకవర్గాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు లక్ష్యంగా ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తల చేరికల వ్యూహానికి పదును పెడుతున్నారు. కాగా, ఈ నెల 13న గద్వాల పర్యటనలో మాజీ మున్సిపల్ చైర్మన్ కేశవ్ బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

ఎర్రవల్లి నివాసానికి నేతల క్యూ..

సీనియర్ నేత హరీశ్‌రావు లక్ష్యంగా ఎమ్మెల్సీ కవిత ఆరోపణలు చేసిన నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం కేసీఆర్ ఎర్రవల్లి నివాసానికి పార్టీ నేతలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. లండన్ నుంచి తిరిగివచ్చిన హరీశ్‌రావు కూడా వెళ్లారు. ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు కేటీఆర్‌తో భేటీ అయ్యారు. వారంతా కేసీఆర్‌ను కూడా కలిసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు పార్టీ తదుపరి కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. కేసీఆర్‌ను హరీశ్‌రావు మర్యాదపూర్వకంగానే కలిశారని, ఈ భేటీలో ఎమ్మెల్సీ కవిత అంశం ప్రస్తావనకు రాలేదని తెలిసింది.

కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారు

కమీషన్లురావు కాబట్టే పేదల ఇళ్లు కట్టలేదు

- బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం
- మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరితో కలిసి వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటన..



అప్పారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు దుస్తులు అందించి ఆశీర్వదిస్తున్న మంత్రులు పొంగులేటి, జూపల్లి, వాకిటి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/నందిగామ: 'గత పాలకులకు పేదవాడి ఆత్మగౌరవం పట్టలేదు. కమీషన్లు రావనే వారికి ఇళ్లు కట్టివ్వలేదు. అదే కమీషన్లు వస్తాయనే దురాశతో రూ.లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. ప్రజాధనాన్ని అడ్డంగా దోచుకున్నారు.' అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉమ్మడి పాలమూరులోని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల కేంద్రంలో, రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. గద్వాల జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించి పట్టాలు అందజేశారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయా సభల్లో పొంగులేటి మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి గూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్ల వ్యయంతో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. రేవంత్ సర్కార్ పేదోడి ప్రభుత్వమని.. వారి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో ఏ ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి గుర్తు చేశారు. ప్రతి సోమవారం దశల వారీగా నిర్మించిన మేరకు ఇళ్లకు నిధులు విడుదల చేస్తామన్నారు. రాష్ట్రంలో ఫౌండేషన్ కట్టనివి కొన్ని ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని.. ఈ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వచ్చే ఏప్రిల్‌లో రెండో దశలో మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో వారి పేరు చేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కవిత చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఆమెనే కొరివి దెయ్యంఅని.. ఇంకా బీఆర్ఎస్‌లో చాలా దెయ్యాలు ఉన్నాయని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్లు పాల్గొన్నారు. అప్పారెడ్డిగూడలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలయ్ బలయ్‌కు రండి

గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, రవీంద్రనారాయణ్ రవిలకు ఆహ్వానం



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వానం అందజేస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఆయన కుమార్తె

సాక్షి, హైదరాబాద్: అక్టోబర్ 3న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న దసరా మిలన్ 'అలయ్ బలయ్' కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తమిళనాడు గవర్నర్ రవీంద్రనారాయణ్ రవిలను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో వారిని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్‌బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చింతల రామచంద్రారెడ్డి, ఆర్.ప్రదీప్‌కుమార్, ప్రేంసింగ్ రాథోడ్, బి.శ్యాంసుందర్‌గౌడ్, డాక్టర్ ఎ.రామచందర్ పాల్గొన్నారు.

10న రాష్ట్ర బీజేపీ నేతలతో ప్రధాని భేటీ

11న కూడా ఎంపీలు, ముఖ్యనేతలతో చర్చలు

- పాల్గొననున్న అమిత్ షా, జేపీ నడ్డా
- తెలంగాణలో అధికార సాధన వ్యూహంపై చర్చ!



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 10, 11 తేదీల్లో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ముఖ్యనేతలతో ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశం కానున్నారు. తెలంగాణలో బీజేపీ 'యాక్షన్ ప్లాన్'ను ఖరారు చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ భేటీకి ముందే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు శని, ఆదివారాల్లో నడ్డా ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంపీలకు శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ వరుస భేటీలతో బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు.

అధికార సాధనే లక్ష్యంగా వ్యూహరచన

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లకే పరిమితమైనా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సమానంగా 8 సీట్లు గెలుచుకోవడం, అనంతరం 3 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండింటిని గెలుచుకోవడంతో రాష్ట్రంలో పార్టీకి ఆదరణ పెరుగుతోందని బీజేపీ అగ్ర నాయకత్వం భావిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో కచ్చితమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీ ప్రస్తుత పరిస్థితులు, కార్యవర్గ కూర్పుపై సందిగ్ధత, అసంతృప్తులు, సమన్వయ లేమి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వమే సీబీఐ విచారణ కోరటంతో దీనిని అవకాశంగా మార్చుకోవాలని ఇప్పటికే ముఖ్య నేతలు ఉద్బోధ చేసినట్టు సమాచారం. అంతర్గత, బహిర్గత సమస్యలతో బీఆర్ఎస్ బలహీనపడటంతో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ఇదే మంచి తరుణమని బీజేపీ నేతలు భావిస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాలని భావిస్తున్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలని రాష్ట్ర పార్టీకి నాయకత్వం నిర్దేశించినట్టు సమాచారం. ఇప్పటికే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి మరింత మందిని చేర్చుకునే పనిని వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆపరేషన్ ఆకర్ష్‌కు మరింత పదును పెడుతున్నట్టు సమాచారం. మరోవైపు స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల అధ్యక్షులు, జెడ్పీ చైర్మన్లను అధిక సంఖ్యలో గెలిపించుకుని సత్తా చాటాలని వ్యూహాలు రచిస్తోంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలను పెద్దసంఖ్యలో చేర్చుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం.

అసెంబ్లీలో ఇచ్చిన మాట తప్పుతారా?

- బీసీ రిజర్వేషన్లపై ప్రధాని వద్దకు అఖిలపక్షం ఏది?
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని నిండు అసెంబ్లీలో ఇచ్చిన మాట తప్పుతారా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసింది తప్ప.. వాటికి రాష్ట్రపతి ఆమోదం కోసం చిన్న ప్రయత్నం కూడా చేయలేదని ఆరోపించారు. శనివారం మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఆరెకటిక సంఘం సురేందర్ తమ అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కవిత చేస్తున్న కృషిని గుర్తించే తాము జాగృతిలో చేరుతున్నామని, 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని వారు పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో కవిత వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను కేంద్రం, కేబినెట్ తీర్మానాన్ని గవర్నర్ తొక్కిపెట్టినా న్యాయపోరాటం చేసి ఒత్తిడి తెచ్చే ప్రయత్నమేదీ సీఎం రేవంత్‌రెడ్డి చేయలేదని ఆరోపించారు.

సివిల్స్‌పై సర్వే తప్పనిసరి!

యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో 0.1 శాతమే సక్సెస్ రేటు

తొలి ప్రయత్నంలోనే సత్తా చాటేవారు 7 శాతమే

(మహేశ్వర్ పెరి, ఫౌండర్ చైర్మన్ కెరీర్స్ 360)

దేశంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షలను 'మదర్ ఆఫ్ ఆల్ ఎగ్జామ్స్'గా భావిస్తారు. సివిల్ సర్వీస్ పరీక్షల ద్వారానే ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), తదితర సర్వీసుల్లో పోస్టులను భర్తీ చేస్తారు. దేశంలోనే అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లక్ష్యంగా ఏటా లక్షలాది మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఏటా దాదాపు వెయ్యి ఖాళీలు మాత్రమే అందుబాటులో ఉంటున్నా సుమారు 11 లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అంతటి పోటీపరీక్షలో నెగ్గాలంటే పట్టుదల, అకుంఠిత దీక్ష, కఠోర శ్రమ, జనరల్ స్టడీస్, సంబంధిత సబ్జెక్టులపైన పట్టు తప్పనిసరి. చాలా తక్కువ సక్సెస్ రేటు మాత్రమే ఉన్న ఈ పరీక్షల్లో విజయం కోసం ఏళ్ల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. మొదటి ప్రయత్నంలోనే ఏదో ఒక సర్వీసును దక్కించుకుంటున్నవారు కేవలం 7 శాతం మాత్రమే ఉంటున్నారు. మిగతా 93 శాతం మందికి ఒకటి కంటే ఎక్కువ ప్రయత్నాలు అవసరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సుదీర్ఘ కాలం కొనసాగే ఈ పరీక్షల ప్రిపరేషన్ యువతపై అధిక భారాన్ని మోపుతూ వారు నేర్చుకునే సామర్థ్యాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. 'యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యే లక్షలాది మంది యువత కృషి, సమయం వృథా అవుతోంది. వారిపై ఒత్తిడి, వ్యయప్రయాసలు పెరుగుతున్నాయి. ఏళ్ల తరబడి సుదీర్ఘ ప్రిపరేషన్ యువత నేర్చుకునే సామర్థ్యాన్ని, వారి విమర్శనాత్మక ఆలోచనను హరించివేసే ప్రమాదముంది. దరఖాస్తులు పెరుగుతున్నప్పటికీ ఆ మేర పెరగని ఖాళీలు యూపీఎస్సీని ప్రెషర్ కుక్కర్‌గా మార్చాయి. అంతిమంగా ఈ స్థితి కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లకు లాభం చేకూర్చుతోంది. యూపీఎస్సీ పరీక్ష విధానంపై దేశవ్యాప్తంగా తప్పనిసరిగా చర్చ జరగాలి. దేశంలో యువతతోపాటు అన్ని వైపుల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలి. దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించాలి' అని నిపుణులు, విద్యావేత్తలు కోరుతున్నారు.



పునఃపరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందా?

ఏమీ నేర్చుకోకుండా పరీక్షకు సిద్ధమవుతున్న వారి ప్రాథమిక సంవత్సరాలను వృథా చేసుకోకుండా ఉండటానికి సివిల్స్ ప్రయత్నాల సంఖ్య, గరిష్ఠ వయసును పునఃపరిశీలించాల్సిన సమయం ఆసన్నమైందా? 6వ ప్రయత్నంలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థి మొదటి ప్రయత్నంలోనే ఫెయిలైన అభ్యర్థి కంటే మెరుగైనవాడా? మనం మెరిట్‌ను ఎలా అంచనా వేస్తాం? ప్రయత్నాలు, తీసుకున్న సంవత్సరాల ఆధారంగా విజయానికి వెయిటేజ్ ఇవ్వబడిందా?.. వీటిపైన దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించాలి.

పరీక్ష విధానం మార్పుతో మలుపు

యూపీఎస్సీ చరిత్రలో 2013 ఒక ప్రధాన మలుపుగా నిలిచింది. ఆ ఏడాది పరీక్షకు కొన్ని నెలల ముందు యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్ పరీక్ష విధానాన్ని మార్చింది. జనరల్ స్టడీస్ పేపర్లను పెంచి వెయిటేజీలో మార్పులు తెచ్చింది. దీంతో ఏళ్ల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆందోళనలు చేశారు. అదనపు ప్రయత్నాలు, వయోపరిమితి సడలింపు రూపంలో ఉపశమనం కోరుతూ దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. దాంతో ప్రభుత్వం 2014 నుంచి పరీక్షలకు సన్నద్ధమయ్యేవారికి మరో రెండు అటెంప్ట్‌లు అదనంగా అవకాశం కల్పించింది.

కేటగిరీ	వయో పరిమితి	ప్రయత్నాల సంఖ్య
జనరల్/ఈడబ్ల్యూఎస్	32	6
ఓబీసీ	35	9
ఎస్సీ/ఎస్టీ	37	పరిమితి లేదు
పీడబ్ల్యూబీడీ	42	ఓబీసీ/జనరల్‌కు 9 ఎస్సీ/ఎస్టీకి పరిమితి లేదు

ఖాళీలు కొన్నే.. అభ్యర్థులు లక్షల్లో..

ఐఏఎస్, ఐపీఎస్ తదితర సర్వీసుల్లో చేరి ప్రజాసేవ చేయాలనుకునే అభ్యర్థులు సివిల్స్‌ను ఒకప్పుడు కఠినమైన పరీక్షగా భావించేవారు. కానీ ఇప్పుడు ఈ పరీక్షలు యుద్ధాన్ని తలపిస్తున్నాయి. కేవలం కొన్ని ఖాళీల కోసం ఏటా లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 2000 సంవత్సరంలో ఒక్కో ఖాళీకి 365 మంది పోటీపడేవారు. ఇటీవల ఈ పోటీ మరింత అధికమైంది. 2020–23 మధ్య ఏటా దాదాపు 11.3 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఖాళీలు మాత్రం ఏటా దాదాపు వెయ్యి మాత్రమే ఉన్నాయి.

చాలా తక్కువ విజయశాతం

అత్యంత కఠినమైన పరీక్ష అయిన యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు విజయం కోసం కొన్నేళ్లపాటు వేచిఉండాల్సి వస్తోంది. 2013కు ముందు ప్రతి 365 మంది అభ్యర్థులకు ఒకరిగా ఉన్న సక్సెస్ రేటు ఆ తర్వాత ప్రతి 1,215 మంది అభ్యర్థులకు ఒకరికి పడిపోయింది. అంటే.. సివిల్స్ సర్వీస్ పరీక్షల్లో విజయశాతం 0.1%, వైఫల్య శాతం 99.9%. ఇదంతా ఒక దశాబ్దంలో జరిగింది.

సుదీర్ఘ ప్రిపరేషన్..

సివిల్స్ పరీక్షల్లో ప్రయత్నాల పెంపు అభ్యర్థులకు మేలు చేయడానికి బదులుగా వారిని సుదీర్ఘ కాలం పాటు పరీక్షల ప్రిపరేషన్‌కే పరిమితమయ్యేలా చేసింది. 2014కు ముందు చాలామంది 2 లేదా 3వ ప్రయత్నంలోనే యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులయ్యేవారు. ప్రయత్నాల సంఖ్య పెంచాక ఈ సగటు 3–4కు పెరిగింది. సివిల్స్‌లో విజయం సాధించడానికి 93% మంది విద్యార్థులు ఒకటి కంటే ఎక్కువ ప్రయత్నాలు తీసుకుంటుండటం గమనార్హం. తొలి ప్రయత్నంలో విజయం సాధించేవారు 7 శాతమే ఉంటున్నారు. అభ్యర్థులు తమ తొలి ప్రయత్నానికి ముందు రెండేళ్ల ప్రిపరేషన్ కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే.. ఈ పరీక్షల కోసం అభ్యర్థులు ఆరేళ్లకు పైగా తమ విలువైన సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది. దీంతో సివిల్స్ ప్రతిభ పరీక్షగా కంటే ఓర్పు పరీక్షగా మారిందని చెప్పొచ్చు. అభ్యర్థులు ఎంత ఎక్కువ సమయం, డబ్బు, మానసిక బలాన్ని పెట్టుబడిగా పెట్టగలిగితేనే పరీక్షలో అంతగా అవకాశాలు మెరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

టాప్ ర్యాంకర్లు సైతం..

సివిల్స్‌లో టాప్ ర్యాంకర్లు సైతం 3 నుంచి 5 ప్రయత్నాల్లోనే విజయాన్ని అందుకుంటున్నారు. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాలనేది చాలామందికి కలగానే మిగులుతోంది. 2024లో టాపర్‌గా నిలిచిన శక్తి దూబే మొదటి మూడు ప్రయత్నాల్లో ప్రిలిమ్స్‌ను కూడా దాటలేకపోయింది. నాలుగో ప్రయత్నంలో మెయిన్స్ దాటినా ఇంటర్వ్యూలో విఫలమైంది. 5వ ప్రయత్నంలో ఆమె టాపర్‌గా నిలిచి సత్తా చాటింది. ఆమె 2018 నుంచి సివిల్స్‌కు సిద్ధమైతే 2025లో ఐఏఎస్ అధికారిణి అయ్యారు. అంటే.. శక్తి దూబేకు ఐఏఎస్ అధికారిణి కావడానికి ఏకంగా ఏడేళ్లు పట్టింది. అలాగే 2024లో రెండో ర్యాంకు సాధించిన హర్షిత గోయల్ 3 ప్రయత్నాల్లో, మూడో ర్యాంకు సాధించిన డోంగ్రే అర్చిత్ పరాగ్ 2, నాలుగో ర్యాంకు సాధించిన షా మార్గి చిరాగ్ 5, ఐదో ర్యాంకు సాధించిన ఆకాశ్ గార్గ్ 2, ఆరో ర్యాంకు సాధించిన కోమల్ పునియా 3, ఏడో ర్యాంకు సాధించిన ఆయుషి బన్సాల్ 3, ఎనిమిదో ర్యాంకు సాధించిన రాజ్ కృష్ణ ఝా 5, తొమ్మిదో ర్యాంకు సాధించిన ఆదిత్య విక్రమ్ అగర్వాల్ 5, పదో ర్యాంకు సాధించిన మయాంక్ త్రిపాఠి 3 ప్రయత్నాల్లో విజయం సాధించారు. అంటే.. టాప్ పది మందిలో 8 మంది సివిల్స్ సాధించడానికి 3–5 ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. మొత్తం మీద దాదాపు 93% మంది విజయవంతమైన అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువసార్లు సివిల్స్ కోసం ప్రయత్నించారు. తొలిసారి పరీక్షలకు హాజరైనవారిలో దాదాపు 7% మంది మాత్రమే విజయం సాధిస్తున్నారు.

సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు అస్వస్థత


సీబీఐ డైరెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీశైలం ఆలయ ఈవో

సాక్షి, హైదరాబాద్: రెండు రోజుల వ్యక్తిగత పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ శనివారం అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రవీణ్ సూద్ వెంటనే ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం దర్శనానికి వెళ్లారు. అక్కడ దర్శనం పూర్తిచేసుకుని తిరిగి శనివారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో ఆయనకు అకస్మాత్తుగా ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. ప్రయాణంలో ఆయనకు అసౌకర్యంగా అనిపించడంతో ఆస్పత్రిలో చేర్చారని సమాచారం. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయనను ఒకరోజు వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్టు తెలిసింది. ప్రవీణ్ సూద్ ఆరోగ్య పరిస్థితి కారణంగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో దక్షిణాది రాష్ట్రాల సీబీఐ డైరెక్టర్లతో జరగాల్సిన షెడ్యూల్డ్ సమావేశంపై అనిశ్చితి నెలకొంది.

పీసీబీ సైంటిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్తల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రసాద్ నేతృత్వంలో ఆ సంఘం జనరల్ సెక్రటరీ, కార్యనిర్వాహక సభ్యులు రాష్ట్ర మంత్రి కొండా సురేఖను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మొట్టమొదటి రిజిస్టర్డ్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని మంత్రి సురేఖకు వారు వివరించారు. తమ సమస్యలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి తెలియచేయడానికి పర్యావరణ కాలుష్యం నిరోధించడానికి ఈ అసోసియేషన్ కృషి చేస్తుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సైంటిఫిక్ అసోసియేషన్ ఏర్పడిన సందర్భంగా మంత్రికి తమ సమస్యలు, ఇంకా విధులలో తమకు జరుగు తున్న వివక్షను తెలియజేశారు. ఇటీవల ప్రతిపాదించిన 42 పోస్టులలో కేవలం ఎనిమిది పోస్టులు మాత్రమే శాస్త్రవేత్తలకు కేటాయించి మిగతా అంతా ఇంజనీరింగ్ పోస్టులతో కొత్త జోనల్, రీజినల్ ఆఫీసుల ఏర్పాటుకు ప్రతిపాదించారన్నారు. జోనల్ ఆఫీసుల్లో ఏర్పాటుకు జోనల్ ల్యాబ్ కూడా ఉండాలని, కానీ వాటిని ప్రతిపాదించలేదని చెప్పారు. కాగా, వీరి విజ్ఞప్తి మేరకు పీసీబీలో జరుగుతున్న వివక్షకు సంబంధించి పూర్తి వివరాలు తెప్పించుకుని పరిశ్రమల తనిఖీల్లో ఒక శాస్త్రవేత్త విధిగా ఉండాలన్న నిబంధనను విధిస్తామని మంత్రి హామీనిచ్చినట్టు తెలిసింది.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


ఆలేటి సాయికుమార్ (ఫైల్)


కురవి: విద్యుదాఘాతంతో ఒక యువ రైతు మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై కురవి ఎస్‌ఐ సతీశ్ తెలిపిన వివరాలివి. స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన యువ రైతు ఆలేటి సాయికుమార్ (28) తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఎస్ఎస్–4 ట్రాన్స్‌ఫార్మర్ కింద వ్యవసాయ బావి ఉంది. బావికి ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. చుట్టుపక్కల రైతులు తేజావత్ రాజు, మాలోత్ సూర్య తదితరులు.. సాయికుమార్‌ను ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సాయికుమార్ భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు పీవీ మెమోరియల్ అవార్డు

స్వీకరించిన సింగ్ సతీమణి గురుశరణ్ కౌర్


గురుశరణ్‌కు అవార్డును అందజేస్తున్న జయప్రకాశ్ నారాయణ. చిత్రంలో మాంటెక్ సింగ్ అహ్లూవాలియా

సాక్షి, న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థకు ఆధునిక రూపం ఇచ్చిన మాజీ ప్రధాని, దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు ప్రతిష్టాత్మక 'పీవీ నరసింహారావు మెమోరియల్' అవార్డు దక్కింది. 2025 సంవత్సరానికి ఫౌండేషన్ ప్రకటించిన ఈ పురస్కారాన్ని శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో.. మన్మోహన్ సింగ్ సతీమణి గురుశరణ్ కౌర్ స్వీకరించారు. భారత ఆర్థిక వ్యవస్థను 1991లో సంక్షోభం నుంచి తప్పించేందుకు.. ప్రధాని పీవీ నరసింహారావు తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాల్లో.. అప్పటి ఆర్థికశాఖ మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారు. ఆర్థిక సంస్కరణలు, గ్లోబలైజేషన్ దిశగా దేశాన్ని నడిపించడంలో ఆయన చూపిన దూరదృష్టి, కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును అందించారు. పురస్కారాన్ని పీవీ మెమోరియల్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తి, గౌరవ సలహాదారులు జయప్రకాశ్ నారాయణ, పోలా విజయబాబు, జనరల్ సెక్రటరీ అనిల్‌కుమార్ కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పంపిన ప్రత్యేక లేఖలో ఫౌండేషన్‌ను అభినందించారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన పుణే సదరన్ కమాండ్‌కు చెందిన కమాండింగ్–ఇన్–చీఫ్, జనరల్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ బృందం. చిత్రంలో దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఆర్ఎస్ శ్రీనివాస్, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ తెలంగాణ, ఏపీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా తదితరులు

ఆధునిక పరిశోధనలు చేద్దాం

యువతతో మిథానీ కంపెనీ చైర్మన్ నారాయణమూర్తి పిలుపు


సదస్సును ప్రారంభోత్సవంలో డాక్టర్ నారాయణమూర్తి, పలువురు ప్రముఖులు

తిరుపతి సిటీ : మారుతున్న కాలాన్ని బట్టి ఆధునిక పరిశోధనలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని మిథానీ కంపెనీ చైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ ఎస్వీఎస్ నారాయణమూర్తి చెప్పారు. తిరుపతిలో మూడ్రోజులపాటు జరిగే 4వ అంతర్జాతీయ రాపిడ్ ఆధారిత సదస్సు శనివారం ప్రారంభమైంది. ఈ సదస్సును తిరుపతి, పాట్నా, ధారవాడ ఐఐటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్–బెంగళూరు సహకారంతో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ప్రాసెసింగ్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీఎస్ నారాయణమూర్తి మాట్లాడుతూ.. దేశంలోని యువత ఆదర్శ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నూతన పరిశోధనలపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతోందని, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో యువత చురుగ్గా పాల్గొనాలని ఆయన చెప్పారు. మెటలర్జిస్టులు, మెకానికల్ ఇంజనీర్ల ఆవశ్యకతతోపాటు భవిష్యత్‌లో వారి డిమాండ్‌ను ఆయన వివరించారు. అలాగే, సవాళ్లను ఎదుర్కోవడం ఎంత ముఖ్యమో ప్రస్తావించారు. ఈ సదస్సు కొత్త తరం పరిశోధకులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఐఐటీ తిరుపతి తరఫున సదస్సు కన్వీనర్ ప్రొ. అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మూడ్రోజులపాటు జరిగే ఈ సదస్సులో చర్చించే అంశాలను వివరించారు. ఫ్రిక్షన్ స్టిర్ ప్రాసెసింగ్, మెటల్ ఫార్మింగ్, తయారీలో కృత్రిమ మేధస్సు, స్థిరమైన పద్ధతులు తదితర అంశాలను తెలిపారు. ఈ సదస్సుకు సుమారు 250 మంది ప్రతినిధులు, ఎనిమిది దేశాల నుంచి వచ్చిన అంతర్జాతీయ పరిశోధకులు.. వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం.. ఐసీఎఫ్‌పీ ప్రత్యేక గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. సత్యం సువాస్, ప్రొ. సతీష్ వి.కైలాస్, ప్రొ. అరుణ్ టంగిరాల, ప్రొ. టీఎస్ శ్రీవత్సన్ వివిధ అంశాలపై మాట్లాడారు.

సింగరేణిలో జేఎంఈటీల పునర్నియామకం

- 43 మందిని తిరిగి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్సీసీఎల్



సాక్షి, హైదరాబాద్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్)లో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జేఎంఈటీ)లుగా చేరి వివిధ కారణాలతో తొలగించబడిన వారిని తిరిగి చేర్చుకోవాలని సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు 43 మంది ట్రైనీలను విధుల్లోకి తీసుకుంటూ సింగరేణి యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు వారికి మరొక అవకాశాన్ని కల్పిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా గతంలో విధులకు గైర్హాజరు కావడం, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవడం లాంటి కారణాలతో విధుల నుంచి సంస్థ తొలగించింది. దీంతో వారిని విధుల్లోకి తీసుకునే అంశంపై ఇటీవల కార్మిక శాఖ అధికారులు, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు పొందిన కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)కు మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ క్రమంలో తొలగించబడిన జేఎంఈటీలను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి వీలుగా యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని తాజా నియామకం కింద విధుల్లో చేర్చుకుంటారు. జేఎంఈటీలు సంస్థ ఏర్పాటు చేసే హైపవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ వివరాలు, ఓవర్ మెన్ సర్టిఫికెట్, టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు తదితరాలు సమర్పించాలి. అనంతరం ఆ కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ప్రాథమిక అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందిస్తారు. విధుల్లో చేరిన తర్వాత జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలు తమ మొదటి సంవత్సరంలో తప్పనిసరిగా కనీసం 190 మస్టర్లకు తగ్గకుండా విధులు నిర్వహించాలి. ఈ అవకాశాన్ని జేఎంఈటీలు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు.

ప్రజలకు సమాచారమివ్వడం సర్కార్ విధి

ఇందిరమ్మ ఇళ్ల వివరాలివ్వాల్సిందేనని తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ప్రజలు కోరిన సమాచారం ఇవ్వడం ప్రభుత్వ విధి అని, పిటిషనర్‌కు ఇందిరమ్మ ఇళ్ల వివరాలు ఇవ్వాలని సర్కార్‌కు హైకోర్టు తేల్చిచెప్పింది. వివరాలు ఇచ్చేందుకు నిరాకరించడం సమాచార హక్కు చట్టం 2005కు పూర్తి విరుద్ధమని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు బీపీఎల్ కింద ఉచిత సమాచారం ఇవ్వాలని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా, అర్హతలు, ప్రభుత్వ ఉత్తర్వులు కోరుతూ పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులకు న్యాయ విద్యార్థి గాడిపెల్లి గణేశ్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. బీపీఎల్ కేటగిరీగా పేర్కొంటూ సెక్షన్ 7(5) కింద సమాచారం కోరగా.. ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారు. దీన్ని సవాల్ చేస్తూ గణేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. చట్టప్రకారం ఉచితంగా సమాచారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. సమాచార హక్కు చట్టానికి విరుద్ధంగా అధికారులు వ్యవహరించారన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జీవో నంబర్ 454 ప్రకారం అధికారులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సర్కార్ జారీ చేసిన జీవో 454 ఈ కేసులో వర్తించదని, బీపీఎల్ దరఖాస్తుదారునికి చట్టప్రకారం ఉచిత సమాచారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతని చెప్పారు. పిటిషనర్ కోరిన వివరాలు ఉచితంగా ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేస్తూ వ్యక్తి మృతి


శేఖర్ (ఫైల్)
సీపీఆర్ చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: గణేశ్ శోభాయాత్రలో నృత్యం చేస్తూ గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నారాయణపేటలోని బురుడివాడకు చెందిన శ్యాసంపల్లి శేఖర్ (45) శాతవాహన కాలనీ గణేశ్ నిమజ్జన ఊరేగింపులో శనివారం ఉదయం నుంచి ఉత్సాహంగా నృత్యం చేశాడు. మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా కుప్పకూలి కిందపడ్డాడు. అక్కడ విధులలో ఉన్న ఎస్ఐ వెంకటేశ్వర్లు వెంటనే సీపీఆర్ చేసినా ఆయనలో కదలిక కనిపించలేదు. వెంటనే దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా.. శేఖర్ స్థానిక మునిసిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వాటర్‌మాన్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఉక్కిరిబిక్కిరి చేసే శబ్ద కాలుష్యం కారణంగానే గుండెపోటు వచ్చి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చికిత్స అందితే బతికేవాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

దేని కాలమునందు అది చక్కగా నుండునట్లు
సమస్తమును ఆయన నియమించియున్నాడు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** పౌర్ణమి రా.11.57 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** శతభిషం రా.10.59 వరకు, తదుపరి పూర్వాభాద్ర. **వర్జ్యం:** ఉ.6.28 నుండి 8.02 వరకు తదుపరి తె.5.12 నుండి 6.45 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.25 నుండి 5.14 వరకు, **అమృత ఘడియలు:** ప.3.45 నుండి 5.22 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

డోనాల్డ్ ట్రంప్ (అమెరికా అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అందంలోనే వికారం కలిసి ఉంటుంది! ఇది సృష్టి వైరుధ్యమా, లేక మానవ మనో వైకల్యమా అని రెండు రోజులుగా వైట్ హౌస్ నుండి బయటికి రాకుండా టీవీ ముందే కూర్చొని ఆలోచిస్తున్నాను.

విజ్ఞులు వికారాన్ని చూడొద్దని అంటారు. అందాన్ని వేరు చేసి చూడమంటారు! అందం, వికారం పక్కపక్కనే ఉంటే వేరు చెయ్యొచ్చు. పైనొకటి, కిందొకటి ఉంటే వేరు చెయ్యొచ్చు. ఒకదానితో ఒకటి కలిసిపోయి ఉంటే ఎలా వేరు చేయటం?

నేను టీవీ చూస్తుంటానని తెలిసి, జిన్‌పింగ్ నాకోసం బీజింగ్‌లోని తియానన్మెన్‌లో చేయించిన మిలిటరీ పరేడ్; తియాంజిన్‌లో పుతిన్, మోదీలతో కలిసి జిన్‌పింగ్ కలిసి చేసిన చిరునవ్వుల ప్రదర్శన (అది కూడా నేను టీవీ చూస్తుంటానని తెలిసే) రెండూ ఎంతో బ్యూటిఫుల్‌గా ఉన్నాయి. మిలిటరీ పరేడా, లేక చిరునవ్వుల ప్రదర్శనా... ఏది ఆ రెండింటిలో బ్యూటిఫుల్‌గా ఉందంటే మాత్రం, చిరునవ్వుల ప్రదర్శనే అంటాన్నేను.



చిరునవ్వుల్లో కేవలం చిరునవ్వులే ఉండవు. చేతులు కలుపుకోవడం ఉంటుంది. భుజాలు తాకించుకోవటం ఉంటుంది. హత్తుకోవటం ఉంటుంది. ఆలింగనం చేసుకోవటం ఉంటుంది. అదోలా చూసుకోవటం ఉంటుంది. ఏదైనా ఇచ్చిపుచ్చుకోవటం ఉంటుంది. కలిసి నాలుగు అడుగులు వేయటం ఉంటుంది. పరవశం కలిగించే చిన్న మాట ఉంటుంది. పెద్దపెట్టున నవ్వేయటం ఉంటుంది. లోకం దృష్టిలో పడాలన్న తహతహ ఉంటుంది. ఆ లోకంలో మళ్లీ పర్టిక్యులర్‌గా ఫలానా వ్యక్తి కంట పడుతున్నామా లేదా అనే దొంగచూపు ఉంటుంది.

ఇన్ని ఉంటాయి చిరునవ్వుల్లో! గర్జించే శతఘ్నులను మించిన మారణాయుధాలు ఈ చిరునవ్వులు.

వావ్!! చిరునవ్వుల మారణాయుధాలు! వండర్ ఫుల్ థాట్. నోబెల్‌ను పెద్ద పెద్ద పనులకే ఇవ్వక్కర్లేదు. నాకొచ్చే ఇలాంటి చిన్న చిన్న థాట్స్‌కు కూడా ఇవ్వొచ్చు.

జిన్‌పింగ్ నన్ను టీవీలోంచి దొంగ చూపులు చూడటం నేను గమనించాను. తనేంటో నాకు చూపించుకోవటం అది. నా దగ్గర పుతిన్ ఉన్నారు. మోదీ ఉన్నారు. కిమ్ జోంగ్ ఉన్ ఉన్నారు అని చెప్పుకోవటం!

ఏం మనిషి అతను?! చైనాకు జపాన్ లొంగిపోయి 80 ఏళ్లయిందని బీజింగ్‌లో పరేడ్ చేయించి ఆ పరేడ్‌కు అమెరికాను పిలవలేదు! పరేడ్ అందంగా ఉంది. జిన్‌పింగ్ మైండే... వికారంగా ఉంది.

అమెరికా బెదిరిస్తేనే కదా జపాన్ వెళ్లి చైనాకు లొంగిపోయింది! ఫారిన్ గవర్నమెంట్స్‌కి థ్యాంక్స్, ఇంటర్నేషనల్ ఫ్రెండ్స్‌కి థ్యాంక్స్ అంటారే గానీ, అమెరికాకు థ్యాంక్స్ చెప్పటానికి ఏమైంది జిన్‌పింగ్‌కి!

చరిత్రను మరిచిపోయారా లేక, చేసిన మేలునే మరిచిపోయారా? చూస్తుంటే రష్యా, ఇండియాలు కూడా అమెరికాను మర్చిపోయేలా చేసేలా ఉన్నారు జిన్‌పింగ్! ఇలాంటప్పుడే నాకు మరింతగా ఎవరికైనా, ఏదైనా చేయాలనిపిస్తుంది.

కాల్ బటన్ నొక్కి, “పీటర్ కెంట్... మనం ఇండియా మీద ఎంత వేశాం, రష్యా మీద ఎంత వేశాం, చైనా మీద ఎంత వేశాం?” అని అడిగాను. నా ట్రేడ్ అడ్వైజర్ ఆయన.

“ఎస్, మిస్టర్ ప్రెసిడెంట్. ఇండియా మీద 50, చైనా మీద 30, రష్యా మీద 10” అని గుర్తు చేశారు పీటర్ కెంట్.

“వెల్, మిస్టర్ కెంట్. ఇండియా మీద ఇంకో 25 వేస్తే ఎలా ఉంటుంది? మొత్తం కలిపి 75” అన్నాను.

“గుడ్ ఐడియా మిస్టర్ ప్రెసిడెంట్. మైండ్-బ్లోయింగ్” అన్నారు పీటర్ కెంట్.

ఎవరికైనా ఏదైనా చేయాలనుకున్నప్పుడు ఆత్మీయులే కదా ముందుగా మనకు గుర్తుకొస్తారు. మోదీతో నేను బాగా కలిసిపోతాను. ఫిబ్రవరిలో ఆయన ఇక్కడే ఉన్నారు! మళ్లీ సెప్టెంబర్ 23న యూఎన్ఓ సమావేశానికి ఇక్కడే ఉంటారు.

అందరికీ వైద్యం అందేదెలా?

విశ్లేషణ

ప్రొ॥ కె. శ్రీనాథ్ రెడ్డి

వ్యక్తిగత వికాసానికీ, దేశ ఆర్థికాభివృద్ధికీ ఆరోగ్య పరిరక్షణకు పూచీనిచ్చే సదుపాయాలు అత్యవసరం. ఆ సేవలు విస్తృతమైనవిగా ఉండాలి. ఆరోగ్యం కాపాడుకోవడాన్ని ప్రోత్సహించడం, వివిధ రుగ్మతలను వెంటనే కనిపెట్టడం, తొలి దశలోనే సరైన ఔషధాలను సేవించేటట్లు చేయడం వరకు దీనిలోకి చాలా వస్తాయి. దీని పరిధిని పునరావాస సేవలు, అవసరమైన చోట ఉపశమన సంరక్షణ కల్పించడానికి కూడా విస్తరించాలి. సగటు ఆయుర్దాయాన్ని పొడిగించడం నుంచి పూర్తి జీవితాన్ని ఆనందమయంగా గడిపేటట్లు చేయడంపై దృష్టి కేంద్రీకరించాలి. వ్యక్తులు తమ పూర్తి సామర్థ్యం మేరకు పని చేయడానికి, తద్వారా దేశాన్ని సుసంపన్నం చేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. 2047 నాటికి ‘వికసిత్ భారత్’ అవతరించేందుకు ప్రతి భారతీయుని ఆరోగ్యం చోదకశక్తిగా పనిచేస్తుంది.



వైద్యానికి ప్రతిబంధకాలు

దేశంలో నివసిస్తున్న అందరికీ ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని గుండెల మీద చేయి వేసుకుని చెప్పగల స్థితి లేదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) అధినేత మోహన్ భాగవత్ ఇటీవల వ్యాఖ్యానించారు. “ఏ వ్యక్తికైనా ఆరోగ్య రక్షణ, విద్య అత్యంత ముఖ్యమైనవి. ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య మానవుడికి ఆ రెండూ అందని మావిపండుగానే ఉన్నాయి” అని ఆయన అన్నారు. ఇండోర్‌లో ఆరోగ్య కేంద్ర–క్యాన్సర్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తూ భాగవత్ అలా వ్యాఖ్యానించారు. చాలా మందికి వైద్యం చేయించుకోవాలనే తాపత్రయం ఉన్నా దగ్గరలో అవి లేకపోవడం, ఉన్నా స్థోమతకు మించి ఉండటం, వైద్యం ఉన్నత ప్రమాణాలతో లేకపోవడం వంటివి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. దీర్ఘకాలిక ఔట్ పేషంట్లు కొందరు వైద్యానికి పెట్టిన ఖర్చుతో పేదరికంలోకి జారుకుంటున్నారు.

సదుపాయాలకు మించి పేషెంట్లు ఉండటం, ఆ యా కేంద్రాల సామర్థ్యం అంతగా లేకపోవడం, పాలనాపరమైన వైఫల్యాలతో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం సవాళ్ళను ఎదుర్కొంటోంది. దానికితోడు, భారత దేశంలో సమాఖ్య వ్యవస్థ అమలులో ఉంది. కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం వేర్వేరు బాధ్యతలను అప్పగించింది. ఆరోగ్య రక్షణ సదుపాయాలకు రూపకల్పన చేయడం, అమలుపరచడంలో ఆ రెండింటి మధ్య ఎంతో సమన్వయం అవసరం.

బహుముఖ సేవలు వాడుకోవాలి!

భారతదేశపు ఆరోగ్య సేవలు ప్రైవేటు రంగంపైన కూడా ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఒక ప్రణాళిక కింద కాక, అవసరాలు, అవకాశాలకు తగ్గట్లుగా ఇది ఒక మిశ్రమ వ్యవస్థగా తయారైంది. విడిగా ప్రాక్టీసు చేస్తున్న డాక్టర్లు ఇప్పటికీ ఉన్నారు. కుటుంబాల ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సింగ్ హోమ్‌లు ఉన్నాయి. ఏదో ఒక వైద్య విభాగానికి పరిమితమై, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారిని చేర్చుకుని సేవలందిస్తున్న ఆస్పత్రులున్నాయి. మల్టీ –స్పెషాలిటీ కార్పొరేట్ ఆసుపత్రుల సంగతి సరేసరి. అలా ప్రైవేటు వైద్య రంగం బహుముఖాలుగా ఉంది. స్వచ్ఛంద సంస్థల రంగం చెదురుమదురుగా ఉన్న చారిటబుల్ ఆసుపత్రులకు పరిమితమవుతోంది. వాటిలో కూడా కొన్నింటిలో అధునాతన వైద్య సదుపాయాలున్నాయి. అవి ధనిక రోగుల నుంచి కాస్త ఎక్కువ వసూలు చేసి, ఆ మార్జిన్ ద్రవ్యాన్ని పేద రోగుల చికిత్సకు వెచ్చిస్తున్నాయి. ప్రైవేటు రంగంపై నియంత్రణ పెళుసుగా ఉండటంతో, అది విధించే చార్జీలు తరచు సామాన్య మానవునికి పెనుభారంగా పరిణమిస్తున్నాయి.

ప్రతి ఒక్కరినీ ఆరోగ్య రక్షణ (యు.హెచ్.సి.) గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు, మరింత మానవతావాద దృష్టితో స్పందించేందుకు ప్రభుత్వ రంగాన్ని మనం ఉద్దీపింపజేయవలసిన అవసరం ఉంది. పెద్ద సంఖ్యలో ఉంటున్న రోగుల తాకిడిని తట్టుకునేటట్లు, మరింత సమర్థతతో పనిచేసేటట్లు ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దాలి. ప్రైవేటు రంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేటట్లు చూడాలి. అనవసర పరీక్షలు, అదనపు చార్జీల జోలికి వెళ్లకుండా వాటిని అరికట్టాలి. స్వచ్ఛంద రంగానికి మరిన్ని వనరులు సమకూర్చాలి. ప్రజలనే భాగస్వాములుగా చేసే విధంగా ప్రజారోగ్య, సమాజ సంబంధిత క్లినికల్ కేర్ సెంటర్లను నెలకొల్పవచ్చు. ఇవి కొన్నిచోట్ల మొదలైతే మిగిలిన ప్రాంతాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి.

◆ మరింత సమర్థతతో పనిచేసేటట్లు ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దాలి. ప్రైవేటు రంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేటట్లు చూడాలి. స్వచ్ఛంద రంగానికి మరిన్ని వనరులు సమకూర్చాలి. ప్రజలనే భాగస్వాములుగా చేసే విధంగా ప్రజారోగ్య, సమాజ సంబంధిత క్లినికల్ కేర్ సెంటర్లను నెలకొల్పాలి. టెలీ-హెల్త్ సేవలను ప్రభావశీలంగా అమలులోకి తేవాలి. సంప్రదాయ వైద్య విధానాలను కూడా ప్రోత్సహించాలి.

టెలీ–హెల్త్ సేవలను ప్రభావశీలంగా అమలులోకి తెచ్చేందుకు ఆరోగ్య రికార్డుల డిజిటలీకరణను వినియోగించుకోవచ్చు. కంప్యూటర్ సేవల్లో ముందున్నాం కనుక ఇది సాధ్యపడే అంశమే. డాక్టర్లు లేకుండా టెక్నాలజీతో నడిచే ఆరోగ్య రక్షణ కేంద్రాలు ప్రాథమిక రక్షణకు సంబంధించి చాలా వరకు సేవలందించవచ్చు. తద్వారా, రెండవ, మూడవ స్థాయి కేంద్రాలపై భారం తగ్గుతుంది. టెక్నాలజీ కేంద్రాలే వ్యాధి తీవ్రతను బట్టి రోగి ఎక్కడికి వెళ్లాలో రిఫర్ చేయవచ్చు.

ఇతర వైద్య విధానాలను కూడా ప్రోత్సహించి తీరాలి. ఏ రోగానికి ఏ రకం వైద్యం పనిచేస్తుందో గుర్తించి, వివిధ వైద్య విధానాల పాత్రల మధ్య సరిహద్దు రేఖ గీయవచ్చు. అల్లోపతీ, సంప్రదాయ వైద్య పద్ధతులకు సరిపోయినంతగా వనరులు కేటాయిస్తేనే ఫలితం ఉంటుంది.

అన్నింటినీ సమన్వయం చేయాలి!

ఈ ప్రయత్నాలన్నీ సజావుగా సాగడానికి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు రెండింటిలోను ఆరోగ్యానికి ఎక్కువ నిధులు కేటాయించక తప్పదు. ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం స్థూల జాతీయోత్పత్తిలో 3 శాతానికి క్రమంగా పెరగాలి. ఆరోగ్య రక్షణకు వ్యక్తులు తమ జేబుల్లోంచి తీసి పెట్టే ఖర్చు 20% కన్నా తక్కువగా ఉండేట్లు చూడాలి. ఆరోగ్య సేవల రూపకల్పనలోను, అందించడంలోను ధర్మమే ప్రధాన భూమిక వహించాలి. సమ న్యాయం అందరికీ ఒకే రకమైన సేవలను అందుబాటులోకి తెస్తుంది.

నేషనల్ హెల్త్ మిషన్, పి.ఎం. జె.ఏ.వై. మధ్య సంబంధం లేకుండా ఉన్నవాటిని తొలగించి, సమీకృత రక్షణ నమూనాలను సృష్టించవచ్చు. ప్రభుత్వ ప్రైవేటు వ్యవస్థల మధ్య; అల్లోపతీ, సంప్రదాయ వైద్య వ్యవస్థల మధ్య పొంతన, సమన్వయం తీసుకొచ్చేందుకు చర్చలు జరగవలసి ఉంది.

వ్యాసకర్త ‘పీహెచ్ఎఫ్ఐ యూనివర్సిటీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సైన్సెస్’లో డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్

సమాజీకరణే దారి

అభిప్రాయం

పి. వేణుగోపాల్ రెడ్డి

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు చాలా కాలంగా రెండు ప్రధాన విధానాల చుట్టూ తిరుగుతున్నాయి. ఒకటి ప్రభుత్వ రంగం, రెండు ప్రయివేటు రంగం. విద్యుత్, రైల్వేలు, రక్షణ వంటి రంగాలను ప్రభుత్వమే నిర్వహిస్తుంది. లాభాపేక్ష కన్నా ప్రజా సంక్షేమమే వీటి నిర్వహణలో ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని ప్రైవేటు సంస్థలను ప్రభుత్వం జాతీయీకరణ చేసి ప్రభుత్వం తన అధీనంలోకి తెచ్చి నిర్వహిస్తుంది. ఉద్యోగులకు భద్రత, ప్రజలకు సేవలు ఉచితంగా ప్రభుత్వ రంగం వల్ల లభిస్తాయి.

ఇక ప్రైవేటు రంగంలో... కంపెనీలు, వ్యాపారులు, వ్యక్తులు పరిశ్రమలను నడుపుతారు. ఇక్కడ పోటీ ఎక్కువగా ఉంటుంది. మార్కెట్‌లో నిలబడటానికి యజమానులు కొత్త ఆలోచనలు, ఆధునిక సాంకేతికత, మంచి సేవలను ఎప్పటికప్పుడు ప్రవేశపెడతారు. దీని వలన వినియోగదారులు తక్కువ ధరలకు మంచి నాణ్యత గల ఉత్పత్తులు పొందే అవకాశం ఉంటుంది. అయితే సంపద కొందరి దగ్గరే పోగుపడుతుంది. ఈ రెండింటికి మధ్యేమార్గంగా ‘సమాజీకరణ’ (సోషలైజేషన్) అనే విధానం మంచిదంటున్నారు.

సమాజీకరణ

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య సమతూకం కలిగిన మార్గం అవసరమని ప్రముఖ కార్మిక నాయకుడు డి.పి.తెంగడి సూచించారు. దీనికి సమాజీకరణే మార్గమని ఆయన అన్నారు. దీనిలో ప్రతి కంపెనీ లాభంలో కొంత భాగాన్ని కార్మికులకు కేటాయించాలి. ఇది జీతానికి అదనంగా ఉండాలి. అంతేకాక కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లలో కార్మికుల ప్రతినిధులు ఉండాలి. ఇలా చేయడం వల్ల కార్మికులు కేవలం ఉద్యోగులే కాకుండా భాగస్వాములు అవుతారు. వారు కంపెనీని తమది అని భావిస్తారు. ఫలితంగా యాజమాన్యం కార్మికుల మధ్య విశ్వాసం పెరుగుతుంది. లాభం వస్తే అందరికీ ప్రయోజనం. ఉద్యోగులు పనిని నిర్లక్ష్యం చేయరు. వృథా ఖర్చులు తగ్గుతాయి. సొంత కంపెనీ అని భావించడం వల్ల కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు వస్తాయి. కార్మికులు లాభాల్లో వాటా పొందడం వల్ల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. పిల్లలకు మంచి విద్య అందించగలరు. అసమానతలు తగ్గి సమాజంలో సమతౌల్యం ఏర్పడుతుంది.

◆ గాంధీజీ చెప్పిన ‘ట్రస్టీషిప్’ భావనలాగే, సమాజీకరణ కూడా సమాజానికి సమానత్వం, న్యాయం అందించే మార్గదర్శకం అవుతుంది. సమాజీకరణలో యజమానులు – కార్మికులు కలిసి పని చేస్తారు. సంపద కొద్దిమందికి కాకుండా అందరికీ పంచబడుతుంది.



ప్రభుత్వ పాత్ర

సమాజీకరణ విజయవంతం కావాలంటే ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవాలి. కంపెనీల లాభాల్లో కొంత భాగం కార్మికులకు ఇచ్చేలా చట్టం చేయాలి. ఈ విధానం పాటించే కంపెనీలకు పన్ను రాయితీలు ఇవ్వాలి. లాభాల పంపకాన్ని పర్యవేక్షించేందుకు స్వతంత్ర సంస్థ ఏర్పాటు చేయాలి. యాజమాన్యం, కార్మికుల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించేందుకు ప్రత్యేక ట్రిబ్యునల్ ఉండాలి. కొంతమంది విమర్శకులు సమాజీకరణ వల్ల వాటాదారుల ఆదాయం తగ్గిపోతుందని అంటారు. కార్మికులు నిర్ణయాల్లో పాల్గొంటే నిర్ణయాలు ఆలస్యం అవుతాయనీ భావిస్తారు. అలాగే కంపెనీలు, ఉదారంగా ఉంటే మార్కెట్ పోటీ దెబ్బతింటుందని అంటారు. కానీ వాస్తవం భిన్నంగా ఉంటుంది. కార్మికులు సంతోషంగా ఉన్న కంపెనీల్లో సమ్మెలు తగ్గుతాయి. సంతృప్తిగా ఉన్న ఉద్యోగులు మెరుగైన ఉత్పత్తులు అందిస్తారు. అలాంటి కంపెనీలకు మంచి పేరు వస్తుంది.

సమాజీకరణ అమలు ఒక కొత్త ఆర్థిక మార్గం. ఇది ప్రభుత్వ రంగానికి ఉన్న ప్రజా సంక్షేమ లక్ష్యాలను, ప్రైవేటు రంగంలో ఉన్న పోటీ, సృజనాత్మకతలను సమతౌల్యం చేస్తుంది. భారతదేశ నుంచి ప్రపంచానికి ఒక కొత్త ఆలోచనగా ఇది నిలుస్తుంది. గాంధీజీ చెప్పిన ‘ట్రస్టీషిప్’ భావనలాగే, సమాజీకరణ కూడా సమాజానికి సమానత్వం, న్యాయం అందించే మార్గదర్శకం అవుతుంది. సమాజీకరణలో యజమానులు–కార్మికులు కలిసి పనిచేస్తారు. సంపద కొద్దిమందికి కాకుండా అందరికీ పంచబడుతుంది. ఆర్థిక వ్యవస్థ కేవలం లాభనష్టాల గణాంకం మాత్రమే కాదు. అది సమాజ నిర్మాణానికి సంబంధించినది. నిజమైన అభివృద్ధి అంటే ప్రజలందరికీ సౌభాగ్యం అందడమే. సమాజీకరణ ఆ దిశగా తీసుకెళ్లే సమతూక మార్గం.

వ్యాసకర్త ‘ఏకలవ్య ఫౌండేషన్’ ఛైర్మన్
pvg2020@gmail.com

ఈ ఆందోళన ఎవరికి లాభం?

సందర్భం

రోహిత్ చందావర్కర్

భారతదేశపు ఆర్థిక రాజధాని అతి పెద్ద ఉద్యమాన్ని చవి చూసింది. మరాఠా వర్గానికి చెందినవారు గత కొద్ది రోజులుగా ముంబయిలో ఆందోళనకు దిగారు. ఐదు రోజుల పాటు సాగిన ఈ తాజా ఆందోళన మంగళవారం సాయంత్రంతో ముగిసింది. విద్య, ఉద్యోగాలలో మరాఠాలకు రిజర్వేషన్ కల్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ ఏనాటి నుంచో ఉంది. మహారాష్ట్రలో పురపాలక సంస్థలు, జిల్లా కౌన్సిళ్ళ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఉద్యమం మరోసారి తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ ఆందోళనకు మనోజ్ జరాంగే పాటిల్ నాయకత్వం వహించారు. ‘మరాఠా వర్గానికి రిజర్వేషన్ కల్పించేందుకు ఒకటే మార్గం ఉంది. అది వారిని వెంటనే కున్బీ వర్గంలో చేర్చడమే. కున్బీలు అనుభవిస్తున్న ప్రయోజనాలను వారికి వర్తింపజేయడమే’నని ఆయన గత కొన్నేళ్ళుగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. సంప్రదాయ సిద్ధంగా మరాఠా వర్గంవారు పాలకులు, భూస్వామ్య వర్గానికి చెందినవారుగా ఆ ప్రాంతంలో లెక్కకు వస్తారు. కానీ, భూకమతాలు తగ్గిపోయి, వాతావరణ మార్పుతో వ్యావసాయిక సంక్షోభం ఏర్పడి, ఇతర అంశాలు కూడా తోడు కావడంతో, ఆ వర్గం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సవాళ్ళను ఎదుర్కొంటోంది. ఆ వర్గీయులు పొట్టచేతపట్టుకుని పట్టణ ప్రాంతాలకు వలస వస్తున్నారు. ఇది రాష్ట్రంలోని ఇతర వెనుకబడిన కులా(ఓబీసీ)ల వారి మాదిరిగానే, మరాఠాలలోని పేదవారు రిజర్వేషన్ల ప్రయోజనాలను ఎందుకు పొందకూడదు? అనే ప్రశ్నకు దారితీసింది.



◆ రిజర్వేషన్ల కోసం మరాఠాలు సాగిస్తున్న ఈ ఉద్యమ ప్రభావం చాలా కాలం ఉండబోతోంది. మరాఠాలు, ఓబీసీలు భిన్న ధ్రువాలుగా ఉండటం వల్ల బీజేపీ లబ్ధి పొందే అవకాశం ఉందని అనేకమంది భావిస్తున్నారు.

మరాఠా ఆందోళన, జాతీయ, ప్రాంతీయ సమాచార సాధనాలలో దానికి లభించిన కవరేజి మహారాష్ట్రలోని ఓబీసీలను మరాఠా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఏకీకృతమయ్యేటట్లు చేసింది. మరాఠాలను కున్బీల జాబితాలో చేర్చితే, ఓబీసీల కోటా నుంచి మరాఠాలకు రిజర్వేషన్ కల్పించడాన్ని తాము వ్యతిరేకిస్తామని ఓబీసీ నాయకులలో కొందరు ఇప్పటికే సమాచార సాధనాలవారికి చెబుతున్నారు.

బీజేపీ గత నాలుగు దశాబ్దాలుగా ఓబీసీ వర్గాన్ని మచ్చిక చేసుకుంటూ వస్తోంది. వారు 1980లు, 1990లలో బీజేపీకి పక్కా ఓటు బ్యాంకుగా మారారు. ఓబీసీలలో కొన్ని వర్గాలను కూడ గట్టుకునే ఆలోచనకు బీజేపీ సిద్ధాంతవేత్త వసంతరావ్ భాగవత్ రూపకల్పన చేశారు. వారి నుంచి కొందరిని బీజేపీ నాయకులుగా తీర్చిదిద్దారు. గోపీనాథ్ ముండే, అన్నాసాహెబ్ డాంగే తదితరులు ఆ కోవలోకి వస్తారు. మహారాష్ట్రలో 1995లో మొదటిసారిగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంలో వారికి ప్రాధాన్యం కల్పించారు.

మరోపక్క, శరద్ పవార్ 1999లో ఏర్పాటు చేసిన జాతీయతావాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ఆది నుంచీ మరాఠాల ప్రాబల్యం కలిగిన రాజకీయ సంస్థగా కనిపిస్తూ వచ్చింది. కాంగ్రెస్‌లో సంప్రదాయ సిద్ధంగా, ప్రధానంగా మరాఠా వర్గానికి చెందినవారు, ఎస్సీ–ఎస్టీ కేటగిరీల నుంచి కొందరు నాయకులు ఉంటూ వచ్చారు.

దాంతో మరాఠాల ఆందోళన, పర్యవసానంగా కొందరు భిన్న ధ్రువాలుగా విడిపోవడం వల్ల ఎవరు లాభం పొందుతారనేది జోస్యం చెప్పదగిన ఆసక్తికరమైన అంశంగా మారింది. ఓబీసీలు ఏకమై, రానున్న ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇస్తారని, అదే రాజకీయంగా లాభం పొందనుందని చాలా మంది పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రిగా ఎవరున్నారనేది కూడా మరో అంశం కాబోతోంది. మహారాష్ట్రకు ఒక బ్రాహ్మణుడు ముఖ్యమంత్రిగా ఉండటం మరాఠాలకు నచ్చడం లేదని అనేక మంది వాదిస్తున్నారు.

ఈ ఉద్యమ రాజకీయ ప్రభావం మాత్రం చాలా కాలం ఉండబోతోంది. ప్రస్తుతానికి అంచనాలకు అందని విషయమే అయినప్పటికీ, మరాఠాలు, ఓబీసీలు భిన్న ధ్రువాలుగా ఉండటం వల్ల బీజేపీ లబ్ధి పొందే అవకాశం ఉందని అనేక మంది భావిస్తున్నారు. మహారాష్ట్రలో రానున్న పురపాలక సంస్థల, వచ్చే ఏడాది మొదటి మూడు నెలల్లో జరగడానికి అవకాశం ఉన్న జిల్లా కౌన్సిళ్ళ ఎన్నికల ఫలితాలలో అది కనిపించవచ్చని అనుకొంటున్నారు.

ఓబీసీ కోటా నుంచి మరాఠాలకు రిజర్వేషన్ కల్పించడం ప్రభుత్వానికి చాలా కష్టమైన పని. వివిధ కమిటీలు గతంలో అదే విషయాన్ని తేల్చి చెప్పాయి. మరాఠాలు సామాజికంగా వెనుకబడిన వర్గమని నిరూపించడం చాలా కష్టం. ఫడ్నవీస్ ప్రభుత్వం 2019లో మరాఠాలకు కల్పించిన రిజర్వేషన్‌ను ఆ ప్రాతిపదికపైనే సుప్రీం కోర్టు కొట్టివేసింది. కానీ, కేంద్ర ప్రభుత్వం తలచుకుంటే, చట్టం చేసి, రాజ్యాంగానికి సవరణలు చేసి మహారాష్ట్రలో హెచ్చు శాతం రిజర్వేషన్లకు వీలు కల్పించవచ్చు. అపుడు మరాఠా రిజర్వేషన్‌కు మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతానికి, మరాఠా ఉద్యమం చాలా వరకు రాజకీయ అంశమే. దాని నుంచి లబ్ధి పొందాలని వివిధ పార్టీలు తహతహలాడుతున్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(‘ద ఫ్రీ ప్రెస్ జర్నల్’ సౌజన్యంతో)

గౌరవంతో ముడిపడిన అంశం

ఇన్ బాక్స్



ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకొంటారు. దీని ప్రధాన ఉద్దేశ్యం సమాజంలో అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలియజేయడం. అక్షరాస్యత అనేది కేవలం చదవడం లేదా రాయడం మాత్రమే కాదు; ఇది మానవ హక్కులు, మానవ గౌరవానికి సంబంధించిన ప్రాథమిక అంశం. ఐక్యరాజ్య సమితి ‘సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు’ అక్షరాస్య తను కీలక భాగంగా గుర్తించాయి. ఒక వ్యక్తి అక్షరాస్యుడిగా మారినప్పుడు మాత్రమే పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం, సామాజిక న్యాయం వంటి లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుంది.

‘పీరియాడిక్ లేబర్ ఫోర్స్’ సర్వే ప్రకారం, భారతదేశంలో 7 సంవత్సరాలు, ఆ పై వయస్సు గల ప్రజల అక్షరాస్యత రేటు 80.9%గా ఉంది. ఇందులో మిజోరం (98.2%), లక్షద్వీప్ (97.3%), కేరళ (95.3%), త్రిపుర (93.7%), గోవా (93.6%) రాష్ట్రాలు అక్షరాస్యత రేటులో అగ్రస్థానంలో ఉన్నాయి. అదే సమయంలో ఆంధ్ర ప్రదేశ్ (72.6%), బిహార్ (74.3%), మధ్యప్రదేశ్ (75.2%), రాజస్థాన్ (75.8%), తెలంగాణ (76.9%) వంటి రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయి. అంతర్జాతీయంగా పరిశీలిస్తే – ఫిన్లాండ్, నార్వే, లక్సెంబర్గ్, ఆండోరా, గ్రీన్‌లాండ్ వంటి దేశాలు 100% అక్షరాస్యత రేటుతో ముందంజలో ఉన్నాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, జపాన్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి అభివృద్ధి చెందిన దేశాల రేటు కూడా 99% వరకు ఉంది. కానీ భారత్ మాత్రం 80.9% రేటుతో మధ్యస్థానానికి కూడా చేరుకోలేకపోతోంది. ఈ గణాంకాలు దేశంలో ఇంకా గ్రామీణ ప్రాంతాలు, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు విద్యావకాశాలకు దూరంగా ఉన్నారనే వాస్తవాన్ని చూపిస్తున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరికి విద్యా హక్కు అందేలా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం అత్యవసరం.

– అర్జునరావు రాజనాల । అరోరా పీజీ కాలేజ్, హైదరాబాద్
(రేపు ‘అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం’)

కర్కోటకుడు



కర్కోటకుడు అంటే క్రూరుడు, దయలేని దుర్మార్గుడు అని లోకంలో వాడుక ఉంది. అది మహాభారతంలో మనకు కనిపించే కర్కోటకుడికి న్యాయం చేయదు. కర్కోటకుడు, కద్రువకున్న అశేష సర్ప సంతానంలో ఒకడు. ‘ఉచ్చైశ్రవం’ అనే తెల్ల గుర్రం తోక మాత్రం నలుపు అని ఆయన తల్లి, తన సవతితో పెంకిగా పందెం కడుతుంది. తన సంతానంలో ఎవరైనా వెళ్ళి తన పందెం నెగ్గేదాకా ఆ గుర్రం తోకను చుట్టుకొని ఉండాలని కోరుతుంది. అది అన్యాయమని అందరూ కాదంటే, ఒక్క కర్కోటకుడు మాత్రం తల్లి ఆదేశం పాటించి, పందెం గెలిపిస్తాడు. అందులో ఆయన తప్పేముంది? ఆయన నిమిత్త మాత్రుడు.

కర్కోటకుడు ఆ తరవాత మళ్ళీ నల దమయంతుల కథలో కనిపిస్తాడు. పుణ్యపురుషుడైన నల మహారాజు, తనను పట్టి పీడిస్తున్న కలిపురుషుడి ప్రభావం వల్ల అన్నీ కోల్పోయి, అతి దీన స్థితిలో అడవిలో తిరుగుతుంటాడు. ముని శాపం వల్ల కదిలే శక్తి కోల్పోయిన కర్కోటకుడు అదే అడవిలో కారు చిచ్చులో చిక్కుకొని, కాలిపోబోతుంటే, నలుడు అతగాడిని ఎత్తి తీసుకెళ్ళి సురక్షిత స్థలం చేరుస్తాడు. ఆ ఉపకారానికి ప్రతిఫలంగా వెంటనే కర్కోటకుడు నలుడిని కస్సున కాటు వేస్తాడు! అతి సుందర రూపుడైన నలుడు, ఆ విషం ప్రభావం వల్ల కమిలి, కుంచించుకుపోయి వికృతమైన రూపం పొందుతాడు.

‘రాజా! నా కాటు నీ మంచికే. కష్టకాలంలో ఓర్పుతో ఉంటే, ఆ కష్టాలకు పరిష్కారం, ఆపదలా మారువేషం వేసుకొని నీముందుకొస్తుంది. ఇప్పటికే నా విషం తీక్ష్ణత తాళలేక, నిన్ను పట్టి పీడిస్తున్న కలిపురుషుడు పారిపోయాడు. నువ్విక అడవిలో అన్న వస్త్రాలు లేకుండా తిరగనక్కర్లేదు. నా విషం వల్ల కలిగిన ఈ వికృత రూపంలో నిన్నెవరూ గుర్తు పట్టలేరు. నీకు మిగిలి ఉన్న కొద్దిపాటి కష్టకాలం గడిచేదాకా, నువ్వు ఋతు పర్ణరాజు దగ్గర అశ్వ శిక్షకుడిగా కొలువు చేయి. త్వరలో నీ కష్టాలు తీరతాయి. అప్పుడు నువ్వు నన్ను స్మరించి, ఈ వస్త్రాలు ధరిస్తే నీ పూర్వ రూపం నీకు తిరిగి వస్తుంది’ అని నలుడికి వస్త్రాలిచ్చి కర్కోటకుడు తన దోవన తను పోతాడు.

కర్కోటకుడి క్రూరత్వం, దుర్మార్గం తన స్వార్థం కోసం కాదు. ఆయన నిమిత్తమాత్రుడు. ఈ కర్కోటకుడిని శాస్త్రోక్త పద్ధతిలో స్మరించిన వారికి, సర్పభయమూ, సర్పదోషాలూ దూరమవుతాయని పెద్దల మాట. కష్టకాలంలో మనపట్ల క్రూరత్వం, దుర్మార్గం చూపేవాళ్ళు నిమిత్తమాత్రులు. ఓపిక వహించగల వారికి, ఆ క్రూరత్వం వల్ల మేలే జరుగుతుంది. అన్నీ మన మంచికే అవుతాయి.

– ఎం. మారుతి శాస్త్రి



నేడు యాదగిరి క్షేత్రం మూసివేత

చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయం ద్వార బంధనం

యాదగిరిగుట్ట: సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సోమవారం వేకువజామున 3.30 వరకు యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని మూసివేయనున్నారు. ఆదివారం రాత్రి 9.56 గంటల నుంచి అర్ధరాత్రి 1.26 గంటల వరకు సంపూర్ణ చంద్రగ్రహణం ఉండనుంది. ఈ కారణంగా ప్రధానాలయంతో పాటు ఉప ఆలయాలు, అనుబంధ దేవాలయాలను మూసివేయ నున్నారు. ధర్మ దర్శనాలు, వీఐపీ దర్శనాలు, బ్రేక్ దర్శనాలు, స్వామి ఊరేగింపు, అర్చన, ఆరాధన, శయనోత్సవం వంటి పూజలు రద్దు చేశారు. తిరిగి సోమవారం వేకువ జామున 3.30 గంటలకు ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయాలు, ఉప ఆలయాలను తెరుస్తారు. సంప్రోక్షణ చేసిన అనంతరం యథావిధిగా నిత్య కైంకర్యాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెంకట్రావ్ వెల్లడించారు.

దసరా ఆర్జిత సేవా టికెట్ల రుసుము ఖరారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 22 నుంచి 11 రోజుల పాటు నిర్వహించే దసరా ఉత్సవాల్లో ఆర్జిత సేవా టికెట్ల రుసుంను దేవస్థాన అధికారులు ఖరారు చేశారు. ఉత్సవాల్లో ప్రత్యేక ఖడ్గమాలార్చనకు రూ.5,116, ప్రత్యేక కుంకుమార్చనకు రూ.3వేలు, మూలా నక్షత్రం రోజున రూ.5వేలుగా నిర్ణయించారు. ప్రత్యేక శ్రీచక్రనవావరణార్చనకు రూ.3 వేలు, ప్రత్యేక చండీహోమం రూ.4 వేలు ఖరారు చేశారు. ప్రత్యేక శ్రీచక్రనవావరణార్చన ఆలయ ప్రాంగణంలోని లక్ష కుంకుమార్చన వేదిక వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చండీహోమం యాగశాల నిర్వహిస్తారు. ఉత్సవాలు ప్రారంభమయ్యే తొలి రోజున మాత్రం ప్రత్యేక కుంకుమార్చన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఒక షిఫ్ట మాత్రమే నిర్వహిస్తారు. ఇక ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌లో పొందే అవకాశం ఉందన్నారు.

పరోక్ష సేవకు రూ.1,500: ఉత్సవాలలో నిర్వహించే ప్రత్యేక కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమాలను పరోక్షంగా జరిపించుకునే అవకాశాన్ని దేవస్థానం భక్తులకు కల్పిస్తుంది. ఒక రోజు పరోక్ష సేవకు రూ.1,500గా, ఇక 11 రోజుల పాటు సేవకు రూ. 11,116గా నిర్ణయించినట్లు సమాచారం. పరోక్ష సేవలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు ఉత్సవాల అనంతరం అమ్మవారి ప్రసాదాలను పోస్టు ద్వారా భక్తులకు పంపుతారు.

పదోన్నతి అర్హతలుంటేనే ఇంక్రిమెంట్!

- ఎస్సీ గురుకుల సొసైటీలో డిగ్రీ లెక్చరర్లకు వింత కొర్రీ
- పీహెచ్‌డీ లేదా డిపార్ట్‌మెంటల్ టెస్ట్ పాసవ్వాలని నిబంధన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీలో డిగ్రీ లెక్చరర్ల(డీఎల్స్)కు వేతన ప్రోత్సాహకాల విడుదలకు అధికారులు విచిత్ర నిబంధనలు తీసుకువచ్చారు. పదోన్నతి పొందేందుకు ఉండాల్సిన అర్హతలుంటేనే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద ఇంక్రిమెంట్ ఇస్తామని తేల్చి చెప్పారు. ఈ నిబంధన కేవలం 2019 ఆగస్టులో నియమితులైన వారికి మాత్రమే వర్తింపజేస్తున్నట్లు పైఅధికారులు సమాచారం ఇవ్వడంతో వారినుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 2017 జూలై నోటిఫికేషన్ ద్వారా నియమితులై 2019 మార్చిలో విధుల్లో చేరిన బ్యాచ్‌కు ఇంక్రిమెంట్లు విడుదల చేసిన సొసైటీ అధికారులు... 2018 ఆగస్టులో తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఎంపికై 2019 ఆగస్టులో విధుల్లో చేరిన వారికి మాత్రం కొత్త నిబంధనలు వర్తింపచేయడం గమనార్హం. గురుకుల విద్యా సంస్థల్లో డిగ్రీ లెక్చరర్లుగా ఎంపికైన వారిని నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్), స్లెట్(స్టేట్ లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్) లేదా పీహెచ్‌డీల్లో ఏదేని ఒకటి అర్హత సాధించడంతో పాటు డిపార్ట్‌మెంటల్ టెస్ట్ తప్పకుండా పాసవ్వాలి. అలాంటి వారికి పోస్టుల లభ్యత ఆధారంగా పదోన్నతి ఇస్తారు. వీటిలో అర్హత లేనప్పుడు పదోన్నతికి అవకాశం ఉండదు. కానీ తాజాగా తీసుకొచ్చిన నిబంధనతో ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ ఇంక్రిమెంట్ కూడా ఇవ్వలేమని ప్రిన్సిపల్స్ చెబుతుండటంతో పలువురు డిగ్రీ లెక్చరర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

లిఖితపూర్వక ఆదేశాలు లేవు...

డిగ్రీ లెక్చరర్లకు ఇచ్చే ఇంక్రిమెంట్లకు సంబంధించి కొత్త నిబంధనలతో కూడిన ఆదేశాలేవీ సొసైటీ కార్యాలయం నుంచి లిఖితపూర్వకంగా వెలువడలేదు. కేవలం రాష్ట్ర కార్యాలయంలోని ఓ అధికారి చెప్పిన మౌఖిక ఆదేశాలతో వీటిని నిలిపివేసినట్లు తెలుస్తోంది.

అక్షరం తేడా ఉన్నా బిల్లు రాదాయె!

▶ మొదటి పేజీ తరువాయి

రాసినా అర్థమయ్యేలా రాయకపోవడం వల్ల కంప్యూటరీకరించే వేళ అక్కడి సిబ్బంది ఇంటి పేర్లను పొడి అక్షరాల్లోకి మార్చారు. దీంతో ఆధార్ కార్డుల్లోని ఇంటి పేర్లు ఒక రకంగా.. ఇందిరమ్మ లబ్ధిదారుల రికార్డుల్లో మరో రకంగా నమోదయ్యాయి. ఫలితంగా ఆధార్‌లోని వివరాల ప్రకారం పేర్లు లేకపోవడంతో లబ్ధిదారులు మారిపోయినట్లు భావిస్తూ అధికారులు బిల్లులను నిలిపేస్తున్నారు.

పేర్ల స్పెల్లింగ్‌లలో తేడాల వల్ల..

కొందరు లబ్ధిదారుల పేర్ల స్పెల్లింగ్‌లలోనూ తేడాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదయ్యాయి. ఉదాహరణకు వల్లి అనే పేరును ఆంగ్ల అక్షరాల్లో రాసేటప్పుడు ఆధార్ కార్డులో చివరి అక్షరంగా 'వై'అని ఉంటే.. ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం 'ఐ'అని రాశారు. అలాగే సుమతి పేరును ఆంగ్లంలో టీహెచ్ఐ అని ఒకచోట, టీఐ అని మరోచోట నమోదు చేశారు. ఇలాంటి తేడాలను కూడా లబ్ధిదారులు మారినట్టుగానే భావిస్తూ బిల్లుల చెల్లింపును అధికారులు ఆపేస్తున్నారు. బేస్‌మెంట్ స్థాయి వరకు పని పూర్తయినట్టు ఇందిరమ్మ యాప్‌లో ఫొటోతో సహా అప్‌లోడ్ చేసి 20 రోజులు గడుస్తున్నా బిల్లులు రావట్లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులను సంప్రదిస్తే ఆధార్ కార్డులోని వివరాలతో సరిపోలట్లేదని.. దాన్ని మారిస్తే తప్ప బిల్లు రాదని చెబుతున్నారు. అయితే తమ ప్రమేయం లేకుండా జరిగిన పొరపాట్లు ఇళ్ల నిర్మాణంపై ప్రభావం చూపుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులు వచ్చిన వారి వివరాలను మార్చి బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు. చాలామంది లబ్ధిదారులకు ఈ సమస్య తెలియక బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ఫిర్యాదు చేయని వారి బిల్లుల విడుదలలో మరింత జాప్యం జరుగుతోంది.

వారిని పర్మనెంట్ చేయకపోవడం వివక్షే

- 29 మంది పారామెడికల్ సిబ్బంది సర్వీసును క్రమబద్ధీకరించాల్సిందే
- బీహెచ్ఈఎల్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తాత్కాలిక పద్ధతిన పారామెడికల్ సేవలందిస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేయాలంటూ బీహెచ్ఈఎల్‌ను హైకోర్టు ఇటీవల ఆదేశించింది. దశాబ్దానికిపైగా పనిచేస్తున్న పిటిషనర్లను పర్మనెంట్ చేయకుండా తాత్కాలిక ఉద్యోగులుగా కొనసాగించడం వివక్షాపూరితమేనని స్పష్టం చేసింది. పిటిషనర్ల సర్వీసులను ఎప్పటికప్పుడు కొంత విరామమిస్తూ పొడిగిస్తూ వస్తున్నారని.. అందువల్ల వారు శాశ్వత నియామకానికి అర్హులేనని తేల్చిచెప్పింది. పారామెడికల్ తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ జి.దుర్గాప్రసాద్‌తోపాటు మరో 28 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ బీహెచ్ఈఎల్ మొదట 6 నెలలకు పిటిషనర్లను తీసుకుందని.. ఆ తర్వాత కృత్రిమ విరామమిస్తూ తిరిగి నియమిస్తూ అనైతిక విధానానికి పాల్పడిందన్నా రు. ఎప్పటికప్పుడు సర్వీసును పొడిగించడానికి అధికారులు సిఫారసులు చేస్తున్నారన్నారు. ఒప్పందం ప్రకారం వారికి ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్, ఎస్ఐపీ తదితర చట్టబద్ధ ప్రయోజనాలతోపాటు రూ. 2 లక్షల బీమా, వసతి సౌకర్యం కల్పించడానికి బీహెచ్ఈఎల్ అంగీకరించినా శాశ్వత నియామకాలు చేపట్టడంలేదన్నారు. బీహెచ్ఈఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించడానికి తాత్కాలిక పద్ధతిన పిటిషనర్ల నియామకం చేపట్టినట్లు తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. దశాబ్దానికిపైగా వారు ఉద్యోగాల్లో ఉంటున్నారని గుర్తు చేశారు. శాశ్వత ఉద్యోగులుగా నియామకానికి అర్హులైనందున వారిని పర్మనెంట్ ఉద్యోగులుగా తీసు కొని వేతన ప్రయోజనాలను కల్పించాలని ఆదేశించారు.



పత్తి చేలో పడిగాపులు

నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని చర్లపల్లికి యూరియాలోడు వచ్చిందని తెలియగానే రైతులంతా ఒకేసారి గోదాం వద్దకు వెళ్లారు. గోదాం వద్దే ఒక కౌంటర్ ఏర్పాటు చేయడంతో.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పక్కనే ఉన్న పత్తి చేలో టోకెన్ల కోసం బారులుదీరారు. ఎండలో నానా ఇబ్బందులు పడ్డారు. ముందస్తుగా యూరియా నిల్వ చేస్తే బాగుండేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

యూరియా కోసం పరస్పర దాడులు

- అధికారుల పొరపాట్లతో కొట్టుకుంటున్న రైతులు
- కరీంనగర్ జిల్లాలో రెండు గ్రామాల రైతుల మధ్య ఘర్షణ
- మహబూబాబాద్‌లో రాళ్లు విసిరిన అన్నదాతలు

సైదాపూర్/ మహబూబాబాద్ రూరల్: రైతులకు యూరియా కష్టాలు మరింత పెరిగాయి. రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడి ఓపిక నశిస్తున్న రైతులు పరస్పరం దాడులకు దిగుతున్నారు. వ్యవసాయాధికారుల తప్పిదాలతో అయోమయానికి గురై దాడులు చేసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్కెపల్లి సహకార సంఘానికి శనివారం యూరియా లోడ్ వచ్చింది. రైతులు, మహిళలు గోదాం వద్దకు చేరుకున్నారు. వెన్నంపల్లిలో టోకెన్‌లు తీసుకునే క్రమంలో వెన్నంపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామ రైతుల మధ్య వివాదం ఏర్పడింది. పరస్పరం దాడులు చేసుకున్నారు. వెన్నంపల్లికి చెందిన కంది గోపాల్‌రెడ్డి తలకు గాయమైంది. సహకార కార్యాలయం కిటికీల అద్దాలు పగిలాయి. వెన్నంపల్లిలో టోకెన్లు పంచాల్సిన సీఈఓ శ్రీధర్.. వాటిని కానిస్టేబుల్‌కు ఇచ్చాడు. దీంతో రైతులు రోడ్డుపై బైఠాయించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏవో వైదేహిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై తిరుపతి వచ్చి రైతులను సముదాయించారు.

యూరియా లారీపై రాళ్లు

యూరియా కోసం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద శనివారం ఉదయం రైతులు బారులుదీరారు. కొందరు ఓపిక నశించి సొసైటీ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి సీఈఓ ప్రమోద్ కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. అతన్ని బయటకు గుంజుకువచ్చే ప్రయత్నం చేయగా టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సైలు అశోక్, మౌనిక, తమ సిబ్బందితో వచ్చి రైతులను సముదాయించి మళ్లీ క్యూలైన్లలో నిలబెట్టారు. అంతలో క్యూలైన్‌లో నిలబడిన ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోవటంతో ఆగ్రహించిన రైతులు యూరియా లారీపై రాళ్లు రువ్వారు. లారీపై కప్పి ఉంచిన టార్పాలిన్‌ను తొలగించి 3 బస్తాలు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ స్వయంగా అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మహిళా రైతులను పురుష పోలీసులు బయటికి నెట్టివేయడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. సంయమనం పాటించాలని తన సిబ్బందికి ఎస్పీ సూచించారు. దగ్గర ఉండి యూరియా బస్తాలను పంపిణీ చేయించారు.



మహబూబాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద లారీలో ఉన్న యూరియా బస్తాలను ఎత్తుకెళ్తున్న రైతులు

'హెలీ' లేదు.. 'ప్యాడ్డే'..!



అలంకార ప్రాయంగా టీజీఐసీసీసీ హెలీప్యాడ్

- నిబంధనలు పాటించకపోవడంతో అనుమతి నిరాకరణ
- ప్రారంభమై మూడేళ్లైనా నిరుపయోగంగానే...
- సీఎం, ఉన్నతాధికారులకు టేకాఫ్ బేగంపేట నుంచే
- నిమజ్జనం పర్యవేక్షణకు అలానే వెళ్లిన హెలీకాప్టర్

సాక్షి, హైదరాబాద్: పోలీసు విభాగం చేసిన ఓ చిన్న పొరపాటు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (టీజీఐసీసీసీ) హెలీప్యాడ్‌ను అలంకార ప్రాయంగా మార్చింది. కేవలం దీనికోసమే ఆ భవనం ఎత్తు తగ్గించి నిర్మించారు. అయితే కొలతలు తీసుకోవడంలో వచ్చిన పొరపాటు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. కేవలం 13 మీటర్లకు సంబంధించిన ఈ వ్యవహారం కారణంగా కేంద్రం పౌర విమానయాన శాఖ ఈ హెలీప్యాడ్ నుంచి హెలీకాప్టర్ల రాకపోకలకు అనుమతి ఇవ్వట్లేదు. ఈ కారణంగానే ఐసీసీసీ అందుబాటులోకి వచ్చిన మూడేళ్లు దాటినా ఇప్పటికీ ఈ ప్యాడ్ అలంకార ప్రాయంగా మారింది. ఫలితంగా శనివారం నాటి గణేశ్ నిమజ్జనాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించడానికి అధికారులు, మంత్రులు బేగంపేట విమానాశ్రం నుంచే వెళ్లిరావాల్సి వచ్చింది. దీనికోసం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ బేగంపేట విమానాశ్రయానికి వెళ్లారు.

24 నుంచి 20 అంతస్తులకు తగ్గింపు...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్‌లో కీలక సభ జరిగింది. అందులో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ బంజారాహిల్స్‌లోని రోడ్ నెం.12లో 22+2 అంతస్తులతో (రెండు సెల్లార్లతో కలిపి) ఐసీసీసీ ఏర్పాటు ప్రకటన చేశారు. ఈ మేరకు ప్రాథమిక అంచనాలు, డిజైన్లు సైతం సిద్ధమైపోయాయి. ఈ సెంటర్ ఏ బ్లాక్ పైన హెలీప్యాడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

- 2015 నవంబర్ 22న దీని నిర్మాణానికి శంకుస్థాపన చేసే సమయానికీ అదే ఎత్తు ఖరారైంది. అయితే అంత ఎత్తులో నిర్మిస్తే హెలీప్యాడ్ నుంచి హెలీకాప్టర్ల రాకపోకలకు అనుమతి ఇవ్వలేమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో ఏ బ్లాక్ ఎత్తును 18+2 అంతస్తులకు తగ్గించారు. రెండు సెల్లార్లు, పైన 18 అంతస్తుల్లో డిజైన్ ఖరారు చేశారు. ఈ 18వ అంతస్తులోనే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఉంది. దీని పైనే హెలీప్యాడ్ నిర్మించారు. ఐసీసీసీని 2022 ఆగస్టు 4న ప్రారంభించారు.

గ్రౌండ్ నుంచి కొలవడంతో చిక్కులు...

భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత హెలీప్యాడ్ నుంచి హెలీకాప్టర్ల రాకపోకలకు అనుమతి కోరుతూ కేంద్రం పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు పోలీసు విభాగం దరఖాస్తు చేసింది. ఆ సమయంలో భవనం ఎత్తును గ్రౌండ్ ఫ్లోర్ నుంచి కొలిచిన ఇంజినీరింగ్ అధికారులు 70 మీటర్లే ఉన్నట్లు నమోదు చేశారు. హెలీకాప్టర్ల ఆపరేటింగ్‌కు అనుమతి ఇచ్చే ముందు మంత్రిత్వ శాఖకు చెందిన బృందం వచ్చి ఐసీసీసీని సందర్శించి కొలతలు తీసుకుంది. ఈ భవనం ప్రధాన రహదారి వైపు రోడ్డుకు సమానంగానే ఉన్నా... వెనుక వైపు మాత్రం రోడ్డు కంటే దిగువన ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆ అధికారులు సెల్లార్ నుంచి ఎత్తును పరిగణనలోకి తీసుకుని లెక్కించారు. ఫలితంగా అది 83 మీటర్లకు చేరింది. హెలీప్యాడ్ ఆపరేటింగ్‌కు భవనం 70 మీటర్ల ఎత్తే ఉండాలని, ఇది 13 మీటర్లు అదనంగా ఉండటంతో అనుమతి ఇవ్వలేకపోతున్నామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

సీఎం సైతం వినియోగిస్తుండటంతో...

టీజీఐసీసీసీని రాష్ట్ర స్థాయి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌గా వినియోగిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాటు తదనంతర పరిణామాల సందర్భంలో ఇక్కడ నుంచే రాష్ట్ర వ్యాప్తంగా కార్యకలాపాలను పర్యవేక్షించారు. దీనికితోడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం అనేక సమీక్షలు, సమావేశాలు ఐసీసీసీ నుంచే చేస్తున్నారు. వాటి అనంతరం ఆయన ఏదైనా పర్యటనకు వెళ్లాలంటే బేగంపేట విమానాశ్రయాన్నే వినియోగించాల్సి వస్తోంది. దీనికోసం రూట్ క్లియరెన్స్ సహా అనేక అంశాలు సవాల్‌గా మారుతున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న నగర పోలీసు విభాగం మరోసారి పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని నిర్ణయించింది. విపత్తు నిర్వహణకు సంబంధించిన అంశాల్లో కొన్ని నిబంధనలకు మినహాయింపు ఉంటుంది. టీజీఐసీసీసీ నుంచి డిజాస్టర్ రెస్పాన్స్ కార్యకలాపాలు సాగుతుండటంతో తమకు మినహాయింపు ఇవ్వాలని కోరనున్నారు. అంతా క్లియర్ అయితే వచ్చే గణేశ్ నిమజ్జనోత్సవం నాటిని ఏరియల్ సర్వేకు హెలీకాప్టర్ ఐసీసీసీ నుంచే బయలుదేరే అవకాశం లేకపోలేదు.

కొత్వాల్ @ పెట్ లవర్..

నగర పోలీసు కమిషనర్‌గా అందరికీ సుపరిచితుడైన సీవీ ఆనంద్ క్రికెట్ ప్లేయర్ అన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆయనో పెట్ లవర్ అనే మరో కోణం కొందరికే తెలుసు. ఆయనకు కుక్కలంటే ప్రాణం. కేవలం ఇవే కాదు.. ప్రతి జంతువునూ ప్రేమగా చూసే ఆనంద్.. ఆ కోణంలోనూ తన ముద్ర వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గోషామహల్ పోలీసుస్టేడియంలో పోలీసు జాగిలాలు, మౌంటెడ్ పోలీసులో సేవలందించే గుర్రాల కోసం అన్ని వసతులతో కూడిన కెన్నెల్, స్టేబుల్ కట్టిస్తున్నారు. జాగిలాలు, అశ్వాల బాగోగులు చూడటానికి తొలిసారిగా హైదరాబాద్ పోలీసు విభాగంలో ఓ వెటర్నరీ డాక్టర్‌ను నియమించారు. - సాక్షి, హైదరాబాద్



- వాటి బాగోగులు చూడడానికీ ప్రాధాన్యం
- జాగిలాలను ప్రాణంగా చూసుకుంటున్న సీవీ ఆనంద్

సీఐఎస్ఎఫ్‌కు తన సొంతవి 'డొనేషన్'

పెట్ లవర్ ఆనంద్ కొన్నేళ్లుగా జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన జాగిలాలను పెంచుకుంటున్నారు. వీటికి డాన్, హాజెల్ అనే పేర్లు పెట్టారు. గతంలో డిప్యుటేషన్‌పై సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో (సీఐఎస్ఎఫ్) ఐజీ ఎయిర్‌పోర్ట్స్ సెక్టార్ విధులు నిర్వర్తించారు. శంషాబాద్ విమానాశ్రయం కేంద్రంగా పనిచేసిన ఆయన ఆ విభాగంలో ఉన్న కెన్నెన్ స్క్వాడ్ బలోపేతానికి నిర్ణయించుకున్నారు. దీనికోసం తన పెంపుడు జాగిలాలైన డాన్, హాజెల్‌కు జన్మించిన మూడు కూనలు స్వీటీ, నియోల్, మ్యాక్స్‌లను 2019 ఆగస్టు 7న ఆ విభాగానికి బహూకరించారు. అవి మొయినాబాద్‌లోని తెలంగాణ డాగ్ ట్రైనింగ్ స్కూల్లో శిక్షణ పొందుతుండగానే ఆనంద్ హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నిసా) డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తూ 2020 నవంబర్ 19న డాగ్ ట్రైనింగ్ స్కూల్‌కు వెళ్లారు. అక్కడ స్నిఫర్ డాగ్స్‌గా శిక్షణ పొందుతున్న తన జాగిలాల కూనల్ని చూసొచ్చారు. ఆ సమయంలో తమ యజమానిని చూసిన ఆ జాగిలాలు ఉద్వేగానికి లోనయ్యాయి. ఆనంద్‌ను చుట్టేసుకున్న స్వీటీ, నియోల్, మ్యాక్స్ తమ విశ్వాసాన్ని చాటాయి.



మానవతాదృక్పథంతో..

జాగిలాలను అమితంగా ఇష్టపడే ఆనంద్ కేవలం తాను పెంచుకునే డాన్, హాజెల్.. వాటికి జన్మించిన స్వీటీ, నియోల్, మ్యాక్స్ విషయంలోనే కాదు.. మిగతా జంతువుల విషయంలోనూ మానవతాదృక్పథంతో స్పందిస్తారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని సీఐఎస్ఎఫ్ కెన్నెన్ స్క్వాడ్‌లో పనిచేసిన జాగిలం రాయ్ గతేడాది కన్నుమూసింది. పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలు, నిషేధిత వస్తువుల్ని గుర్తించడానికి వాసన చూస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే గ్యాస్ట్రిక్ డిలేటేషన్–వోల్వులస్ (జీడీవీ) అనే అరుదైన వ్యాధితో రాయ్ చనిపోయింది. దీంతో చలించిన ఆనంద్ తన ఎక్స్ ద్వారా దాని సేవలను కొనియాడుతూ పోస్టు పెట్టారు. సిటీ పోలీసుల డాగ్ స్క్వాడ్‌లో పనిచేసిన రెండు జాగిలాలు, మౌంటెడ్ పోలీసులోని ఓ గుర్రం కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాయి. దీంతో ఈ రెండు విభాగాల్లోని మూగజీవాలకు వైద్య సేవలందించడానికి శాశ్వత ప్రాతిపదికన ఆనంద్ ఓ వైద్యుడిని కూడా నియమించారు.

దోస్త్ మేరా దోస్త్!

మోదీ, నేను భాయీ భాయీ

- భారత్‌ను మేం చైనాకు కోల్పోలేదు
- ఒక్కరోజుకే ప్లేట్ ఫిరాయించిన ట్రంప్
- మోదీ గొప్ప ప్రధాని అంటూ కితాబు
- ఇప్పుడాయన చేస్తున్నదే నచ్చడం లేదు!
- రష్యా, చైనాతో భారత్ నెయ్యంపై ఆక్రోశం
- మారిన వైఖరిని అభినందిస్తున్నా: మోదీ
- భారత్–అమెరికాలది వ్యూహాత్మక బంధం
- అత్యంత హుందాగా స్పందించిన ప్రధాని





న్యూయార్క్/వాషింగ్టన్: నాలుకకు నరం లేదని, తన చిత్తం క్షణక్షణానికీ మారుతూ ఉంటుందని అమెరికా అధ్యక్షుడు మరోసారి నిరూపించారు. రష్యా, చైనాతో పాటు భారత్‌పైనా ఒంటికాలిపై లేచి ఒక్క రోజైనా గడవకుండానే షరామామూలుగా ప్లేటు ఫిరాయించారు. భారత్‌పైనా, ప్రధాని నరేంద్ర మోదీపైనా ఉన్నట్టుండి ప్రశంసల వర్షం కురిపించారు. ''భారత్‌తో అమెరికాకు 'ప్రత్యేక బంధ'ముంది. ముఖ్యంగా మోదీ ఓ అద్భుతమైన ప్రధాని. ఓ గొప్ప వ్యక్తి కూడా. ఆయనతో నాకు గొప్ప స్నేహ బంధముంది. అదెప్పటికీ కొనసాగుతుంది కూడా'' అని శుక్రవారం (అమెరికా కాలమానం ప్ర కారం) వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో మీడియా భేటీ సందర్భంగా మీడియా ప్రశ్నలకు బదులుగా చెప్పుకొచ్చారు. మోదీ కూడా అందుకు అత్యంత హుందాగా స్పందించారు. ''అమెరికా అధ్యక్షుని తాలూకు ఈ మారిన వైఖరిని ఎంతగానో అభినందిస్తున్నా. భారత–అమెరికా భాగస్వామ్యంపై ఆయన సానుకూల వ్యాఖ్యలు, రెండు దేశాల ప్రత్యేక బంధాన్ని అభినందించిన తీరు ప్రశంసనీయం'' అని పేర్కొన్నారు. ట్రంప్ మీడియా భేటీ తర్వాత కొద్ది గంటలకే ఈ మేరకు ఎక్స్‌లో ప్రధాని పోస్టు పెట్టారు. భారత్, అమెరికాలది అత్యంత సానుకూల, ప్రగతి శీల, సమగ్ర వ్యూహాత్మక అంతర్జాతీయ భాగస్వామ్యం అంటూ కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. జూన్ 17 నాటి ఫోన్ సంభాషణల అనంతరం ట్రంప్, మోదీ పరస్పరం స్పందించడం ఇదే తొలిసారి. ప్రతీకార సుంకాల కారణంగా దిగజారిన ద్వైపాక్షిక బంధాల పునరుద్ధరణకు అమెరికా, భారత్ సంసిద్ధతకు ఇది నిదర్శనమని పరిశీలకులు భావిస్తున్నారు.

నిమిషానికో మాట...

భారత్, రష్యాలను దుష్ట చైనాకు కోల్పోయామంటూ సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ట్రూత్‌సోషల్'లో ట్రంప్ ఘాటుగా పోస్టు పెట్టడం తెలిసిందే. ఆ మూడింటి దోస్తీ సుదీర్ఘంగా వర్ధిల్లాలంటూ వ్యంగ్యోక్తులు కూడా విసిరారు. 'యుద్ధమా, శాంతా అమెరికాయే తేల్చుకోవా'లన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హెచ్చరికలకు స్పందనగా ట్రంప్ పెట్టిన ఆ పోస్టు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఆయన ఒంటెత్తు పోకడల కారణంగా అమెరికాతో భారత సంబంధాలు గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా దిగజారిపోవడం తెలిసిందే. వాటిని పూర్తిస్థాయిలో చక్కదిద్దేందుకు సిద్ధంగా ఉన్నారా అంటూ ట్రంప్‌ను విలేకరులు ప్రశ్నించారు. అందుకాయన రకరకాలుగా స్పందించారు. ''ఇరుదేశాల సంబంధాల విషయంలో ఆందోళన పడాల్సిందేమీ లేదు. ఏదో, అప్పుడప్పుడూ అలా జరుగుతూ ఉంటుంది' అంటూ తేలిగ్గా కొట్టిపారేశారు. ''మోదీతో నేను చాలా చనువుగా ఉంటా తెలుసా! ఆయన చాలా గొప్ప వ్యక్తి. రెండు నెలల క్రితమే అమెరికాలో పర్యటించారు కదా!'' అంటూ ప్రధానిపై మరోసారి పొగడ్తలు కురిపించారు. ''ఆ సందర్భంగా మేమిద్దరం కలిసి రోజ్ గార్డెన్‌లో వ్యాహ్యాళికి వెళ్లాం. అక్కడి గడ్డి చెప్పలేనంత తడిగా ఉంది. మీడియా కాన్ఫరెన్స్‌కు అస్సలు సరైన ప్రదేశం కాదది. అలాంటి చోట ప్రెస్‌మీట్ పెట్టడం నాకదే చివరిసారి'' అని చెప్పుకున్నారు. అంతలోకే, 'మోదీ ప్రస్తుతం చేస్తున్న పనే నాకస్సలు నచ్చడం లేదు' అంటూ రష్యా, చైనాలతో భారత మైత్రిపై తన ఆగ్రహాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. 'అయినా సరే, భారత్‌తో అమెరికాకు అత్యంత ప్రత్యేక బంధముంది' అంటూ చిరునవ్వులు చిందించారు. ''అంతలోకే, రష్యా నుంచి భారత్ అంతంత భారీగా చమురు కొనేస్తుండటం నాకస్సలు నచ్చడం లేదు. ఇది నన్నెంతో నిరాశకు గురి చేస్తోంది'' అంటూ మళ్లీ అక్కసు వెళ్లగక్కారు. ''ఈ విషయం వాళ్లు తెలుసుకోవాలి. అందుకేగా భారత్‌పై అతి భారీగా 50 శాతం సుంకాలు విధించా!'' అని చెప్పుకొచ్చారు. ఆ వెంటనే మోదీపై మళ్లీ ప్రశంసలు కురిపించారు. భారత్‌ను చైనాకు కోల్పోయామంటూ మీరు చేసిన పోస్టు నిజమేనా అని మీడియా ప్రశ్నించగా, అలా జరిగిందని తాను అనుకోవడం లేదని ట్రంప్ చెప్పడం విశేషం!

వాణిజ్య చర్చలు సూపర్

భారత్‌తో వాణిజ్య చర్చలు అద్భుతంగా సాగుతున్నాయని మీడియా ప్రశ్నకు బదులుగా ట్రంప్ చెప్పారు. ''అన్ని దేశాలతోనూ చర్చలు బాగా జరుగుతున్నాయి. కాకపోతే గూగుల్ తదితర అతి పెద్ద అమెరికా టెక్ దిగ్గజాల పట్ల యూరోపియన్ యూనియన్ వైఖరి విషయంలోనే బాగా నిరాశకు లోనయ్యాం'' అని బదులిచ్చారు.

మళ్లీ నవరో నోటిదురుసు!

భారత్ పట్ల విద్వేషానికి పెట్టింది పేరుగా మారిన ట్రంప్ సలహా బృందం సీనియర్ సభ్యుడు పీటర్ నవరో మరోసారి నోరు పారేసుకున్నారు. రష్యా నుంచి భారత్ కొంటున్న చమురు ద్వారా సమకూరుతున్న ఆర్థిక వనరులే ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఆదరువుగా మారాయంటూ మరోసారి ప్రేలాపనలకు దిగారు.



వజ్రాలు పొదిగిన స్వర్ణకలశం చోరీ

విలువ రూ. కోటిపైనే..

- జైనుల మత గురువులా వచ్చి మాయం చేసిన వైనం
- ఆలస్యంగా వెలుగుచూసిన చోరీ ఘటన
- మారువేష మాయగాడి కోసం మొదలైన పోలీసుల వేట

న్యూఢిల్లీ: ఎర్రకోట ప్రాంగణం. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే దేశ రాజధానిలోని కీలక చారిత్రక ప్రాంతం. పోలీసుల వలయంగా వినతికెక్కిన అలాంటి చోట సైతం చోరకళను ప్రదర్శించాడు ఒక దొంగ. కోటి రూపాయల విలువైన బంగారు కలశాన్ని కొట్టేసే లక్ష్యంతో రంగంలోకి దిగిన ఆ దొంగ జైన గురువు వేషధారణలో వచ్చి అలవోకగా కలశాన్ని ఎత్తుకెళ్లిపోయాడు. సెప్టెంబర్ మూడో తేదీ ఉదయం జరిగిన ఈ చోరీ అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెల్సుకున్న పోలీసులు వెంటనే ఆ చోరశిఖామణి వేటలో తలమునకలయ్యారు. వజ్రవైడ్యూరాలు, రత్నాలు, కెంపులు వంటి అత్యంత విలువైన రాళ్లు పొదిగిన ఆ కలశాన్ని భుజానికున్న బ్యాగులో పెట్టుకుని ఉడాయించిన సీసీటీవీ ఫుటేజీ వీడియో ప్రస్తుతం సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

జంకులేకుండా వచ్చి మరీ..

ఎర్రకోట ప్రాంగణంలోని 15వ నంబర్ గేట్ వద్ద సెప్టెంబర్ మూడో తేదీ ఉదయం జైనుల సంబంధ మత కార్యక్రమం 'దస్‌లక్షణ్ మహాపర్వ్'నిర్వహించారు. ఆగస్ట్ 28వ తేదీ నుంచి మొదలై సెప్టెంబర్ 9వ తేదీదాకా జరగనున్న ఈ కార్యక్రమం కోసం సివిల్ లైన్స్ ప్రాంతానికి చెందిన సుధీర్‌జైన్ అనే వ్యాపారి తన సొంత పుత్తడి కలశాన్ని ప్రతిరోజూ తీసుకొచ్చి పూజ తర్వాత ఇంటికి తీసుకెళ్తున్నారు. 760 గ్రాముల బరువైన ఈ కలశానికి చుట్టూతా 150 గ్రాముల బరువైన, అత్యంత విలువైన వజ్రాలు, కెంపులు, మరకతాలు అందంగా అద్ది ఉంటాయి. ఎప్పటిలాగే ఆయన కలశాన్ని తీసుకురాగా ఉదయం 9 గంటల 26 నిమిషాలకు కొందరు ప్రముఖులు కార్యక్రమానికి వచ్చారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సైతం వచ్చి జైన గురువుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. దీంతో కలశ యజమానిసహా తదితరులు పక్కకు వెళ్లారు. అదే అదునుగా భావించి ఒక దొంగ జైన గురువు వేషధారణలో శ్వేతవర్ణ దుస్తులు ధరించి కార్యక్రమంలో చొరబడ్డాడు. ఎవరూ గమనించని సమయంలో ఆ కలశంతోపాటు మరో కొబ్బరికాయ ఆకారంలోని పాత్ర, మరో బంగారు పాత్రను దొంగ ఎత్తుకుపోయాడు. ఈ తతంగం అంతా అక్కడి గదిలోని సీసీటీవీలో రికార్డయింది. కార్యక్రమం నిర్వాహకుడు పునీత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి గాలింపు చేపట్టారు. అయితే ఈ దొంగ గతంలో ఇదే ఎర్రకోట ప్రాంగణంలో మూడుసార్లు చోరీలు చేసి చాకచక్యంగా తప్పించుకున్నట్లు తెలుస్తోంది. దొంగను గుర్తించామని త్వరలనే అతడిని పట్టుకుంటామని ఢిల్లీ పోలీసులు శనివారం తెలిపారు. అయినప్పటికీ ఎర్రకోట ప్రాంగణంలో సరైన పోలీసు భద్రత లేదనే ఆరోపణ మరోసారి తెరమీదకొచ్చింది. ఇటీవల ఎర్రకోట సమీపంలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు సన్నాహకాల వేళ ఉత్తుత్తి బాంబును సైతం గుర్తించడంలో విఫలమైన కానిస్టేబుల్‌సహా ఏడుగురు ఢిల్లీ పోలీసులను సస్పెండ్ చేయడం తెల్సిందే.



రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించింది. రాష్ట్రపతి ముర్మును కలుసుకున్నట్లు ప్రధాని మోదీ స్వయంగా ఎక్స్‌లో వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను షేర్ చేశారు. చైనాలోని తియాంజిన్‌లో ఆగస్ట్ 31 నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ప్రధాని పాల్గొన్నారు. అంతకుముందు ఆయన జపాన్‌లో పర్యటించారు. 9వ తేదీన ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ప్రధాని మోదీ రాష్ట్రపతితో సమావేశమైనట్లు భావిస్తున్నారు.

ఐరాస సభకు మోదీ వెళ్లరు

ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి జై శంకర్ హాజరు

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభనుద్దేశించి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దఫా ప్రసంగించడం లేదు. వార్షిక సమావేశాల్లో ప్రసంగించే వివిధ దేశాల నేతల పేర్ల జాబితాను శుక్రవారం ఐరాస విడుదల చేసింది. ఇందులోని వక్తల జాబితాలో ప్రధాని మోదీ పేరు లేదు. ఈ నెల 9వ తేదీన ఐరాస జనరల్ అసెంబ్లీ 80వ సెషన్ ప్రారంభం కానుంది. ఉన్నత స్థాయి సాధారణ చర్చ ఈ నెల 23–29వ తేదీల మధ్య జరుగుతుంది. ఆనవాయితీ ప్రకారం మొదటగా బ్రెజిల్, తర్వాత అమెరికా దేశాల నేతలు ప్రసంగిస్తారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్ 23వ తేదీన మొదటిసారిగా ఐరాస జనరల్ అసెంబ్లీనుద్దేశించి మాట్లాడనున్నారు. జూలైలో విడుదల చేసిన జాబితాలో సెప్టెంబర్ 26వ తేదీన భారత్ నుంచి ప్రధాని మోదీ ప్రసంగిస్తారని ఐరాస విడుదల చేసిన జాబితా పేర్కొంది. తాజా లిస్ట్‌లో మాత్రం 27న భారత్ విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ప్రసంగిస్తారని ఉంది. 26న ఇజ్రాయెల్, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నేతల ప్రసంగాలుంటాయి. అయితే, ఇది తుది జాబితా మాత్రం కాదు. ఈ జాబితాలో వ్యక్తుల పేర్లు, వారు ప్రసంగించే తేదీలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయని చెబుతున్నారు. ఐరాస 80వ సెషన్ ఈసారి 'బెటర్ టుగెదర్: 80 ఇయర్స్ అండ్ మోర్ ఫర్ పీస్, డెవలప్‌మెంట్, హ్యూమన్ రైట్స్'ఇతివృత్తంగా ఉంది. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాలు కొనసాగుతున్న వేళ జరిగే ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికా వెళ్లారు. వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరిపారు. అయితే, రష్యా నుంచి భారీ చమురుకొంటూ ఉక్రెయిన్‌తో యుద్ధానికి ప్రేరేపిస్తోందని ఆరోపిస్తూ ఇటీవల భారత్‌పై ట్రంప్ ఏకంగా 50 శాతం టారిఫ్‌లను విధించడం తెల్సిందే. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్–పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు తన జోక్యమే కారణమని పదేపదే ప్రకటించుకోగా వాటిని భారత్ ఖండిస్తూ వస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఐరాస సమావేశాల్లో పాల్గొనడం లేదని పరిశీలకులు అంటున్నారు.

మూడ్రోజుల్లో ముగియలేదు

- పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ ఇంకొన్ని రోజులు కొనసాగింది
- ప్రకటించిన భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది
- సైనిక, వాయు, నావికాదళాల సమష్టి సమరవిధానం కోసం వేచిచూస్తున్నామని వ్యాఖ్య



న్యూఢిల్లీ: ధూర్తదేశం పాకిస్తాన్‌తో 'ఆపరేషన్ సిందూర్'పేరిట భారత మొదలెట్టిన పోరు కేవలం మూడ్రోజుల్లో ముగిసిపోలేదని భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ప్రకటించారు. ఢిల్లీలోని మాణిక్‌షా సెంటర్‌లో జరిగిన ''ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్‌సైడ్ పాకిస్తాన్''పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ద్వివేది పాల్గొని ప్రసంగించారు. ''మే 7వ తేదీ తెల్లవారుజామున భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట ముష్కరమూకల స్థావరాలను నేలమట్టంచేసింది. వెనువెంటనే పాక్ డ్రోన్ల దండుతో దండెత్తింది. వాటిని మన బలగాలు నేలమట్టం చేశాయి. తర్వాత పాక్ వైమానిక స్థావరాలను మన క్షిపణులు నాశనం చేశాయి. ఇదంతా మే 10వ తేదీన ముగిసిపోయిందని అంతా భావిస్తున్నారు. ఇందులో కొంతే నిజముంది. నిజానికి మే 10వ తేదీ తర్వాత సైతం ఆపరేషన్ సిందూర్ కొన్ని రోజులపాటు కొనసాగింది. అయితే ఆ కాలంలో దాడులు చేశామా లేదంటే ప్రతిదాడులు జరిగాయా అనేది చెప్పకూడదు. కానీ ఈ పోరు పరిసమాప్తికి ఎన్నో దశలను దాటాల్సి వచ్చింది. ఇరు దేశాల మధ్య ఎన్నో సంప్రదింపులు జరిగాయి. ఇవన్నీ ఇప్పుడు నేను బయటపెట్టలేను. ఈ పుస్తకం మన సైనిక ఆపరేషన్ జరిగిన విధానాన్ని మాత్రమేకాదు మన సైనికుల ధైర్యం, వృత్తి నిబద్ధత, అసాధారణ స్ఫూర్తిగాథలకు దర్పణంపడుతుంది''అని ద్వివేది అన్నారు. ''ఆపరేషన్ సిందూర్‌లో తనవంతుగా అద్వితీయ పాత్ర పోషించిన నాటి లెఫ్టినెంట్ జనరల్ ధిల్లాన్ సేవలను మరువలేము. వాస్తవాధీన రేఖ వెంట యుద్ధమంటూ వచ్చిందంటే దాని పరిణామాలు ఎలా ఉంటాయి, మన భావోద్వేగాలు ఎటు పోతున్నాయి, లాభనష్టాలు ఇలాంటివేవీ బేరీజు వేసుకునే సమయం ఉండదు. సవాళ్లను ఎదుర్కోవడంపై మాత్రమే ఆర్మీ దృష్టిపెడుతుంది. అందుకే ఆపరేషన్ సిందూర్ అనేది ఎవరికీ సరిగా, స్పష్టంగా తెలియని కథే''అని ఆయన అన్నారు.

కీలక థియేటరైజేషన్‌పై..

''ఏదైనా యుద్ధం వంటి ఆపత్కాలంలో ఆర్మీ, వాయుసేన, నావికాదళాలు ఎవరికిచ్చిన బాధ్యతల్లో వాళ్లు తలమునకలవుతారు. ఇలా వేర్వేరు బాధ్యతలు కాకుండా సమష్టిగా అత్యంత కచ్చితత్వంతో సమన్వయంతో ఒకే యుద్ధం, ఆపరేషన్‌లో పాల్గొని విజయకేతనం ఎగరేసేందుకు ఏకీకృత సమన్వయ వేదిక(థియేటరైజేషన్) అవసరం. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ శక్తిసామర్థ్యాల సమష్టి కలయికగా థియేటరైజేషన్‌ను చెప్పొచ్చు. ఇది వీలైనంత త్వరగా ఆచరణ సాధ్యం కోసం ప్రయత్నిస్తున్నాం. ఇది ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అని నేను కూడా ఆత్రంగా వేచిచూస్తున్నా. ఇందుకోసం కొన్ని విభాగాల విలీనం వంటివి అవసరం. ఇవిగాన యుద్ధం విస్తృతస్థాయిలో వస్తే మరిన్ని ఏజెన్సీలను కలుపుకునిపోయి పనిచేయాల్సి ఉంటుంది. త్రివిధ దళాలకు తోడు బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఇస్రో, సివిల్ డిఫెన్స్, సివిల్ ఏవియేషన్, రైల్వే, ఎస్‌సీసీ, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులతో సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. ఇలా అన్ని ఏజెన్సీలతో కలిసి పనిచేయడం ఒక్క థియేటరైజేషన్‌తోనే సాధ్యం. మారుతున్న అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, పొరుగు దేశాలతో పొంచి ఉన్న ముప్పు నేపథ్యంలో థియేటరైజేషన్ అనేది తప్పనిసరి''అని ద్వివేది వ్యాఖ్యానించారు.



తెగిపోయిన రోప్ వే వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

గుజరాత్‌లో రోప్ వే తెగి.. ఆరుగురు మృతి

హాలోల్: గుజరాత్‌లోని పంచమహల్ జిల్లా పావగఢ్ కొండల్లో రోప్ వే తెగి పడిన ఘటనలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. ఇక్కడి కొండపై మహాకాళిక ఆలయం ఉంది. 800 మీటర్ల ఎత్తున్న ఈ కొండపైకి చేరుకోవాలంటే 2 వేల మెట్లు ఎక్కాలి. లేదా ఎత్తురోప్ వే ద్వారా చేరుకోవాల్సి ఉంటుంది. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రోప్ వేలో తిరుగు ప్రయాణంలో ఘటన చోటుచేసుకుంది. కేబుల్ మొదటి టవర్‌కు సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో ఇద్దరు లిఫ్ట్ ఆపరేటర్లు, ఇద్దరు కార్మికులు, మరో ఇద్దరు ఇతరులు ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులను తరలించేందుకు వాడే ప్రధాన రోప్ వేను అననుకూల వాతావరణం కారణంగా రెండు రోజులుగా మూసివేసి ఉంచారు. ప్రమాదం జరిగిన మరో రోప్ వేను వస్తువులను తరలించడం తదితర పనుల కోసం వాడుతుంటారని ఎస్పీ హరేశ్ దుధట్ చెప్పారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందన్నారు. ఇక్కడి ఆలయాన్ని ఏటా 25 లక్షల మంది దర్శించుకుంటారు.

ఖలిస్తానీలకు కెనడా నుంచే...

ఆర్థిక దన్ను!

ప్రభుత్వ నివేదికలోనే బట్టబయలు

ఒట్టావా: కెనడా గడ్డనుంచి భారత్‌పై విషం కక్కుతున్న ఖలిస్తానీ మూకలు ఆర్థికంగా స్థానికంగానే వేళ్లూనుకుని ఉన్నట్టు మరోసారి రుజువైంది. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ద ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ అనే రెండు స్థానిక ఖలిస్తానీ అతివాద సంస్థలకు కెనడా నుంచే ఆర్థిక మద్దతు పుష్కలంగా అందుతున్నట్టు స్వయానా కెనడా ప్రభుత్వమే విడుదల చేసిన నివేదిక తేల్చడం విశేషం. తేలింది. 'కెనడాలో మనీ లాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ రిస్కులపై మదింపు–2025'పేరిట విడుదలైన ఈ నివేదిక, కెనడాతో పాటు ఇతర దేశాల్లో కూడా ఇలాంటి ఖలిస్తానీ గ్రూపులు ఇష్టారాజ్యంగా నిధుల వసూళ్లకు పాల్పడుతున్నాయంటూ ఆందోళన వెలిబుచ్చింది. పంజాబ్‌లో ప్రత్యేక ఖలిస్తానీ రాజ్య స్థాపనే లక్ష్యంగా 1980ల నుంచీ కెనడా లో రాజకీయ ప్రాపకంతో కూడిన హింసాత్మక అతివాదం (పీఎంవీఈ) నిర్నిరోధంగా పెచ్చరిల్లుతోందని స్వయానా కెనడా నిఘా సంస్థే రెండు నెలల క్రితం ఓ నివేదికలో ప్రభుత్వాన్ని హెచ్చరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా నివేదిక సంచలనం రేపుతోంది. అంతర్జాతీయంగా హమాస్, హెజ్బొల్లా వంటి ఉగ్ర, అతివాద సంస్థలు ఈ పీఎంవీఈ జాబితాలోకి వస్తాయి. కెనడాలో అతిపెద్ద మనీ లాండరింగ్ జాడ్యాల్లో డ్రగ్స్ అక్రమ సరఫరా ఒకటి.

రాగద్వేషాల్లేకుండా..

- చట్టాన్ని అమలు చేయడమే న్యాయస్థానాల విధి
- సుప్రీంకోర్టు మహిళా న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యయుతంగా చట్టాన్ని అమలుచేయాలంటే న్యాయస్థానాలు ఎలాంటి భయాలు, రాగద్వేషాలు లేకుండా తమ విధి నిర్వహణకు అంకితం కావాలని సర్వోన్నత న్యాయస్థానంలో మహిళా న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవంలో జస్టిస్ నాగరత్న పాల్గొని ప్రసంగించారు. ''చట్టం అనేది నిబంధనల సమాహారం మాత్రమే కాదు. పేదలు, ధనికులు, కిందిస్థాయి, పైస్థాయి, కులం, మతం, లింగ భేదాలకు అతీతంగా ఎలాంటి నమ్మకాలు, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకోకుండా చట్టం ముందు అందరూ సమానులే అనే భావనతోనే చట్టాన్ని అమలుచేయాలి. శక్తివంతమైన వ్యక్తులకు మాత్రమే కోర్టులు, న్యాయ సేవలు అందుబాటులో ఉంటాయనే అపోహ తొలగిపోవాలి. ఈ తప్పుడు భావనను న్యాయవాదులు సైతం మార్చగలరు'' అని జస్టిస్ నాగరత్న అన్నారు. ఈ సందర్భంగా యువ లా విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ''నిజమైన బాధితుల కేసులను వాదనల కోసం స్వీకరించాలి. అప్పుడు బాధితులకు సాంత్వన, న్యాయం చేకూర్చే వారధులుగా న్యాయవాదులు కీర్తిగడిస్తారు. రాజ్యాంగానికి పౌరులకు, న్యాయానికి ప్రజలకు మధ్య సైతం అడ్వొకేట్లు సేతువుగా నిలబడాలి. న్యాయవాద వృత్తి అనేది మార్పునకు వాహకంగా ఉండాలి. ముఖ్యంగా భారతీయ సమాజంలో చూస్తే చరిత్రాత్మకంగా వివక్ష, వెలివేతకు గురైన, అసమానత కారణంగా అన్యాయమైన వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు న్యాయవాద వృత్తిని సాధనంగా ఉపయోగించుకోవాలి'' అని అన్నారు. ''సుపరిపాలనలో చట్టాలను సమగ్రస్థాయిలో అమలుచేయడం అనేది అత్యంత ఆవశ్యకం. న్యాయపాలన అనేది కూడా కచ్చితంగా ఉండాలి. ఎందుకంటే భారత్‌లో న్యాయవ్యవస్థ పూర్తి స్వతంత్రంగా అమలవుతోంది. ఈ కోర్టుల వ్యవస్థకు స్వతంత్ర బార్ వ్యవస్థ చేదోడువాదోడుగా నిలిచింది''అని అన్నారు. ''రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న నేతలు, ధర్మాసనంలో తీర్పులిచ్చే న్యాయమూర్తులేకాదు న్యాయవాదులకూ ఉంది. రాజ్యాంగాన్ని అడ్వొకేట్ చేయాల్సిన విధ్యుక్తధర్మాన్ని ప్రతి ఒక్క అడ్వొకేట్ పాటించాలి''అని అన్నారు.

మళ్లీ.. దక్షిణాదికి వెళ్లిపోండి!

గాజా నగర వాసులకు ఇజ్రాయెల్ ఆర్మీ హెచ్చరికలు

మరో బహుళ అంతస్తుల భవనంపై దాడి

గాజా సిటీ: గాజా నగరాన్ని పూర్తి నియంత్రణలోకి తెచ్చుకునే ప్రయత్నాలను ఇజ్రాయెల్ ఆర్మీ మరింత ముమ్మరం చేసింది. ఇప్పటికే నగరాన్ని యుద్ధ జోన్‌గాను, అందులోని కొన్ని ప్రాంతాలను రెడ్ జోన్లుగాను ప్రకటించింది. రెడ్ జోన్లలోని వారంతా ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేస్తోంది. దక్షిణాదిన ఉన్న మువాసికి వెళ్లాలని, అక్కడ ఏర్పాటు చేసిన హ్యూమానిటేరియన్ ఏరియాలో తలదాచుకోవాలని ఆర్మీ ప్రతినిధి అవిచె ఆండ్రీ ఎక్స్‌లో కోరారు. హమాస్‌కు గట్టి పట్టున్న యుద్ధ క్షేత్రంగా మారినందున వెంటనే వెళ్లిపోవాలని సూచించారు. నిర్దేశించిన మార్గంలో వెళితే ఎలాంటి తనిఖీలు ఉండవని చెప్పారు. హ్యూమానిటేరియన్ జోన్‌లో ఫీల్డ్ ఆస్పత్రులు, వాటర్ పైప్‌లైన్లు, ఆహారం, టెంట్లు ఉంటాయన్నారు.

ఆర్మీ రెడ్ జోన్లుగా ప్రకటించిన ప్రాంతాల్లో కనీసం 10 లక్షల మంది ఉంటున్నారు. వీరందరినీ ఖాళీ చేయించడం వల్ల మానవీయ సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చుతుందని సహాయక సంస్థలు అంటున్నాయి. దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న పోరు కారణంగా పాలస్తీనియన్లు పదేపదే ఉన్న చోటును వదిలి వేరే చోటును ఆశ్రయించాల్సి వచ్చింది. సరైన ఆహారం సైతం లభించని స్థితిలో బలహీనంగా, ఎక్కడికి వెళ్లాలో తెలియని స్థితిలోకి వెళ్లిపోయారు. 'వాళ్లు మాకు ఒక పట్టణం నుంచి ఇంకో పట్టణానికి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు చేస్తున్నారు. మా పిల్లలతో కలిసి మేం ఎక్కడికి వెళ్లాలి? ఏం చేయాలి? గాయపడిన వాళ్లు, జబ్బున పడిన వాళ్లు, ముసలి వాళ్లు ఉంటే వాళ్లని ఎక్కడికని తీసుకెళ్లాలి?'అని గాజా సిటీకి చెందిన ఉమ్ హైతమ్ ప్రశ్నించారు. తాజాగా, ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించిన హ్యూమానిటేరియన్ జోన్ విషయంలో తమతో సంప్రదించలేదని ఐరాస ఆఫీస్ ఫర్ ది కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమానిటేరియన్ అఫైర్స్ ప్రతినిధి ఒల్గా చెరెవ్కో అన్నారు. గతంలో మువాసి సహా పలు ప్రాంతాలను మానవతా జోన్లుగా ప్రకటించిన తర్వాత కూడా ఇజ్రాయెల్ ఆర్మీ వాటిపై దాడులకు దిగిందని గాజా ఆరోగ్య విభాగం అంటోంది. ఇలా ఉండగా, శనివారం ఇజ్రాయెల్ ఆర్మీ నగరంలోని మరో రెండు బహుళ అంతస్తుల భవనాలకు హెచ్చరికలు జారీ చేసింది. శుక్రవారం 12 అంతస్తుల భవనాన్ని నేలమట్టం చేయడం తెల్సిందే. హెచ్చరికలు జారీ చేసిన కొద్ది సేపటికే ఒక భవనాన్ని కూల్చినట్లు మంత్రి ప్రకటించారు. ఆకాశ హర్మ్యాలను హమాస్ నిఘాకు వాడుకుంటోందన్నది ఆర్మీ ఆరోపణ. కాగా, హమాస్ తమ చెరలో ఉన్న ఇద్దరు ఇజ్రాయెల్ బందీల వీడియోలను తాజాగా విడుదల చేసింది. వీరిద్దరిని గై గిల్బోవా–దలాల్, అలోన్ ఒహెల్‌గా గుర్తించారు. వేలాదిగా ఆర్మీ సిబ్బందితో గాజాపై నియంత్రణకు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నాలతో మిగతా బందీల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వారి కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. యుద్ధాన్ని ముగించి, బందీలను సురక్షితంగా విడిపించాలని వారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌ను కలిశారు.

ఉక్రెయిన్‌పై ఏం చేద్దాం?

మోదీతో మాక్రాన్ చర్చలు

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నట్టు భారత్, ఫ్రాన్స్ పునరుద్ఘాటించాయి. ప్రధాని నరేంద్ర మోదీతో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ శనివారం ఫోన్‌లో సంభాషించారు. యుద్ధానికి తెర దించే మార్గాలపై ఇరు నేతలు లోతుగా చర్చలు జరిపారు. అనంతరం ఇరు దేశాలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. మాక్రాన్‌తో చర్చలు ఫలప్రదంగా సాగినట్టు మోదీ తెలిపారు. పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారం తదితరాలను సమీక్షించినట్టు వివరించారు. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనిపెట్టాలన్న వైఖరికే భారత్ తొలినుంచీ గట్టి మద్దతుదారుగా ఉందని పునరుద్ఘాటించారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలను పెంపొందించడంలో ఇరు దేశాలు ఇకపై కూడా కీలకపాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. వచ్చే ఫిబ్రవరిలో భారత్‌లో జరిగే ఏఐ శిఖరాగ్రంలో పాల్గొనేందుకు అంగీకరించినందుకు మాక్రాన్‌కు మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో తన ఇటీవలి చర్చలు ఫలప్రదంగా సాగాయని మాక్రాన్ పేర్కొన్నారు.

సాక్షి
కరీంనగర్
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



గణేశ్‌నగర్ లడ్డూ రూ.1,54,116

కరీంనగర్‌కల్చరల్: గణేశ్‌నగర్‌లోని సీపీఐ భవనం ఎదురుగా ఉన్న గల్లీలో గణేశ్ సేవా యూత్ ఆధ్వర్యంలోని గణేశుడి వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. రూ.1,54,116 కు మ్యాన రోజా– శ్రీనివాస్ దంపతులు దక్కించుకున్నారు.



కొత్తగట్టులో జడ్జి పూజలు

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామిని జిల్లా జడ్జి వరీనా దంపతులు దర్శించుకున్నారు. అర్చకుడు శేషం మురళీధరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి జడ్జి దంపతులను సత్కరించారు.

గరిష్టం/కనిష్టం
33.0/27.0

వాతావరణం

జిల్లాలో నేడు వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది. గాలిలో తేమ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూమిలోని భవనం స్వాధీనం



మహిళలతో మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి తహసీల్దార్ పరిధి సీతారాంపూర్‌లోని సర్వే నంబర్ 26 ప్రభుత్వ శిఖం భూమిలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు శనివారం రాత్రి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొయినొద్దీన్ ఆధ్వర్యంలో భవనంలోని సామగ్రిని ఖాళీ చేయించే ప్రయత్నం చేయగా.. మహిళలు అడ్డుకున్నారు. తప్పుకోవాలంటూ తహసీల్దార్ చెప్పినప్పటికీ వినకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ బిల్లా కోటేశ్వర్ అక్కడికి చేరుకుని భవనాన్ని ఖాళీ చేయించారు. భవనాన్ని ఓపెన్ స్కూల్‌కు అప్పజెప్పనున్నట్లు అధికారులు వెల్లడించారు. భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇటీవల కలెక్టర్‌కు గ్రామానికి చెందిన పాదం శివరాజ్, ఎడ్ల లక్ష్మణ్ ఫిర్యాదు చేశారు. ఎంఈవో ఆనందం, ఆర్ఐలు నదీమ్, రజనీకుమార్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సభ్యులను ఓపెన్ స్కూల్లో చేర్చాలి



మాట్లాడుతున్న అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్‌కల్చరల్: పదోతరగతి, ఇంటర్ ఫెయిలైన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను తెలంగాణ ఓపెన్ స్కూల్లో చేర్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. మెప్మా, డీఆర్‌డీవో అధికారులతో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, ఉల్లాస్ రిజిస్ట్రేషన్లపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల గడువు ముగియకముందే మీసేవ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి, ఓపెన్ స్కూల్లో చేర్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళ అక్షర జ్ఞానం కలిగి ఉండాలన్న ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డీఆర్‌డీవో శ్రీధర్, మెప్మా పీడీ సరూపారాణి పాల్గొన్నారు.

కేవీకేకు అరుదైన గౌరవం



ప్రశంస పత్రం అందుకుంటున్న కేవీకే హెడ్ వెంకటేశ్వర్లు

జమ్మికుంట: వ్యవసాయ సాంకేతిక ప్రయోగ పరిశోధన సంస్థ(ఏటీఏఆర్ఐ) హైదరాబాద్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరులో ఈ నెల 4వ తేదీన 2024 ఏడాదికి సంబంధించి వార్షిక సమీక్ష నిర్వహించారు. తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాల జోన్–ఎక్స్ పరిధి 72 కేవీకేల్లో జమ్మికుంట కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం)కు మూడో ర్యాంకు వచ్చింది. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. హైదరాబాద్ జోన్–ఎక్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, తమిళనాడు అవినాశలింగం విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ భారతి హరిశంకర్‌ల చేతుల మీదుగా జమ్మికుంట కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు ప్రశంస పత్రం అందుకున్నారు. కేవీకే ప్రధాన కార్యదర్శి విజయగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశంసపత్రం మరింత బాధ్యత పెంచిందని హర్షం వ్యక్తం చేశారు.

శ్రీసీతారామచంద్రస్వామి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని కరీంనగర్ డివిజన్ దేవాదాయధర్మశాఖ పరిశీలకుడు సత్యనారాయణ పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. 4నెలల 14 రోజులకు గాను 23 హుండీలను లెక్కించారు. రూ.8,59,861 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో కందుల సుధాకర్ తెలిపారు. దేవస్థాన కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు, ధర్మకర్తలు మూడెత్తుల మల్లేశ్ యాదవ్, గోపాల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నాగరాజు, అర్చకులు శేషం వంశీధరాచార్యులు, నవీన్‌శర్మ పాల్గొన్నారు.

22 తర్వాత కొందాం

- 10 శాతం జీఎస్టీ తగ్గడంతో బైక్, కార్ల కొనుగోళ్లు వాయిదా
- ఈనెల 22 తరువాత కొందామంటున్న వినియోగదారులు
- కస్టమర్లకు ఏటా రూ.60 కోట్ల వరకు మిగులు
- బైక్‌పై రూ.20 వేలు, కార్లపై రూ.60వేల నుంచి రూ.1.50 లక్షల వరకు తగ్గింపు
- ప్రస్తుతం నిలిచిన వాహనాల బుకింగ్‌లు, స్తంభించిన వ్యాపారం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కారు, బైక్ షోరూంలు కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి. జీఎస్టీ శ్లాబులు తగ్గుతాయని కేంద్రం ప్రకటన దరిమిలా.. ఇప్పటికిప్పుడు బండి (కారు లేదా బైక్) కొందామనుకున్న ప్రతీ ఒక్కరూ వాయిదా వేశారు. సెప్టెంబరు 22 తరువాత తగ్గించిన జీఎస్టీ అమలులోకి రానుండటంతో కారు, బైకుల ధరలు 10శాతం వరకు తగ్గనున్నాయి. ఫలితంగా మధ్యతరగతికి భారీ ఊరట కానుంది. ప్రతీ బైకుపై కనిష్టంగా రూ.8,000 నుంచి గరిష్టంగా రూ.20వేల వరకు ధరలు తగ్గనున్నాయి. కార్లపైనా రూ.60వేల నుంచి రూ.1.50లక్షల వరకు తగ్గనున్నాయి. దీంతో ప్రస్తుతం షోరూముల్లో బుకింగులు నిలిచిపోయాయి. కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి.

సెకండ్ హ్యాండ్ మార్కెట్‌కు కుదుపు

జీఎస్టీ కొత్త శ్లాబులు అమలు కానుండటంతో షోరూంల్లోనే కాదు, ఇటు సెకండ్‌హ్యాండ్‌మార్కెట్ పైనా ప్రభావం పడింది. బైకుల ధరలు పెట్రోల్ వేరియంట్లలో రూ.8000 నుంచి రూ.20,000 వరకు తగ్గింపు వర్తించనుండడం, కార్లకు రూ.60వేల నుంచి రూ.1.50లక్షల వరకు తగ్గనుండడంతో ఇంతకాలం సెకండ్ హ్యాండ్ కొందామనుకున్న వారంతా కొత్త బండ్ల వైపు చూస్తున్నారు. ఫలితంగా సెకండ్ హ్యాండ్ మార్కెట్ వెలవెలబోతోంది.

ఆగస్టు 13 నుంచే కటకట

సెప్టెంబరు 3వ తేదీన కొత్త జీఎస్టీ శ్లాబులను కేంద్రం ప్రకటించింది. దాంతో 4వ తేదీ నుంచి షోరూంలు, సెకండ్ హాండ్ మార్కెట్లు బోసిపోతున్నాయి. ఆటోమొబైల్ రంగానికి ఈ కుదుపు ఆగస్టు 13నే తాకింది. ఆ రోజు రాత్రి ప్రతీ వాహనంపై 2శాతం ట్యాక్స్‌ను పెంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో మరునాటి నుంచి కొనుగోళ్లపై ప్రభావం కనిపించిందని షోరూం నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 15న కేంద్రం జీఎస్టీ విషయంలో దీపావళికి తీపి కబురు చెబుతానడటంతో ఆటోమొబైల్ రంగం ఆందోళన చెందింది. దీపావళి వరకు కొనుగోళ్లు బోసిపోతాయని కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈనెల 3న ప్రకటన రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కొత్త ఆఫర్లు.. డిస్కౌంట్లు

ప్రస్తుతం షోరూం నిర్వాహకులు వాహనాలు బుకింగ్ చేసుకోవచ్చని, డెలివరీ సెప్టెంబరు 22 తరువాతే ఇస్తామని సరికొత్త ఆఫర్లు ప్రకటిస్తూ.. కొనుగోళ్లు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు తమ పాత వాహనాలను క్లియర్ చేసేందుకు 10శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని కస్టమర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. అయినా, పెద్దగా కొనుగోళ్లు పుంజుకోవడం లేదని షోరూం నిర్వాహకులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వాహనాల కొనుగోళ్లు అధికంగానే జరుగుతాయి. మధ్యతరగతి వారు అధికంగా వినియోగించే 350 సీసీలోపు బైకులపై జీఎస్టీని 28శాతం నుంచి 18శాతానికి తగ్గించారు. అంటే దాదాపు 10శాతం వరకు తగ్గింపు ఉంది. ప్రస్తుతం ప్రతీ 100 సీసీ ఆపై సామర్థ్యం ఉన్న బైకులు రూ.లక్షకుపైనే పలుకుతున్నాయి. ఎలక్ట్రిక్ బైకుల ధర రూ.30వేల నుంచి మొదలవుతుంది. వీటికి సైతం 10శాతం జీఎస్టీ తగ్గింపు వర్తిస్తుంది. ప్రతీ నెలా కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల షోరూముల్లో కలిపి దాదాపు 3000కుపైగా బైకులను విక్రయిస్తారు. ఈ లెక్కన ఎలక్ట్రిక్ బైకులపై రూ.3000, పెట్రోల్ బైకులపై రూ.8000 వరకు కనిష్టంగా ధరలు తగ్గనున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా నెలకు రూ.2.40కోట్ల వరకు వినియోగదారులకు లబ్ధి చేకూరతుందని అంచనా వేస్తున్నారు. ఇక పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ కార్లు నెలకు 500 నుంచి 550 వరకు కార్లు అమ్ముడుపోతాయి. 1200 సీసీ లోపు సామర్థ్యం ఉన్న కార్లపై జీఎస్టీని 18శాతానికి తగ్గించారు. ప్రతీ నెలా రూ.2.6 కోట్ల చొప్పున ఏటా రూ.31.2 కోట్ల వరకు వినియోగదారులకు కలిసి రానుంది. బైక్, కార్ల కొనుగోళ్లలో ఉమ్మడి జిల్లా కస్టమర్లకు దాదాపుగా రూ.60 కోట్ల వరకు కలిసి రానుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

2,206 విగ్రహాలు నిమజ్జనం



మానకొండూర్ చెరువు వద్ద శనివారం ఉదయం నిమజ్జనానికి బారులు తీరిన వినాయకులు

- శనివారం సాయంత్రం వరకు కొనసాగిన కార్యక్రమం
- నేటి నుంచి శిథిలాల తొలగింపు
- రూ.2.92 లక్షలతో ఇప్పటికే టెండర్

నగరపరిధిలోని వివిధ చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేసిన విగ్రహాలు

మానకొండూర్	1,018
కొత్తపల్లి	535
చింతకుంట	488
దుర్శేడ్	78
బొమ్మకల్	48
గోపాల్‌పూర్	39
మొత్తం	2,206

కరీంనగర్ కార్పొరేషన్/కరీంనగర్ కల్చరల్/కొత్తపల్లి/కరీంనగర్ టౌన్/ మానకొండూర్: వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ప్రారంభమై శనివారం సాయంత్రం వరకు కొనసాగింది. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో మానకొండూరు, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్ వద్ద నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 2,206 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. వీటితో పాటు దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్‌లోని చెరువులు, వాగుల్లోనూ నిమజ్జనం చేశారు. విగ్రహాల శిథిలాల తొలగింపును ఆదివారం నుంచి చేపట్టనున్నారు. ప్రతిసారి నిమజ్జనం అనంతరం ఆయా చెరువులు, కాలువల్లో విగ్రహ శిథిలాలు రోజుల తరబడి పేరుకుపోవడం, స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో ఈసారి ముందుగానే శిథిలాల తొలగించడానికి నగరపాలకసంస్థ రంగం సిద్ధం చేసింది. నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా విగ్రహ శిథిలాల తొలగింపునూ టెండర్‌లో చేర్చింది. మానకొండూరు చెరువు నుంచి విగ్రహాలు, శిథిలాలు తొలగించడానికి రూ.98 వేలు, కొత్తపల్లి చెరువు నుంచి తొలగించేందుకు రూ.95 వేలు,చింతకుంట కెనాల్ నుంచి తొలగించేందుకు రూ.99 వేలు కేటాయించారు. ఆదివారం నుంచి శిథిలాల తొలగింపును ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సాయంత్రం వరకు కొనసాగిన నిమజ్జనం

మానకొండూర్, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్‌లో శనివారం సాయంత్రం వరకు నిమజ్జన కార్యక్రమం కొనసాగింది. మానకొండూర్ చెరువుకు వేకువజాము వరకు భారీ విగ్రహాలు తరలివచ్చాయి. 844 పెద్దవి, 174 చిన్న విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. కరీంనగర్ రాంనగర్‌లోని మిత్ర యూత్ క్లబ్ భారీ గణేశుడిని చింతకుంట కెనాల్‌లో నిమజ్జనం చేయడంతో వేడుకలు సంపూర్ణంగా ముగిశాయి. కొత్తపల్లి చెరువులో 535 విగ్రహాలు, చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్ వద్ద 488 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిమజ్జన వేడుకలు విజయవంతంగా ముగిశాయని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. శనివారం కొత్తపల్లి చెరువు, చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్‌ను పరిశీలించారు.

భారీ గణేశుడి శోభాయాత్రకు అడ్డంకులు

కరీంనగర్‌లోని రాంనగర్‌లో మిత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 35అడుగుల భారీ మట్టి వినాయకుడి శోభాయాత్రకు విద్యుత్ తీగలు, సీసీ సర్వేలెన్స్ కెమెరాల స్తంభాలు అడ్డంకిగా మారాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచే రాంనగర్ చౌరస్తాలో శోభాయాత్ర నిలిచిపోయింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశాలతో మేరకు మాజీ మేయర్ వై.సునీల్‌రావు విద్యుత్‌శాఖ, నగరపాలక సంస్థ కమిషనర్‌తో మాట్లాడారు. అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలు, కెమెరా స్తంభాలను తొలగించి శోభయాత్రకు మార్గం సుగమం చేయడంతో గణేశుడు చింతకుంటకు నిమజ్జనానికి తరలాడు.



కొత్తపల్లి చెరువు వద్ద నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



విద్యుత్ వైర్లు అడ్డురావడంతో నిలిపోయిన రాంనగర్ భారీ వినాయకుడి శోభాయాత్ర

కలెక్టర్, కమిషనర్లకు అభినందనలు

కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జన ఉత్సవాలు దిగ్విజయంగా పూర్తి చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం నిర్వహించిన కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సహా అన్నిశాఖల అధికారులను ఒక ప్రకటనలో ప్రత్యేకంగా అభినందించారు.

వెనకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టండి

- ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, చిత్రంలో డీఈవో చైతన్య జైనీ

కొత్తపల్లి(కరీంనగర్)/కరీంనగర్: ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకోవడంతో పాటు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కొత్తపల్లి శివారులోని ఓ ఫంక్షన్ హాలులో తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నైతిక విలువలు బోధించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా గమనించాలని సూచించారు. ప్రభుత్వం తరఫున ప్రైవేటు పాఠశాలల టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్)లో పాల్గొనాలని సూచించారు. డీఈవో చైతన్య జైనీ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు ప్రశంశాపత్రాలు అందించి సత్కరించారు.

ఓల్డ్ హైస్కూల్ భవనాన్ని సైన్స్ మ్యూజియంగా మార్చాలి

నగరంలోని ఓల్డ్ హైస్కూల్ భవనాన్ని సైన్స్ మ్యూజియంగా ఆధునీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. పురాతన ఉన్నత పాఠశాల భవనంలో కొనసాగుతున్న సైన్స్ మ్యూజియాన్ని శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో చైతన్య జైనీతో కలిసి సందర్శించారు. పురాతన పాఠశాల తరగతులను నూతన భవనంలోకి మార్చాలన్నారు. అక్కడే కొనసాగుతున్న డీసీబీ కార్యాలయాన్ని మరోచోటకు, ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని సీతారాంపూర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాల సమీప భవనంలోకి తరలించాలన్నారు. పురాతన పాఠశాల భవనాన్ని పూర్తిగా సైన్స్ మ్యూజియానికే కేటాయించాలన్నారు. సైన్స్ మ్యూజియంలో రోబోటిక్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఆర్ట్, క్రాఫ్ట్ కంప్యూటర్ ల్యాబ్ కోసం ప్రత్యేక గదులు, విద్యార్థుల కోసం సెమినార్ హాల్ ఏర్పాటు చేయాలన్నారు. సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ అశోక్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ పాల్గొన్నారు.

నేడు ఆలయం మూసివేత

గన్నేరువరం: రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ఖాసీంపేట గ్రామ శ్రీ మానసాదేవి ఆలయం ఆదివారం మూసివేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అమర్‌నాథ్ శర్మ, ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 11 నుంచి 8వ తేదీ ఉదయం 5 గంటలకు వరకు దర్శనాలు ఉండవని, భక్తులు గమనించాలని సూచించారు.

Special Story
సాక్షి

'కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు ఎక్కువ వాల్యూంతో ఇయర్ ఫోన్లు పెట్టుకొని పాటలు వినడం, సినిమాలు, రీల్స్ చూడడం ఇష్టం. బైక్‌పై వెళ్తున్నా.. బస్సుల్లో ప్రయాణిస్తున్నా.. ఆఫీసులో ఉన్నా.. రోడ్డుపై ఉన్నా ఇదే ధ్యాస. నిత్యం ఏడెనిమిది గంటలపాటు ఇదే పరిస్థితి. ఇటీవల అతనికి చెవిలో ఒకటే హోరు మొదలైంది. భరించలేక ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదిస్తే అసలు విషయం తెలిసింది. గంటల తరబడి ఎక్కువ సౌండ్‌తో ఇయర్ ఫోన్స్ వినడంతో చెవిలోపలి భాగంలో సమస్య తలెత్తినట్లు గుర్తించి చికిత్స చేశారు. అయినా పూర్తిస్థాయి ఫలితం రాలేదు.'



హలో.. వినబడుతుందా?

- ఇయర్ ఫోన్లతో వినికిడి శక్తిపై తీవ్ర ప్రభావం
- బాధితుల్లో 20-40 ఏళ్లవారే ఎక్కువ
- హెచ్చరిస్తున్న ఈఎన్‌టీ నిపుణులు

'హుజూరాబాద్‌కు చెందిన శ్రావణికి (పేరు మార్చాం) ఫోన్‌లో రీల్స్ చూడడం.. పాటలు వినడం అలవాటు. ఎప్పుడు చూసినా ఇయర్ ఫోన్లు పెట్టుకొనే కనిపిస్తుంది. దీంతో ఆమె కర్ణభేరి దెబ్బతింది. రెండు చెవులు వినిపించడంలేదు. మెదడులో నరాలు దెబ్బతిన్నాయి. అప్పుడప్పుడు మతిస్థిమితం లేకుండా వ్యవహరిస్తోంది. డాక్టర్లను సంప్రదిస్తే అతిసీపం నుంచి శబ్దం.. అంటే ఇయర్ ఫోన్స్ లాంటివి వాడితే ఇలాంటి ఇబ్బందులు వస్తాయని తెలిపారు. ఇప్పుడామెది ఏమీ వినలేని పరిస్థితి.'

'సిరిసిల్లకు చెందిన పరమేశ్‌కు(పేరు మార్చాం) ఇయర్ ఫోన్స్ పెట్టి సెల్‌ఫోన్‌లో పాటలు వినడం, సినిమాలు చూడడం అలవాటు. క్రమంగా ఆయన వినికిడి శక్తిని కోల్పోయాడు. చెవిలో అతిదగ్గరినుంచి శబ్దం వినడంతో కర్ణభేరికి ఇబ్బందిగా మారిందని వైద్యులు చెప్పారు. ఇప్పుడాయనా చెవికి వినికిడి పరికరం అమర్చుకున్నాడు. లేదంటే ఆయన ఎలాంటి శబ్దం వినలేడు'.

హుజూరాబాద్/కరీంనగర్ టౌన్: ఇయర్, హెడ్‌ఫోన్లు విచ్చలవిడిగా వాడుతున్నారా... గంటల కొద్దీ వాటితోనే కాలం గడుపుతున్నారా? అయితే జాగ్రత్త ఎక్కువ శబ్దంతో వీటిని వినియోగించడం వల్ల కొందరిలో దీర్ఘకాలంగా వినికిడి శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఈఎన్‌టీ డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చెవి, వినికిడి సమస్యతో వారానికి వేయి నుంచి 1500 మంది సంప్రదిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వీరిలో ఎక్కువ మంది 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులే ఉంటున్నారని పేర్కొంటున్నారు. సాధారణంగా ఇయర్ ఫోన్లు, హెడ్‌ఫోన్ల నుంచి వచ్చే ధ్వని తరంగాలు కర్ణభేరికి చేరుతాయి. తర్వాత అవి చెవిలోని చిన్న ఎముక ద్వారా లోపలి చెవిని(ఇన్నర్ ఇయర్) తాకుతాయి. అక్కడ ఉన్న కోక్లియా వాటిని గ్రహిస్తుంది. ఎక్కువ శబ్దం వినడంతో మొత్తం చెవి ఆరోగ్యంపైనే ప్రభావం పడుతుంది. ముఖ్యంగా కోక్లియాలో అతి సూక్ష్మకణాలు, ద్రవం ఉంటాయి. అతి శబ్దం, దీర్ఘకాలిక, నిరంతర ధ్వనుల తాకిడి వల్ల అందులోని సున్నితమైన కణాలు దెబ్బతింటాయి. నిపుణుల సూచనల ప్రకారం ప్రతీ వ్యక్తి రోజుకు 8 గంటలపాటు 8,5 డెసిబుల్స్ శబ్దాల వరకు వింటే ఎలాంటి ఇబ్బంది ఉండదరు. అయితే చాలామంది 85–100 వరకు డెసిబుల్ సౌండ్స్‌తో ఇయర్ ఫోన్లు, హెడ్‌ఫోన్లు వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.



చెవికి తీవ్ర నష్టం

సెల్‌ఫోన్ వచ్చాక చెవుడు సమస్యలు ఎక్కువయ్యాయి. 12–34 ఏళ్ల మధ్య 24శాతం మంది పర్సనల్ లిసెనింగ్ డివైజ్ (హెడ్‌ఫోన్స్, ఇయర్ బడ్స్) వాడుతూ, 48శాతం మంది 85 డిసెబుల్స్ కన్నా ఎక్కువ శబ్దాన్ని వింటూ వినికిడి సమస్యల బారిన పడుతున్నారు. తీవ్రమైన శబ్దం వినడం వల్ల శ్రవణ వ్యవస్థలో ఉండే సూక్ష్మమైన హెయిర్ సెల్స్ దెబ్బతిని చెవుడు ఏర్పడుతుంది. డీజే సౌండ్ లాంటి అధిక వాల్యూమ్‌తో శాశ్వత చెవుడు వచ్చే అవకాశముంది. మ్యూజిక్, వాయిస్‌కాల్స్ హెడ్‌ఫోన్స్, ఇయర్ బడ్స్‌తో ఎక్కువ సమయం వినడం వల్ల బ్రెయిన్ సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇయర్‌ఫోన్స్, హెడ్‌ఫోన్స్, సెల్‌ఫోన్, డీజే సౌండ్‌ను ఎంత తక్కువగా ఉపయోగిస్తే అంత మేలు. – ప్రశాంత్, నిపుణుడు



ప్రమాదం ఇలా..

చెవిలో ఇన్ఫెక్షన్ దెబ్బతిన్నప్పుడు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో వినికిడి సమస్య తలెత్తుతుంది. అందుకే లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని వైద్యులు సూచిస్తున్నారు.

- చెవుల్లో శబ్దాల హోరు
- చిన్న శబ్దాలను కూడా వినలేకపోవడం
- చెవుల్లో తరచూ ఇన్‌ఫెక్షన్లు, నొప్పి
- అధికంగా గులిమి ఏర్పడడం
- చెవిపై ఒత్తిడి పెరగడంతో వర్టిగో సమస్య



ఇయర్ ఫోన్స్ వాడొద్దు

ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో ఫోన్ల వాడకం విపరీతంగా పెరిగింది. ప్రజలు మరింత సౌలభంగా ఉండేందుకు వీలుగా ఇయర్ ఫోన్స్ వాడుతున్నారు. ప్రస్తుతం వచ్చిన ఇయర్ ఫోన్స్‌లో శబ్ద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. చెవి నొప్పితో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యం కోసం ఇయర్ ఫోన్లను తక్కువ వాడటమే ఉత్తమం. – రాజు, ఈఎన్‌టీ వైద్యుడు, హుజూరాబాద్

క్లుప్తంగా

ప్రాణం తీసిన పైసల పంచాయితీ

- అన్నపై తమ్ముడి దాడి
- చికిత్స పొందుతూ మృతి

మెట్‌పల్లి: డబ్బుల విషయంలో తమ్ముడు తన అన్నపై దాడి చేయగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మెట్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. స్థానిక దీన్‌దయాళ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ మౌలానా (30) తన పాత ఫోన్‌ను కొన్ని రోజుల క్రితం తమ్ముడు అబ్దుల్‌కు రూ.5వేలకు విక్రయించాడు. కొంత మొత్తం ఇచ్చిన అతడు మిగతా డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేశాడు. ఈ విషయమై గురువారం గొడవ జరిగింది. ఈ క్రమంలో అబ్దుల్ అన్న మౌలానాపై దాడికి పాల్పడ్డాడు. గాయపడ్డ మౌలానాను కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తీసుకెళ్లారు. అక్కడ శుక్రవారం రాత్రి మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

మెట్‌పల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మెట్‌పల్లి మండలం వెల్లుల అనుబంధం రాంచంద్రంపేటకు చెందిన గడిపెల్లి శ్రీనివాస్(52) శనివారం మృతి చెందాడు. ఐదురోజుల క్రితం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితంలేదు.

బస్సు ఢీకొని ఒకరు..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట శివారులో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కోరుట్ల మండలం ధర్మారానికి చెందిన దుంపల రాజ్‌కుమార్(27) బైక్‌పై వస్తున్నాడు. మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సు ఖానాపూర్ నుంచి మెట్‌పల్లి వైపు వస్తోంది. వేంపేట శివారు పెట్రోల్ బంక్ వద్ద బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

బైక్ ఢీకొని వృద్ధురాలు..

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని మక్త గ్రామంలో శనివారం రాత్రి మోటర్‌సైకిల్ ఢీకొని రాజమ్మ (60) మృతిచెందినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కేశవపట్నం నుంచి మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి రాజమ్మను ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోయినట్లు పేర్కొన్నారు.

మండపంలో అగ్నిప్రమాదం

రామగుండం: అంతర్గాం మండలం మద్దిర్యాలలోని గణపతి మండపంలో అగ్నిప్రమాదం సంభవించింది. శుక్రవారం వినాయక నిమజ్జనం కోసం విగ్రహాన్ని ట్రాక్టర్‌పైకి చేర్చారు. గండదీపాన్ని అక్కడే ఉంచారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించిన నిర్వాహకులు గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఆ తర్వత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. శనివారం వేకువజామున మండపం నుంచి పొగలు రావడంతో స్థానికులు వెళ్లి చూడగా అగ్నిప్రమాదం ఘటన వెలుగుచూసింది. గండదీపం చుట్టూ ఏర్పాటు చేసిన కాటన్ డబ్బాకు నిప్పంటుకుని కార్పెట్, విద్యుత్ తీగలు, టెంట్, సీలింగ్, డెకోరేషన్ ఫ్లవర్స్ కాలిపోయాయి.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిపై కేసు

జగిత్యాలక్రైం: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బీరం రాజేశ్‌పై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విధులకు ఆటంకం కలిగించాడని శుక్రవారం రాత్రి పోలీసులు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని హనుమాన్‌వాడ గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో టౌన్ ఎస్సై రవికిరణ్ సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నారు. కొందరు రోడ్డు బ్లాక్ చేసి రాకపోకలకు ఇబ్బంది కలిగించారు. అక్కడకు వెళ్లి ట్రాఫిక్ క్లియర్ చేస్తుండగా బీరం రాజేశ్ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించాడు. కానిస్టేబుల్ అలీం ఫిర్యాదు మేరకు రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

తీరని యూరియా కష్టాలు

- దుకాణాల ఎదుట ఉదయం నుంచే బారులు
- అయినా, అందరికీ సరిపడా అందని బ్యాగులు
- నిరాశతో వెనుదిరుగుతున్న అన్నదాతలు
- అదను దాటిపోతుందనే ఆందోళనలో రైతులు



చందుర్తి : యూరియా కోసం క్యూకట్టిన రైతులు



వీర్నపల్లి: రైతువేదిక వద్ద..



కాల్వశ్రీరాంపూర్ : పెగడపల్లి ఆగ్రోస్ కేంద్రం వద్ద

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/ఎలిగేడు(పెద్దపల్లి): యూరియా కోసం అన్నదాతలు అన్నిపనులూ వదిలేసి మండల కేంద్రాలు, పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. వరి, పత్తి తదితర పంటలకు ప్రస్తుతం యూరియా ఎంతోఅవసరమని, అదను దాటితే ఎంతవేసినా ప్రయోజనం ఉండదనే ఆతృతతో అన్నదాతలు వేకువజాము నుంచే దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. వచ్చే ఒకట్రెండు లోడ్‌లో వరుసలో ముందున్న వారికే సరిపోవడం లేదని, వెనుకాల ఉన్నవారి వంతు వచ్చేవరయే స్టాక్ ఖాళీ అవుతోందని రైతులు వాపోతున్నారు. శనివారం కూడా జిల్లావ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఉదయమే సింగిల్‌విండోలు, దుకాణాలు, గ్రోమోర్ తదితర గోదాముల ఎదుట బారులు తీరి కనిపించారు.

పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ

సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా వచ్చిందనే సమాచారంతో పలు గ్రామాల రైతులు ఉదయమే గోదాము వద్దకు చేరుకుని బారులు తీరారు. లారీలోడ్‌లో 340 బస్తాల యూరియా రావడంతో పట్టాదారుపాస్ పుస్తకాలు, సాగు విస్తీర్ణం ఆధారంగా ఒక్కో రైతుకు ఒకట్రెండు యూరియా బ్యాగులు అందజేశారు. రైతుల సంఖ్య అధికంగా ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేశారు. మిగతా వారికి సోమవారం యూరియా స్టాక్ వస్తుందని చెప్పి పంపించి వేశారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని పీఏసీఎస్ కార్యదర్శి సంతోష్‌కుమార్, ఇన్‌చార్జి చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు.

క్యూలైన్‌లో చెప్పులు.. రైతుల పాట్లు

కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలోని ఆగ్రోస్ కేంద్రం వద్దకు రైతులు ఉదయమే చేరుకున్నారు. అదేవిధంగా ఇదేగ్రామంలోని సాయికృష్ణ ఫెర్టిలైజర్స్ దుకాణం ఎదుట కూడా వందల సంఖ్యలో క్యూలో నిల్చున్నారు. యూరియా స్టాక్ రాక ఆలస్యం కావడంతో తమవంతు లైన్‌లో చెప్పులు ఉంచారు. రైతులు భారీ సంఖ్యలో తరలి రావడంతో పాస్‌బుక్కు జిరాక్స్ ఆధారంగా ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా, నానో లిక్విడ్ బాటిల్ ఇస్తున్నారు. పొద్దంతా పడిగాపులు కాస్తే.. ఒకబస్తా సైతం అందలేని, వరి పొట్టదశకు వచ్చిందని, పత్తి పూతపూసి గుంజర వచ్చేందుకు సిద్ధంగా ఉందని, ఈ సమయంలో యూరియా వేయాల్సి ఉన్నా.. దొరకడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తీరని యూరియా కష్టాలు

ఎలిగేడు మండలం ధూళికట్ట సహకార సంఘానికి యూరియా లోడ్ వచ్చిందనే సమాచారంతో ఎండను సైతం లెక్కచేయకుండా రైతులు ఉదయమే తరలివచ్చారు. క్యూలైన్‌లో ఒక్కసారిగా గందరగోళం నెలకొనడంతో పంపిణీని కాసేపే ఆపివేసారు. సాయంత్రం 5గంటలకు పోలీసులు రావడంతో పంపిణీని మళ్లీ ప్రారంభించారు. ధూళికట్టలో ఎకరాకు ఒకబస్తా చొప్పున 340 బస్తాలు, ఎలిగేడులో టోకెన్‌కు రెండు బస్తాల చొప్పున 540 బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు ఏవో ఉమాపతి తెలిపారు. ఏఈవో శరణ్య పాల్గొన్నారు.

మూడు రోజులు బారులు తీరినా..

వీర్నపల్లి: మండల కేంద్రంలో మూడురోజులుగా రైతులు బారులు తీరుతున్నా యూరియా లభించడం లేదు. శనివారం ఉదయం నుంచి రైతువేదికకు 220 యూరియా బస్తాలు రాగా.. క్యూలో నిలబడితే.. ఒకేఒక్క యూరియా బస్తా ఇవ్వడంతో ఇవేమీ కష్టాలని రైతులు ఆవేదన చెందారు. రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆవేదన చెందారు.

టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు..

చందుర్తి: విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలకు మేరకు శనివారం 330 యూరియా బస్తాలను సరఫరా చేశారు. సమాచారం అందుకున్న రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. 156 మంది రైతులకు రెండు బస్తాల చొప్పన సిబ్బంది పంపిణీ చేశారు. సగం మందికి కూడా సరిపడా యూరియా అందలేదు. దీంతోవారు నిరాశతో వెనుదిరిగారు. మరికొందరు రైతులకు వ్యవసాయాధికారులు టోకెన్లు ఇచ్చారు. మరోలోడ్ వచ్చేక ప్రాధాన్యత ప్రకారం యూరియా అందిస్తామని చెప్పి అక్కడి నుంచి పంపించివేశారు.

గూడెంలో రైతుల జాగరణ

ఓదెల(పెద్దపల్లి): గూడెం గ్రామంలో రైతులు యూరియా కోసం జాగరణ చేశారు. రాత్రి సమయంలో 140 బస్తాల యూరియా లోడ్ రాగా.. 400 మంది దాకా రైతులు గుమిగూడారు. తమకు ఇవ్వాలని ఆందోళనకు దిగారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో ఎస్సై రమేశ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒక్కో రైతుకు ఒక యూరియా బ్యాగ్ పంపిణీ చేయడంతో ఆందోళన విరమించారు.

బంగారం దొంగ అరెస్టు

వీణవంక: బంగారం దొంగతనం చేసి ఫైనాన్స్‌లో తాకట్టు పెడుతున్న దొంగను వీణవంక పోలీసులు పట్టుకున్నారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి శనివారం వివరాలు వెల్లడించారు. వీణవంక మండలం కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక రవి కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడ్డాడు. పేకాటకు బానిసై డబ్బులు పోగొట్టుకోవడంతో.. రోడ్డు పక్కన నివసిస్తున్న వృద్ధులను లక్ష్యంగా బంగారం గొలుసులను దొంగిలించేవాడు. ఆ బంగారాన్ని ఫైనాన్స్‌లో పెట్టి నగదు తీసుకొని మహారాష్ట్రలోని గడ్చందూర్‌లో పేకాట ఆడేవాడు. డబ్బులు అయిపోవడంతో మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. వీణవంక మండలం చల్లూరులో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై ఆవుల తిరుపతి వాహనాలు తనిఖీ చేస్తుండగా రవి అనుమానాస్పదంగా కనిపించాడు. విచారణ చేయగా దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందుతుడి నుంచి రూ.9 లక్షల విలువ చేసే బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు. సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై తిరుపతి, సిబ్బంది మోహన్, కోమల్, ప్రశాంత్, రమేశ్, మహేశ్‌ను ఏసీపీ అభినందించారు.

వినాయక శోభాయాత్రలో ఇరువర్గాల ఘర్షణ

మల్యాల: మల్యాలలో వినాయక విగ్రహాల నిమజ్జనంలో భాగంగా శోభాయాత్రగా వెళ్తున్న రెండు వినాయక మంటపాల నిర్వాహకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలకేంద్రంలోని తూర్పువాడకు చెందిన ఆద ర్శ రైతు సంఘం వి నాయక మంటపంలో గతంలో సభ్యులుగా ఉండి.. విడిపోయి కొడారి రణధీర్, కొడారి మనోజ్ మరోచోట వినాయక మంటపం ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం శోభాయాత్రలో భాగంగా ఆదర్శ రైతు సంఘం రాయల్ బుల్స్ మంటపం వద్దకు చేరుకోగానే.. పాత గొడవలు మనసులో పెట్టుకుని ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు. కైలాస్ మహేశ్ ఫిర్యాదు మేరకు కొడారి రణధీర్, కొడారి మనోజ్‌పై.. అలాగే కొడారి పవిత్ర ఫి ర్యాదు మేరకు కైలాస్ మహేశ్, ముదాం నాగరాజుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బోయినపల్లి(చొప్పదండి): గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో మిత్రులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్న ఓ యువకుడు మరుసటి రోజే బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లిలో శనివారం విషాదం నింపింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పోతుల పద్మ రెండో కుమారుడు పోతుల అరవింద్(21) హైదరాబాద్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం స్వగ్రామంలో జరిగిన వినాయక నిమజ్జనంలో పాల్గొనేందుకు వచ్చాడు. నిమజ్జనంలో స్నేహితులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్న అరవింద్ శనివారం ఉదయం ఇంటికొచ్చి కత్తెరతో పొడుచుకునేందుకు ప్రయత్నించాడు. తల్లి పద్మ అడ్డుకొని నచ్చ చెప్పింది. అనంతరం ఆమె ఇంటి పని చేస్తుండగా గదిలోకి వెళ్లిన తలుపులు వేసుకున్నాడు. తల్లి ఎంత వేడుకున్నా తలుపులు తీయకపోవడంతో పెద్ద కొడుకు వినయ్‌కి ఫోన్‌చేసి చెప్పింది. పెద్దకుమారుడు వచ్చి తలుపులు తీసి చూడగా అప్పటికే ఉరివేసుకున్నాడు. వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అరవింద్ తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

అరవింద్ నేత్రాలు సజీవం

అరవింద్ చనిపోయినా నేత్రాలు మరో ఇద్దరికి చూపునివ్వనున్నాయి. తల్లి, సోదరుడి అనుమతితో రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారు యువకుడి నేత్రాలు సేకరించారు.

రాజన్నకు భక్తుల నీరాజనం



కాత్యాయనిదేవికి స్వామి వారి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు



సోషల్ వెల్ఫేర్ కమిషనర్ సీతాలక్ష్మికి ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్నను శనివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాల మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(సెర్ప్) అడిషనల్ సీఈవో కాత్యాయనిదేవి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కమిషనర్ సీతాలక్ష్మి వేర్వేరుగా దర్శించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రమాదేవి, పర్యవేక్షకులు జి.శ్రీనివాస్‌శర్మ, ఆలయ ఇన్‌స్పెక్టర్ నూగూరి నరేందర్, ప్రొటోకాల్ అధికారులు అశోక్, సింహాచార్యులు పాల్గొన్నారు.

అలరించిన 'ట్రినిటి' ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని శుభం గార్డెన్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన ట్రినిటి జూనియర్ కళాశాల (గరల్స్) ఫ్రెషర్స్ డే వేడుకలు అలరించాయి. ట్రినిటి వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, ట్రినిటి గ్రూప్ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డిలు జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ముందుఆ నిర్వహించే ఆలోచన ఉన్నందున ఆ దిశగా విద్యార్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. మీ ప్రయాణం ఆధ్యాత్మికత, విద్య, క్రీడా, సాంస్కృతిక అభివృద్ధితో నిండి ఉండాలని అన్నారు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నలుగురిపై కేసు

జమ్మికుంట: దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రామకృష్ణ శనివారం తెలిపారు. పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్‌లో శుక్రవారం రాత్రి గణపతి ఉరేగింపు జరిగింది. శాలవాడకు చెందిన యువసేన యూత్‌క్లబ్ సభ్యులు శ్యామ్, సందీప్, రాకేశ్, హేమంత్ శోభాయాత్రలో గెల్లు రాజశేఖర్, గౌడ శ్రీనివాస్‌పై దాడి చేశారు. ఇద్దిరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కొడుకు పుట్టనో.. చెట్టునో పట్టుకుని ఉంటడు

- జాడ కోసం గోదావరిలో గాలించండి
- రాజేశ్ యాదవ్ తల్లిదండ్రుల ఆవేదన
- వినాయక నిమజ్జన ప్రదేశంలో కన్నీటి పర్యంతం
- నదిలో కొనసాగుతున్న గాలింపు చర్యలు



ఓదార్చుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్



గోదావరి వంతెనపై బైఠాయించిన బాధితులు



రాజేశ్ (ఫైల్)

రామగుండం/యైటింక్లయిన్‌కాలనీ: 'నా కొడుకు చెట్టునో పుట్టనో పట్టుకొని ఉంటడు.. ఒక్కగానొక్క కొడుకు.. ఓ కన్ను పోయినా సాదుకుంటా.. ఓ కాలు తెగినా సాదుకుంటా దేవుడా.. ఎంతో అందంగా ఉన్న సక్కనోడు.. అమ్మా.. నాన్న ఒక్కడు పనిచేస్తే డబ్బులు సరిపోతలేవు.. దసరా పోయినంకా నేను కూడా పనికి పోతనే.. నీకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో నీవు పనిచేసే పరిస్థితి లేదు కదా.. నేను, నాన్న ఇద్దరం కలిసి పనికి పోతమే.. ఏడాదిలో రెండు గదులతో ఇల్లు కట్టుకుందామే.. అంటివి బిడ్డా.. మొన్ననే సెల్‌ఫోన్ కొనిత్తిని.. వినాయకుడా.. నాకు కడుపుకోత పెట్టకు.. గోదారమ్మ తల్లీ.. నా కొడుకును నువ్వు తీసుకుంటే నేను, మా ఆయన ఇద్దరం కలిసి నీ ఒడిలోకి చేరుతం' అని ఆ తల్లి రోదించిన తీరు స్థానికులను కంట తడిపెట్టించింది. వివరాలు.. స్థానిక అక్బర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న నారకట్ల మహేశ్వ రి – సత్యం దంపతుల కుమారుడు రాజేశ్‌యా దవ్ ఉన్నాడు. అదేకాలనీలో గణపతి విగ్రహాన్ని శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గోదావరిఖని గంగానగర్ సమీప గోదావరిలో నిమజ్జనం చేసేందుకు మండప నిర్వాహకులతో కలిసి వెళ్లాడు. శనివారం వేకువజామున విగ్రహం నిమజ్జనం కోసం క్రేన్ కొక్కెనికి తగిలించే క్రమంలో టేబుల్‌పైకి రాజేశ్‌యాదవ్ ఎక్కాడు. దానిపై అడ్డుగా ఉన్నతీగలు కాలికి తగలడంతో అదుపుతప్పి ప్రమాదవాశాత్తు గోదావరిలో పడిపోయాడు. మధ్యాహ్నం 12 గంటల వరకూ యువకుడి ఆచూకీ లభించలేదు. ఈ ఘటనను నిరసిస్తూ అక్బర్‌నగర్ కాలనీవాసులు నది వంతెనపై బైఠాయించి నిరసన తెలిపారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా పూర్తియ్యిందనుకునే సమయంలోనే గోదావరిలో యువకుడు గల్లంతుకావడంతో విషాదం నెలకొంది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్, బీఆర్‌ఎస్ కార్మిక సంఘం నేత కౌశిక హరి, కాంగ్రెస్ నేత అయోధ్యసింగ్‌ఠాకూర్, ఏసీపీ రమేశ్, సీఐలు ప్రసాదరావు, ఇంద్రసేనారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వంతెన పిల్లర్ల నుంచి సుందిళ్ల బ్యారేజీ వరకు రెండు స్పీడ్ బోట్లు, నాలుగు నాటు పడవలు, ఇరవై మందితో గాలింపు చర్యలు చేపట్టామని ఏసీపీ రమేశ్ తెలిపారు. కాగా, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ, రాజేశ్‌యాదవ్ కుటుంబానికి రూ.2లక్షల నగదు పరిహారంగా అందిస్తామని, ఇందిరమ్మ పథకంలో ఇల్లు ఇప్పిస్తామన్నారు. ఊహించని పరిణామమని బీఆర్‌ఎస్ కార్మిక సంఘం నేత కౌశిక హరి అన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మాయలేడీ.. ముగ్గురిని వాడుకుంది!

- పెళ్లిల పేరిట మోసం

జగిత్యాలక్రైం: పెళ్లి చేసుకుంటానంటూ మాయ మాటలు చెప్పి పెళ్లి పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తూ.. మోసానికి పాల్పడుతున్న ఓ మాయలేడి ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రాయికల్ మండలంకు చెందిన ఓ మహిళ గతంలో ప్రేమ వివాహం చేసుకుని విడాకులు తీ సుకుంది. సారంగాపూర్ మండలంలోని ఓ గ్రా మానికి చెందిన వ్యక్తి భార్య అనారోగ్యంతో చని పోవడంతో సదరు లేడీ మధ్యవర్తుల సహాయంతో అతడితో పెళ్లి సంబంధం కుదుర్చుకుంది. ఇందుకోసం రూ.5లక్షల డిపాజిట్, మూడు తులాల బంగారం పెట్టాలని సూచించింది. కొద్ది రోజులకే సదరు మాయలేడి ఆర్మూర్ మండలం మోర్తాడ్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు తీసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించింది. అనంతరం సారంగాపూర్‌కు చెందిన వ్యక్తికి ఫోన్ చేసి తనకు క్యాన్సర్ ఉందని, రూ.3.50 లక్షలు వైద్య ఖర్చులకు ఇవ్వాలని, వ్యాధి నయం అయ్యాక పెళ్లి చేసుకుంటానని నమ్మించింది. దీంతో సదరు వ్యక్తి జూలైలో జగిత్యాలలోని ఓ బ్యాంక్‌లో బంగారం తాకట్టుపెట్టి సదరు మాయలేడికి రూ.3.50 లక్షలు అప్పగించాడు. కొద్దిరోజుల తర్వాత వైద్యుడు మరో రూ.5 లక్షలు అడుగుతున్నాడని చెప్పి కోరుట్ల మండలం సాతారానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతాలో రూ.5లక్షలు జమచేయించింది. షాపింగ్ పేరుతో మరికొంత వసూలు చేసింది. తర్వాత ఆర్మూర్ మండలం మోర్తాడ్‌కు చెందిన వ్యక్తి నుంచి కూడా రూ.5లక్షలు వసూలు చేసి పెళ్లికి సిద్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న సారంగాపూర్‌కు చెందిన వ్యక్తి పెద్ద మనుషులతో కలిసి వెళ్లి ఆరా తీశాడు. సమాచారం తెలుసుకున్న మాయలేడి వీరిపైనే ఫిర్యాదు చేసింది. దీంతో వారు చేసేదేమీలేక గతనెల సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మాయలేడిపై కేసు నమోదు చేశారు. దీంతో మాయలేడి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఈ మాయలేడి గతంలో కూడా చాలామందిని పెళ్లి పేరుతో మోసం చేసినట్లు అనుమానిస్తున్నారు. మాయలేడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయం వెలుగుచూడనుంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రగాయాలు

మానకొండూర్: మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన గొల్ల లక్ష్మీనర్సయ్య(65) వినాయక నిమజ్జనాన్ని తిలకించేందుకు వెళ్తుండగా.. చెరువుకట్ట వద్ద హుజురాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

జేఎన్టీయూ.. అరకొర వసతులు

- అగ్రహారం డిగ్రీ కాలేజీలో తరగతులు
- సరిపోని తరగతి గదులు
- కిలోమీటర్ దూరంలో హాస్టల్
- అద్దె భవనం.. అసౌకర్యాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



అగ్రహారం జేఎన్‌టీయూ కళాశాల

వేములవాడఅర్బన్: రాజన్నసిరిసిల్ల జిల్లాకు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ మంజూరుతోనే సరిపెట్టారు. ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేసిన ప్రభుత్వం పక్కా భవనం నిర్మాణం మరిచిపోయింది. దీంతో తాత్కాలికంగా అగ్రహారం డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్నారు. డిగ్రీ కాలేజీలో ఉన్న వసతులు ఇంజినీరింగ్ విద్యార్థులకు సరిపోయేలా లేవు. అయినా తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 2021–02 విద్యాసంవత్సరంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించారు. అప్పటి నుంచి అగ్రహారం డిగ్రీ కాలేజీలోనే తరగతులు నిర్వహిస్తున్నారు.

చాలీచాలని తరగతి గదులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తరగతి గదుల్లోని సగం గదులను తాత్కాలికంగా జేన్‌టీయూ కళాశాలకు వినియోగిస్తున్నారు. నాలుగేళ్లుగా అరకొర గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎనిమిది గదుల్లో తరగతులు కొనసాగుతున్నాయి. అగ్రహారం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు కోర్సుల్లో 1,032 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ దాదాపుగా 20 తరగతి గదులు అవసరం ఉంటుంది. కానీ అరకొర గదులతోనే నెట్టుకొస్తున్నారు.

కొండగట్టులో ప్రాక్టికల్స్

కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ మాత్రమే ఉంది. ఈసీఈ, మెకానికల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ కోసం కొండగట్టు జేఎన్‌టీయూ కళాశాలకు తీసుకెళ్తున్నారు. సివిల్ కోర్సు విద్యార్థులను సమీపంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలోని ల్యాబ్‌కు తీసుకెళ్తున్నారు. మిగతా కోర్సులకు అంతంతే ల్యాబ్ సౌకర్యం ఉంది.

అద్దె భవనాల్లో హాస్టల్ వసతి

అగ్రహారంలోని ఎనిమిది అద్దె భవనాల్లో విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించారు. ఉదయం, మధ్యాహ్నం కళాశాలలోని మెస్‌లో టిఫిన్, భోజనం అందుబాటులో ఉంటుంది. రాత్రి కొందరు మెస్‌లో తింటున్నారు. దూరంగా ఉన్న హాస్టల్ విద్యార్థులకు అక్కడికి భోజనం పంపుతున్నారు. హాస్టల్ నుంచి కాలేజీకి దాదాపు కిలోమీటర్ దూరం ఉంది. హాస్టల్ నుంచి కాలేజీకి నడుచుకుంటూ రావాల్సిందే.

ఇద్దరే ప్రభుత్వ ప్రొఫెసర్లు

కళాశాల ప్రారంభించి నాలుగేళ్లు అవుతున్నా ఇద్దరే రెగ్యులర్ ప్రభుత్వ ప్రొఫెసర్లు ఉన్నారు. ఒకరు ప్రిన్సిపాల్, మరొకరు ఈసీఈ ప్రొఫెసర్. కాంట్రాక్ట్ పద్ధతిన ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 40 మంది గెస్ట్ ఫ్యాకల్టీ విధులు నిర్వర్తిస్తున్నారు.

కళాశాలలో కోర్సులు, విద్యార్థులు

కోర్సు	ఫస్టియర్	సెకండియర్	థర్డ్ ఇయర్	ఫోర్త్ ఇయర్
సివిల్	14	61	60	59
ఈఈఈ	16	62	60	63
మెకానికల్	0	01	59	56
ఈసీఈ	54	68	66	64
సీఎస్ఈ	67	65	69	68
మొత్తం	151	257	314	310

చాలా ఇబ్బందులు



కళాశాలలో మెస్ చిన్నగా ఉండటంతో ఇబ్బందిగా ఉంది. షిఫ్టుల వారీ గా తింటున్నాం. హాస్టల్ నుంచి కళాశాల కిలోమీటరుకు పైగా దూరం ఉంటుంది. రోజు నడుచుకుంటూ వస్తున్నాం. సెలవు రోజు కళాశాలకు వచ్చి తిని వెళ్లాలి. కళాశాలలో హాస్టల్ వసతిలేక ఇబ్బందిగా ఉంది.

– సాయివర్ధన్, విద్యార్థి

తరగతి గదులు సరిపోతలేవు



కళాశాలలో మొత్తం ఎనిమిది తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఆ గదుల్లోనే షిఫ్టుల వారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. సరిపోయే సంఖ్యలో గదులు లేక ఇబ్బందులు పడుతున్నాము.

– అంజలి, విద్యార్థిని

ల్యాబ్, లైబ్రరీ లేదు



ఇంజినీరింగ్ కళాశాలలో లైబ్రరీ లేదు. ల్యాబ్‌లు మాత్రం కొన్ని కోర్సులకే ఉన్నాయి. ల్యాబ్ అవసరం ఉంటే కొండగట్టు జేఎన్‌టీయూకు, దగ్గరలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తుంది.

– సాయిచరణ్య, విద్యార్థిని

నిధులు ఇస్తే బాగు



తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామ శివారులో 20 ఎకరాల భూమిని జేఎన్‌టీయూ కళాశాల కోసం కేటాయించారు. కానీ నిధులు మాంజూరు చేయలేదు. అధ్యాపకుల పోస్టులు కూడా మంజూరు చేయలేదు.

– వేణుగోపాల్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్, అగ్రహారం

క్లుప్తంగా

సరస్వతీ శిశు మందిర్ స్కూల్‌కు సహాయం అందిస్తా



స్కూల్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: సరస్వతీ శిశు మందిర్ పాఠశాలల అభివృద్ధికి తన వంతుగా సాయం అందిస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కమిటీ సభ్యులు కేంద్ర మంత్రిని కలిసి పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ శిశుమందిరాలు దేశానికి ఎంతో ముఖ్యమని, ప్రస్తుత జనరేషన్‌లో సనాతన ధర్మం కాపాడటం శిశు మందిరాలతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యానారాయణ, మేచినేని దేవేందర్‌రావు, డాక్టర్ రమణాచారి, గట్టు శ్రీనివాస్, పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులకు సన్మానం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఆటల, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి శాలువలతో సత్కరించారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన



ఉత్తములుగా ఎంపికైన ఉపాధ్యాయులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని కోరా స్కూల్‌కు చెందిన ఎండీ గౌసొద్దీన్, రమేశ్, ప్రసూన, జాన్సన్ గ్లోబల్‌కి చెందిన కవిత, అశోక్, ఏఎస్‌సీకి చెందిన పావని, సౌమ్యారాణిలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై కలెక్టర్ పమేలా సత్పతి, ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. వీరిని శనివారం ఆ పాఠశాలల చైర్మన్ కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి అభినందించారు.

కవితను కలిసిన జిల్లా జాగృతి నాయకులు



కవితతో హరిప్రసాద్

సప్తగిరికాలనీ(కరీంనగర్): జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను శనివారం జిల్లాకు చెందిన పలువురు సీనియర్ జాగృతి నాయకులు హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. కవిత తీసుకునే నిర్ణయాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, ఉయ్యాల విష్ణువర్ధన్, గాలిపెల్లి రత్నాకరచారి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమం కోసమే జీఎస్టీ తగ్గింపు

కరీంనగర్‌టౌన్: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యుడు బొంతల కళ్యాణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక ప్రజలందరూ ఉపయోగించుకునే 80 శాతం వస్తువులపై టాక్స్ తగ్గింపు ఇదే మొదటిసారి అని అన్నారు. నిత్యావసర వస్తువులకు 5 శాతం, సాధారణ వస్తువులకు 18 శాతం, విలాసవంతమైన, హానికరమైన వస్తువులకు 40 శాతంతో జీఎస్టీలో మార్పులు చేయడం మంచి పరిణామం అన్నారు.

నియామకం

విద్యానగర్(కరీంనగర్): జాతీయ మాల మహానాడు కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఇరుకుల్ల యాదగిరి, చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జిగా కునుమల్ల చంద్రయ్య, మానకొండూర్‌కు లింగంకుమార్, హుజూరాబాద్‌కు జూపాల శ్రీనివాస్‌లను శనివారం జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్ నియమించారు.

రెండో రోజు వినాయక నిమజ్జనం

లడ్డూలకు వేలం



బొమ్మకల్ చెరువులో నిమజ్జనం చేస్తున్న వినాయక విగ్రహం



బొమ్మకల్ చెరువులో వినాయక విగ్రహాన్ని అందిస్తున్న మహిళలు



బొమ్మకల్‌లో వేలంలో లడ్డూ పొందిన దంపతులు మౌనిక-ఫణీధర్



తీగలగుట్టపల్లిలో వేలంలో లడ్డూ పొందిన జ్యోతి-వీరారెడ్డి దంపతులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో రెండో రోజు శనివారం వినాయక విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. మండపాల నిర్వాహకులు ట్రాక్టర్లలో వినాయక విగ్రహాలతో మేళతాళాలు, డీజే పాటలతో ఊరేగింపు నిర్వహించి ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు విగ్రహాలను నిమజ్జనం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రేన్లతో బొమ్మకల్‌లోని మల్లయ్య చెరువులో శనివారం సాయంత్రం వరకు వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. బొమ్మకల్ అంజనానగర్‌లో 50 సంవత్సరాల గోల్డెన్‌జూబ్లీ గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలంలో పిల్లి మౌనిక-ఫణీధర్ దంపతులు రూ.35,116 గెలుచుకున్నారు. తీగలగుట్టపల్లి కార్తికేయనగర్‌లోని వినాయక మండపం వద్ద విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కరెడ్ల జ్యోతి-వీరారెడ్డి దంపతులు రూ.25,016 లడ్డూను పొందారు.



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియం వెలుపల రోడ్డుపై చెత్తాచెదారం పేరుకుపోతుంది. స్టేడియం మెయిన్ గేట్ పక్కన ప్రతీరోజు సాయంత్రమైతే చాలు చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్తాచెదారం ఉండడంతో పరిసర ప్రాంత వాసులతో పాటు స్టేడియంకు వచ్చే వాకర్స్ దుర్వాసనతో భరించలేకుండా పోతున్నారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ చెత్తను తరలించకపోవడంతో సమస్య మరింతగా జఠిలమవుతోంది. రోడ్డుపై చెత్త వేయకుండా నగరపాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– పి.రవీందర్, తిరుమలనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వేణుమాధవ్, డిప్యూటీ కమిషనర్, సెల్ నం.98499 07538

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పోటీలను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కబడ్డీ ఆడుతున్న మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని పద్మనగర్‌లో గల మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో కరీంనగర్ అర్బన్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అర్బన్ కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాలో మానేరు విద్యాసంస్థలు క్రీడారంగానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. భవిష్యత్‌లో జాతీయ పోటీల నిర్వాహణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, కబడ్డీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, పెటా టీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, అర్బన్ ఎస్జీఎఫ్ కార్యదర్శి శంకరయ్యలతో పాటు పీడీ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రాండ్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్



పాల్గొన్న చిన్నారులతో గ్రాండ్ మాస్టర్ లలిత్ బాబు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని భగత్‌నగర్‌లో గల విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన గ్రాండ్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్ శనివారం ముగిసింది. ప్రముఖ ఇండియన్ గ్రాండ్ మాస్టర్ లలిత్ బాబు వివిధ జిల్లాల నుంచి వచ్చిన చిన్నారులకు చెస్‌లో మెలకువలు నేర్పించారు. ఓపెనింగ్ థియరీ, మిడిల్ గేమ్ స్టేజీ, ఎండ్ గేమ్ థియరీ తదితర వాటిని క్లుప్తంగా క్రీడాకారులకు మార్గ నిర్దేశం చేశారు. అనంతరం గ్రాండ్ మాస్టర్ లలిత్ బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, అకాడమీ డైరెక్టర్, ఏషియన్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇంటర్నేషనల్ రేటెడ్ ప్లేయర్, కోచ్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్, చదరంగ సమాఖ్య జిల్లా కోఆర్డినేటర్ అంతగిరి రాజేంద్రప్రసాద్, అకాడమీ సీనియర్ కోచ్ కొప్పర్తి శివయ్య, చిట్టుమల్ల మారుతి, కసుకుంట్ల మధు పాల్గొన్నారు.

వంశీకృష్ణకు గురుబ్రహ్మ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గోపీకృష్ణ

కొత్తపల్లి: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరంకుశం గోపీకృష్ణకు గురుబ్రహ్మ పురస్కారం అందజేశారు. విద్యారంగానికి విశేష సేవలందిస్తున్న గోపీకృష్ణకు పురస్కారం రావడం హర్షించదగ్గ విషయమని పాఠశాల చైర్మన్ ప్రసాదరావు అన్నారు. గోపీకృష్ణను పాఠశాల చైర్మన్‌తో పాటు డైరెకర్లు ప్రసూన, అనుకర్‌రావు, రష్మిత, రమణ, వినోద్‌రావు, ప్రసాద్, హనుమంతరావు, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

గంగాధర: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని మండల ప్రాదేశిక స్థానాలకు సంబంధించిన ఓటరు జాబితాను శనివారం ఎంపీడీవో ధమ్మని రాము ప్రదర్శించారు. మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలుండగా.. సంబంధిత నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాను పొందుపరిచినట్లు, ఏమైనా అభ్యంతరాలుంటే 3 రోజుల్లో తెలియజేయాలన్నారు. ఎంపీవో గౌరి రమేశ్, సూపరింటెండెంట్ జీవన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, టైపిస్టు సంతోష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో 37,867 ఓటర్లున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. 13 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. 19,217 మహిళలు, 18,650 పురుష ఓటర్లున్నారు.

అల్ఫోర్స్ విద్యార్థినికి 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు



శ్రీనిత్యను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: హైదరాబాద్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థిని గజబీంకార్ శ్రీనిత్య (6వ తరగతి) అత్యున్నత ప్రదర్శనతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,500 మంది విద్యార్థులకు పైగా పాల్గొన్న ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనలో శ్రీనిత్య చోటు సంపాదించడంపై శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అభినందించారు. విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా ప్రదర్శనల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవి అనిల్‌కుమార్‌కు కాళోజీ పురస్కారం



కొత్త అనిల్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన త్రివర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా అందిస్తున్న సాహిత్య పురస్కారాల్లో భాగంగా కాళోజీ నారాయణరావు పేరు మీద ప్రదానం చేయనున్న సాహిత్య పురస్కారాన్ని ఈసారి కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత కొత్త అనికుమార్‌కు అందజేస్తున్నట్లు త్రివర్ణ ఫౌండేషన్ కన్వీనర్, జానపద అకాడమీ, అధికార భాషా సంఘం ఆంధ్రప్రదేశ్ పూర్వ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కవితా సంపుటాలు రచించిన కొత్త అనిల్‌కుమార్ ప్రస్తుతం సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా సాహితీ సేవలు అందిస్తున్నారు. పురస్కారం రావడంపై నంది శ్రీనివాస్, గాజుల రవీందర్, దొమ్మటి శంకర్, కాండూరి వెంకటేశ్వర్లు, సాయిల్ల శ్రీనివాస్, సజ్జన కమలాకర్, శ్రీనివాసచారి, ఏ.శ్రీనివాస్‌లతో పాటు కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

అభినందనీయం

విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వ విద్యారంగాన్ని సంస్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని గురుకులాల విద్యార్థుల హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగురం రమేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్ఫూర్తిని ప్రభుత్వ ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకొని విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు విద్యా వ్యవస్థకు దీటుగా ప్రభుత్వ విద్యను పటిష్టం చేయడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు.

విజ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులే



ఆర్డీవో మహేశ్వర్‌ను సన్మానిస్తున్న ఫాతిమారెడ్డి



విజన్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు సన్మానం

కొత్తపల్లి: విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంతో పాటు విజ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులే అని కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ అన్నారు. కొత్తపల్లి, రేకుర్తిలోని సెయింట్‌జార్జ్, ప్యారడైజ్ విద్యాసంస్థలో శనివారం జరిగిన ఉపాధ్యాయ వేడుకల్లో పాల్గొని పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. బాల్యం నుంచే విద్యార్థులకు చక్కని బాట వేస్తే భవిష్యత్‌లో వారు ఉన్నత స్థానాలను చేరుకుంటారన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని తెలిపారు. పాఠశాలల చైర్మన్ పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ప్రతీ ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వసంత, భార్గవ్, ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపల్స్ మధు, నిరంజన్, ప్రసాద్ రెడ్డి, ఇంచార్జిలు సంధ్య, సంగీత, స్వప్న పాల్గొన్నారు.

విజన్ హైస్కూల్‌లో..

రేకుర్తిలోని విజన్ హై స్కూల్‌లో శనివారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులను ఆ స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాను ఒలింపిక్స్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న రవీందర్ సింగ్

కరీంనగర్‌స్పోర్ట్స్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన యోగాను ఒలింపిక్స్‌లో చేర్చుటకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని యోగా అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రవీందర్‌సింగ్ కోరారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో శనివారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ యోగా చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా యోగాలో భాగస్వాములయ్యే వారు అధిక సంఖ్య ఉన్నారని, వారి ప్రతిభను ప్రపంచ వేదికపై చాటేందుకు ఒలింపిక్స్ ప్రధానమైందన్నారు. ఒలింపిక్స్‌లో యోగా చేర్చితే భారత్‌కు ఎక్కువ స్వర్ణ పతకాలు వస్తాయని తెలిపారు. యోగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధించేలా ప్రత్యేక కార్యచరణ చేపట్టినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేష్‌రెడ్డి, కోచ్‌లు కిష్టయ్య, మల్లేశ్వరి, రామకృష్ణ, సాగర్, అశోక్, ఆనంద్ కిశోర్, ప్రశాంత్, కోటేశ్వర్ రావు, స్వరూపచారి, వాణి, సుష్మ శైలజ, ఆమని, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో అక్రమాలపై ఆందోళన



ఏఈవోతో మాట్లాడుతున్న పోలీసులు



పాసుపుస్తకాలను ఏరుకుంటున్న రైతులు


కరీంనగర్‌రూరల్: దుర్శేడ్ సహకార సంఘంలో యూరియా బస్తాల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ శనివారం రైతులు ఆందోళనకు దిగారు. రైతులతో ఏఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ వాగ్వాదానికి దిగడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. దుర్శేడ్ సంఘంలో యూరియా బస్తాల కోసం రైతులు క్యూలైన్‌లో ఉండగా మొగ్దుంపూర్‌కు చెందిన కొందరు రైతుల పేర్లు రాగా ఆకుల మల్లయ్య అనే రైతు నిన్న పాసుపుస్తకం ఇచ్చానని తన పేరు ఎందుకు రాలేదంటూ ఏఈవో పైడితల్లిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఈక్రమంలో డైరెక్టర్ కందుల రమేశ్‌గౌడ్ రైతులతో మర్యాదగా మాట్లాడాలని, ఇష్టారాజ్యంగా యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్నారంటూ ఏఈవోను నిలదీయడంతో వివాదమేర్పడింది. ఏఈవోకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేయడంతో ఏవో సత్యం, పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. గోపాల్‌పూర్, దుర్శేడ్ రైతులకు ముందుగా యూరియా బస్తాలను ఇస్తున్నారని, ఇరుకుల్ల, మొగ్దుంపూర్ రైతులకు సక్రమంగా ఇవ్వడం లేదని పలువురు రైతులు తెలిపారు. పోలీసు బందోబస్తుతో క్యూలైన్‌లో ఉన్న రైతులకు మాత్రమే యూరియా బస్తాలను పంపిణీ చేయాలని ఏఈవోకు సూచించారు. అనంతరం గతంలో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాల జిరాక్స్‌లను బయట పడేయడంతో రైతులు ఎవరివి వారు ఏరుకునేందుకు పడరానీపాట్లు పడ్డారు.



ఘనంగా ఓనం

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని మెహర్‌నగర్‌లో గల వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో శనివారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ఓనం పండుగ ప్రాముఖ్యత, విశిష్టతను తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులు రంగురంగుల పూలతో ఓనం రంగవల్లులను అలంకరించారు. అనేక రకాల వంటకాల రుచులతో అందరినీ ఆకట్టుకున్నారు. నృత్యాలు అలరించారు. కార్యక్రమంలో వింధ్యావాలీ పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాముకు శస్త్రచికిత్స



పాముకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో శనివారం పాము వచ్చిందనే స్థానికుల సమాచారంతో శ్రీలక్ష్మి జంతుశాల నిర్వాహకుడు సుమన్ వెళ్లాడు. తోక తెగి ఉన్న జెర్రిపోతు పామును పట్టుకుని చికిత్స కోసం కరీంనగర్‌లోని పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. వైద్యుడు అజిత్‌రత్నం పాముకు శస్త్రచికిత్స చేసి తోక అతుక్కునేలా కుట్లు వేశాడు. ప్రస్తుతం పాము తన వద్దనే ఉందని, తోక అతుక్కోగానే అటవీ ప్రాంతంలో విడిచిపెడుతానని సుమన్ తెలిపాడు.

మద్యం అక్రమ కేసులో ముగ్గురికి బెయిల్

నిందితుల ప్రాథమిక హక్కులను హరించడమే

ఇటీవల సుప్రీంకోర్టు రీతూ చాబ్రియా కేసులో స్పష్టమైన తీర్పు ఇచ్చింది. దర్యాప్తు పూర్తి చేయకుండానే దాఖలు చేసిన అసంపూర్ణ చార్జిషీట్.. సీఆర్‌పీసీ సెక్షన్ 167(2) ప్రకారం నిందితుడికి లభించే డిఫాల్ట్ బెయిల్ హక్కును దూరం చేయలేదని తేల్చిచెప్పింది. డిఫాల్ట్ బెయిల్ చట్టబద్ధ హక్కు మాత్రమే కాక రాజ్యాంగంలోని అధికరణం 21 ప్రకారం ప్రాథమిక హక్కు కూడా అని సుప్రీం పేర్కొంది. ప్రతి నిందితుడికి వేర్వేరుగా చార్జిషీట్‌లు దాఖలు చేసి డిఫాల్ట్ బెయిల్ హక్కును అడ్డుకోవాలనుకునే తీరు చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం కూడా అని తెలిపింది. ఇలాంటి చర్యలు నిందితుడి ప్రాథమిక హక్కు అయిన స్వేచ్ఛను హరిస్తాయని చెప్పింది. అసంపూర్ణ లేదా పలు భాగాలుగా చార్జిషీట్ దాఖలు చేయడం ద్వారా రాజ్యాంగం ప్రసాదించిన ఈ హక్కును కాలరాయలేరని కూడా సుప్రీంకోర్టు చెప్పింది

అనుమతులు.. ఆమోదం లేకుండా ముందుకెళ్లలేం

ప్రస్తుత కేసులో ప్రాథమిక చార్జిషీట్, అనుబంధ చార్జిషీట్ విషయానికి వస్తే 48 మందిని నిందితులుగా పేర్కొన్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ప్రాథమిక చార్జిషీట్‌ను 16 మందిపై మాత్రమే దాఖలు చేశారు. మరో ముగ్గురిపై అనుబంధ చార్జిషీట్ వేశారు. ఇంకా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నివేదికలు రాలేదు. ఆ నివేదికల్లో ఏమున్నదో తెలియకుండా, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ లేదా 19 ప్రకారం అనుమతులు, ఆమోదం పొందకుండా ప్రభుత్వ ఉద్యోగులపై కేసును ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాదు

ప్రి కాగ్నిజెన్స్ దశలో కస్టడీ పొడిగించలేం

చట్ట ప్రకారం నేరాలను కోర్టు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందే తప్ప నిందితులను కాదు. సీఆర్‌పీసీ సెక్షన్ 309(2) ప్రకారం నేరాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిందితుల రిమాండ్ పొడిగించడం సాధ్యం కాదు. కేసు ఇంకా ప్రి కాగ్నిజెన్స్ దశలోనే ఉంది. ఈ పరిస్థితుల్లో సెక్షన్ 167(2) ప్రకారం 90 రోజులు దాటిన తరువాత నిందితుల కస్టడీ పొడిగించడానికి అనుమతి లేదు. అందువల్ల నిందితులకు సీఆర్‌పీసీ సెక్షన్ 167(2) కింద బెయిల్ మంజూరు చేయడం తప్ప మరో మార్గం లేదు

-ఏసీబీ కోర్టు తీర్పు

గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు మంజూరు చేసిన ఏసీబీ కోర్టు

డిఫాల్ట్ బెయిల్ రాకుండా ఉండేందుకు అసంపూర్ణ చార్జిషీట్ దాఖలు చేయడం రాజ్యాంగ విరుద్ధం... డిఫాల్ట్ బెయిల్ అన్నది ప్రాథమిక హక్కే కాకుండా చట్టబద్ధమైన హక్కు అని సుప్రీంకోర్టు చెప్పింది..

సంపూర్ణ చార్జిషీట్ లేకుండా 60/90 రోజులకు మించి రిమాండ్ పొడిగించడానికి వీలు లేదు.... ప్రతి నిందితుడికి వేర్వేరుగా చార్జిషీట్ దాఖలు చేసి బెయిల్‌ను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం : ఏసీబీ కోర్టు



సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో విజయవాడ ఏసీబీ కోర్టు శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సాగించిన ప్రయత్నాలను పటాపంచాలు చేసింది. ఈ ముగ్గురికీ బెయిల్ ఇచ్చింది. చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో వీరికి ఏసీబీ కోర్టు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు షరతులు విధించింది. పాస్‌పోర్టులను ఇప్పటికే జప్తు చేయకుంటే, విడుదలైన మూడు రోజుల్లో వాటిని స్వాధీనం చేయాలని ఆదేశించింది. ముగ్గురూ రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని సూచించింది. కోర్టు అనుమతి లేకుండా దేశం దాటి వెళ్లొద్దని, తమ నియంత్రణలోని లేని పరిస్థితుల్లో తప్ప మిగిలిన అన్నివేళల్లో కోర్టు విచారణలకు హాజరై తీరాలని స్పష్టం చేసింది. తదుపరి పర్యవేక్షణ నిమిత్తం మొబైల్ ఫోన్‌ను యాక్టివ్‌లో ఉంచాలని పేర్కొంది. సాక్షులను గాని, సహ నిందితులను కలవడానికి వీల్లేదని ఆదేశించింది. ఎలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడరాదని, షరతులను ఉల్లంఘిస్తే వెంటనే బెయిల్ రద్దవుతుందని వెల్లడించింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు శనివారం తీర్పు వెలువరించారు.

- రీతూచాబ్రియా వర్సెస్ సీబీఐ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ఏసీబీ కోర్టు తన తీర్పులో పేర్కొంది. డిఫాల్ట్ బెయిల్ రాకుండా చేసేందుకు అసంపూర్ణ చార్జిషీట్ దాఖలు చేయడం రాజ్యాంగంలోని అధికరణ 21కు విరుద్ధమని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. అంతేకాక, సీఆర్‌పీసీ సెక్షన్ 167(2) కింద డిఫాల్ట్ బెయిల్ అన్నది ప్రాథమిక హక్కే కాక చట్టబద్ధమైనది కూడా అని సర్వోన్నత న్యాయస్థానం చెప్పిందని ఏసీబీ కోర్టు తెలిపింది. సంపూర్ణ చార్జిషీట్ లేకుండా 60/90 రోజులకు మించి రిమాండ్ పొడిగించడానికి వీల్లేదని కూడా సుప్రీం స్పష్టం చేసిందని పేర్కొంది.

అసంపూర్ణ దర్యాప్తు ఆధారంగా దాఖలు చేసే చార్జిషీట్‌కు చట్టబద్ధత లేదు

''సిట్ దాఖలు చేసిన మొదటి చార్జిషీట్, తర్వాత వేసిన అనుబంధ చార్జిషీట్‌ను ఈ కోర్టు పరిశీలించింది. మొత్తం 21 లోపాలను గుర్తించి మూడు రోజుల్లో సవరించాలని ఆగస్టు 23న స్పష్టం చేశాం. చార్జిషీట్ కాపీల దాఖలు, పెన్ డ్రైవ్ రూపంలో డాక్యుమెంట్ల జాబితా ఇవ్వడం మినహా మిగిలిన లోపాలను సిట్ సరిదిద్దలేదు. మేం లేవనెత్తిన అభ్యంతరాలనే కాక పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనల సమయంలో చార్జిషీట్‌లో పలు ఇతర అంశాలను ఎత్తిచూపారు. ఈ నేపథ్యంలో డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలా వద్దా అన్నదాన్ని చార్జిషీట్ దాఖలు చేశారా? లేదా? అన్న కోణంలో చూడకూడదు. దర్యాప్తు మొత్తం నిర్దీత గడువులో పూర్తయిందా? లేదా? ఆ దర్యాప్తు పూర్తయిన తర్వాత మాత్రమే చార్జిషీట్ దాఖలైందా? లేదా? అన్నదే పరిశీలించాల్సి ఉంటుంది. ప్రాథమిక లేదా అసంపూర్ణ దర్యాప్తు ఆధారంగా చార్జిషీట్ దాఖలు చేయడం చట్టబద్ధం కాదు. ఇది నిందితుడు డిఫాల్ట్ బెయిల్ పొందే చట్టబద్ధ హక్కుకు అడ్డంకిగా మారకూడదు. ఇదే విషయాన్ని ఆకుల రవితేజ కేసులో హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది.

- ''రోజువారీగా మరికొంత మంది నిందితుల విషయంలో సిట్ సోదాలు కొనసాగిస్తోంది. దర్యాప్తు ఇప్పటికీ కొనసాగుతోంది. అవినీతి జరిగిన మొత్తంగా ఆరోపిస్తున్న రూ.3,570.87 కోట్లలో కేవలం రూ.40 కోట్ల వరకు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన మొత్తాల వివరాలు తెలియాల్సి ఉంటుంది. ఈ కారణాలతో నిందితులపై నమోదైన నేరాలను విచారణకు స్వీకరించే పరిస్థితిలో ఈ కోర్టు లేదు' అని ఏసీబీ కోర్టు తన తీర్పులో వివరించింది.

చార్జిషీట్‌ను విచారణకు స్వీకరించనప్పుడు రిమాండ్ పొడిగించలేరు...

గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలు జూలై, ఆగస్టు నెలల్లో రెండుసార్లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు కొట్టివేసింది. దీంతో ఇటీవల ఏసీబీ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు వేశారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాదులు తప్పెట నిరంజన్‌రెడ్డి, వినోద్‌కుమార్ దేశ్‌పాండే, పొపెల్లుగారి వీరారెడ్డి, తప్పెట నాగార్జునరెడ్డి, శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి, చంద్రగిరి విష్ణువర్ధన్‌లు వాదనలు వినిపించారు. సిట్ చార్జిషీట్‌పై ఏసీబీ కోర్టు పలు అభ్యంతరాలను లేవనెత్తిందని, చార్జిషీట్‌ను విచారణకు స్వీకరించని నేపథ్యంలో పిటిషనర్లకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మరోవైపు చార్జిషీట్‌ను విచారణకు స్వీకరించనప్పుడు సీఆర్‌పీసీ సెక్షన్ 167(2) కింద రిమాండ్‌ను పొడిగించే ఆస్కారం లేదని తెలిపారు. సెక్షన్ 309 ప్రకారం రిమాండ్ పొడిగింపు చట్ట విరుద్ధం అవుతుందని పేర్కొన్నారు. ఏసీబీ కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలను సిట్ అధికారులు నివృత్తి చేయలేదని తెలిపారు. అభ్యంతరాలను సరిచేయకుండా, రిమాండ్‌ను పొడిగించాలంటూ సిట్ అధికారులు యాంత్రికంగా కోర్టులో మెమోలు దాఖలు చేస్తూ వస్తున్నారని చెప్పారు. దీనిని సిట్ తోసిపుచ్చుతూ బెయిల్ ఇవ్వొద్దంటూ గట్టిగా వాదనలు వినిపించింది.

100 రోజులకు పైగా జైల్లో ముగ్గురు

గత ప్రభుత్వ మద్యం విధానంలో అవకతవకలు జరిగాయంటూ సీఐడీ నిరుడు సెప్టెంబరు 23న ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అనంతరం ఈ అక్రమ కేసులో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు నిమిత్తం సిట్‌ను ఏర్పాటు చేసింది. దర్యాప్తు జరిపిన సిట్... రాజ్ కేసిరెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా సత్యప్రసాద్, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వేణుంబాక విజయసాయిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కాల్వ ధనుంజయరెడ్డి, పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు మొత్తం 48 మందిని నిందితులుగా చేర్చింది.

- ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని కొట్టివేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ విచారణ పెండింగ్‌లో ఉండగానే, సిట్ అధికారులు ఈ ఏడాది మే 13న బాలాజీ గోవిందప్పను అరెస్ట్ చేశారు. 117 రోజులుగా ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.
- కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి మే 16న అరెస్టయ్యారు. వీరు 113 రోజులుగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. మద్యం అక్రమ కేసులో ఈ ముగ్గురి పాత్రపై సిట్ చార్జిషీట్ దాఖలు చేసింది.

మిథున్‌రెడ్డికి మధ్యంతర బెయిల్

మంజూరు చేసిన ఏసీబీ కోర్టు ● రాజమండ్రి జైలు నుంచి విడుదల



జైలు నుంచి బయటకు వస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, అమరావతి/విజయవాడ లీగల్ /సాక్షి, రాజమహేంద్రవరం: మద్యం అక్రమ కేసులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు శనివారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. పార్లమెంట్ సభ్యుడిగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. మిథున్‌రెడ్డి రూ.50వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, ఈనెల 11న సాయంత్రం ఐదు గంటలకల్లా రాజమండ్రి కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ముందు సరెండర్ కావాలని ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని మిథున్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై శనివారం ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు విచారణ చేపట్టారు. మిథున్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దని సిట్ తరఫు న్యాయవాది వాదించారు. ఓటు హక్కు కోసం మధ్యంతర బెయిల్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా కూడా ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని అన్నారు. అయితే ఏసీబీ కోర్టు సిట్ వాదనను తోసిపుచ్చింది. మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీ కోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో ఎంపీ మిథున్‌రెడ్డి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ నుంచి శనివారం సాయంత్రం విడుదలయ్యారు. పార్టీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు మిథున్‌రెడ్డికి స్వాగతం పలికారు.

ఎట్టకేలకు తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

● సుప్రీంకోర్టు ఉత్తర్వులతో దిగొచ్చిన పోలీసులు



తాడిపత్రిటౌన్/యల్లనూరు: అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎట్టకేలకు తాడిపత్రిలోని తన నివాసానికి చేరుకున్నారు. శనివారం జిల్లా ఎస్పీ జగదీష్ తాడిపత్రి పట్టణంలోనే మకాం వేసి.. దాదాపు 250 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పెద్దారెడ్డి తన స్వగ్రామమైన యల్లనూరు మండలం తిమ్మంపల్లి నుంచి బయలుదేరి తాడిపత్రిలోని తన నివాసానికి చేరుకున్నారు. ప్రభుత్వ అండతో టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్‌రెడ్డి కూటమి సర్కారు ఏర్పడినప్పటి నుంచి పెద్దారెడ్డిని తాడిపత్రికి రాకుండా అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. చివరికి ఆయన గత నెలలో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన తాడిపత్రిలోని స్వగృహానికి చేరుకునేలా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారి అయిన సీబీ రోడ్డు నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్ల వరకు పోలీస్ బలగాలను మోహరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేశారు. వారి ఇళ్ల వద్దకు వస్తున్న వారిపై నిఘా ఉంచారు.

లడ్డూ కోసం పోటా..పోటీ

- ఇంటికి లడ్డూ వస్తే మేలు జరుగుతుందని గట్టి నమ్మకం
- భక్తితో పాటు ఇది ఒక స్టేటస్ గా చూస్తున్న భక్తులు
- ఏటా పెరుగుతున్న లడ్డూ వేలం పాట ధరలు

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరంలో గణేశ్ లడ్డూ వేలం ఈ ఏడాది మరో లెవెల్‌కు వెళ్లిపోయింది. లడ్డూ ప్రసాదం రూ.వేలు, రూ.లక్షల నుంచి రూ.కోట్లు దాటిపోతోంది. భక్తుల కొంగు బంగారమై నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడి ప్రసాదం సొంతం చేసుకోవడానికి వేలాది మంది ఆసక్తి చూపిస్తున్నారు. బాలాపూర్, మైహోంభూజా, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, వంటి గణేశ్ మండపాల్లో లడ్డూ ఎంత ధర పలికింది అనేది తెలుసుకోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు ఆసక్తిగా ఎదుచూస్తుంటారు. లడ్డూ వేలం పాటలో దక్కించుకోవడం అనేది భక్తితో పాటు స్టేటస్ సింబల్‌గాను భావిస్తున్నారు. దీంతో గణేశ్ లడ్డూకు విపరీతమైన క్రేజ్ వచ్చింది. ఈ ఏడాది వేలం పాటలో రూ. 3 లక్షలు అంతకంటే ఎక్కువ మొత్తం పెట్టి లడ్డూ సొంతం చేసుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- → బాలాపూర్ వినాయకుడి లడ్డూను కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథగౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే బాలాపూర్ లడ్డూ ధర ప్రస్తుతం రూ.4.99 లక్షలు పెరిగింది.
- → మాదాపూర్ శ్రీనగర్ యూత్ అసోసియేషన్ లడ్డూ రూ.30 లక్షలకు జి.మణికుమార్ సొంతం చేసుకున్నారు.
- → ఖానాపూర్ గ్రామం శ్రీ వరసిద్ధి వినాయక మండపంలో లడ్డూ వేలం పాటలో రూ.14,26160 మస్కూరి శంకరయ్య కుటుంబం కైవసం చేసుకుంది.
- → బాలాజీ నగర్ డివిజన్ సేవాలాల్‌నగర్ వినాయకుని లడ్డూ ఎస్.కృష్ణ రూ.10.20 లక్షలకు సొంతం చేసుకున్నారు.
- → మణికొండ పంచవటి కాలనీ వినాయకుడి లడ్డూను రూ.9.15 లక్షలకు భాస్కర్ రావు దక్కించుకున్నారు.
- → చేవెళ్ల మండలం ఖానాపూర్ గణేష్ లడ్డూను చేకూరి అంజిరెడ్డి రూ.9.5 లక్షలకు దక్కించుకున్నారు.
- → చేవెళ్ల పట్టణం జర్నలిస్టు కాలనీలో జేసీ యూత్ వినాయక లడ్డూ ప్రసాదాన్ని రూ.6,06,666కు కోణార్క్ గ్రూప్ సభ్యులు కాసుల ఆనంద్ గౌడ్, కిష్టమొళ్ల త్రినేత్ర సొంతం చేసుకున్నారు.
- → రాగన్నగూడలో లడ్డూను రూ.7.65 లక్షలకు రొక్కం భీరెడ్డి దంపతులు సొంతం చేసుకున్నారు.
- → తుక్కగూడ బొడ్రాయి ఉత్సవ కమిటీ గణేషుడి లడ్డూను రూ.7,55,111లకు ప్రకాష్‌రెడ్డి సొంతం చేసుకున్నారు.
- → బడంగ్‌పేట్ వీరాంజనేయ భక్తసమాజం గణనాథుడి లడ్డూను రూ.7.10 లక్షలకు గౌర సత్తయ్య కుటుంబం దక్కించుకుంది.
- → రామంతపూర్ డి మార్ట్ వద్ద శ్రీ లక్ష్మీ గణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణేశ్ లడ్డూను జంధ్యాల శ్రీనివాస్(బొట్టు శ్రీను) రూ. 6.66 లక్షలకు కైవసం చేసుకున్నారు.
- → మియాపూర్ మాతృశ్రీ నగర్‌కు చెందిన సైనేని లోకేష్ రూ.6,11,111కు వేలం పాటలో లడ్డూ దక్కించుకున్నారు.
- → కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్ కాలని గణేశ్ లడ్డూను అనంతుల ముత్యంరెడ్డి రూ.5.50 లక్షలకు కైవసం చేసుకున్నారు.
- → వనస్థలిపురం ప్రశాంత్ నగర్లో గణపతి లడ్డూను రూ.5,01,116 లకు భీరం శంకర్ రెడ్డి దక్కించుకున్నారు.
- → కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద వినాయక భక్త మండలి లడ్డూను నవీన్‌రావు రూ.5,11,116 లడ్డూను చేజిక్కించుకున్నారు.
- → శేరిలింగంపల్లి తారానగర్ వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి లడ్డూను రూ.4.15 లక్షలకు భాస్కర్ గుప్తా దక్కించుకున్నారు.
- → లింగంపల్లిలో వినాయక లడ్డూను రూ.4 లక్షలకు భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ సభ్యులు సొంతం చేసుకున్నారు.
- → రాఘవేంద్ర కాలనీ సీ బ్లాక్ గణేశ్ పెద్ద లడ్డూను కళ్యాణి రమేశ్ కుటుంబం రూ.4.36లక్షలకు కైవసం వేసుకున్నారు.
- → కొకాపేట్ ఎస్‌వీఎస్ యూత్ లడ్డును రూ.4 లక్షలకు ముంగి బుజంగా రెడ్డి కైవసం చేసుకున్నారు.
- → రామంతపూర్ లోని వడ్డెర సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని లడ్డును పీట్ల అశోక్ రూ. 3,00,116కు సొంతం చేసుకున్నారు.
- → ఈస్ట్ ఆనంద్ వెల్ఫేర్ అసోసియేషన్ వినాయకుడి లడ్డును తోరణాల సంజయ్ కుమార్ గుప్తా రూ.3.5 లక్షలకు వేలం పాడారు.
- → చంపాపేట్ పోచమ్మ గుడి ఆవరణలో క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మహా గణనాథుని లడ్డూను దేవరశెట్టి సందీప్ పాటిల్ రూ. 4.33 లక్షలకు దక్కించుకున్నారు.
- → సబ్జిమండి గంగపుత్ర సంఘం గణేశ్ ఉత్సవ సమితి వినాయక లడ్డు వేలంలో పిట్టల సుజన్ రూ. 3 లక్షలకు కేవసం చేసుకున్నారు.
- → మణికొండ పంచవటి కాలనీ వినాయకుడి వద్ద లేడీస్ లడ్డూను స్వప్న వెంకట రమణ రూ. 3.10 లక్షలకు సొంతం చేసుకున్నారు.
- → శ్రీ చిదంబరేశ్వర భక్త సమాజం వినాయక లడ్డూ గొల్ల విశాల్ యాదవ్ కుటుంబం రూ.3.05 లక్షలకు సొంతం చేసుకుంది.
- → రహమత్‌నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ మండపం వద్ద రూ.3,00,116లకి సురేష్ ముదిరాజ్ లడ్డూ దక్కించుకున్నారు.

గణేశ్ నిమజ్జనంలో హైడ్రా సేవలు

- చెరువుల్లో గస్తీ కాసిన గజ ఈతగాళ్లు
- సహాయక చర్యల్లో భాగమైన డీఆర్ఎఫ్



హుస్సేన్‌సాగర్ వద్ద హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ నిమజ్జనంలో హైడ్రా విభాగాలు కీలక సేవలు అందించాయి. హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్, ఐడీఎల్, కాప్రా, సఫిల్‌గూడ చెరువులతో పాటు నగరంలో నిమజ్జనం జరుగుతున్న అన్ని చెరువుల్లో హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోట్లలో తిరుగుతూ గస్తీ నిర్వహించారు. వీరికి తోడు ప్రతి క్రేన్ వద్ద ఒక్కొక్కరు చొప్పున హైడ్రాకు చెందిన 121 మంది గజ ఈతగాళ్లు విధుల్లో ఉన్నారు. హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పర్యవేక్షించారు. హుస్సేన్‌సాగర్ వద్ద ఏర్పాటు చేసిన హైడ్రా కంట్రోల్ రూమ్ ఆద్యంతం పరిశీలించారు. హైడ్రాకు చెందిన 51 డీఆర్‌ఎఫ్ బృందాల్లో 745 మంది అధికారులు, సిబ్బంది గణేష్ నిమజ్జన కార్యక్రమంలో మిగతా విభాగాలతో కలసి పని చేశారు.

మద్యం అక్రమ కేసులో కూటమి కుతంత్రం

అబద్ధాల గోడలతో అడ్డగోలుగా భేతాళ కథలు అల్లిన సిట్

- వాటిని నిజం చేయడానికి అనుబంధ కథలతో తంటాలు
- బలవంతంగా '164 స్టేట్‌మెంట్' ఇప్పించి, అప్రూవర్లుగా మార్చే ప్రయత్నం
- ఆపై ఇష్టం వచ్చిన కథలను బలవంతంగా చెప్పించే తంతు
- అసలు స్కామే జరగనిచోట స్కాం జరిగినట్లు బురదజల్లే పన్నాగం
- దీనికితగినట్లుగా ఈనాడు, ఎల్లో మీడియా తానతందాన
- సిట్ వేధిస్తోందని స్వయంగా హైకోర్టును ఆశ్రయించిన వాసుదేవరెడ్డి
- తర్వాత ప్రలోభపెట్టి, బెదిరించి అప్రూవర్‌గా మార్చిన సిట్
- వాస్తవానికి రాజ్ కేసిరెడ్డి–ఎంపీ కేశినేని చిన్ని వ్యాపార భాగస్వాములు
- పొరపాటున కూడా ఈ విషయాన్ని ప్రస్తావించని ఎల్లో మీడియా
- ఇప్పుడు కొత్తగా వైఎస్ జగన్ సమీప బంధువుల మీద మరో భేతాళ కథ
- బురదజల్లే క్రమంలో... వైఎస్ అనిల్‌రెడ్డి పీఏ విచారణ అంటూ సిట్ కొత్త డ్రామా
- భేతాళ కుట్రలతో సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వికాట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప అరెస్టు

కుతంత్రాలు పటాపంచలవడంతో.. కొత్త కట్టుకథలతో...

అసలు లేని మద్యం కుంభకోణంలో అనేక కుతంత్రాలకు పాల్పడి పలుసార్లు తలబొప్పి కట్టించుకుంది. హైదరాబాద్ శివారు వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యానికి చెందిన ఫాంహౌస్‌లో రూ.11 కోట్లు దొరికాయంటూ హడావుడి చేసింది. ఈ విషయమై నంబర్లతో సహా నోట్ చేయాలని కోర్టు నిలదీసేసరికి ఎల్లో మీడియా సాయంతో ఇంకో భేతాళ కుట్ర అల్లింది. అదే రోజు... మరోచోట రూ.కోట్ల నగదు లభ్యమైందని.. అదంతా మద్యం సొమ్మేనని ముడిపెట్టింది.

వెంకటేష్‌నాయుడు తన ఫోన్‌లో చిత్రీకరించిన వీడియో ఇదిగో అంటూ ఎల్లో మీడియాకు లీకులిచ్చింది. ఇప్పుడు మాజీ సీఎం వైఎస్ జగన్ సమీప బంధువుల మీద మరో భేతాళ విక్రమార్క కథను అల్లుతోంది. వైఎస్సార్ కుటుంబం, గత ప్రభుత్వంపై బురదజల్లే క్రమంలో... వైఎస్ జగన్ సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి పాత్ర ఉందంటూ ఆయన పీఏను విచారిస్తున్నామంటూ సిట్ కొత్త డ్రామా నడిపిస్తోంది.

సాక్షి, అమరావతి:

కుట్రలు... పన్నాగాలతో... బెదిరింపులు... వేధింపుల మధ్య... అబద్ధపు వాంగ్మూలాలు... తప్పుడు సాక్ష్యాలతో మద్యం అక్రమ కేసును నడిపిస్తోంది ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్). కక్షసాధింపే లక్ష్యంగా... దెబ్బతీయడమే ఉద్దేశంగా... అబద్ధాల పునాదులపై అడ్డగోలుగా భేతాళ కథలు అల్లింది. వాటిని నిజం చేయడానికి అనుబంధ కథలతో నానాతంటాలు పడుతోంది. తాజాగా అక్రమ కేసులో సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, అంతర్జాతీయ సిమెంట్ కంపెనీ వికాట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనం. చార్జిషీట్ కాపీలు, పెన్‌డ్రైవ్ రూపంలో డాక్యుమెంట్ల లిస్ట్ ఇవ్వడం మినహా తాము అడిగిన లోపాలను సరిదిద్దలేదని న్యాయస్థానం పేర్కొనడాన్ని బట్టి... సిట్‌ది ఎంత భేతాళ కుట్రనో స్పష్టం అవుతోంది. కాగా, మద్యం అక్రమ కేసులో సిట్ మొదటినుంచి ఇదే ధోరణిలో వ్యవహరిస్తోంది. లేని స్కాంను ఉన్నట్లుగా చూపేందుకు కిందామీద పడుతోంది. ఎల్లో మీడియాకు లీకులిస్తూ రక్తి కట్టిస్తోంది.

- మద్యం అక్రమ కేసులో అరెస్టు చేసినవారితో బలవంతంగా వారికి కావాల్సినట్లు '164 స్టేట్‌మెంట్' ఇప్పించి, అప్రూవర్లుగా మార్చే ప్రయత్నం యథేచ్ఛగా సాగించింది. ఆపై వారితో ఇష్టం వచ్చిన కథలను బలవంతంగా చెప్పించే తంతు నడిపించింది. ఇక్కడ సిట్ ఎంత అన్యాయంగా, దారుణంగా వ్యవహరించింది అంటే... అసలు కుంభకోణమే లేనప్పటికీ బురదజల్లడమే లక్ష్యంగా అక్రమ కేసులను నమోదు చేసింది. ఇదే అదనుగా... అందుకు తగినట్లుగా ఈనాడు, ఎల్లో మీడియా తానతందాన అంటూ బరితెగించి కథనాలు వండివార్చడం మొదలుపెట్టాయి.

అసలు వ్యాపార భాగస్వాములు వారే...!

రాజ్ కేసిరెడ్డి... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొనసాగిన పలువురు సలహాదారుల్లో ఒకరు. అంతమాత్రాన్నే మద్యం అక్రమ కేసులో ముడిపెట్టింది సిట్. వాస్తవానికి రాజ్ కేసిరెడ్డి... విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్)లే వ్యాపార భాగస్వాములు. ఈ విషయం ఆధారాలతో బయటకు వచ్చింది కూడా. ఇక కేశినేని చిన్ని మంత్రి నారా లోకేశ్ బినామీ అని అందరికీ తెలిసిందే. కానీ, ఎల్లో మీడియా మాత్రం పొరపాటున కూడా మాటమాత్రంగానైనా ఈ విషయాన్ని ప్రస్తావించదు. ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తూ... కళ్లున్న కబోదిలా ప్రవరిస్తూ ఉంటుంది. గత ప్రభుత్వంపై మాత్ర యథేచ్ఛగా బురదజల్లుతూ తన కపట బుద్ధిని బయటపెట్టుకుంటోంది.

'అప్రూవర్ కుట్ర'లతో...

అక్రమ కేసు కుతంత్రంలో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, పూర్వ ఉద్యోగి సత్యప్రసాద్‌లను తీవ్రంగా వేధించి మరీ అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయించింది కూటమి ప్రభుత్వం. వారి ద్వారా అప్రూవర్ కుట్రకు కూడా తెగించింది. వాస్తవానికి వాసుదేవరెడ్డిని అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు తీవ్రంగా వేధించారు. ఆయన డెప్యుటేషన్ ముగిసినా ప్రభుత్వం రిలీవ్ చేయకుండా అడ్డుకుంది. కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో ముందస్తు బెయిల్ కోరుతూ మూడుసార్లు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం వెంటాడి వేధించింది. వారు చెప్పినట్లు వింటే అప్రూవర్‌గా మారుస్తామంది. చివరకు సిట్ చెప్పినట్టుగా వాసుదేవరెడ్డి అబద్ధపు వాంగ్మూలం ఇచ్చారు. ఆ వెంటనే ఆయనను రిలీవ్ చేసి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

- బెవరేజెస్ కార్పొరేషన్ చిరుద్యోగులు సత్యప్రసాద్, అనూష సహా పలువురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని వేధించి బలవంతంగా అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించింది. ఇలా ఇచ్చేందుకు సమ్మతించనివారిపై సిట్ ప్రతాపం చూపింది.
- కట్టుకథలను మించిన భేతాళ కథలతో కుతంత్రాలు పన్నిన సిట్... సీఎంవో అప్పటి కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలను అరెస్టు చేసింది. నిజానికి మద్యం విధానం ఫైలు అసలు సీఎంవోకు రాదు. కానీ, సిట్ తన కపట ఉద్దేశాలతో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను మద్యం అక్రమ కేసులో ఇరికించింది. ఇక బాలాజీ గోవిందప్ప అంతర్జాతీయ సిమెంట్ కంపెనీ వికాట్ డైరెక్టర్. ఆయనకు అసలు మద్యం విధానంతో సంబంధమే లేకపోయినా, భేతాళ కుట్రలు పన్ని లక్ష్యంగా చేసుకుంది.

నేడు నేషనల్ గ్రాండ్ పేరెంట్స్ డే




వయసైపోయి, శక్తి ఉడిగిందని గ్రాండ్ పేరెంట్స్‌ని చులకనగా చూడకండి.
ఈ యుగపు వేగంతో నత్త వారసులేం పోటీపడగలరు అనుకోకండి.
వాట్సాప్‌లు, స్నాప్‌చాట్‌లు, ట్విటర్లు, ఇన్‌స్టా హ్యాండిల్స్‌లో వాళ్లు యమ యాక్టివ్.
ఫేస్‌టైమ్.. స్కైపుల్లో భలే షార్ప్. షాట్స్, రీల్స్‌లో సూపర్ ఫాస్ట్.
జెన్ జీ జార్గాన్‌నూ జీర్ణించుకుంటున్నారు. ఆధ్యాత్మికతనూ ఆస్వాదిస్తున్నారు.
సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ పట్లా అవగాహనతో ఉంటున్నారు.
టూర్స్ అండ్ ట్రావెల్స్‌కీ రెడీ అవుతున్నారు.
ఇంటి నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్ దాకా కావల్సినంత ఇన్ఫో ఇస్తున్నారు.
అన్నింటిలోనూ గ్రాండ్‌నెస్‌ను చవిచూపిస్తున్న వాళ్లే గ్రాండ్ పేరెంట్స్.
వారితో కనెక్టివిటీని పెంచే ఉద్దేశంతోనే 'గ్రాండ్‌పేరెంట్స్ డే' సెలబ్రేషన్ మొదలైంది.

ఆకాశంలోని చుక్కల్ని పరిచయం చేయడం దగ్గర్నుంచి కథలతో ఊహలను ఉసిగొల్పడం వరకు మన జీవితాల్లో అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు పోషించిన పాత్రను వర్ణించగలమా? అందుకు వాళ్లు నేర్పిన మాటలతోపాటు మనం నేర్చుకున్న భాషల్లోని వొకాబులరీని అరువు తెచ్చుకున్నా సరిపోదు. రామాయణంలో రాముడి వ్యక్తిత్వాన్ని, భాగవతంలోని కృష్ణుడి లీలలను, భారతంలోని యుద్ధనీతిని.. పురాణ స్త్రీల ఔన్నత్యాన్ని, చరిత్రలోని పరాక్రమాన్ని.. వెండితెర అద్భుతాలను తమదైన బాణీ, వాణీతో బుజ్జి మెదళ్లలో నింపే గుర్తులు మరుపుకొచ్చేవా! ఆ కాలానికీ ఈ కాలానికీ వారధులైన గ్రాండ్‌పేరెంట్స్ మనల్ని నడిపించే గురువులు. బడులు బోధించలేని ఎన్నో పాఠాలను వాళ్ల అనుభవ జ్ఞానం బోధిస్తుంది.

అందుకే..

ముసలాళ్లని వాళ్లను మూలకు తోసేయొద్దు. మనకన్నా ముందు ప్రపంచాన్ని చూసినవాళ్లని.. ఔపోసనపట్టిన పెద్దవాళ్లని గౌరవిద్దాం. రోజూ కుదరకపోయినా.. వారాంతాల్లోనైనా వాళ్లతో కాస్త సమయాన్ని వెచ్చిద్దాం. కనీసం గ్రాండ్‌పేరెంట్స్ డే అయినా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేద్దాం!
హ్యాపీ గ్రాండ్‌పేరెంట్స్ డే!



మెరియన్ మెక్వేడ్ అనే గృహిణి.. పెద్దలను గౌరవించాలని, వారి అనుభవజ్ఞానానికి విలువివ్వాలని.. దాన్నో సంస్కృతిగా మార్చాలనే తలంపుతో గ్రాండ్‌పేరెంట్స్ డే అనే కాన్సెప్ట్‌ని క్రియేట్ చేసి.. దాన్నో వేడుకగా మలచింది. అప్పటి నుంచి ప్రపంచంలోని పలు దేశాలు వాళ్లకు అనువైన నెలల్లో ఈ గ్రాండ్ పేరెంట్స్ డేను నిర్వహించుకుంటున్నాయి. అలా మనం ప్రతి ఏడు సెప్టెంబర్‌లోని మొదటి ఆదివారం నాడు గ్రాండ్‌పేరెంట్స్ డేని జరుపుకుంటున్నాం!

ఓల్డ్ is గోల్డ్

కొత్త తరానికి వారధులు



● కమలా హ్యారిస్



● కరీనా కపూర్



● అభయ్ డియోల్

ఈరోజు నేనీ స్థాయిలో ఉండటానికి కారణం మా తాతయ్యే (పీవీ గోపాలన్). చదువు దగ్గర్నుంచి మహిళా హక్కులు, ప్రజా సేవ వరకు నా మీద ఆయన ప్రభావం చాలా ఉంటుంది. ఆయన చాలా ప్రొగ్రెసివ్. అమ్మాయిల చదువుకు ఎంతో ఇంపార్టెన్స్ ఇచ్చేవారు. ఎన్నో విషయాలను తాతయ్య దగ్గరే నేర్చుకున్నాను.
- కమలా హ్యారిస్

మా నాన్న, చిన్నాన్న యాక్టర్స్ అయినా నాతోపాటు అక్క (కరిష్మా కపూర్), తమ్ముడు (రిషీ కపూర్) అందరం ఇన్‌ఫ్లుయెన్స్ అండ్ ఇన్‌స్పైర్ అయింది మాత్రం మా తాతగారు రాజ్‌కపూర్ వల్లనే! ఫ్యామిలీ యూనిటీ నుంచి సినిమాల దాకా చాలా విషయాల్లో ఆయన చెప్పిన మాటలు, చూపిన దారినే అనుసరిస్తాం!
- కరీనా కపూర్

క్రమశిక్షణ, బాధ్యత వంటి విషయాలను మా తాతయ్య (లెఫ్టినెంట్ కల్నల్ రామేశ్వర్‌నాథ్ డియోల్) నుంచే నేర్చుకున్నాను. ఏ పని చేసినా నిబద్ధత ముఖ్యమనే ఆయన మాటలనే జీవన విలువగా పాటిస్తున్నాను.
- అభయ్ డియోల్

హెల్త్

● వృద్ధాప్యంలో డిప్రెషన్

మెరుగు పడేది ప్రేమతో...

గత కొంతకాలం కిందట రిటైర్ అయిన పరంధామయ్య మొదట్లో బాగానే ఉండేవారుగానీ ఈ మధ్య అంత చురుగ్గా లేకపోవడంతో పాటు ఎంతో విచారంగా కనిపిస్తున్నారు. పిల్లలిద్దరూ యూఎస్‌లో ఉండటంతో పరంధామయ్య దంపతులిద్దరూ ఒంటరిగానే ఉండాల్సి వస్తోంది. గతంలోలా ఎక్కడికీ వెళ్లడం లేదు. కాస్త మతిమరపు వచ్చినట్టుగా ఫీలవుతున్నారు కూడా. బాగా సన్నిహితులైన ఒకరిద్దరు కనిపించి సైకియాట్రిస్ట్ దగ్గరికి వెళ్లమంటే... 'తానేమైనా పిచ్చివాడిని అయిపోతున్నానా?' అనే దిగులు ఆయన్ను మరింత కుంగదీస్తోంది. ఎట్టకేలకు కొందరు ఫ్రెండ్స్ ఆయనను సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తే తేలిందేమిటంటే... ఆయన 'వృద్ధాప్యం తాలూకు డిప్రెషన్'తో బాధపడుతున్నట్లు తేలింది. ఇంట్లో కనీసం మనవలూ, మనవరాళ్లూ ఉండి ఉంటే గ్రాండ్స్ పేరెంట్స్‌కు ఈ పరిస్థితి వచ్చేది కాదేమోనని చెప్పడంతో ఈ వృద్ధాప్యపు డిప్రెషన్ గురించి నలుగురికీ తెలియడం మంచిదని ఫీలయ్యారు పరంధామయ్య ఫ్రెండ్స్. వృద్ధాప్యంలో వచ్చే ఆ 'ఓల్డ్ ఏజ్ డిప్రెషన్' తాలూకు వివరాలివి...

వయసు పైబడిన వారు ముందుగా గుర్తుంచుకోవాల్సిందేమిటంటే... తమ మనసుకు వచ్చిన సమస్యనూ లేదా సైకియాట్రిస్ట్ దగ్గరికి వెళ్లాల్సిన పరిస్థితిని చాలా సహజమని గుర్తించాలి. తల్లిదండ్రులు కాస్తా గ్రాండ్ పేరెంట్స్‌గా మారే టైముకు పిల్లలు తమ పిల్లలతో (గ్రాండ్ చిల్డ్రన్‌తో) కలిసి వాళ్ల కెరియర్ కోసం విదేశాలకు లేదా దూరప్రాంతాలకు వెళ్లడం చాలా సహజం. ఇటీవలి సామాజిక ధోరణి కారణంగా... తమ రిటైర్‌మెంట్ నాటికి పెద్దలు డిప్రెషన్‌కు లోనుకోవడం చాలా సాధారమవుతోంది. పైగా ఈ తరహా డిప్రెషన్ ఇటీవల చాలామందిలో విపరీతంగా విస్తరిస్తోంది. దురదృష్టవశాత్తు త వైద్యులను సంప్రదించేవారి సంఖ్య చాలా తక్కువగా ఉండటం ఆందోళన గొలిపే అంశం.

వృద్ధాప్య డిప్రెషన్‌కు కారణాలు...

నిజానికి డిప్రెషన్ ఏ వయసులోనైనా రావచ్చు. కానీ వృద్ధాప్యంలో డిప్రెషన్‌కు లోనయ్యేందుకు అవకాశాలు ఎక్కువ. అందుకు కారణాలివి...

● **ఒంటరితనం:** ముందుగా చెప్పుకున్నట్టు తాము స్థిరపడటానికి పిల్లలు దూరప్రాంతాల్లో ఉంటారు. పెద్దలు తామంతట తాము కదల్లేని స్థితిలో ఉండి, ఇతరుల మీద ఆధారపడాల్సి రావడం డిప్రెషన్‌కు దారితీయవచ్చు.

● **ఆరోగ్య సమస్యలు:** వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు చాలా సాధారణం. దీర్ఘకాలిక వ్యాధులు, జ్ఞాపకశక్తి, శారీరక దృఢత్వం, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, శస్త్రచికిత్స చేయించాల్సిన జబ్బులకూ వృద్ధాప్యం కారణంగా చికిత్స తీసుకునే పరిస్థితి ఉండకపోవడం వంటి కారణాలతో డిప్రెస్ అవుతుంటారు.

● **అర్థం లేని భయాలు:** ఎవరూ దగ్గరగా లేని సమయంలో తాము చనిపోతామేమో, అలాగైతే తాము చనిపోయిన విషయం పిల్లలకు ఎలా తెలుస్తుంది... లాంటి అర్థం లేని భయాలు వేధిస్తుంటాయి.

● **ఏ ప్రయోజనాల కోసం బతకాలనే భావన:** ఇకపై ఎవరి ప్రయోజనాలకోసం, ఏం సాధించడానికి బతికి ఉండాలనే నిరాశాపూర్వకమైన భావనతో ప్రతికూల ఆలోచనలు వెంటాడటం.

● **ఇటీవల చూస్తున్న తమ తోటివారి మరణాలు:** తమ బంధువుల్లో, తెలిసినవారిలో తమ వయసువారు చనిపోతుండటంతో కలిగే కుంగుబాటు. ఒకవేళ అలా మరణించిన వారిలో తమ జీవిత భాగస్వామి ఉండటం డిప్రెషన్‌కు దారితీస్తుంది.

వైద్య ఆరోగ్య అంశాలతో కలిగే డిప్రెషన్...

వృద్ధాప్యంలో వచ్చే కొన్ని రకాల వ్యాధుల వల్ల అంటే ఉదాహరణకు... డయాబెటిస్‌తో పాటు దాని వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, హైబీపీ, గుండెజబ్బులు, పక్షవాతం, క్యాన్సర్, థైరాయిడ్ సమస్యలు, విటమిన్ బి-12 లోపం, మతిమరపు, అల్జైమర్స్ వ్యాధి, లూపస్, మల్టిపుల్ స్క్లీరోసిస్ వంటి కారణంగా డిప్రెషన్‌కు లోనయ్యే అవకాశాలెక్కువ.

కొన్ని రకాల మందులతోనూ డిప్రెషన్...

కొన్ని సందర్భాల్లో ఆ వయసులో వాడే కొన్ని రకాల మందుల వల్ల కూడా డిప్రెషన్ రావచ్చు. ఉదాహరణకు మామూలుగా రక్తపోటుకు వాడే కొన్ని మందులు, బీటా బ్లాకర్లు, కొన్ని రకాల నిద్రమాత్రలు, క్యాల్షియమ్ ఛానెల్ బ్లాకర్లు, పార్కిన్సన్ డిసీజ్ తాలూకు మందులు, అల్సర్ మందులు, గుండెజబ్బుల మందులు, కొన్నిరకాల స్టెరాయిడ్స్, హైకొలెస్ట్రాల్ ఉన్నవారు వాడే మందులు, నొప్పినివారణ మందులు, ఆర్థరైటిస్ ఔషధాలు, ఈస్ట్రోజెన్ హార్మోన్ వంటివి పెద్ద వయసు వారిలో డిప్రెషన్‌కు కారణం కావచ్చు.

వృద్ధాప్య డిప్రెషన్ లక్షణాలు

● ఎప్పుడూ తీవ్రమైన నిరాశ, విచారం ● నిత్యం అలసట ● గతంతో తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిన హాబీలూ లేదా వ్యాపకాలపైనా ఆసక్తి కోల్పోవడం ● ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం ● ఆకలి తగ్గడం ● బరువు తగ్గం ● తరచూ నిద్రాభంగం లేదా ఒక్కోసారి మితిమీరి నిద్రపోతుండటం ● తనతో ఏ ప్రయోజనమూ లేదనీ, తాను సమాజానికి భారమనే భావన ● మద్యం/డ్రగ్స్‌కు బానిస కావడం ● త్వరగా మరణించాలనే భావన లేదా ఆత్మహత్యా ధోరణి/ ఆలోచనలూ/ యత్నాలు.

వృద్ధుల్లో డిప్రెషన్‌ను గుర్తించడమిలా...

● తమలో అంతకు మునుపు లేని నొప్పులను ఏకరవు పెడుతుండటం ● తాము ఏపనీ చేయలేకపోతున్న విషయాలను తరచూ ప్రస్తావిస్తూ ఉండటం ● యాంగ్జైటీకి గురికావడం / వేదన, బాధలను వ్యక్తపరుస్తుంటం ● త్వరగా భావోద్వేగాలకు గురికావడం ● వ్యక్తిగత విషయాలపై తగిన శ్రద్ధ చూపకపోవడం.

ఆల్కహాల్‌తోనూ డిప్రెషన్...

కొందరు పెద్దవయసు వారు ఆ వయసులో బాగా నిద్రపట్టేందుకూ లేదా హాయిగా సాయంత్రాలు గడిపేందుకూ మద్యం ఒక సాధనమని అనుకుంటుంటారు. అయితే ఆ వయసులో అతిగా తాగే మద్యం వల్ల కూడా డిప్రెషన్ వస్తుంది. ఆల్కహాల్ వల్ల తేలిగ్గా కోపం, చిరాకు వంటి ఉద్వేగాలకు గురికావడం (ఇరిటబిలిటీ), యాంగ్జైటీకి లోనుకావడం, మెదడులోని జీవక్రియలు అస్తవ్యస్తం కావడం జరగవచ్చు. ఆల్కహాల్ కారణంగా వృద్ధులకు ఇచ్చే యాంటీ డిప్రెసెంట్ మందులు అంత ప్రభావపూర్వకంగా పనిచేయకపోవడం వంటివీ జరగవచ్చు. మద్యం నిద్ర నాణ్యతను దెబ్బతీసే ముప్పు ఉంటుంది. పైగా మద్యం మత్తులో పడిపోవడం జరిగి, ఆ వయసులో పూర్తిగా మరొకరిపై ఆధారపడాల్సి రావడం కూడా ఒక నిస్సహాయతతో పాటు... అలా ఆధారపడాల్సి రావడమనే భావన కూడా డిప్రెషన్‌కు దారితీయవచ్చు.

విచారం/బాధలూ లేకున్నా డిప్రెషన్!

సాధారణంగా డిప్రెషన్‌లో తీవ్రమైన విచారం, బాధ ఉండటం చాలా సాధారణం. కొందరిలో ఇలాంటి లక్షణాలేమీ కనిపించకుండానే డిప్రెషన్‌లోకి వెళ్లే అవకాశాలుంటాయి. ఏ పనిపైనా వాళ్లకు ఆసక్తిలేకపోవడం; ఏదైనా చేయాలంటే ఉత్సాహం లేకపోవడం (లో మోటివేషన్); ఏదైనా పని చేయడానికి తగిన శక్తి/సామర్థ్యం తమలో లేదనే భావన వంటి ఫీలింగ్స్‌తో ఈ డిప్రెషన్ కనిపిస్తుంది. కొందరిలో ఎప్పటికీ తగ్గని ఒంటి నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో కూడా వృద్ధాప్యపు డిప్రెషన్ వ్యక్తం కావచ్చు.

చికిత్స

పై నివారణ చర్యల తర్వాత కూడా డిప్రెషన్‌కు లోనైన వారికి సైకియాట్రిస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఆర్ మందులు, యాంటీడిప్రెసెంట్స్‌తో చికిత్స చేయాల్సి ఉంటుంది. కొందరిలో కేవలం కౌన్సెలింగ్‌తోనే సమస్య తీరవచ్చు. కొందరికి కౌన్సెలింగ్‌తో పాటు మందులూ అవసరం పడవచ్చు.

అది బాధా... డిప్రెషనా?

కొందరిలో డిప్రెషన్ కాకుండా తీవ్రమైన బాధ కూడా ఉండవచ్చు. కాస్త శ్రద్ధగా పరిశీలించుకుంటే అది డిప్రెషనా లేక బాధనా అన్నది గుర్తుపట్టడమూ కాస్తంత తేలికే. ఉదాహరణకు బాధలో ఉన్న వారికి అప్పుడప్పుడైనా సంతోష భావన కలుగుతుంది. అలాంటి సంతోష భావనలూ, ఆనందాలూ, ఇతరత్రా ఉద్వేగాలేవీ లేకుండా ఎప్పుడూ విచారం, బాధ, నిరాశ, నిస్పృహలతో ఉంటే అది డిప్రెషన్‌గా పరిగణించవచ్చు.



డాక్టర్ శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై
హెచ్‌వోడీ ఆఫ్ సైకియాట్రీ &
సీనియర్ సైకియాట్రిస్ట్
ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రి, వరంగల్

డిప్రెషన్ నుంచి దూరమవ్వాలంటే...

తమ పట్ల తాము కాస్తంత శ్రద్ధ తీసుకోవడం ద్వారా ఎంతగా వయసు పైబడినప్పటికీ డిప్రెషన్‌ను దరిచేరనివ్వకుండా చూడవచ్చు. వృద్ధాప్యంలో డిప్రెషన్‌ను నివారించే చర్యలివే...

● **నలుగురినీ కలవడం :** వృద్ధాప్యంలో కలిగే తీరికతో నలుగురినీ కలుస్తుండటం.(డిప్రెషన్ నివారణకూ లేదా అధిగమించడానికి ఇది బాగా పనిచేస్తుంది).

● **వ్యాయామం :** తమకు శారీరక శ్రమ కలిగించని రీతిలో వాకింగ్ వంటి వ్యాయామల వల్ల డిప్రెషన్ దరిచేరదు.

● **కంటి నిండా నిద్ర:** కంటినిండా నిద్రపోవడం డిప్రెషన్‌కు మంచి మందు. అయితే మితిమీర కూడదు. అంటే... నిద్ర సమయం 7-9 గంటలు మించనివ్వవద్దు.

● **సమతుల ఆహారం :** అన్ని పోషకాలు అందేలా తేలిగ్గా జీర్ణమయ్యే సమతులా ఆహారం తీసుకోవాలి. జంక్‌ఫుడ్ వద్దు.

● **హాబీలు :** మనకు ఆసక్తి కలిగించే హాబీలను కొనసాగించవచ్చు. యుక్తవయసులో పనిఒత్తిడి, తీరిక లేని కారణంగా మానేసిన హాబీలను ఈ సమయంలో పునరుద్ధరించుకోవడం డిప్రెషన్ నివారణకు చాలా మేలు చేస్తుంది.

● **పెంపుడు జంతువులు :** పెట్స్ ఆలనా-పాలనా డిప్రెషన్‌ను దరిచేరనివ్వవు.

● **కొత్త విద్యలు/ నైపుణ్యాలు :** వీటిని నేర్చుకోవడం డిప్రెషన్‌ను అధిగమించడానికి చాలా మేలు చేస్తుంది. ఆసక్తి ఉంటే ఏ వయసులోనైనా, ఏ విషయాన్నైనా నేర్చుకోవచ్చు. పైగా వృద్ధాప్యంలో వేరే వ్యాపకాలేవీ ఉండవు కాబట్టి ఆ టైమ్‌లో నేర్చుకోవడం సులభం కూడా.

● **హాస్యం :** ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ, హాస్యప్రియత్వం కలిగి ఉండటం.

- యాసీన్

మనపై 'గాండ్రు'మన్న పులులే మెత్తని గ్రాండ్ పేరెంట్స్ అయ్యారే!

ఈ గ్రాండ్ పేరెంట్స్ ఉన్నారే... వాళ్ల రెండు నాల్కల ధోరణే వేరు.

వీళ్లు పేరెంట్స్‌గా ఉన్నప్పుడు తమ పిల్లలు అన్నం తినకపోయినా... సరిగా చదవకపోయినా... మాట వినకపోయినా విపరీతంగా తిట్టేవారు. కసితీరా కొట్టేవారు. వెరసి... చెడుగుడాడేవాళ్లూ... చెమడాలెక్కతీసేవాళ్లు.

ఈ ధోరణితో వాళ్లు ప్రవర్తిస్తున్న కాలంలో పిల్లలుగా మనం బితుకూ బితుకూమంటూ బతికేవాళ్లం. ఎట్టకేలకు వాళ్లిప్పుడు గ్రాండ్స్‌పేరెంట్స్ అయ్యారు.

కాలచక్రం గిర్రున తిరిగి మనకూ ఇప్పుడు పిల్లలు పుట్టారు. కాలేజీలో జూనియర్స్ సీనియర్స్ అయి 'పేరేం ట్ర్యాగింగు' పర్వదినాల కోసం మనమూ ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నామా...? అదృష్టవశాత్తూ ఇప్పుడు మన వంతు రాగానే మన పిల్లలు అన్నం తిననప్పుడు మనం బెల్టు పట్టుకోబోయామా... వాళ్లెదురుగా వచ్చి పిల్లలముందు నిలబడిపోతారు. బెత్తం పట్టుకోబోయామా... అడ్డంగా వచ్చేసి కలబడిపోతారు.

థూ మన బతుకుచెడా... మన బండపడా... అప్పుడు మనం పిల్లలుగా ఉన్నప్పుడూ బితుకూ బితుకే... ఇప్పుడూ అదే బతుకే!

వాళ్లే మన పేరెంటూ... మన నాటి పేరెంట్సే... నేటి గ్రాండ్ పేరెంట్సు. మళ్లీ సదరు గ్రాండు పేరెంట్సు... గ్రాండుగా వాళ్లు చెప్పొచ్చేదేమిటంటే... ''ఏం మాకు పిల్లలు పుట్టలేదా? మేం పెంచలేదా, పెంచడం మాకు తెలియదా'' అంటూ దబాయింపు. అలా వాళ్లు తమ రెండు నాల్కల ధోరణితో మనల్ని నానా మాటలు అంటూ ఉంటే... సదరు మన పేరెంట్సుకూ, మన పిల్లల గ్రాండుపేరెంట్సుకూ ఎదురుచెప్పకూడదంటూ మనలో మనం అనేసుకునే మాటేమిటంటే... ''అయ్యో.... మీకు తెలియకపోవడమేమిటీ? అప్పుడు మీరు పెంచిందీ, గసిరిందీ, కొట్టిందీ మమ్మల్నే... ఇప్పుడు పిల్లల ఎదురుగా నిలబడిపోతూ, కలబడిపోతూ గసురుతున్నదీ, మాటలు విసురుతున్నదీ మమ్మల్నే!'' అంటూ గుసగుసగా గునుస్తూ... నేటి మన గ్రాండ్ పేరెంట్స్ గాండ్రుగాండ్రుల పట్ల మురుస్తూ ఇలా బతికేస్తున్నాం... బతికేస్తుంటాం.

జాతీయ పోషకాహార వారోత్సవాలు
సెప్టెంబరు 1- 7

అరవైల్లోనూ యవ్వనంగా!

అరవై ఏళ్లు దాటిన కొందరు సెలబ్రిటీలను, వారి ఫిట్‌నెస్ చూసి చాలా మంది 'వయసును ఆపేశారు' అని మాట్లాడుకోవడం చూస్తుంటాం. వారు తీసుకునే పోషకాహారం, వ్యాయామం, చేసే పనుల నిర్వహణ ఇంకా యవ్వనంగా ఉండేలా చేస్తుంది. అరవై ఏళ్ల వయసు పై బడిన వారు ఇక జీవితం అయిపోయిందని అనుకోకుండా తమ రోజువారీ తీసుకునే ఆహారం పట్ల సరైన శ్రద్ధ వహిస్తే ఆరోగ్యంగానూ, పనుల నిర్వహణలోనూ ఉత్సాహంగా ఉంటారు.



రోజువారీగా తీసుకోవాల్సిన...

కేలరీలు: 1500-1700
ప్రొటీన్లు: పురుషులు - రోజుకు 54 గ్రా॥
మహిళలు - రోజుకు 45గ్రా॥
నాణ్యమైన ప్రోటీన్ కోసం: ఉడికించిన గుడ్డు, పాలు, కోడి మాంసం, చేపలు, పప్పు దినుసులు
కొవ్వులు: రోజుకు 25.గ్రా
(ఆరోగ్యకరమైన కొవ్వులు - 1 టేబుల్ స్పూన్ నూనె, గింజలు, నువ్వులు)
కార్బోహైడ్రేట్లు: మొత్తం కాలరీలలో 45-65%
విటమిన్లు, ఖనిజాలు
విటమిన్-ఎ: 840-1000 మైక్రోగ్రాములు
విటమిన్- ఇ: రోజుకు 65 మి.గ్రా॥
క్యాల్షియం: రోజుకు 1200 మి.గ్రా॥
ఐరన్: రోజుకు 11-19 మి.గ్రా॥

రోజువారీ భోజన ప్రణాళిక...

బ్రేక్‌ఫాస్ట్
ఇడ్లీ (60గ్రా.) + 1 కప్పు సాంబార్ లేదా ఉప్మా (60గ్రా.) + 1 కప్పు సాంబార్ లేదా ఓట్స్ / కిచిడీ (60గ్రా.) + ఉడికించిన గుడ్డు తెల్లసొన

స్నాక్స్
ఆపిల్ / కివి / కమలపండు
కొద్దిగా నానబెట్టిన గింజలు
కొబ్బరి నీళ్లు

మధ్యాహ్న భోజనం
1 కప్పు బియ్యం / బ్రౌన్ రైస్
1 జొన్న/రాగి పుల్కా (25గ్రా॥)
1 కప్పు తోటకూర పప్పు
1 కప్పు కాకర కాయ కూర / ఇతర కూర

ఈవెనింగ్ స్నాక్స్
1 కప్పు చికెన్ సూప్ / వెజిటబుల్ సూప్ / మజ్జిగ

రాత్రి భోజనం
1 కప్పు అన్నం / బ్రౌన్ రైస్ / కిచిడీ లేదా 1 పుల్కా
1 కప్పు పాలక్ పనీర్ కూర / పలుచని పప్పు/ ఏదైనా ఒక కూర



– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

ఫుడ్ గ్రూప్స్

➡ **పండ్లు:** రోజుకు 1-2 సర్వింగ్స్ (మీడియం సైజు ఉన్న పండు)
➡ **కూరగాయలు:** రోజుకు 3-4 సర్వింగ్స్ (వంట చేసినవి లేదా ఉడికించినవి)
➡ **ధాన్యాలు:** రోజుకు 6-8 సర్వింగ్స్ (1 కప్పు = 30గ్రా) అన్నం, సజ్జలు, లేదా గోధుమ నూక
➡ **డైరీ ఉత్పత్తులు:** రోజుకు 2-3 సర్వింగ్స్ (పాలు, పెరుగు, పనీర్)

సాధారణంగా రోజూ ఈ కాంబినేషన్‌లో ఆహారం ఉండేలా చూసుకోవాలి.



ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నిఖత్ శుభారంభం

లివర్‌పూల్: తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటుతూ శుభారంభం చేసింది. మరో వైపు టోక్యో ఒలింపిక్స్ పతక విజేత లవ్లీనా బొర్గొహైన్‌కు తొలిరౌండ్‌లోనే చుక్కెదురైంది. పారిస్ ఒలింపిక్స్‌లో గాయంతో రెండో రౌండ్లోనే నిష్క్రమించిన నిఖత్ ఈ టోర్నీకి దీటుగా సిద్ధమైంది. శనివారం మహిళల 51 కేజీల విభాగం లో జరిగిన తొలి రౌండ్‌లో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన ఆమె అద్భుతమైన పంచ్ పవర్‌తో అమెరికా ప్రత్యర్థి జెన్నిఫర్ లొజానోను కంగుతినిపించింది. ఈ తెలంగాణ స్టార్ 5–0తో జెన్నిఫర్‌పై తిరుగులేని విజయంతో రెండో రౌండ్లోకి దూసుకెళ్లింది. అయితే మహిళల 75 కేజీల కేటగిరీలో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన లవ్లీనా తొలి రౌండ్లోనే 0–5తో టర్కీకి చెందిన బుస్రా ఇసిల్దార్ చేతిలో కంగుతింది. పురుషుల ఈవెంట్‌లోనూ భారత్‌కు శనివారం కలిసిరాలేదు. రెండు సార్లు ప్రపంచకప్ పతకాలు సాధించిన హితేశ్ గులియా 70 కేజీల కేటగిరీలో రెండో రౌండ్లోనే ఇంటి దారి పట్టాడు. మూడో సీడ్‌గా బరిలోకి దిగిన భారత బాక్సర్ 1–4తో బాస్ ఫిన్ రాబర్ట్ చేతిలో ఓడాడు. హితేశ్‌కు తొలిరౌండ్లో బై లభించగా.. రెండో రౌండ్లో తలపడిన భారత ఆటగాడికి డచ్ బాక్సర్ చేతిలో చుక్కెదురైంది. పురుషుల 90 ప్లస్ కేజీల తొలిరౌండ్లో నరేందర్ బెర్వాల్ 4–1తో ఐర్లాండ్ బాక్సర్ మార్టిన్ క్రిస్టోఫర్‌పై విజయం సాధించాడు.

ఫైనల్లో భారత్



'సూపర్–4' చివరి మ్యాచ్‌లో 7–0 గోల్స్ తేడాతో చైనాపై విజయం

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. 'సూపర్–4' దశ చివరి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్నా ముందంజ వేసే స్థితిలో బరిలోకి దిగిన టీమిండియా భారీ విజయం ఖాతాలో వేసుకుంది. 'సూపర్–4' ఆఖరి పోరులో శనివారం భారత్ 7–0 గోల్స్ తేడాతో చైనాను చిత్తుచేసింది. భారత్ తరఫున అభిషేక్ (46వ, 50వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో సత్తా చాటగా... శిలానంద్ లక్రా (4వ నిమిషంలో), దిల్‌ప్రీత్ సింగ్ (7వ నిమిషంలో), మన్‌దీప్ సింగ్ (18వ నిమిషంలో), రాజ్ కుమార్ పాల్ (37వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (39వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. 'సూపర్–4' దశ ముగిసేసరికి భారత్ 7 పాయింట్లతో పట్టిక అగ్ర స్థానంలో నిలవగా... డిఫెండింగ్ చాంపియన్ కొరియా 4 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం టైటిల్ సమరం జరగనుంది. ఇందులో గెలిచిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించనుంది. మూడో స్థానం కోసం మలేసియాతో చైనా తలపడుతుంది. చైనాతో పోరులో టీమిండియా పూర్తి ఆధిపత్యం కనబర్చింది. భారత స్ట్రయికర్ల ధాటికి చైనా ప్లేయర్లు ఆత్మరక్షణలో పడిపోయారు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు ప్రత్యర్థికి ఒక్క పెనాల్టీ కార్నర్ అవకాశం కూడా ఇవ్వలేదు. మ్యాచ్ ఆరంభమైన నాలుగో నిమిషంలో శిలానంద్ గోల్‌తో ఖాతా తెరిచిన భారత్... ఇక చివరి వరకు అదే జోరు కొనసాగించింది. మరో మ్యాచ్‌లో కొరియా 4–3 గోల్స్ తేడాతో మలేసియాపై గెలిచింది.

భారత్, జపాన్ మ్యాచ్ 'డ్రా'

- 2–2 గోల్స్‌తో స్కోర్లు సమం
- ఆసియా కప్ మహిళల హాకీ టోర్నీ



హాంగ్జౌ (చైనా): ఆసియా కప్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారీ విజయంతో శుభారంభం చేసిన భారత జట్టు... డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో రెండో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. తొలి మ్యాచ్‌లో 11–0 గోల్స్ తేడాతో థాయ్‌లాండ్‌ను చిత్తుచేసిన సలీమా టెటె సారథ్యంలోని టీమిండియా... శనివారం జపాన్‌తో రెండో మ్యాచ్‌ను 2–2తో 'డ్రా'గా ముగించింది. పూల్ 'బి'లో భాగంగా జరిగిన ఈ పోరులో చివరి క్షణాల్లో నవ్‌నీత్ కౌర్ గోల్ చేసి జట్టును గట్టెక్కించింది. భారత్ తరఫున రుతుజ (30వ నిమిషంలో), నవ్‌నీత్ కౌర్ (60వ నిమిషంలో) చెరో గోల్ సాధించగా... జపాన్ తరఫున హిరోకా మురయామా (10వ నిమిషంలో), చికో ఫుజిబయాషి (58వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేసుకున్నారు. పూల్ 'బి'లో భాగంగా శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో థాయ్‌లాండ్ 2–1 గోల్స్ తేడాతో సింగపూర్‌పై విజయం సాధించింది. లీగ్ దశలో చివరి మ్యాచ్‌లో సోమవారం సింగపూర్‌తో భారత్ తలపడనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటుండగా... ఒక్కో పూల్ నుంచి ఉత్తమ ప్రదర్శన చేసిన రెండు జట్లు... సూపర్–4 దశకు అర్హత సాధించనున్నాయి. అందులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఈ నెల 14న ఫైనల్ జరుగుతుంది. అందులో గెలిచిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న మహిళల వరల్డ్‌కప్‌నకు నేరుగా అర్హత సాధించనుంది.

సినెర్ X అల్‌కరాజ్

- మరో గ్రాండ్‌స్లామ్ తుది పోరులో ఢీ
- నేడు యూఎస్ ఓపెన్ ఫైనల్
- రాత్రి 11.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

పురుషుల టెన్నిస్‌లో అసాధారణంగా సాగుతున్న ఇద్దరు స్టార్ ఆటగాళ్ల వైరం మరో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు చేరింది. వరల్డ్ నంబర్ 1 యానిక్ సినెర్, నంబర్ 2 కార్లోస్ అల్‌కరాజ్ యూఎస్ ఓపెన్‌లో తుది పోరుకు అర్హత సాధించారు. ఏకపక్షంగా సాగిన తొలి సెమీస్‌లో దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్‌ను అల్‌కరాజ్ అలవోకగా ఓడించగా... మరో సెమీస్‌లో ఆగర్ అలియసిమ్‌పై సినెర్ విజయం సాధించాడు. ఈ ఏడాది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ సినెర్, అల్‌కరాజ్‌ల మధ్యనే జరుగుతుండటం విశేషం.



సినెర్



అల్‌కరాజ్

న్యూయార్క్: క్లే కోర్టు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్‌కరాజ్ గెలుపు... గ్రాస్ కోర్టు వింబుల్డన్ ఫైనల్లో విజేత సినెర్... ఇప్పుడు హార్డ్ కోర్టులో చాంపియన్ ఎవరో నేడు తేలనుంది. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో సినెర్ (ఇటలీ), అల్‌కరాజ్ (స్పెయిన్) ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్లో అల్‌కరాజ్ 6–4, 7–6 (7/4), 6–2తో జొకోవిచ్ (సెర్బియా)పై ఘన విజయం సాధించాడు. 2 గంట 23 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో అల్‌కరాజ్ ముందు 38 ఏళ్ల జొకోవిచ్ నిలవలేకపోయాడు. 31 విన్నర్లు కొట్టిన అల్‌కరాజ్ 7 ఏస్‌లు సంధించాడు. రెండో సెమీ ఫైనల్లో సినెర్ 6–1, 3–6, 6–3, 6–4తో 25వ సీడ్ అలియసిమ్ (కెనడా)ను ఓడించాడు. 3 గంటల 21 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో అలియసిమ్ గట్టి పోటీనిస్తూ ఒక సెట్ గెలవడంలో సఫలమైనా... చివరకు సినెర్‌దే పైచేయి అయింది. సినెర్ 11 ఏస్‌లు కొట్టగా, ఆగర్ 9 ఏస్‌లు బాదాడు.

నువ్వా, నేనా...

పురుషుల టెన్నిస్‌ను 24 ఏళ్ల సినెర్, 22 ఏళ్ల అల్‌కరాజ్ శాసిస్తున్నారు. ఓపెన్ ఎరా చరిత్రలో ఒకే సీజన్‌లో మూడు గ్రాండ్‌స్లామ్‌లలో ఫైనల్‌కు చేరిన తొలి జోడీగా వీరిద్దరు గుర్తింపు పొందారు. గత తొమ్మిది గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌లో ఎనిమిదింటిని వీరిద్దరే పంచుకున్నారు. ఈ ఇద్దరు యువ ఆటగాళ్ల మధ్య 14 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో అల్‌కరాజ్ 9–5తో ముందంజలో ఉన్నాడు. యూఎస్ ఓపెన్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే 2022 క్వార్టర్ ఫైనల్లో వీరిద్దరు తలపడ్డారు. ఏకంగా రికార్డు స్థాయిలో 5 గంటల 15 నిమిషాల పాటు సాగిన పోరులో అల్‌కరాజ్ గెలిచాడు. నాటినుంచే గ్రాండ్‌స్లామ్‌లో ఇద్దరి వైరం మొదలైంది. తాజా ఫామ్‌ను చూసుకుంటే 2025లో రెండు గ్రాండ్‌స్లామ్‌లు (ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్) సినెర్ ఖాతాలో చేరగా, ఫ్రెంచ్ ఓపెన్‌ను అల్‌కరాజ్ గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అల్‌కరాజ్ క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించాడు. సినెర్ వరుసగా నాలుగు గ్రాండ్‌స్లామ్‌లోనూ ఫైనల్ చేరిన ఘనతను నమోదు చేశాడు. రాడ్ లేవర్, ఫెడరర్ (3 సార్లు), జొకోవిచ్ (3 సార్లు) తర్వాత ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా సినెర్ నిలిచాడు. ప్రస్తుత టోర్నీలో అల్‌కరాజ్ పూర్తి స్థాయిలో ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శించగా... సినెర్ సెమీస్‌లో గాయంతో కాస్త తడబడ్డాడు. అతను పూర్తి ఫిట్‌గా ఉంటే మరో అద్భుత పోరును చూడొచ్చు.

మళ్లీ వస్తా: జొకోవిచ్



25వ గ్రాండ్‌స్లామ్ సాధించేందుకు పట్టు వదలకుండా పోరాడుతున్న దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. సెమీస్‌లో అల్‌కరాజ్ ముందు 38 ఏళ్ల జొకోవిచ్ నిలవలేకపోయాడు. 2025 సీజన్‌లో నాలుగు గ్రాండ్‌స్లామ్‌లలోనూ సెమీ ఫైనల్ వరకు వచ్చిన సెర్బియా స్టార్ ఆట అక్కడే ముగిసింది. సెమీస్‌లలో వరుసగా జ్వెరెవ్, సినెర్ (2 సార్లు), అల్‌కరాజ్ చేతుల్లో అతను ఓడాడు. అయితే తాను ఇంకా ఆశలు కోల్పోలేదని, పోరాటం ఆపనని అతను స్పష్టం చేశాడు. 'గ్రాండ్‌స్లామ్‌ల వేటలో నేను ఆగిపోవడం లేదు. కనీసం మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసమైనా నా పోరాటం కొనసాగిస్తాను. ఇది కష్టమైన పని అని అందరికీ తెలుసు. సెమీస్‌లో తొలి రెండు సెట్‌ల వరకు బాగానే ఉన్నా ఆ తర్వాత నాలో సత్తువ తగ్గిపోయింది. తన కెరీర్‌లో అత్యుత్తమ దశలో ఉన్న ఒక కుర్రాడితో తలపడుతున్నప్పుడు ఈ వయసులో అంతకంటే ఎక్కువ ఆశించడం కూడా సరైంది కాదు. సినెర్, అల్‌కరాజ్ లాంటి ప్లేయర్లతో 5 సెట్‌లు ఆడటం కష్టంగా మారిపోయింది. అయితే ఈ పోటీని నేను ఇష్టపడుతున్నా. మైదానంలో అభిమానుల మద్దతు, ఆ ఉత్సాహం వల్లే నేను ఇంకా ఆడగలుగుతున్నా' అని జొకోవిచ్ చెప్పాడు.



జ్యోతి సురేఖ జోడీకి పతకం ఖాయం

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ మరోసారి మెరిసింది. దక్షిణ కొరియా వేదికగా జరుగుతున్న టోర్నీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ–రిషభ్ యాదవ్ జోడీ ఫైనల్‌కు చేరి పతకం ఖాయం చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో ఇప్పటికే 9 పతకాలు (కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో 3, కాంపౌండ్ టీమ్ విభాగంలో 4, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో 2) సాధించిన 29 ఏళ్ల జ్యోతి సురేఖ చివరిసారిగా 2021 మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అభిషేక్‌తో కలిసి రజతం నెగ్గింది. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన జ్యోతి–రిషభ్ జంట తిరుగులేని ఆధిపత్యం కనబర్చింది. శనివారం పోటీల్లో 160–152 పాయింట్ల తేడాతో జర్మనీపై జయభేరి మోగించింది. 16 షాట్‌లలో గరిష్ట 160 పాయింట్లకు గానూ భారత ద్వయం మొత్తం పాయింట్లు సాధించింది. సెమీఫైనల్లో 157–155 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీపై గెలిచింది. ఆదివారం జరగనున్న ఫైనల్లో నెదర్లాండ్స్ జోడీతో భారత జంట తలపడనుంది. కాంపౌండ్ పురుషుల టీమ్ విభాగంలో సైతం భారత బృందం ఫైనల్‌కు చేరింది. రిషభ్ యాదవ్, అమన్ సైనీ, ప్రథమేశ్‌తో కూడిన భారత జట్టు ఆస్ట్రేలియా బృందంపై షూట్ ఆఫ్‌లో విజయం సాధించింది. తొలుత 232–232తో పాయింట్లు సమం కాగా... విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన షూట్ ఆఫ్‌లో భారత జట్టు 30–28తో ముందంజ వేసింది. క్వార్టర్ ఫైనల్లో 234–233 పాయింట్లతో అమెరికాపై, సెమీఫైనల్లో 234–232 పాయింట్లతో టర్కీపై గెలిచి భారత బృందం ఫైనల్ చేరింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఘనంగా సైమా అవార్డ్స్ వేడుక



● తగ్గేదే లే అంటూ... 'పుష్ప' మేనరిజమ్‌తో దేవిశ్రీ ప్రసాద్, నవీన్, రష్మిక, అల్లు అర్జున్, సుకుమార్

ప్రతి ఏడాది నిర్వహించే 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' (సైమా) వేడుకలు ఈ ఏడాది కూడా ఘనంగా జరుగుతున్నాయి. 13వ సైమా అవార్డు వేడుకని దుబాయ్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్, ఎక్స్‌పో సిటీలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజు తెలుగు చిత్రాలకు అవార్డులు అందజేశారు నిర్వాహకులు. 'పుష్ప 2: ది రూల్' చిత్రానికిగాను ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ 'సైమా' అవార్డ్‌ని సొంతం చేసుకున్నారు. 'సైమా' నుంచి ఆయన అందుకున్న ఐదో అవార్డు ఇది. 'సన్నాఫ్ సత్యమూర్తి (2015), రుద్రమదేవి (2016), అల వైకుంఠపురములో (2021), పుష్ప (2022)' వంటి చిత్రాలకు గాను ఇప్పటికే ఆయన నాలుగుసార్లు ఉత్తమ నటుడిగా అవార్డ్స్ అందుకున్నారు. ఇక 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి ఉత్తమ నటిగా రష్మికా మందన్నా, ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, ఉత్తమ సంగీతదర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా శంకర్‌బాబు అవార్డులు అందుకున్నారు. 'కల్కి 2898 ఏడి' చిత్రానికి గాను ఉత్తమ చిత్రం అవార్డును నిర్మాత సి. అశ్వనీదత్, ఉత్తమ ప్రతినాయకుడి అవార్డును కమల్‌హాసన్, ఉత్తమ సహాయ నటి అవార్డును అన్నా బెన్‌లకు ప్రదానం చేశారు. ఇదే చిత్రానికి ఉత్తమ సహాయనటుడి అవార్డుకు అమితాబ్ బచ్చన్ ఎంపికయ్యారు. హీరో ఎన్టీఆర్ 'దేవర' చిత్రానికిగాను సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, రచయిత రామజోగయ్య శాస్త్రి, గాయని శిల్పారావు అవార్డు సొంతం చేసుకున్నారు. ఉత్తమ నటుడు (క్రిటిక్స్) తేజ సజ్జా, ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) ప్రశాంత్ వర్మ, ఉత్తమ నటి (క్రిటిక్స్) మీనాక్షీ చౌదరి... ఇంకా పలు విభాగాల్లో పలువురు తారలు అవార్డులు అందుకున్నారు.

'పుష్ప 3' ఉంటుంది: ఇదే వేదికపై 'పుష్ప 3' ఉంటుందా? అని సుకుమార్‌ని యాంకర్ అడగ్గా... అల్లు అర్జున్ వైపు చూశారాయన. ఆ తర్వాత 'ఉంటుంది' అని స్పష్టం చేశారు సుకుమార్.

కామెడీ షురూ



● నాగచైతన్య, 'అల్లరి' నరేశ్

హీరో 'అల్లరి' నరేశ్ నటిస్తున్న 65వ సినిమా షురూ అయింది. చంద్రమోహన్ దర్శకత్వం వహిస్తున్న 'నరేశ్ 65' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో 'వెన్నెల' కిశోర్, నరేశ్ వీకే, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ కీలక పాత్రలు చేస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్–హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేశ్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ బాబీ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టారు. దర్శకుడు వీఐ ఆనంద్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకులు వశిష్ఠ, రామ్ అబ్బరాజు, విజయ్ కనకమేడల స్క్రిప్ట్‌ను నిర్మాతలకు అందజేశారు. ''యునిక్ కాన్సెప్ట్స్‌తో ఆకట్టుకున్న కామెడీ కింగ్ నరేశ్ తన కొత్త చిత్రం 'నరేశ్ 65'తో తిరిగి కామెడీ జానర్‌లోకి వచ్చారు. ఈ సినిమాలో ఆయన సరికొత్త పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం ఫ్యాంటసీ, కామెడీ బ్లెండ్‌తో సరికొత్తగా ఉంటుంది. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: రాంరెడ్డి.

రాముడిగా..?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు వెండితెరపై రాముడిగా కనిపించనున్నారట. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ ఫారెస్ట్ యాక్షన్ అడ్వెంచరస్ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం కెన్యా దేశంలోని నైరోబీలో జరుగుతోంది. ఇటీవల మొదలైన ఈ లాంగ్ షూటింగ్ షెడ్యూల్ నెల రోజులకు పైనే ఉంటుందట. అయితే చిన్న గ్యాప్ రావడంతో ప్రస్తుతం మహేశ్‌బాబు హైదరాబాద్ చేరుకున్నారని, త్వరలోనే మళ్లీ నైరోబీకి వెళ్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా రామాయణం ఇతిహాసం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని, ఈ చిత్రానికి 'జెన్ 63' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా కథనం విభిన్న కాల మానాల్లో జరుగుతుందని, ఇందులో భాగంగా కొన్ని సన్నివేశాల్లో రాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇక ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 120కి పైగా దేశాల్లో ఈ చిత్రం 2027లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది.

మిరాయ్ కథకు ఆ స్కోప్ ఉంది

– దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని



తేజ సజ్జా హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, మంచు మనోజ్, శ్రియ, జగపతిబాబు, జయరామ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ– ''ఏడేళ్ల క్రితమే 'మిరాయ్' ఐడియా పుట్టింది. ఈ సినిమా పూర్తిగా కల్పితం. అశోకుని దగ్గర తొమ్మిది దైవ గ్రంథాలు ఉన్నాయనే మిత్ ఉంది. ఈ తొమ్మిది గ్రంథాల కోసం దుష్టులు ప్రయత్నించగా, వీటిని మన ఇతిహాసాల ఆధారంగా ఎలా కాపాడవచ్చు? అన్నదే 'మిరాయ్' సినిమా కథ. ఈ చిత్రంలో తల్లి–కొడుకుల బలమైన ఎమోషన్ కూడా ఉంది. తల్లి–కొడుకులుగా శ్రియ– తేజ నటించారు. ఆధ్యాత్మిక భావనలు గల అంబిక (శ్రియ పాత్ర పేరు) తన ఆశయం నెరవేరడానికి తన కొడుకుకి ఎలా మార్గనిర్దేశకత్వం చేసింది? అన్నది సినిమాలో చూడాలి. తేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో ప్రత్యేకమైన శిక్షణ తీసుకున్నాడు. మనోజ్ రోల్ కథలో చాలా బలంగా ఉంటుంది. హీరోని గైడ్ చేసే అగస్త్య మునిగా జయరామ్, తాంత్రిక గురువుగా జగపతిబాబు నటించారు. జటాయు బ్రదర్ సంపాతి పాత్రని స్ఫూర్తిగా తీసుకొని ఒక సీక్వెన్స్ చేశాం. ట్రైలర్‌లో కనిపించే పక్షి సీక్వెన్స్ ఇది. ఈ పాత్రలు సినిమాలో చాలా కీలకంగా ఉంటాయి. రియల్ లొకేషన్స్‌లో ఈ సినిమాను చిత్రీకరించాం. శ్రీలంక, నేపాల్, రాజస్తాన్, బుర్జు, థాయ్‌ల్యాండ్... మొత్తం ఆసియా అంతా తిరిగేశాం. ఈ చిత్రంలో ఐదారు యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. శ్రీలంకలో తేజపై ట్రెన్ నేపథ్యంలో వచ్చే ఓ యాక్షన్ సీక్వెన్స్ ఓ హైలైట్. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, ఆ సమస్యకు పరిష్కారం మన ఇతిహాసాల్లోనో, పురాణాల్లోనో ఉందనే నమ్మకంతో ఈ సినిమా కథ చేశాను. చిన్నప్పుడు మన అమ్మమ్మలు, నానమ్మలు చెప్పిన ఇతిహాస కథలు, పాత్రలన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి. అయితే ఈ అంశాలన్నింటినీ కథలో ఆసక్తికరంగా బ్లెండ్ చేయడం అనేది నాకు సవాల్‌గా అనిపించింది. ఈ సినిమా బడ్జెట్ కాస్త ఎక్కువగానే అయింది. అయినా విశ్వ ప్రసాద్‌గారు చాలా సపోర్ట్ చేశారు. వీఎఫ్ఎక్స్ పనులను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారే లోకల్‌గా చేస్తున్నారు. సినిమాలో వీఎఫ్ఎక్స్ బాగుండాలంటే ఒకటి మన దగ్గర డబ్బులు ఉండాలి లేదా మన దగ్గర టైమ్ ఉండాలి. మాకు టైమ్ ఉంది. వీఎఫ్ఎక్స్ వర్క్ బాగా వచ్చింది. హరి గౌర సినిమాను ఎలివేట్ చేసే మంచి మ్యూజిక్ ఇచ్చాడు. ఓ ఫ్రాంచైజీ బిల్డ్ చేసే స్కోప్ ఉన్న కథ 'మిరాయ్'. ఈ సినిమా విజయంపై అది ఆధారపడి ఉంటుంది. ఇక దర్శకుడిగా, సినిమాటోగ్రాఫర్‌గా, ఎడిటర్‌గా చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఏదన్నా ఐడియా ఉన్నప్పుడు వేరేవాళ్లకు కథలు కూడా ఇస్తున్నాను'' అని అన్నారు.

ఓటీటీ చేతుల్లోకి సినిమా వెళ్లిపోయినట్లుంది

– నిర్మాత సాహు గారపాటి



బెల్లంకొండ సాయిశ్రీనివాస్ నటించిన హారర్ మిస్టరీ మూవీ 'కిష్కింధపురి'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించారు. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సాహు గారపాటి మాట్లాడుతూ– ''హారర్ నేపథ్యంలో చాలా సినిమాలొచ్చాయి. అయితే మా 'కిష్కింధపురి' చిత్రం మాత్రం వినూత్నంగా, విభిన్నంగా ఉంటుంది. ఒక రేడియో నుంచి వచ్చే వాయిస్, దాని చుట్టూ ఉండే హారర్ ఎలిమెంట్స్, రేడియోతో దెయ్యానికి ఉన్న కనెక్షన్ ఇవన్నీ మా సినిమాలో కొత్తగా ఉంటాయి. ఇలాంటి హారర్ థ్రిల్లర్ ఇప్పటివరకు రాలేదు. కొన్ని షాకింగ్, సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ కూడా సినిమాలో ఉన్నాయి. బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌గారి ప్రెజెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలోని పాత్రకు ఆయన పూర్తి న్యాయం చేశారు. ఇక ఈ సినిమా కథ అనుకున్నప్పుడే అనుపమను హీరోయిన్‌గా అనుకున్నాం. అనుపమ మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ చిత్రం కోసం నెల రోజులు కష్టపడి, దాదాపు రూ. 2 కోట్లతో ఓ రేడియో స్టేషన్ సెట్ వేశాం. సినిమాలోని కీలక సన్నివేశాలు ఇక్కడే జరుగుతాయి. తొలి భాగం వినోదాత్మకంగా, సెకండాఫ్‌లో సీరియస్ హారర్ ఫిల్మ్‌గా టర్న్ అవుతుంది. 'కిష్కింధపురి' అనే ఊర్లో జరిగే కథ కనుక 'కిష్కింధపురి' అని టైటిల్ పెట్టడం జరిగింది. మా సినిమా థియేటర్స్‌లో ఆడియన్స్‌ను తప్పక ఎంగేజ్ చేస్తుంది. హాలీవుడ్ సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది. ఇక ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాతలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాన్–థియేట్రికల్ రైట్స్ విషయంలో ఒకప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. ఓటీటీ డీల్స్ కుదరని కారణంగా కొన్ని ప్రాజెక్ట్స్ ఆగిపోతున్నాయి. సినిమాల రిలీజ్ డేట్స్ ప్రభావితం అవుతున్నాయి. చూస్తుంటే ఓటీటీ చేతుల్లోకి సినిమా వెళ్లిపోయినట్లుంది. ఇక సినీ కార్మికుల సమ్మె ప్రభావం మా బ్యానర్‌లో (ఈ సినిమాకు సుస్మితా కొణిదెల మరో నిర్మాత) నిర్మిస్తున్న చిరంజీవిగారి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాపై పడింది. కానీ ఈ సినిమాను సంక్రాంతికే రిలీజ్ చేస్తాం. కాకపోతే అక్టోబరులో షూటింగ్ పూర్తి చేయాలనుకున్నాం. కానీ నవంబరు కల్లా పూర్తి చేస్తాం. ఓ పదిహేను రోజులు తేడా అంతే'' అని అన్నారు.

సస్పెన్స్ విద్రోహి



● రవి ప్రకాశ్, చరిష్మా

''విద్రోహి' మూవీ ఫస్ట్ లుక్ బాగుంది. ఈ స్క్రిప్ట్ గురించి విన్నాను. చాలా మంచి కథ. ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందనుకుంటున్నాను. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా చేసిన రవి ప్రకాశ్ మంచి ఆర్టిస్ట్. ఈ చిత్రం సక్సెస్ అయి, టీమ్‌కి మంచి భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నాను'' అని డైరెక్టర్ వీవీ వినాయక్ తెలిపారు. రవి ప్రకాశ్, శివకుమార్, చరిష్మా శ్రీఖర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విద్రోహి'. వీఎస్‌వీ దర్శకత్వంలో విజ్జన వెంకట సుబ్రహ్మణ్యం నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. భీమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ఓ పాటని వీవీ వినాయక్ చేతుల మీదుగా విడుదల చేయించారు మేకర్స్. వీఎస్‌వీ మాట్లాడుతూ– ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'విద్రోహి'. సరికొత్త పాయింట్‌తో రూపొందించాం'' అన్నారు.

పైసాలోనే పరమాత్మనా?

నేటి ఆధునిక జీవితంలో డబ్బు సంపాదనకే ప్రజల అధిక ప్రాధాన్యత

- ఆదాయ ఆర్జనతోనే ఆనందాన్ని పొందొచ్చని భావిస్తున్న మెజారిటీ ప్రజలు
- మానవ సంబంధాలకంటే ఆస్తులకు విలువ ఇచ్చే వారిలో అధిక ఆందోళన ఉంటోందన్న ఓ అధ్యయనం
- సంతోషం కోసం వస్తువుల కొనుగోలు 'దీర్ఘకాలిక అసంతృప్తికి' దారితీస్తున్నట్టు తేల్చిన ఓ పరిశీలన



సాక్షి, హైదరాబాద్: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో సమయం, డబ్బు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారీగా డబ్బు సంపాదించాలంటే అధిక సమయం వెచ్చించాల్సిందే. ప్రస్తుత పరిస్థితుల్లో సమయంకన్నా డబ్బు సంపాదనే ముఖ్యమనే భావన మెజారిటీ ప్రజల్లో దాదాపుగా స్థిరపడింది. డబ్బుతో ఏదైనా సాధించవచ్చనే అభిప్రాయం బలపడింది. అయితే తక్కువ సంపాదనతో ముడిపడిన వాటికి తక్కువ సమయాన్ని వెచ్చించడమే తెలివైన పని అని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉదాహరణకు ఇంటి పనుల కోసం వ్యక్తిని నియమించుకోవడం లేదా కిరాణా సామాను హోం డెలివరీ ద్వారా తెప్పించుకోవడం వంటి సమయాన్ని ఆదా చేసే సేవలకు డబ్బు ఖర్చు చేయడం వల్ల ఆనందం, జీవన సంతృప్తి పెరుగుతుందని వివిధ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. డబ్బు ఖర్చు చేయడం, ఇతర రూపాల్లో సమయం కొనుగోలు వంటి వాటి వల్ల ఒత్తిడి భావం, 'సమయ లేమి' వంటి ప్రతికూల ప్రభావాలు తగ్గుతాయని భావిస్తున్నారు. ఇది వ్యక్తులుగా తాము ఆనందించే పనులను చేయడానికి ఎక్కువ స్వేచ్ఛకు వీలు కల్పిస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. ఇది శ్రామిక తరగతుల నుంచి లక్షాధికారుల వరకు వివిధ ఆదాయ స్థాయిలకు వర్తిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డబ్బు, సమయం వంటివి ఆనందాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై కొందరు పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం 'నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్ రీసెర్చ్'లో ప్రచురితమైంది. 'డబ్బును సరైన పద్ధతుల్లో ఖర్చు చేస్తే ఆనందాన్ని కొనుగోలు చేయవచ్చు' అని ఓ అధ్యయనంలో బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయ మనస్తత్వశాస్త్ర ప్రొఫెసర్ ఎలిజబెత్ డన్ అభిప్రాయపడ్డారు. ధనవంతులు లేదా పేదలనే తేడా లేకుండా సమయం ఆదా చేయడానికి డబ్బు ఖర్చు చేయడం వల్ల ప్రజలు సంతోషంగా ఉంటారని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ పరిశోధకులు ఆష్లే విల్లన్స్ పేర్కొన్నారు. వారు సేకరించిన డేటా ప్రకారం చూస్తే తక్కువ డబ్బు ఉన్న వ్యక్తులు ఎక్కువ డబ్బు ఉన్నవారి కంటే సమయం ఆదా చేసే వివిధ కొనుగోళ్ల ద్వారా ఎక్కువ ఆనందాన్ని పొందగలిగినట్టు స్పష్టమైందన్నారు.

సమయాన్ని సద్వినియోగ పరుచుకోవాలి...

ఒకరి ఆనందం పెరుగుదల అనేది స్వయంచాలకంగా జరగదు. ఖాళీగా ఉన్న సమయాన్ని ఉద్దేశపూర్వకంగా, ఆనందదాయకంగా గడపడానికి ఒక సానుకూల నిర్ణయం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకరు సంపాదించే విలువైన సమయాన్ని స్నేహితులు, కుటుంబ సభ్యులతో కనెక్ట్ అవ్వడం, పుస్తకాలు చదవడం, ఏదైనా కొత్తభాష నేర్చుకోవడం, సంగీతం, నాట్యం, కళలను అభ్యసించడం వంటి కొత్త అభిరుచులను అలవరుచుకోవడం, వ్యక్తిగత లక్ష్యాల కోసం పనిచేయడం వంటి వాటిని సంతృప్తిపరిచే కార్యకలాపాలకు ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలతోపాటు సంపన్న దేశాల్లోనూ చాలా మంది ప్రజలు 'సమయం సరిపోవడం' అనే అనుభూతికి గురవుతున్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నట్టు స్పష్టమైంది. అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ రివ్యూలో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం పరస్పర సంబంధాలపై కంటే కూడా వ్యక్తిగత వృద్ధి, భౌతిక ఆస్తులకు విలువ ఇచ్చే వ్యక్తులు ఎక్కువ ఆందోళనకు గురికావడంతోపాటు తక్కువ స్థాయిలో జీవిత సంతృప్తిని పొందుతున్నట్టు వెల్లడైంది. జర్నల్ ఆఫ్ కన్జ్యూమర్ రీసెర్చ్‌లో ప్రచురితమైన మరో పరిశీలనలో సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో వస్తువులను కొనుగోలు చేయడం వాస్తవానికి 'దీర్ఘకాలిక అసంతృప్తికి' దారితీస్తున్నట్టు స్పష్టమైంది. జర్నల్ ఆఫ్ ఎకనామిక్ సైకాలజీలో ప్రచురితమైన మరో అధ్యయనంలో 'రిటైల్ థెరపీ' అనేది విచారం, తక్కువ జీవిత సంతృప్తితో ముడిపడి ఉన్నట్టు తేలింది.

డబ్బులేని జీవితాన్ని ఊహించలేము...

ఇప్పుడున్న పరిస్థితుల్లో డబ్బు సంపాదన జీవితంలో ముఖ్య భాగమైంది. డబ్బు లేకుండా జీవితాన్నే ఊహించలేము. డబ్బు కోసం పనిచేయాల్సిందే. అప్పుడే మన జీవితం అనుకున్న పద్ధతుల్లో నడవడానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు వయసు అనేది డబ్బుతో సమానం. అది గతిస్తే రాదు కాబట్టి మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో వ్యవహరించాల్సిందే. అందువల్ల జీవితం, డబ్బు సంపాదనను సమాంతరంగా నడిపించాల్సిన అవసరముంది.

- సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్, యూ అండ్ మీ కౌన్సెలింగ్ సెంటర్

'సమ్మక్క సాగర్' చిక్కులు వీడేనా?

- ప్రాజెక్టుకు అనుమతుల పునఃపరిశీలనకు 22న ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశం
- ఎస్సారెస్పీ-2, కాళేశ్వరం, సమ్మక్క ప్రాజెక్టుల కింద ఒకే ఆయకట్టు స్థిరీకరణను ప్రతిపాదించిన గత సర్కారు
- దీనిపై గతంలో అభ్యంతరం తెలిపిన సీడబ్ల్యూసీ.. 2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు ప్రతిపాదించాలని సూచన
- ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చుకోవాలని మెలిక.. ముంపు లెక్కల్లో తేడాతో కుదరదన్న పొరుగు రాష్ట్రం

సాక్షి, హైదరాబాద్: సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టు చిక్కుల్లో పడింది. ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నిరభ్యంతర పత్రం ఇచ్చేందుకు నిరాకరించగా ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన ఆయకట్టుకు బదులుగా మరోచోట కొత్తగా 2 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) రాష్ట్రాన్ని కోరింది. వాస్తవానికి శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టు రెండో దశ కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును సమ్మక్క-సాగర్ ప్రాజెక్టు కింద స్థిరీకరిస్తామని గత ప్రభుత్వం డీపీఆర్‌లో ప్రతిపాదించింది. అలాగే ఇదే 4.40 లక్షల ఎకరాల ఆయకట్టునే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద సైతం స్థిరీకరిస్తామని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు సమ్మక్క సాగర్ ప్రాజెక్టు డీపీఆర్ మదింపు సందర్భంగా కేంద్ర జల సంఘం గుర్తించి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒకే ఆయకట్టును ఎస్సారెస్పీ-2, కాళేశ్వరం, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుల కింద ఎలా ప్రతిపాదిస్తారంటూ కేంద్ర జలసంఘం రాష్ట్ర నీటిపారుదల శాఖ నుంచి వివరణ కోరింది. దీంతో సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ అంశాలను పునఃపరిశీలించడానికి ఈ నెల 22న ఢిల్లీలో సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్ర జలసంఘం రాష్ట్ర నీటిపారుదల శాఖకు తెలియజేసింది. రూ. 9,257 కోట్లతో చేపట్టిన సమ్మక్కసాగర్ ప్రాజెక్టు (తుపాకులగూడెం బరాజ్) పనులు 95 శాతం పూర్తయ్యాయి. ప్రాజెక్టు ప్రయోజనాలు వ్యయాల (బెనిఫిట్ కాస్ట్ రేషియో) మధ్య నిష్పత్తిని 1.67:1గా అంటే.. ప్రాజెక్టుపై రూపాయి వెచ్చిస్తే రూ. 1.67 రాబడి వస్తుందని డీపీఆర్‌లో అంచనా వేశారు. మెరుగైన వ్యయ నిష్పత్తిని చూపేందుకే ఎస్సారెస్పీ రెండోదశ ఆయకట్టు స్థిరీకరణను సైతం సమ్మక్క ప్రాజెక్టు ఖాతాలో ప్రభుత్వం వేయగా కేంద్ర జల సంఘం పరిశీలనలో దొరికిపోయింది. సమ్మక్క బరాజ్ బ్యాక్ వాటర్ నుంచి ఎత్తిపోసిన నీటిని ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించాలంటే కొత్తగా 2 లక్షల ఎకరాల ప్రత్యేక ఆయకట్టును ప్రతిపాదించడంతోపాటు ఛత్తీస్‌గఢ్ నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చుకోవాలని కేంద్ర జలసంఘం స్పష్టం చేసింది.

ముంపు ముప్పుపై ఐఐటీ-ఖరగ్‌పూర్ ద్వారా సర్వే..

ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలను పరిష్కరించి ఆ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం తెచ్చి సమర్పించాలని సీడబ్ల్యూసీ తెలంగాణ ప్రభుత్వానికి పలుమార్లు సూచించింది. ఈ నేపథ్యంలో 2023 సెప్టెంబర్ 6-9 మధ్య సమ్మక్క బరాజ్‌ను ఛత్తీస్‌గఢ్ అధికారులు పరిశీలించారు. సర్వే ద్వారా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి భూసేకరణ ప్రక్రియను వేగిరం చేయాలని ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు రాష్ట్ర అధికారులు విజ్ఞప్తి చేశారు. బరాజ్ వల్ల కలిగే ముప్పుపై ఐఐటీ ఖరగ్‌పూర్‌తో రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయించగా బరాజ్ వద్ద 87 మీటర్ల గరిష్ట వరద సంభవిస్తే బీజాపూర్ జిల్లాలోని పోటూరు, కొటూరు, తుగ్గగూడ, గంగారం, కంబాలపేట, సీతానగరంలో 100 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తేలింది. తక్కువ ముంపు ఉండనుందని తేలడంతో ఛత్తీస్‌గఢ్ నిరభ్యంతర పత్రం ఇచ్చే అవకాశాలు మెరుగయ్యాయి.



ఛత్తీస్‌గఢ్ ససేమిరా అనడంతో...

ములుగు జిల్లాలో గోదావరిపై తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్క సాగర్ బరాజ్‌లో పూర్తిస్థాయి నిల్వ మట్టం 83 మీటర్ల మేర నీటిని నిల్వ చేస్తే ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌కు పలుమార్లు తెలిపింది. అయితే 2022 జూలై 17, 19వ తేదీల్లో వచ్చిన 88 మీటర్ల గరిష్ట వరదను ప్రామాణికంగా తీసుకొని ఆ మేరకు వరద వస్తే ముంపునకు గురికానున్న భూములన్నింటికీ పరిహారం చెల్లించాలని ఛత్తీస్‌గఢ్ డిమాండ్ చేస్తోంది. 2021 సెప్టెంబర్‌లో సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి డీపీఆర్ దాఖలు చేసింది. దీంతో దీనిపై అభ్యంతరాలు/అభిప్రాయాలు తెలియజేయాలని కోరుతూ సీడబ్ల్యూసీ ఆ డీపీఆర్‌ను ఛత్తీస్‌గఢ్ పరిశీలనకు పంపింది. ఫలితంగాసీడబ్ల్యూసీలోని అన్ని డైరెక్టరేట్లు అనుమతులిచ్చినా ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలతో డీపీఆర్ ముందుకు కదల్లేదు.

జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయం పురోగతి

- ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, టిల్లర్లపై భారీగా తగ్గనున్న ధరలు
- విత్తనాలు, ఫెర్టిలైజర్ డ్రిల్ టిన్‌లు కూడా..
- పాల ఉత్పత్తిదారులకు, వినియోగదారులకూ మేలే..



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జనరల్ సర్వీస్ గూడ్స్ (జీఎస్టీ) శ్లాబులను ఈనెల 22వ తేదీ నుంచి తగ్గించనున్న నేపథ్యంలో వ్యవసాయరంగం పురోగతికి మార్గం సుగమం అవుతోంది. వ్యవసాయ పరికరాల ధరలు భారీగా తగ్గడం రైతులకు మేలు చేకూర్చేది అయితే.. అదే సమయంలో పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపు శ్వేతవిప్లవానికి మరింత ఊతం ఇస్తుందని భావిస్తున్నారు. వ్యవసాయానికి వినియోగించే పలు పరికరాలపై జీఎస్టీ తగ్గింపు అనుకూలంగా ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వివిధ రకాల పరికరాల వినియోగంలో రూ. 5 వేల నుంచి దాదాపు రూ. 1.90 లక్షలు రైతులకు ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పరికరాల తగ్గింపు ఒకటైతే.. రైతులు విక్రయించే పాలతో చేసే ఉత్పత్తులపై కూడా జీఎస్టీ తగ్గింపు వల్ల వీటి వినియోగం పెరగడం, దీని వల్ల ఉత్పత్తులు పెరిగి రైతులకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంటున్నారు. దాదాపు 10 కోట్ల మంది పాల ఉత్పత్తిదారులకు జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది, పాలు, పన్నీర్‌పై జీఎస్టీని పూర్తిగా తొలగించడంతో పాల ఉత్పత్తిదారులతోపాటు, వినియోగదారులకు కూడా మేలు జరుగనుంది. సహకార సంఘాలు, ఆహారాలను శుద్ధిచేసే పరిశ్రమలు తయారుచేసే చీజ్, పాస్తా, నమ్కీన్, జామ్స్, జెల్లీ, ఫ్రూట్ పల్ప్, ఆహార పానీయాలపై కొత్త జీఎస్టీ విధానంలో ఐదు శాతానికి తగ్గించనున్నారు. ఈ ధరను తగ్గించడం వల్ల కుటుంబంపై నెలసరి భారం కొంతమేరకు తగ్గుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. 1,800 సీసీ ఉండే ట్రాక్టర్లు, అలాగే రైతులు వినియోగించే అమ్మోనియా, సల్ఫ్యూరిక్ యాసిడ్, నైట్రిక్ యాసిడ్‌లపై కూడా జీఎస్టీ తగ్గిస్తున్నట్లు అధికారవర్గాలు వివరించాయి. బయో పెస్టిసైడ్స్, మైక్రో న్యూట్రియంట్స్‌పై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్టీ శ్లాబును ఐదు శాతానికి తగ్గించడం వల్ల రైతులపై భారం కూడా తగ్గుతుందని చెబుతున్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి ఆలంబనగా ఉంటుందని అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగానికి ఈ తగ్గింపు కారణంగా ప్రయోజనం చేకూరనుంది. డెయిరీ రంగంలో రైతులు, మహిళా సంఘాలకు లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. రైతులు వినియోగించే కొన్ని పరికరాల ధరలు ప్రస్తుతం జీఎస్టీ తగ్గింపు వల్ల ఏ మేరకు తగ్గుతాయో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ధరలు తగ్గేవాటిలో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి.

జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పరికరాలపై వస్తున్న ఆదా వివరాలిలా..

పరికరం పేరు	ప్రాథమిక ధర	ప్రస్తుత జీఎస్టీ 12%	సవరించే జీఎస్టీ 5%	ఆదామొత్తం
35 హెచ్‌పీ ట్రాక్టర్	5,80,000	69,600	29,000	40,600
45 హెచ్‌పీ "	6,43,000	77,160	32,150	45,010
75 హెచ్‌పీ "	8,93,000	1,07,100	44,650	62,450
పవర్ టిల్లర్ 13హెచ్‌పీ	1,69,643	20,357	8,482	11,875
హార్వెస్టర్ కంబైన్	26,78,571	3,21,428	1,33,928	1,87,500
బాలేర్ స్క్వేర్	13,39,286	1,60,714	66,964	93,750

సినీ గీత రచయిత పూవై సెంగుట్టువన్ కన్నుమూత



సెంగుట్టువన్ (ఫైల్)

తమిళసినిమా: ప్రముఖ సినీ గీత రచయిత పూవై సెంగుట్టువన్ (90) శుక్రవారం చెన్నైలో వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. తమిళ సాహిత్యం, సినీ గేయ రచయితగా ఈ రంగాల్లో విశేష సేవలు అందించారు. ప్రఖ్యాత గీత రచయిత కన్నదాసన్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న ఈయన వేలాది చిత్ర గీతాలను రాసి పాపులర్ అయ్యారు. సినీ గీతాలతో పాటూ చిత్ర కథ, కథనాలు, సంభాషణలు రాయడంతో పాటు ప్రైవేట్ పాటలు, స్టేజి నాటకాలు,, రేడియో కార్యక్రమాలు, టీవీ సీరియల్‌కు పూవై సెంగుట్టువన్ పాటలు, కథలు, సంభాషణ అందించారు. అబ్దుల్ కలాం ప్రశంసలను అందుకున్న ఈయన కలైమామణి, కలైత్తురై విత్తకర్, కన్నదాసన్, మహాకవి భారతీయార్ అవార్డులను అందుకున్నారు. కాగా వీరికి పూవై దయానిధి, ఎస్.రవిచంద్రన్ కుమారులు, విజయలక్ష్మి, కలైసెల్వి కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. స్థానిక పెరంబుర్‌లోని స్వగృహంలో పువై సెంగుట్టువన్ భౌతిక కాయాన్ని బంధువులు, అభిమానుల సందదర్శనార్థం ఉంచారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

గౌడ్లకు 25 శాతం వైన్స్ దుకాణాలు

గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: వైన్స్ దుకాణాల్లో 25 శాతం గౌడ్లకు కేటాయించాలని, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను శనివారం గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దుర్గయ్య గౌడ్, కల్లు దుకాణాల రక్షణ కమిటీ నేత సురేశ్ గౌడ్ కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. సమావేశంలో బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నాగేశ్వర్ గౌడ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కేశమోని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ మదర్.. ఎంతో ప్రెజర్!

ఇంటా, బయటా నలిగిపోతున్న మహిళలు.. ఇల్లు, పిల్లలు ఉద్యోగంతో తీవ్రమైన ఒత్తిడి

'మగాళ్లు అర్థం చేసుకుంటే అదే పదివేలు'.. గుర్తింపు, గౌరవం ఇస్తే చాలంటున్న అతివలు

ఏ ఉద్యోగికైనా నిర్దిష్టమైన పనిగంటలు ఉంటాయి. అలాంటి వెసులుబాటు లేని అలుపెరుగని సేవ అమ్మది! ఆమె ఉద్యోగి కూడా అయితే.. ఆకష్టం మామూలుది కాదు! ఇల్లు, పిల్లలు, కెరీర్.. వీటన్నింటితో వర్కింగ్ మదర్స్ నలిగిపోతుంటారు. మరి, అలాంటి మహిళలకు పరిష్కారం ఏమిటి? కుటుంబం.. ముఖ్యంగా భర్తలు లేదా ఇంట్లోని మగవాళ్లు వాళ్లకు చేదోడుగా ఎలా ఉండొచ్చు? - సాక్షి, ఫీచర్స్ డెస్క్

ఎన్నో ఆశలు.. ఆశయాలతో చదువులు చదివి, ఉద్యోగాలు చేసే అతివలు కొందరు. తమకు నచ్చిన లేదా ప్రావీణ్యం ఉన్న పనిని చేయాలన్న లక్ష్యంతో కెరీర్ ఎంచుకునే మహిళామణులు మరికొందరు. రోజురోజుకీ ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో.. వేణ్నీళ్లకు చన్నీళ్లలా ఇంటి బండి నడవడానికి సాయపడదామని ఏదో ఒక పనిచేసే పడతులు ఇంకొందరు. వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, బ్యాంకు ఉద్యోగులు, టీచర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు.. ఇలా విభిన్న రంగాల్లో ఇంటా బయటా రెండు అవతారాలు ఎత్తి పనిచేసే మహిళలు ఎందరో.

ఒక భానుతేజ...



'మెటర్నిటీ లీవ్ తర్వాత పాలు తాగే పాపను ఇంట్లో వదిలి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆఫీస్‌కి వెళ్తుంటే అనుభవించిన బాధ ఎవరికీ అర్థంకాదు. లిఫ్ట్‌దాకా పాపను ఎత్తుకుని లిఫ్ట్ లోకి ఎక్కుతున్నప్పుడు పాపను అత్తయ్య తీసుకుంటుంటే అది నా చున్నీ పట్టుకుని వెళ్లకుండా మొండికేస్తుంటే ఏడుపొచ్చేది. బలవంతంగా పాపను అత్తయ్య చేతిలో పెట్టి వచ్చేసేదాన్ని' అంటూ గుర్తుచేసుకుంది భానుతేజ. ఆమె ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఇప్పుడు ఆమె కూతురికి మూడేళ్లు. ఆ పాపను డే కేర్ సెంటర్‌లో చేర్పించింది. అయినా భానుతేజ బాధ, భయం పోలేదు. ఉదయం తొమ్మిదింటికి తాను ఆఫీస్‌కి వెళ్లేప్పుడు పాపను డే కేర్‌లో దింపితే.. సాయంత్రం ఏడింటికి తాను ఇంటికి వస్తూ పాపను తీసుకెళ్తుంది. పాపకు కావల్సిన పాలు, భోజనం, స్నాక్స్, డైపర్స్ అన్నీ ఇస్తుంది. అయినా ఏదో తెలియని ఆందోళన. ఆఫీసులో ఉన్నా పాప గురించే ఆలోచన!



శత సహస్రావధానం

అమ్మాయిల చదువు, ఉద్యోగాల విషయంలో ఇంటి నుంచి ఎంత ప్రోత్సాహం దొరుకుతున్నా.. పిల్లలు పుట్టగానే 'పిల్లలా.. కెరీరా?' అనే డైలమా. రెండిట్లో ఏదో ఒకదాన్నే ఎంచుకోవాల్సిన పరిస్థితి. మొండిగా రెండిటినీ ఎంచుకుంటే.. ఇంటా బయటా చాలా సందర్భాల్లో మద్దతు లేమి లాంటి ఒత్తిళ్లు! 'కానీ, మగవాళ్ల విషయంలో అలా కాదు. భార్య ఉద్యోగం ఎంత గొప్పదైనా.. ఆమె తనకన్నా రెట్టింపు జీతం తీసుకుంటున్నా సరే.. పిల్లల కోసం కొలువుకి సంబంధించి నో కాంప్రమైజ్. వర్కింగ్ మదర్‌కి మాత్రం సర్దుబాట్లు తప్పవు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మహిళలు. ఇలా ఇల్లు, పిల్లలు, ఉద్యోగం మధ్య సమన్వయ మనే అష్టావధానం.. కాదు కాదు, శత సహస్రావధానం, ఒక్క భానుతేజదే కాదు.. కడుపులో చల్ల కదలకుండా చేసుకునే టీచర్ ఉద్యోగం నుంచి 24/7 ఆన్‌టాస్క్ ఉండే ఆంత్రొ ప్రెన్యూర్ వరకు వర్కింగ్ మదర్స్ అందరిదీ!



ఇదివరకటిలా పిల్లల కోసం ఇప్పుడు బయ లాజికల్ క్లాక్‌ను ఫాలో కావాల్సిన అవసరం లేదు. ఎగ్ ఫ్రీజింగ్, ఆంబ్రియో ఫ్రీజింగ్, సరోగసీ లాంటి.. సౌకర్యాలు ఎన్నో ఉన్నాయి. ఆ సహాయంతో

పోనీ పిల్లల్ని వాయిదా వేసుకుంటే..

కెరీర్‌లోనే కాదు.. ఆర్థికంగానే స్థిరపడ్డాకే పిల్లల్ని కనే వెసులుబాటు ఉంది. కానీ ఆ ప్రక్రియల్లో సక్సెస్ రేట్ లెక్కేసుకోవాలి. అంతవరకు, జీవనశైలి జబ్బులు రాకుండా జాగ్రత్త పడాలి. 'ఆ తలనొప్పి కంటే.. వయసులో పిల్లలను కనడమే బెటర్' అంటున్నారు చాలామంది వర్కింగ్ ఉమన్.

మరి పరిష్కారం?

వర్కింగ్ మదర్స్‌కి ఇటు ఉద్యోగం.. అటు పిల్లల పెంపకం మధ్య నలగకుండా.. అపరాధ భావానికి గురవకుండా రెండిటినీ వీలయినంత వరకు సమన్వ యం చేసుకోగల సహకారం కావాలి.

- నెలల వయసు నుంచి స్కూల్ ఈడు వచ్చేవరకు పిల్లల సంరక్షణ కోసం అన్ని సంస్థలు క్రెషెస్, డే కేర్ సెంటర్స్‌ను ఏర్పాటు చేయాలి. దీనివల్ల వర్కింగ్ మదర్స్‌కు మానసిక ప్రశాంతత, రిలీఫ్ ఉండటమే కాక పిల్లల కోసం సెలవులు, ముందస్తు అనుమ తులు లాంటి పనివేళల వృథా తగ్గుతుంది అంటున్నారు భిన్నరంగాల్లోని వర్కింగ్ మదర్స్.
- చాలా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఇలాంటి కన్వీనియెన్స్ ఉన్నప్పటికీ ప్రభుత్వ సంస్థలు సహా మిగిలిన అన్ని రంగాల్లోనూ ఏర్పాటైతే బాగుంటుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

'మగాళ్లూ.. కాస్త ఆలోచించండి'



'ఉద్యోగం పురుష లక్షణమే. కానీ, మారుతున్న పరిస్థితుల్లో ఉద్యోగాలు చేస్తున్న మమ్మల్ని కూడా గుర్తించండి, గౌరవించండి' అని కోరుతున్నారు మహిళలు.

- 'చిన్నచూపు చూడటం, సూటిపోటి మాటలు లేకపోతే మా పని మేం హాయిగా చేసుకుంటాం. కుటుంబంలోనూ సంతోషం వెల్లివిరుస్తుంది' అంటున్నారు.
- 'పిల్లల చదువులు, ఇంటి పనులు, తమపై ఆధారపడినవారు ఉంటే వారి కష్టసుఖాలు, సింగిల్ మదర్ అయితే అదనపు బాధ్యతలు.. ఇలా పది చేతులున్నా సరిపోనన్ని పనులు. మీరు ఇవన్నీ అర్థం చేసుకుంటే మాకు పదివేలు' అని కోరుతున్నారు.



శనివారం తిరుమల శ్రీవారిని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ దర్శించుకున్నారు

ఘనంగా వీఐటీ చెన్నై స్నాతకోత్సవం



సాక్షి, హైదరాబాద్: వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) చెన్నై 13వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ర్యాంకర్లు, పీహెచ్‌డీ స్కాలర్లకు ముఖ్య అతిథి, తమిళనాడు సమాచార సాంకేతిక, డిజిటల్ సేవల మంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ పతకాలు, డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చెన్నైలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ డిప్యూటీ హైకమిషనర్ షెల్లీ సలేహిన్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) వ్యవస్థాపక ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షత వహించారు. దాదాపు 6,581 మంది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పరిశోధకులు డిగ్రీ పట్టాలను అందుకున్నారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్స్ శ్రీ శంకర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం పాల్గొన్నారు. వీఐటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్, వీఐటీ చెన్నై ప్రొ-వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ త్యాగరాజన్. ప్రొ-వైస్ ఛాన్స్‌లర్, వీఐటీ వెల్లూరు, డాక్టర్ పార్థసారథి మల్లిక్, వీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి.జయభారతి పాల్గొన్నారు.

రూ.3.8 కోట్ల బంగారు ఆభరణాలు సీజ్



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదుతో అధికారులు

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం మీదుగా రైల్లో బంగారు అభరణాలు అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో వాల్తేర్ డివిజన్, రైల్వే భద్రతా దళం అధికారులు, సిబ్బంది, క్రైమ్ ప్రివెన్షన్ అండ్ డిటెక్షన్ స్క్వాడ్ (సీపీడీఎస్)లు సంయుక్తంగా తనిఖీలు ప్రారంభించాయి. ఈ తనిఖీల్లో రాత్రి 10 గంటలకు పాదచారుల వంతెన వద్ద ఓ అనుమానిత వ్యక్తి తచ్చాడుతున్నట్టు గుర్తించి ప్రశ్నించారు. అతని బ్యాగులను తనిఖీ చేశారు. వాటిలో సుమారు 3,756 గ్రాములు (3.75కేజీలు) బంగారు ఆభరణాలు, రూ.13,12,750 నగదు గుర్తించారు. వీటికి ఏ ఆధారాలూ చూపించకపోవడంతో ఆర్పీఎఫ్, సీపీడీఎస్ సిబ్బంది స్టేట్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు సమాచారం అందించారు. రైల్వేపోలీసులు సీజ్ చేసిన ఆభరణాలు, నగదును శనివారం ఇన్‌కంట్యాక్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆభరణాల విలువ రూ.3.8 కోట్లు ఉంటుందని వివరించారు.

ఇంత జరుగుతున్నా..

- మహారాష్ట్ర పోలీసుల ఆపరేషన్‌తో ఉలిక్కిపడ్డ తెలంగాణ పోలీసులు
- రాష్ట్రం డ్రగ్స్ తయారీకి అడ్డాగా మారినా పసిగట్టలేకపోవడంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర పోలీసుల ఆపరేషన్‌లో ఏకంగా రూ. 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడటం తెలంగాణ పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. డ్రగ్స్ తయారీ అడ్డాగా తెలంగాణ మారినా పసిగట్టలేకపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. డ్రగ్స్ కట్టడి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు సంస్థలైన ఈగల్, హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌-న్యూ)... హైదరాబాద్ నగర పరిసరాల్లోనే ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ తయారీ సంస్థలను ఎందుకు గుర్తించలేకపోతున్నా యన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తుతోంది. తెలంగాణలో డ్రగ్స్ వాడకానికి తావు లేదని.. డ్రగ్స్ సరఫరా చేసే/వాడే వారి వెన్నులో వణుకు పుట్టిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు, పలు వేదికలపై పదేపదే స్పష్టం చేస్తున్నారు. అయితే మత్తు ముఠాల పనిపట్టేందుకు... డ్రగ్స్, గంజాయిని తరిమికొట్టేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసినా క్షేత్రస్థాయిలో ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవనడానికి తాజా ఉదంతమే ఉదాహరణగా నిలుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మూతపడ్డ పరిశ్రమలే కాదు.. నడుస్తున్న పరిశ్రమలూ అడ్డాలే...

సాధారణంగా కొన్ని ముఠాలు డ్రగ్స్ తయారీకి నగర శివార్లలోని మూతపడ్డ పరిశ్రమలు, గోదాములను ఎంచుకుంటున్నాయి. వాటిని అద్దెకు తీసుకొని డ్రగ్స్ తయారీ కేంద్రాలుగా మార్చుకుంటున్నాయి. గతంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) సోదాల్లోనూ సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం, జహీరాబాద్, జీడిమెట్ల, బాలానగర్, చర్లపల్లి తదితర ప్రాంతాల్లో ఈ తరహాలో కొన్ని మూతపడ్డ ఫ్యాక్టరీల్లో అల్ప్రాజోలం సహా ఇతర డ్రగ్స్ తయారీని గుర్తించిన ఉదంతాలు ఉన్నాయి. అయితే తాజా ఘటన అంతకుమించి అన్నట్లుగా నిరూపించింది. ఇటీవల కొందరు డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, అందులో కాస్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సిబ్బంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్మగ్లర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని దేశ, విదేశాలకు మాదకద్రవ్యాల ముడిసరుకును చేరవేస్తున్నారు. డైజోఫాం, ఎంఫిటమైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ వంటి డ్రగ్స్‌కు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంది.



వాటి తయారీకి అవసరమైన ముడిసరుకును సేకరించి గుట్టుచప్పుడు కాకుండా సింథటిక్ డ్రగ్స్ తయారు చేస్తున్నారు. కమీషన్‌కు ఆశపడే వారిని ఎంచుకొని ఈ తరహా డ్రగ్స్ తయారీకి తెరతీస్తున్నారు. తాజాగా ఒక ల్యాబ్ మాటున మరో డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీని నడుపుతుండడం.. అందులో రూ. కోట్ల విలువైన డ్రగ్స్ తయారవుతుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్‌ను తయారు చేసినా వాటిని ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాల్లోని ఏజెంట్లకు చేరవేయక తప్పదు. ప్రైవేటు బస్సులు, కొరియర్ సంస్థల ద్వారా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ దశలోనూ స్థానిక పోలీసులు లేదా డ్రగ్స్ కేసుల దర్యాప్తు కోసమే వెలిసిన ప్రత్యేక దర్యాప్తు సంస్థలు గుర్తించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. వీటన్నింటిపై నిఘా పెట్టాల్సిన పోలీసులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

రూ. 12 వేల కోట్ల డ్రగ్స్ సీజ్




మహారాష్ట్ర పోలీసులు సోదాలు చేసిన చర్లపల్లిలోని ఫ్యాక్టరీ

▶ మొదటి పేజీ తరువాయి

అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల్లో ఒక బంగ్లాదేశీ యువతి సైతం ఉన్నట్లు చెప్పారు. నిందితుల నుంచి 27 మొబైల్ ఫోన్లు, మూడు కార్లు, ఒక టూవీలర్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ నెట్‌వర్క్‌కు, అంతర్జాతీ యంగా డ్రగ్ నెట్‌వర్క్‌లకు సైతం హైదరాబాద్ శివారులో తయారయ్యే ఎండీ డ్రగ్ సరఫరా అవుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చామన్నారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

ముంబైలో లింకులతో.. హైదరాబాద్‌లో వెలుగులోకి..

ఈ కేసును థానే జిల్లాలోని ఎంబీవీవీ పోలీసులు చిన్న లింక్ ద్వారా వెలుగులోకి తెచ్చారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మిరా రోడ్ ఈస్ట్‌లోని నివసించే బంగ్లాదేశీ యువతి ఫాతిమా మురాద్‌షేక్ అలియాస్ మొల్లా (23) మెఫిడ్రోన్ (ఎండీ) డ్రగ్‌ను విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఆగస్టు 8న కాశీమిరా బస్టాప్ దగ్గర ఫాతిమాను అదుపులోకి తీసుకొని ఆమె నుంచి 105 గ్రాముల ఎండీ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్‌ను తాను హైదరాబాద్ నుంచి కొన్నట్లు నిందితురాలు పేర్కొనడంతో ఆమె ఇచ్చిన సమాచారం ప్రకారం డ్రగ్ నెట్‌వర్క్‌లోని మరో 10 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకున్న అక్కడి పోలీసులు.. హైదరాబాద్ శివారులోని చర్లపల్లి ప్రాంతంలో ఉన్న ఒక ఫ్యాక్టరీలో డ్రగ్స్ తయారవుతున్నట్లు నిర్ధారణకు వచ్చి ఆపరేషన్ చేపట్టారు.

కెమికల్ ఫ్యాక్టరీ ముసుగులో డ్రగ్స్ తయారీ దందా..

భారీగా డ్రగ్స్ తయారీ దందాకు తెరతీసిన శ్రీనివాస్ విజయ్ వోలేటికి రెండు కంపెనీలు ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. వాటిల్లో వాగ్దేవి ల్యాబ్‌ను నవోదయ కాలనీలో 2020లో ప్రారంభించారు. కోవిడ్ సంబంధిత మందులు ఇందులో తయారవుతున్నాయి. అలాగే 2015లో నాచారంలో వాగ్దేవి ఇన్నోసైన్స్ పేరిట ఆర్ అండ్ డీ సంస్థను ఏర్పాటు చేశారు. అయితే కెమికల్ ఫ్యాక్టరీ పేరిట బయటికి చూపుతూ లోపల డగ్స్ తయారీ దందాకు నిర్వాహకులు తెరతీసినట్లు తెలిసింది.

కట్టెల లోడ్ వాహనాల్లో..

కట్టెల లోడ్ వాహనాల్లో ముడి సరుకుతోపాటు తయారు చేసిన డ్రగ్స్‌ను శ్రీనివాస్ విజయ్ వోలేటి తరలించేవాడని సమాచారం. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం గోడౌన్ కోసమని చర్లపల్లి, నవోదయనగర్ ప్లాట్ యజమానిని సంప్రదించి అద్దెకు తీసుకొని వాగ్దేవి ల్యాబ్‌ను ప్రారంభించారు. కంపెనీలో ఎప్పుడూ ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు మినహా మరెవరు కనిపించే వారు కాదని.. ఉదయమంతా గేటు మూసేసి ఉండేదని చుట్టుపక్కల కంపెనీల వారు పేర్కొన్నారు. రాత్రిళ్లు డ్రమ్ముల్లో రసాయనాలు, కట్టెల లోడ్‌ల వాహనాలు వచ్చేవని చెప్పారు. అప్పుడప్పుడూ ఘాటైన వాసనలు వచ్చినా రసాయన సంస్థలో ఇది మామూలే కదా అనుకునేవారమని చెప్పుకొచ్చారు. కాగా, స్థల యజమానికి ఏడాదిగా అద్దె కూడా చెల్లించట్లేదని తెలిసింది.

మరణించినా 'మోస్ట్‌వాంటెడ్'లే!

ఎన్ఐఏ వెబ్‌సైట్‌లో మరణించిన మావోయిస్టుల పేర్లు


నంబాల కేశవరావు, గాజర్ల రవి సహా కీలక నేతల పేర్లు

దేశంలోని 317 మందితో ఎన్ఐఏ హిట్‌లిస్టు

గణపతి, హిడ్మా సహా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లోని కీలక క్యాడర్



అక్కిరాజు హరగోపాల్



గాజర్ల రవి



నంబాల కేశవరావు

సాక్షిప్రతినిధి, వరంగల్: దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తూ టాప్ నక్సలైట్ నేతలందరినీ ఎన్‌కౌంటర్లలో చంపేసినా.. వారి పేర్లు ఇంకా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలోనే కొనసాగుతున్నాయి. గత ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణించారు. అదే రాష్ట్రంలో గత ఏడాది డిసెంబర్‌లో మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మొబైల్ పొలిటికల్ స్కూల్ ఇన్‌చార్జిగా ఉన్న అగ్రనేత బల్మూరి నారాయణరావు అలియాస్ ప్రభాకర్ కూడా బలగాల ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. వీరి పేర్లు ఇంకా ఎన్ఐఏ వెబ్‌సైట్‌లో మోస్ట్ వాంటెడ్ లిస్టులోనే ఉండటం గమనార్హం.

దేశవ్యాప్తంగా ఉగ్రవాద, తీవ్రవాద, వేర్పాటువాద, తీవ్ర ఆర్థిక నేరాలతో సంబంధం ఉన్న 317 మంది పరారీలో ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. వారందరి పేర్లు, ఫొటోలతో కూడిన వివరాలను వెబ్‌సైట్‌లో మోస్ట్‌వాంటెడ్ లిస్టులో చేర్చింది. ఇందులో నంబాల కేశవరావుతో పాటు పలువురి పేర్లు ఉన్నాయి. దండకారణ్యం జోనల్ కమిటీ సభ్యుడు అన్నె సంతోష్ అలియాస్ సాగర్ బీజాపూర్ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ఆంధ్ర- ఒడిశా కమిటీ కార్యదర్శిగా పని చేసిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ ఈ ఏడాది జూన్ 17న ఏపీ- ఒడిశా సరిహద్దులోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. ఆయనతో పాటు మరో కీలక నేత వెంకటరవి లక్ష్మీ చైతన్య అలియాస్ అరుణ కూడా మృతి చెందారు. నల్లగొండ జిల్లా చందూరు మండలం పుల్లెంలకు చెందిన పాక హన్మంతు ఏడాది జనవరి 25న ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. అగ్రనేత మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్ జీ భార్య పోతుల కల్పన అలియాస్ సుజాత మహబూబ్‌నగర్‌లో రెండేళ్ల క్రితం అరెస్టయ్యారు. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కోడి మంజుల అలియాస్ నిర్మల 2024 నవంబర్‌లో వరంగల్ పోలీసు కమిషనర్ ఎదుట లొంగిపోయారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడగూడెం గ్రామానికి చెందిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ సీపీఐ (మావోయిస్టు) రాష్ట్ర కార్యదర్శిగా ఉండి 2021 జూన్ 21న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో కోవిడ్ వ్యాధితో మరణించారు. మరో కేంద్ర కమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ (ఆర్కే) అనారోగ్యంతో 2021 అక్టోబర్ 14న దక్షిణ బస్తర్ జిల్లాలో మృతి చెందాడు. వీరందరి పేర్లు ఇంకా మోస్ట్‌వాంటెడ్ లిస్టులో ఉండటం గమనార్హం. అయితే, మావోయిస్టు పార్టీలో ఇంకా కీలకంగా ఉన్నారని భావిస్తున్న సుమారు 40 మంది ఎన్ఐఏ హిట్‌లిస్టులో ఉన్నట్లు సమాచారం. వారిలో కేంద్ర కమిటీ కార్యదర్శిగా పని చేసిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మడావి హిడ్మా, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి, కదారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ సాధు, మల్లా రాజిరెడ్డి, మోడం బాలకృష్ణ, పుల్లూరు ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, తిప్పిరి తిరుపతి తదితర అగ్రనేతలు ఉన్నట్లు తెలిసింది.

జాబితాలో 317 పేర్లు



చెరువుల్లో నీళ్లు లేక..

మంచాల: రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని చెరువులు, కుంటలు నీరులేక వెలవెలబోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల భారీ వర్షాలు కురిసి చెరువులు, ప్రాజెక్టులు అలుగు పారినా ఇక్కడి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. మండలంలోని ఆరుట్ల, మంచాల చెరువుల్లో కొద్దిపాటి నీళ్లు మినహా.. మిగిలిన 23 పంచాయతీల్లోని జలాశయాల్లో ఎక్కడా చుక్క నీరు లేదు. చాలామంది నాగార్జునసాగర్, ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు తీసుకెళ్లి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. శనివారం పలు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేశారు.



మా సార్ మాకే కావాలి..

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థుల ఆందోళన

స్టేషన్‌ఘన్‌పూర్: 'మా సార్‌ను అనవసరంగా డిప్యుటేషన్‌పై పంపించారు. మా సార్ మాకే కావాలి'.. అంటూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు శనివారం పాఠశాల గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఇన్‌చార్జి హెడ్ మాస్టర్‌గా ధరావత్ రాజు నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల పాఠశాలలో జరిగిన పరిణామాల నేపథ్యంలో.. ఉన్నతాధికారులు రాజును హనుమకొండ జిల్లా ఆరెపల్లి ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. రాజు శనివారం పాఠశాల నుంచి కారులో వెళ్తుండగా.. పలువురు విద్యార్థులు 'సార్.. వెళ్లొద్దంటూ' కన్నీరు పెట్టుకున్నారు. పాఠశాల గేటు వద్ద దాదాపు ఐదు గంటల పాటు నిరసన తెలిపారు. రాజు సార్ తమపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారని, పదో తరగతిలో 100 ఉత్తీర్ణత కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ జి.వేణు, ఎస్ఐ వినయ్‌కుమార్ పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యార్థినులు వినకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఫోన్‌లో కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ ఆదేశాల మేరకు.. నెల రోజుల్లో రాజు సార్‌ను పాఠశాలకు రప్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.

టీవీఎస్ అపాచీ నుంచి కొత్త వేరియంట్లు



సాక్షి, హైదరాబాద్: ప్రఖ్యాత టీవీఎస్ మోటార్ సంస్థ తన ప్రధాన మోటార్ సైకిల్ టీవీఎస్ అపాచీకి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, అపాచీ ఆర్‌టీఆర్ 160, 180, 200, టీవీఎస్ అపాచీ RR310, RTR310 లైనప్‌లలో లిమిటెడ్-ఎడిషన్ వేరియంట్లను విడుదల చేసింది. లిమిటెడ్ ఎడిషన్ లైనప్‌లో ప్రత్యేకమైన బ్లాక్-షాంపైన్-గోల్డ్ లివరీ, డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్, యూఎస్‌బీ చార్జర్, మరెన్నో ఫీచర్లు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160, 200 లైనప్‌లలో అత్యున్నత స్థానంలో నిలిచే కొత్త 4 వీ వేరియంట్లు, అత్యాధునిక క్లాస్-డి ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్‌లు, ఎల్‌ఈడీ డీఆర్ఎస్‌లు, ఆల్-ఎల్‌ఈడీ లైటింగ్, 5 అంగుళాల కనెక్టెడ్ టీఎఫ్‌టీ క్లస్టర్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, బోల్డ్ కొత్త రంగులు, డైనమిక్ గ్రాఫిక్స్ తదితర అదనపు ఫీచర్లు లభించాయి. ఈ సందర్భంగా టీవీఎస్ మోటార్ కంపెనీ డైరెక్టర్, సీఈవో కె.ఎన్. రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 6.5 మిలియన్ల టీవీఎస్ అపాచీ కమ్యూనిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

కనుచూపు మేర పచ్చని నల్లమల కనుమలు.. ఆ మధ్యలో ఒంపులు తిరుగుతూ ముందుకు ప్రవహించే కృష్ణానది. ఆ అందాలను ఒడిసిపట్టిన శ్రీశైలంప్రాజెక్టు.. వీటన్నింటినీ ఒక చోటు నుంచి వీక్షిస్తే.. మది పులికించిపోతుంది. రాష్ట్ర సరిహద్దుగా ఉన్న శ్రీశైల ప్రాంతం పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతో అనువుగా ఉంది. ఆ గట్టున తెలంగాణ ప్రభుత్వం టూరిజాన్ని పరుగులు పెట్టిస్తుండగా.. ఈ గట్టున ఏపీ ప్రభుత్వం కనీసం ఆ ఆలోచన కూడా చేయడం లేదు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ఎన్నో అవకాశాలు ఉన్నా పట్టించుకోవడం లేదు.


తెలంగాణ వైపు ప్రకృతి అందాల నడుమ హిల్ టాప్ విల్లాలు

ఆ గట్టు పరవశించి.. ఈ గట్టు నీరసించి!

- శ్రీశైలం సమీపంలో విడిది విల్లాలు ఏర్పాటు చేసిన తెలంగాణ
- నల్లమల కొండల మధ్యలో నిర్మాణం
- ఆసక్తి చూపుతున్న పర్యాటకులు
- మరో వైపు నాగార్జునసాగర్, సోమశిల నుంచి బోటు ప్రయాణం
- పర్యాటకం అభివృద్ధిపై దృష్టి సారించని ఏపీ పర్యాటక శాఖ
- శ్రీశైలం, సున్నిపెంట ప్రాంతాల్లో కోకొల్లలుగా 'హిల్ వ్యూ' ప్రదేశాలు
- నిలిచిన హెలీ టూరిజం ప్రారంభమెప్పుడో..



శ్రీశైలంటెంపుల్: దట్టమైన నల్లమల మధ్యలో ఉన్న శ్రీగిరి సందర్శనకు శివభక్తులు, యాత్రికులు, ప్రకృతి ప్రేమికులు దేశం నలుమూలల నుంచి నిత్యం వస్తూనే ఉంటారు. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలసి వెలసిన పుణ్యక్షేత్రమైన శ్రీశైలం. ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. క్షేత్రానికి విచ్చేసిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం శ్రీశైలం పరిసర ప్రాంతాల్లోని పర్యాటక ప్రదేశాలను తిలకిస్తూ పర్యాటక అనుభూతిని పొందుతున్నారు. టూరిజంగా అభివృద్ధి చెందేందుకు శ్రీశైలం ప్రాంతంలో అనేక అవకాశాలు ఉన్నా కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. శ్రీశైలంలో లోకల్ జాయ్ ట్రిప్ బోటింగ్, అక్కమహాదేవి గుహలకు బోటింగ్ మాత్రమే ఉన్నాయి. గతంలో 2016లో హెలిటూరిజం పేరుతో హెలికాప్టర్ ప్రయాణం ప్రారంభించినప్పటికీ అది అర్ధంతరంగా నిలిచిపోయింది. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రం టూరిజం అభివృద్ధిలో దూసుకుపోతోంది. పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు ఆసక్తి ఉన్న పలు సంస్థలకు సైతం లీజు పద్ధతిపై భూములు కేటాయిస్తోంది. పలు సంస్థలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నాయి. టూరిజం అభివృద్ధిలో శ్రీశైల ఆలయానికి 25 కిలోమీటర్ల దూరంలో తెలంగాణ ప్రభుత్వం నల్లమల కొండల్లో విడిది విల్లాలను నిర్మించింది. తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో 'హిల్ టాప్' పేరుతో నిర్మించిన ఈ విల్లాలను సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో 20 వసతి గదులు అందుబాటులో ఉన్నాయి. నల్లమల అందాలు, కృష్ణమ్మ నదీ ప్రవాహం, శ్రీశైల ఆలయం దృశ్యాలను వసతి గదిలోనే కూర్చొని వీక్షించే అవకాశం ఉంది. దీంతో హిల్‌టాప్ వసతి గదుల్లో బస చేసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు.

ఆ వైపు పడవెళ్లిపోతుంది..

తెలంగాణ రాష్ట్రం పర్యాటక అభివృద్ధిలో భాగంగా పడవ ప్రయాణం కూడా అందుబాటులోకి తెచ్చింది. నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం బోటు షికార్‌ను ఎప్పుడో ప్రారంభించింది. అంతేకాకుండా సోమశిల నుంచి పాతాళగంగకు కృష్ణానదిపై బోటులో ప్రయాణిస్తూ నల్లమల అందాలను ఆస్వాదించవచ్చు. అక్కడ రిసార్ట్స్ ఏర్పాటు చేసి పర్యాటకులు బస చేసే అవకాశం కల్పించింది. ఈ గట్టున సంగమేశ్వరం కూడా ఇందుకు అనువుగా ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో హడావుడి చేసి చేతులెత్తేసింది. సంగమేశ్వర క్షేత్రానికి సమీపంలోనే రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి అమ్మవారు కొలువైన క్షేత్రం కొలను భారతి. ఈ రెండు కేంద్రాలను శ్రీశైలం నుంచి పర్యాటకులు కృష్ణానది మీదుగా ప్రయాణించి దర్శించుకునే అవకాశం ఉంది. ఆ దిశగా రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఆలోచన చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హెలిటూరిజం మళ్లీ వచ్చేనా..


శ్రీశైల మహాక్షేత్ర ఖ్యాతి విశ్వవ్యాప్తంగా విస్తరించడంతో వివిధ దేశాల నుంచి భక్తులు శ్రీశైలానికి తరలివస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి భక్తుల సౌకర్యార్థం దేవస్థానం, ఏవియేషన్ సంయుక్తంగా హెలి టూరిజం ఏర్పాటు చేసింది. 2016, ఆగస్టు 28న హెలి టూరిజంను అప్పటి దేవస్థాన ఈఓ నారాయణ భరత్‌గుప్తా ప్రారంభించారు. సమ్మిట్ ఏవియేషన్ సంస్థ ద్వారా హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి హెలికాప్టర్ సర్వీసును నడిపింది. అలాగే లోకల్‌గా భక్తులు, స్థానికుల సౌకర్యార్థం జాయ్ ట్రిప్‌ను సైతం ఏర్పాటు చేసింది. హెలి టూరిజానికి భక్తుల నుంచి ఆదరణ ఉన్నప్పటికీ అర్ధాంతరంగా నిలిపివేశారు.


యాత్రికులతో శ్రీశైలం చేరుకున్న హెలికాప్టర్ (ఫైల్)

పర్యాటకం అభివృద్ధికి మార్గాలెన్నో..

శ్రీశైలం, సున్నిపెంట ప్రాంతాల్లో కోకొల్లలుగా హిల్ వ్యూ ప్రదేశాలు ఉన్నాయి. ఏపీ టూరిజం శాఖ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దైవ దర్శనానికి వచ్చిన పర్యాటకులు రెండు, మూడు రోజులు ఇక్కడే బస చేసి పర్యాటక ప్రాంతాలను తిలకించడంతోటూరిజం అభివృద్ధితో పాటు పాటు స్థానిక యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడతాయి.

- శ్రీశైలానికి 17 కిలోమీటర్ల దూరంలోని ఇష్ట కామేశ్వరి అమ్మవారి దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో ఆసక్తి చూపుతారు. పూర్తిగా దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఉండడంతో టూరిజం శాఖ ఆ దిశగా ఆలోచనలు చేసి ఇష్టకామేశ్వరి జంగిల్ సఫారీ ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుతం నెక్కంటి జంగిల్ సఫారీ పేరుతో ఇష్టకామేశ్వరి దర్శనానికి ప్రైవేట్ జీపుల ద్వారా భక్తులను అనుమతిస్తున్నారు. అలాగే అటవీశాఖ అధికారులు ఓపెన్‌టాప్ జీపులను ఏర్పాటు చేసి అడవిలో సంచరించే జంతువులను పర్యాటకులు వీక్షించేలా ఏర్పాట్లు చేయవచ్చు.
- తెలంగాణ ప్రాంతంలోని అమ్రాబాద్ వద్ద ఉన్న ఆక్టోపస్ వ్యూ పాయింట్ మాదిరిగా శ్రీశైలం సమీప నల్లమల అడవుల్లో ఏర్పాటు చేయవచ్చు. అడవుల్లో పర్యాటకులు ఒక రోజు విడిది చేసేలా టూరిజం శాఖ రిసార్ట్స్ నిర్మించవచ్చు. కాగా ఈ ప్రాంతం టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో అనుమతులకు పాలకులు కృషి చేయాల్సి ఉంది.
- నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని సున్నిపెంట బయోడైవర్శిటీ ల్యాబ్, ఎకలాజికల్ పార్క్ అలాగే పర్యావరణ విజ్ఞాన కేంద్రం మూడింటిని కలుపుతూ ఎకో టూరిజంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తెస్తే పర్యాటకులు మరింత పెరిగే అవకాశం ఉంది.



ఒప్పందాలే.. వచ్చింది లేదు

విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల స్థాపనకు ముందుకురాని సంస్థలు

- కూటమి అధికారంలోకి వచ్చాక కుదుర్చుకున్న ఒప్పందాలు కేవలం 38
- అయినా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించని సంస్థలు
- భూములు కేటాయించి చేతులు దులుపుకొన్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: చంద్రబాబు మాటలకు చేతలకు చాలా తేడా ఉంటుందన్నది ఇంధన రంగంలో మరోసారి రుజువవుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేలకోట్ల రూపాయల భారం వేయడం తప్ప ఆ భారాన్ని భవిష్యత్తులోనైనా తగ్గించే ప్రయత్నం చేయడం లేదు. విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలే నామమాత్రం కాగా, అవి కూడా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. గత ప్రభుత్వంలో భారీగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటిలో అనేక ప్రాజెక్టుల పనులు ప్రారంభమైనా వాటిని ప్రోత్సహించడం లేదు. దీంతో రాష్ట్రంలో ఇంధనరంగ ప్రాజెక్టులు కనీసం నత్తనడకన కూడా సాగడం లేదు.

అంతా ఆర్భాటమే.. ఆచరణ శూన్యం

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 16 పవనవిద్యుత్, 15 సౌరవిద్యుత్, 7 పంప్డ్ స్టోరేజ్ పవర్ సిస్టమ్ (పీఎస్పీ) చొప్పున మొత్తం 38 పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. వీటిద్వారా 3,505 మెగావాట్ల పవన, 12,180 మెగావాట్ల సౌర, 11,760 మెగావాట్ల పీఎస్పీ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పింది. వీటికి వరుసగా రూ.25,084 కోట్లు, రూ.60,138 కోట్లు, రూ.58,809 కోట్ల పెట్టుబడులు వస్తాయని, తద్వారా 5,435 మందికి, 41,260 మందికి, 22,690 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని నమ్మించింది. వీటిలో ఒక్కటైనా ఏర్పాటైందా, ఒక్కరికైనా ఉపాధి లభించిందా? అని అడిగితే అధికారులు తెల్లమొఖం వేస్తున్నారు. ఎందుకంటే ఇవన్నీ పేపర్లకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో వాటి ఊసే లేదు.

ప్రాజెక్టులు లేక కొనుగోళ్లు

ప్రాజెక్టులు అందుబాటులోకి రాకపోవడంతో డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను సమకూర్చడం కోసం విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఏడాదిలో రూ.3,880 కోట్లు వెచ్చించి 4,535 మిలియన్ యూనిట్లు కొనుగోలు చేశాయి. ఈ మొత్తాన్ని డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోతే మళ్లీ వినియోగదారులపైనే వేయాల్సి ఉంటుంది. లేదంటే అవి అప్పుల్లోకి వెళ్లిపోతాయి. చంద్రబాబు గతంలో పదవి నుంచి దిగిపోయేనాటికి డిస్కంలు, జెన్‌కోల అప్పులు రూ.29,703 వేలకోట్ల నుంచి రూ.68,596 వేలకోట్లకు పెంచేశారు. విద్యుత్ ఉత్పత్తిసంస్థలకు డిస్కంలు ఇవ్వాల్సిన బకాయిలు రూ.2,800 కోట్ల నుంచి రూ.21 వేల కోట్లకు చేర్చారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వం విద్యుత్ సంస్థలను ఆదుకోవడానికి దాదాపు రూ.40 వేలకోట్ల సాయం చేసింది. కూటమి ప్రభుత్వం అలాంటి సాయమేదీ చేయకపోగా ప్రజల నుంచే వసూలు చేసుకోమని చెబుతోంది. దీంతో ఇప్పటికే రాష్ట్ర ప్రజలపై రూ.15,485.36 కోట్ల భారం వేయగా, మరో రూ.16,401.32 కోట్ల భారం మోపేందుకు రంగం సిద్ధం చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగానికి వెలుగులు

భారీ పవర్ ప్రాజెక్టులకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలపడంలో గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సఫలీకృతం అయ్యారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించడంతో పాటు భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకుంది. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో ఏకంగా రూ.9.57 లక్షలకోట్ల ఇంధన రంగ ఒప్పందాలతో చరిత్ర సృష్టించింది. రానున్న 30 ఏళ్ల వరకు దీన్ని కొనసాగించేందుకు 7 వేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలుకు రంగం సిద్ధం చేసింది. డిస్కంలపై విద్యుత్ కొనుగోలు భారం తగ్గించేందుకు 42,240 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణం తలపెట్టింది. ఇందులో 33,240 మెగావాట్లకు సంబంధించిన 29 లొకేషన్లలో ఉన్న ప్రాజెక్టులకు ఫీజబులిటీ స్టడీలు జరుగుతున్నాయి. 20,900 మెగావాట్ల ప్రాజెక్టుల డీపీఆర్‌లు కూడా పూర్తయ్యాయి. వీటిలో 16,180 మెగావాట్ల ఉత్పత్తికి వివిధ కంపెనీలకు అలాట్‌మెంట్లు కూడా ఇచ్చేశారు. రాయలసీమ ప్రాంతమైన నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్ల విలువైన మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూమిపూజ జరిగింది. ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ కంపెనీ మరో 1,014 మెగావాట్ల ప్రాజెక్టుకు, ఎకోరన్ ఎనర్జీ రెండువేల మెగావాట్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాయి. దాదాపు రూ.10 వేలకోట్ల విలువైన ప్రాజెక్టుకు ఫీజబులిటీ స్టడీస్ పూర్తయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా పిన్నాపురంలో గ్రీన్ కో గ్రూప్ స్థాపిస్తున్న 5,230 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ (ఐఆర్‌ఈపీ) పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మెడికిల్ మాఫియా

మందుల షాపుల్లో అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. మత్తు మందులతోపాటు కాలం చెల్లిన మందులు, ఫిజీషియన్ శాంపిళ్లను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. ఆపరేషన్ గరుడ పేరిట ఈగల్ బృందాలు మొదట్లో తనిఖీలు నిర్వహించాయి. అక్రమ ఔషధాలు గుర్తించి పలు షాపులను సీజ్ చేశారు. అయినప్పటికీ అక్రమార్కులు యథావిధిగా దందా కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగా ఔషధ నియంత్రణ అధికారులు ఈ మెడికల్ మాఫియాను ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో అక్రమ మందుల వ్యాపారం కొనసాగుతోంది.

గుట్టుచప్పుడు కాకుండా మత్తుమందుల అమ్మకం



- కాలం చెల్లిన మందులు, ఫిజీషియన్ శాంపిళ్ల విక్రయం
- గతంలో ఈగల్ బృందం తనిఖీల్లో వెలుగులోకి దారుణాలు
- నేటికీ ఆగని అక్రమార్కుల దందా
- అమ్మకాలపై కొరవడిన అధికారుల నిఘా
- అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోతున్న విక్రేతలు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మందుల మాఫియా చెలరేగుతోంది. ఇక్కడ కొన్ని షాపుల్లో మత్తుమందుల విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నరసరావుపేటలో ట్యాబ్లెట్స్‌లను సరఫరా చేసే డీలర్‌లు అధికంగా ఉన్నారు. లాభాల కోసం బ్రాండెడ్ కంపెనీలను పోలి ఉండే వాటిని తీసుకొచ్చి రాయలసీమ ప్రాంతంతో పాటు పలు జిల్లాలకు సరఫరా చేస్తుంటారు. దీంతోపాటు ఇతర రాష్ట్రాలకు సైతం అమ్మకాలు జరుపుతుంటారు. నకిలీ మందులకు అడ్డాగా నరసరావుపేటకు పేరు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులు మరో అడుగు ముందుకేశారు. మత్తు మందులను విక్రయించటంతోపాటు ఇతర ప్రాంతాలకు కొరియర్, పార్శిళ్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఘటనలు గతంలో కూడా వెలుగు చూశాయి. రెండేళ్ల క్రితం ఓ ఫార్మా కంపెనీలో ట్రామాడోల్ తయారు చేసినట్లు అధికారుల దాడుల్లో తేలింది. ఆ కంపెనీలో చాలా బ్రాండెడ్ మందులకు సంబంధించి నకిలీవి తయారు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు మత్తుమందులు వస్తుండగా, ఇక్కడి నుంచి పలుచోట్లకు తరలుతున్నాయి.

కాలం చెల్లినా విక్రయాలు

జిల్లాలో సుమారు వెయ్యికి పైగా ఔషధ దుకాణాలు ఉన్నాయి. పలు షాపుల్లో కాలం చెల్లిన మందులు, ఫిజిషియన్ శాంపిళ్ల విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. ప్రజలకు తెలియకుండానే వీటిని అంటగడుతున్నారు. వాడిన వారు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. పలు ప్రముఖ కంపెనీలు ప్రయోగం కోసం ఉచితంగా అందించే ఫిజిషియన్ శాంపిళ్లు మెడికల్ దుకాణాల్లో, కొన్ని వైద్యశాలలకు అనుబంధంగా ఉండే షాపుల్లో విక్రయించటం ఆందోళన కలిగిస్తోంది. జనరిక్ మందులను కూడా బ్రాండెడ్ పేర్లతో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారన్నారు. ఈగల్ బృందం తనిఖీల్లో సైతం దీనిని గుర్తించారు. ఆయా షాపుల లైసెన్స్‌ను తాత్కాలికంగా నిలిపివేయగా, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో పునరుద్ధరించారు. ఇలా అక్రమ వ్యాపారం చేసినా ఏమి కాదనే రీతిలో పలువురు రెచ్చిపోతున్నారు. దీంతో మార్కెట్‌లోకి కాలం చెల్లిన మందులు ఇబ్బడిముబ్బడిగా వచ్చేస్తున్నాయి.

రెచ్చిపోతున్న మాఫియా

అధికార పార్టీ నేతల అండ చూసుకొని మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమార్కుల ఆగడాలు హద్దుమీరాయి. ఈగల్ టీం దాడులు, అధికారుల తనిఖీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. దుకాణాల్లో నాణ్యమైన మందులు కొనుగోలు చేశామన్నా నమ్మకం కూడా సామాన్యులకు లేకుండా పోతోంది. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యానికి చేటు తెచ్చే ఈ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

పట్టు కోల్పోతున్న చేనేత

చేనేత రంగం పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోతోంది. మరమగ్గాలతో తయారు చేసిన పట్టు చీరలు ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి భారీగా వస్తున్నాయి. దీంతో చేనేత మగ్గంపై తయారు చేసిన పట్టు చీరాలకు గిరాకీ తగ్గుతోంది. పెరిగిన పెట్టుబడులు, కార్మికులకు తగిన కూలీ లేకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో నేతన్నలు మగ్గాలు వదిలేస్తున్నారు. కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు వాపోతున్నారు.

- మరమగ్గాలపై ఇబ్బడిముబ్బడిగా పట్టు చీరల తయారీ
- తక్కువ ధరకే మార్కెట్లో భారీగా విక్రయాలు
- మగ్గంలో తయారు చేసిన పట్టు చీరలకు తగ్గిన గిరాకీ
- వృత్తి వదిలి కూలీ పనులకు చేనేత కార్మికులు

వేటపాలెం: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చేనేత కేంద్రాలైన చీరాల, జాండ్రపేట, వేటపాలెం, రేపల్లె, భట్టిప్రోలు, కనిగిరి, బేస్తవారిపేట, ఈతముక్కల, వలపర్ల తదితర ప్రాంతాల్లో 10 వేల వరకు చేనేత మగ్గాలు ఉన్నాయి. ఈ రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల మందికిపైగా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. మొన్నటి వరకు ఒక వెలుగు వెలిగిన చేనేత మగ్గాలకు పవర్‌లూమ్స్ శాపంగా మారాయి. చేనేత కార్మికుడు మగ్గంపై 5 లేదా 7 రోజులపాటు ఒక చీర బారు నేస్తే పవర్‌లూమ్స్‌లో రోజుకు రెండు చీరల బార్ తయారవుతున్నాయి. చేనేత మగ్గంలో తయారైన చీర కన్నా మరమగ్గంపై తయారైన పట్టు చీరను 30 నుంచి 40 శాతం తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత మగ్గాల వైపు వ్యాపారులు కన్నెత్తి కూడా చూడటం లేదని కార్మికులు వాపోతున్నారు.


చేనేత మగ్గంపై చీర నేస్తున్న మహిళ


పవర్ లూమ్‌పై తయారైన చీరలు

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

కర్ణాటక, బెంగళూరు, చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పవర్‌లూమ్స్‌లో తయారు చేసిన పట్టు చీరలను తక్కువ ధరలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. పవర్‌లూమ్స్‌లో చేనేత రిజర్వేషన్ చట్టం ప్రకారం వందశాతం పట్టు దారంతో, డిజైన్‌లను తయారు చేయకూడదు. పవర్ లూమ్స్‌లో తయారయ్యే పట్టు చీరలలో 52 శాతానికి మించి జరీ వాడకూడదు. బార్డర్, పల్లూ డిజైన్‌లు చేనేత మగ్గంలో తయారయ్యే వాటిని వాడకూడదన్న నిబంధనలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 11 రకాల డిజైన్‌లను మరమగ్గాలలో తయారు చేయకూడదన్న నిబంధనలతో ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పట్టు చీరలు తయారు చేసి చేనేతలను దెబ్బతీస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాల్సిన హాండ్లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పర్యవేక్షణ కరువైందని కార్మికులు ఆరోపిస్తున్నారు. రిజర్వేషన్ చట్టానికి తూట్లు పొడుస్తూ మరమగ్గాలలో పట్టుచీరల తయారీకి అడ్డు చెప్పకుండా ఉండాలంటే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మాస్టర్ వీవర్ ప్రతి నెలా మామూలు ఇవ్వాలని షరతుల పెట్టి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అరకొరగా ఉన్న మరమగ్గాలు ఇప్పుడు బాగా పెరిగిపోయాయి.

మూత పడుతున్న చేనేత మగ్గాలు..

మరమగ్గాల దెబ్బకు చేనేత మగ్గాలు నష్టాలను చవి చూస్తుండటంతో క్రమంగా మూతపడునత్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.24 వేలు సాయం అందించేది. కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం పథకానికి తొలి ఏడాది మంగళం పాడింది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని నేతన్నలు జీవనం సాగిస్తున్నారు. తీసుకొన్న వడ్డీ డబ్బులు చెల్లించడానికి, కుటుంబ జీవనం గడవడానికి నేత కార్మికులు వారి వృత్తిని వదిలి బేల్దారీ, రంగులు, ఇతర వ్యవసాయ పనులు, జీడిపరిశ్రమలో పనులకు వెళుతున్నారు.

33 లక్షల ల్యాండ్ పార్శిల్స్ నమోదు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 శాతం ల్యాండ్ పార్శిల్స్‌ను డిజిటల్ పంటల సర్వేలో నమోదు లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీరావు వెల్లడించారు. 'ఈ–క్రాప్ నమోదు జాప్యం...రైతుల పాలిట శాపం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. ఈ ఏడాది నుంచి సీజన్ ప్రారంభంలోని గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది పునర్‌వ్యవస్థీకరణ, బదిలీల కారణంగా జాప్యం జరిగిందన్నారు. బదిలీలపై వచ్చిన ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఆయా ప్రాంతాలకు కొత్త వారు కావడంతో గ్రామ సర్వే నంబర్లను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనన్నారు. ఈ కారణంగానే 2.60 కోట్ల లాండ్ పార్శిల్స్‌కు గానూ ఇప్పటి వరకు 33.33 లక్షలు లాండ్ పార్శిల్స్ మాత్రమే నమోదు చేశారన్నారు.

జోరుగా హుషారుగా షూటింగ్‌కి పోదమా


● చిరంజీవి

ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపూ సొలుపూ ఉండదన్నట్లు జోరుగా షూటింగ్స్ చేస్తారు స్టార్స్. అలాంటివారికి హఠాత్తుగా బ్రేక్ వస్తే... ఓ నాలుగైదు రోజులు బాగానే ఉంటుంది. కానీ దాదాపు 20 రోజులు బ్రేక్ వస్తే... ఎప్పుడెప్పుడు షూటింగ్స్‌కి పోదామా అని వెయిట్ చేస్తారు. తెలుగు చలన చిత్ర కార్మికుల సమ్మె కారణంగా ఆ మధ్య దాదాపు 20 రోజులు బ్రేక్ రావడం, ఈ మధ్యే మళ్లీ షూటింగ్స్ మొదలు కావడంతో 'జోరుగా హుషారుగా షూటింగ్‌కి పోదమా' అంటూ భాగ్యనగరంలో కొందరు స్టార్స్ షూటింగ్స్‌తో బిజీ అయ్యారు. ఆ విశేషాలు...


● ప్రభాస్


● ఎన్టీఆర్


● రవితేజ


● రామ్ పోతినేని


● నాని


● నాగ చైతన్య


● అఖిల్

స్పీడుగా శంకరవరప్రసాద్

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండక్కి వస్తున్నారు' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'సైరా: నరసింహారెడ్డి, గాడ్ ఫాదర్' చిత్రాల తర్వాత హీరో చిరంజీవి, హీరోయిన్ నయనతార కలిసి నటిస్తున్న సినిమా ఇది. ఇంకా ఈ చిత్రంలో వెంకటేశ్, వీటీవీ గణేశ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. క్యాథరిన్ మరో కీలక పాత్రలో కనిపిస్తారని తెలిసింది. కాగా ఆగస్టు 5న ప్రారంభం కావాల్సిన ఈ చిత్రం కొత్త షూటింగ్ షెడ్యూల్ సినీ కార్మికుల సమ్మె కారణంగా వాయిదా పడింది. తాజాగా ఈ షూటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో ప్రారంభమైంది. చిరంజీవితో పాటు ఈ చిత్రంలోని కీలక తారాగణం పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. కాగా ఈ షెడ్యూల్‌లోనే చిరంజీవి-వెంకటేశ్ కాంబినేషన్‌లో కూడా కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతుందని, వీరి కాంబినేషన్‌లోనే ఓ సెలబ్రేషన్ సాంగ్‌ను కూడా చిత్రీకరించాలని ఈ చిత్రదర్శకుడు అనిల్ రావిపూడి ప్లాన్ చేశారని తెలిసింది. సుస్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది. అయితే కార్మికుల సమ్మె కారణంగా ఒక షెడ్యూల్ చిత్రీకరణ ఆలస్యమైంది కనుక ఇకపై పెద్దగా బ్రేక్స్ లేకుండా స్పీడ్‌గా షూటింగ్ పూర్తి చేసి, సంక్రాంతి బరిలోనే ఈ సినిమాను నిలపాలని ఈ చిత్రయూనిట్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఇక ఈ చిత్రంలో శంకరవరప్రసాద్ పాత్రలో చిరంజీవి నటిస్తున్నారు. ఇందులో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఆయన పాత్ర ఉంటుంది. చిరంజీవి-నయనతార భార్యాభర్తలుగా నటిస్తున్నారు. వెంకటేశ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

చలో గ్రీస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ సినిమా 'ది రాజాసాబ్'. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్, నిధీ అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రభాస్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందట. ఈ షూటింగ్ షెడ్యూల్ పూర్తి కాగానే గ్రీస్ వెళ్లనుందట 'ది రాజాసాబ్' చిత్రయూనిట్. అక్కడ పాటలు చిత్రీకరించనున్నారట. ఆల్రెడీ ఈ చిత్రదర్శకుడు మారుతి అక్కడి లొకేషన్స్ చూసొచ్చారట. ఈ గ్రీస్ షెడ్యూల్‌తో 'ది రాజాసాబ్' చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందని సమాచారం. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కావాల్సింది. అయితే ఈ సినిమాను సంక్రాంతి సందర్భంగా జనవరి 9న రిలీజ్ చేయనున్నట్లుగా విశ్వప్రసాద్ ఇటీవల వెల్లడించారు. ఇక 'ది రాజాసాబ్' సినిమాలో సంజయ్ దత్, వీటీవీ గణేశ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో తాత-మనవళ్లుగా సంజయ్ దత్-ప్రభాస్ కనిపిస్తారని టాక్.

విదేశాలకు డ్రాగన్

హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్). ఈ పీరియాడికల్ యాక్షన్ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోందని తెలిసింది. ఎన్టీఆర్ షూట్‌లో పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. కొంత టాకీ పార్టుతో పాటు ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారట ప్రశాంత్ నీల్. అయితే ఈ సినిమా నెక్ట్స్ షూటింగ్ షెడ్యూల్‌ను ప్రశాంత్ నీల్ విదేశాల్లో ప్లాన్ చేశారని, ఈ దిశగా ఏర్పాట్లు కూడా మొదలైపోయాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇంకా ఈ సినిమా ప్రధాన కథకు ఇంటర్నేషనల్ టచ్ ఉంటుందని, ప్రధాన కథాంశం 1969 నేపథ్యంలో ఉంటుందని, ముఖ్యంగా కోల్‌కత్తా ప్రస్తావన ఉంటుందని తెలిసింది. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ-సిరీస్ ఫిల్మ్స్ పతాకాలపై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది.

మాస్ జడల్...

ఒక హిట్ కాంబినేషన్‌లో మళ్లీ సినిమా రూపొందితే ఎన్ని అంచనాలు ఏర్పడతాయో అన్నీ 'ది ప్యారడైజ్' సినిమాపై ఉన్నాయి. 'దసరా' వంటి హిట్ మూవీ తర్వాత ఆ చిత్రకథానాయకుడు నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ చిత్రంలో నాని పాత్ర పేరు జడల్. ఇప్పటివరకు విడుదల చేసిన స్టిల్‌లో ఓ లుక్‌లో నాని రెండు జడలు వేసుకుని కనిపించారు. హీరో లుక్, స్టోరీ, టేకింగ్... ఇలా ప్రతిదీ డిఫరెంట్‌గా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. కాగా... సినిమాలో నాని వేసుకునే జడలకు, ఈ చిత్రదర్శకుడు శ్రీకాంత్ ఓదెల జీవితానికి చిన్న కనెక్షన్ ఉందట. శ్రీకాంత్ ఐదో తరగతి వరకూ అతని తల్లి ఇలా రెండు జడలు వేసి స్కూల్‌కి పంపించేవారట. ఇది మాత్రమే కాదు... నాని క్యారెక్టర్‌కి జడలు వేయడం వెనక వేరే కారణం ఉందట. అది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే అని ఆ మధ్య ఓ సందర్భంలో శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇక జడల్ పాత్రలో నాని ఫుల్ మాస్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో జరుగుతోంది. టాకీ పార్ట్ చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2026 మార్చి 26న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.

శంకర్‌పల్లిలో...

హీరో రవితేజ వరుస సినిమాలతో బిజీ బిజీగా దూసుకెళుతుంటారు. ఓ సినిమా సెట్స్‌పై ఉండగానే మరో రెండు మూడు సినిమాలు కమిట్ అవడంతో పాటు సెట్స్‌పైకి తీసుకెళుతుంటారాయన. రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆర్‌టీ 76' (వర్కింగ్ టైటిల్). కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో రవితేజ ట్రేడ్‌మార్క్ కామిక్ టైమింగ్, మాస్ అప్పీల్ మిస్ కాకుండా ఉండేలా కథను సిద్ధం చేశారట కిశోర్ తిరుమల. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌కి సమీపంలోని శంకర్‌పల్లిలో జరుగుతోంది. ఈ చిత్రం కోసం వేసిన ప్రత్యేకమైన సెట్‌లో షూటింగ్ కొనసాగుతోందట. రవితేజతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట కిశోర్ తిరుమల. శరవేగంగా ఈ సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసి, 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో ఉందట యూనిట్. ఇదిలా ఉంటే... రవితేజ హీరోగా నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ-శ్రీలీల ఈ సినిమాలో రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే పలుమార్లు రిలీజ్ పోస్ట్‌పోన్ అయిన ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 20న ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తున్నాయి.

ముచ్చింతల్‌లో...

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీ ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి సిరీస్ ఫిలిమ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబరు 28న రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే... ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్ శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది. ఈ సినిమాలో ఉపేంద్ర ఓ స్టార్ హీరోగా నటిస్తుండగా, ఆయన వీరాభిమాని పాత్రలో రామ్ నటిస్తున్నారు. రాజమండ్రిలో 34 రోజుల పాటు నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా తర్వాతి షెడ్యూల్‌ని హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు యూనిట్. గచ్చిబౌలిలోని అల్యూమినియం ఫ్యాక్టరీలో కొద్ది రోజులు షూటింగ్స్ జరుపుకున్న ఈ సినిమా ప్రస్తుతం ముచ్చింతల్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. హీరో హీరోయిన్లతో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట పి. మహేశ్‌బాబు. వివేక్-మెర్విన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'పప్పీ షేమ్...' అంటూ సాగే పాటని ఈ నెల 8న విడుదల చేయనున్నారు.


● సిద్ధు జొన్నలగడ్డ


● సాయి దుర్గా తేజ్



● 'మహాకాళి' పోస్టర్

మిస్టిక్ థ్రిల్లర్...

'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్నారు హీరో నాగచైతన్య. అంతేకాదు... తొలిసారి ఆయన వంద కోట్ల క్లబ్‌లో చేరారు. అలాంటి హిట్ మూవీ తర్వాత నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్‌సీ 24' (వర్కింగ్ టైటిల్). ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాని తన ఖాతాలో వేసుకున్న మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'విరూపాక్ష' (2023) వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇది. బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. మిస్టిక్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో జరుగుతోంది. ఇందుకోసం ఓ ప్రత్యేకమైన సెట్ రూపొందించారు మేకర్స్. ఈ సినిమాలో నాగచైతన్య సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఈ లుక్ కోసం ఆయన శారీరకంగా కొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు కూడా. అలాగే మీనాక్షీ చౌదరి కూడా సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఇక ప్రస్తుతం నాగచైతన్య, మీనాక్షీ చౌదరితో పాటు ఇతర ముఖ్యమైన నటీనటులపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట కార్తీక్ వర్మ.

మాదాపూర్‌లో...

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి చిత్రాలతో వరుస హిట్స్ అందుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఈ సినిమాలతో ఆయనకంటూ ప్రత్యేకమైన మేనరిజమ్‌ని, యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ని సొంతం చేసుకున్నారాయన. సిద్ధు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ఈ మూవీలో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జరుగుతోంది. సిద్ధు శైలి వినోదంతో పాటు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో మనసుని హత్తుకునే భావోద్వేగాలు, అనుబంధాలు కూడా ఉంటాయట. దీపావళి కానుకగా అక్టోబర్ 17న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అంటే... ఈ దీపావళికి సిద్ధు జొన్నలగడ్డ నవ్వుల మతాబులు పేల్చనున్నారన్నమాట.

కొనసాగుతున్న సంబరాలు

సాయిదుర్గా తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటిగట్టు). ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. రోహిత్ కేపీ ఈ సినిమా ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్నారు. 'హనుమాన్' (2024) సినిమాతో పాన్ ఇండియా హిట్ అందుకున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న మరో పాన్ ఇండియా మూవీ 'ఎస్‌వైజీ'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో జరుగుతోంది. ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట. 'బ్రో' సినిమా 2023 జూలై 28న విడుదలైంది. అప్పటి నుంచి 'సంబరాల ఏటిగట్టు' సినిమాతో బిజీగా ఉన్నారు సాయి దుర్గా తేజ్. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డ ఈ సినిమా ఈ సెప్టెంబర్ 25న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం షూటింగ్ పూర్తి కానందున మరోసారి విడుదల వాయిదా పడే అవకాశం ఉందని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

బూత్ బంగ్లాలో...

అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. 'ఏజెంట్' సినిమా (2023) తర్వాత రెండేళ్ల గ్యాప్ అనంతరం అఖిల్ నటిస్తున్న ఈ సినిమాకి మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా కోసం పొడవాటి హెయిర్, గెడ్డంతో ఫుల్ మాస్ లుక్‌లోకి మారిపోయారు అఖిల్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని బూత్ బంగ్లాలో జరుగుతోంది. అఖిల్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు మురళీ కిశోర్. కాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా తొలుత శ్రీలీల ఫిక్స్ అయ్యారు. కారణాలు తెలియదు కానీ ఆమె స్థానంలో 'మిస్టర్ బచ్చన్' మూవీ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారని టాక్.

ముచ్చింతల్‌లో మహా కాళి

'హను-మాన్' సినిమాతో పాన్ ఇండియా హిట్ అందుకుని, అదే స్థాయిలో గుర్తింపు సొంతం చేసుకున్నారు డైరెక్టర్ ప్రశాంత్ వర్మ. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో 12 సూపర్ హీరోస్ సినిమాలను తెరకెక్కించనున్నట్లు గతంలో ప్రకటించారాయన. ఈ యూనివర్స్‌లో వచ్చిన తొలి చిత్రం 'హను-మాన్' బ్లాక్‌బస్టర్‌గా నిలవగా, తాజాగా రూపొందుతోన్న సినిమా 'మహా కాళి'. ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్ ప్లే అందించిన ఈ సినిమాకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌కేడీ స్టూడియోస్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్న ఫిమేల్ సూపర్ హీరో మూవీ ఇది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది. మహాకాళి అమ్మవారి చుట్టూ అల్లుకున్న కథతో బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. నటీనటుల వివరాలను మేకర్స్ ఇప్పటివరకూ అధికారికంగా ప్రకటించలేదు. అయితే, ఆ మధ్య విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఒక అమ్మాయి తన తలను పులి తలకు ప్రేమగా తాకుతున్న లుక్ వైరల్‌గా మారింది. మరి... ఈ చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాలంటే చిత్రయూనిట్ ప్రకటించే వరకు వేచి ఉండాలి.

పైన పేర్కొన్న చిత్రాలే కాదు.. మరికొన్ని సినిమాలు కూడా హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో సందడి సందడిగా చిత్రీకరణ జరుపుకుంటున్నాయి.

- దేరంగుల జగన్ మోహన్


● సన్నీ లియోన్

థ్రిల్లింగ్‌గా ఉంది

బాలీవుడ్ దర్శక-నిర్మాత విక్రమాదిత్య మొత్వాని, నటి సన్నీ లియోన్ అంతర్జాతీయ స్థాయిలో ఓ బయోపిక్ చేయనున్నారు. వెబ్ సిరీస్‌గా రానున్న ఈ బయోపిక్ హక్కులు సన్నీ లియోన్‌కి చెందిన సన్‌సిటీ సంస్థ దక్కించుకుందట. దీంతో విక్రమాదిత్య మొత్వానికి చెందిన ఆండొలన్ ఫిల్మ్స్, సన్నీ లియోన్ 'సన్ సిటీ' సంస్థలు ఈ అంతర్జాతీయ బయోపిక్‌ను రూపొందించనున్నాయి. ''ఈ ప్రాజెక్ట్ కోసం అసోసియేట్ అవుతున్నందుకు చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఈ బయోపిక్‌లోని స్టోరీ నన్ను ఇన్‌స్పైర్ చేసింది'' అని సన్నీ లియోన్ పేర్కొన్నారు. ఇక... ఇది ఎవరి బయోపిక్? ఇందులో నటీనటులు ఎవరు? సన్నీ లియోన్ కూడా ఈ సిరీస్‌లో నటిస్తారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

బాలీవుడ్ నటుడు ఆశిష్ వారంగ్ హఠాన్మరణం



బాలీవుడ్ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు ఆశిష్ వారంగ్ (55) హఠాన్మరణం చెందారు. శుక్రవారం ఆయన మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తన ప్రస్థానం ప్రారంభించిన ఆశిష్ పలు సినిమాల్లో తనదైన నటనతో ప్రేక్షకులను అలరించారు. అక్షయ్ కుమార్ హీరోగా నటించిన 'సూర్యవంశీ', అజయ్ దేవగణ్ కథానాయకుడిగా నటించిన 'దృశ్యం', రాణీ ముఖర్జీ లీడ్ రోల్ పోషించిన 'మర్దానీ', సిద్ధార్థ్ మల్హోత్రా 'ఏక్ విలన్' వంటి పలు హిట్ సినిమాల్లో నటించి, మంచి గుర్తింపు తెచ్చుకున్నారు ఆశిష్ వారంగ్. హిందీ సినిమాల్లోనే కాదు... మరాఠీ చిత్రాల్లోనూ నటించారాయన. ఆశిష్ వారంగ్ మృతిపై పలువురు నటీనటులు, దర్శకులు, సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు. ఇదిలా ఉంటే... ఆయన మృతికి కారణం ఏంటి? అనే విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. కానీ, బాలీవుడ్ మీడియాలో మాత్రం రకరకాల కథనాలు ప్రసారం అవుతున్నాయి.

బిజినెస్ రీల్

సముద్ర మార్గంలో కార్గో తగ్గలేదు..

కేంద్ర మంత్రి సోనోవాల్ వెల్లడి



ట్యుటికోరిన్: భారతీయ ఎగుమతులపై అమెరికా భారీ టారిఫ్‌ల ప్రభావాలపై ఆందోళన నెలకొన్నప్పటికీ.. సముద్ర మార్గంలో సరుకు రవాణా తగ్గలేదని కేంద్ర షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. భారతీయ మారిటైమ్ రంగం అసాధారణ స్థాయిలో పురోగమిస్తోందని పేర్కొన్నారు. తమిళనాడులో వీవోసీ పోర్టులో గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్రాజెక్టు ప్రారంభంతో పాటు ఇతరత్రా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. ఆగస్టు 27 నుంచి భారత ఎగుమతులపై సుంకాలను అమెరికా 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనితో ఎగుమతులపై ప్రభావం పడుతుందనే ఆందోళనల నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏప్రిల్–జూలై మధ్యకాలంలో అమెరికాకు భారత ఎగుమతులు 22 శాతం పెరిగి 33.53 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 12 శాతం పెరిగి 17.41 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ వ్యవధిలో భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది.

రిలయన్స్ ఇన్‌ఫ్రా జేవీలో వాటా పెంపు

51 శాతానికి డసాల్ట్ వాటా



న్యూఢిల్లీ: మౌలిక రంగ దిగ్గజం రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఏర్పాటు చేసిన భాగస్వామ్య కంపెనీ(జేవీ)లో తాజాగా ఫ్రెంచ్ ఏరోస్పేస్ దిగ్గజం డసాల్ట్ ఏవియేషన్ 2 శాతం వాటాను పెంచుకోనుంది. తద్వారా డసాల్ట్ రిలయన్స్ ఏరోస్పేస్(జేవీ)లో ప్రస్తుత 49 శాతం వాటాను 51 శాతానికి చేర్చుకోనుంది. ఇందుకు వీలుగా రిలయన్స్ ఇన్‌ఫ్రా అనుబంధ సంస్థ రిలయన్స్ ఏరోస్ట్రక్చర్ 2 శాతం వాటాను డసాల్ట్‌కు బదిలీ చేయనుంది. ప్రస్తుతం జేవీలో రిలయన్స్ ఏరోస్ట్రక్చర్ వాటా 51 శాతంకాగా.. డసాల్ట్ 49 శాతం వాటా కలిగి ఉంది. వాటా బదిలీ తదుపరి జేవీలో డసాల్ట్ మెజారిటీ వాటా(51 శాతం) పొందనుంది. వెరసి డసాల్ట్ ఏవియేషన్‌కు అనుబంధ సంస్థగా జేవీ అవతరించనుంది. నవంబర్1కల్లా వాటా బదిలీ పూర్తికానున్నట్లు అంచనా. ఈ డీల్‌కు రిలయన్స్ ఏరో రూ. 176 కోట్లు అందుకోనున్నట్లు తెలుస్తోంది.

ఐపీవో బాటలో చార్టర్డ్ స్పీడ్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 855 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ప్రయాణ సర్వీసులందించే చార్టర్డ్ స్పీడ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 655 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 200 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు పంకజ్ గాంధీ, అల్కా పంకజ్ గాంధీ విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 396 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 97 కోట్లు ఎలక్ట్రిక్ బస్‌ల కొనుగోలుకీ వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. 2007లో ఏర్పాటైన అహ్మదాబాద్ కంపెనీ ప్రధానంగా ప్యాసింజర్ మొబిలిటీ సర్వీసులను అందిస్తోంది. 2025 జూన్30కల్లా 500 పట్టణాలలో 2,000 బస్సులతో సర్వీసులు సమకూర్చుతోంది. గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో రూ. 667 కోట్ల ఆదాయం, రూ. 70 కోట్ల నికర లాభం ఆర్జించింది. అనుబంధ సంస్థల ద్వారా 945 ఎలక్ట్రిక్ బస్‌ల కొనుగోలుకి ఆర్డర్లు జారీ చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

7-9-2025	
విశాఖ	555–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545–00
విజయవాడ	545–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

వినియోగానికి జీఎస్‌టీ సంస్కరణల దన్ను

ప్రతి కుటుంబానికి ప్రయోజనం

- ఎకానమీ వృద్ధికి ఊతం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) సంస్కరణలతో వినియోగానికి మరింత ఊతం లభిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. విస్తృత స్థాయిలో వివిధ ఉత్పత్తుల రేట్లను క్రమబద్ధీకరించడం వల్ల ప్రతి కుటుంబం ప్రయోజనం పొందుతుందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఇది దోహదపడుతుందన్నారు. మొత్తం మీద ప్రజలకు గణనీయంగా మేలు చేకూర్చే కీలక సంస్కరణగా జీఎస్‌టీ సవరణలను ఆమె ఓ ఇంటర్వ్యూలో అభివర్ణించారు. ధరల తగ్గుదల ప్రయోజనాలు ప్రజలకు బదిలీ అయ్యేలా తానే వ్యక్తిగతంగా పర్యవేక్షణ బాధ్యతలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. పరిశ్రమ ఇప్పటికే రేట్ల తగ్గింపు విషయంలో సానుకూలంగా స్పందించిందన్నారు. పలు కార్ల సంస్థలు మొదలుకుని ప్రభుత్వ రంగ బీమా సంస్థలు, పాదరక్షలు, దుస్తుల బ్రాండ్లు గణనీయంగా ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయని వివరించారు. కొత్త జీఎస్‌టీ రేట్లు అమల్లోకి వచ్చే నాటికి మిగతావి కూడా రేట్లను తగ్గించవచ్చని పేర్కొన్నారు. 'మొత్తం 140 కోట్ల మందికి ప్రయోజనం చేకూర్చే సంస్కరణ ఇది. అత్యంత పేదలకు కూడా ఎంతో కొంత ప్రయోజనం చేకూరుతుంది' అని నిర్మలా సీతారామన్ చెప్పారు. గతంలో నాలుగు శ్లాబులుగా (5%, 12%, 18%, 28%) ఉన్న జీఎస్‌టీ రేట్లను రెండు శ్లాబులుగా (5%, 18%) మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇవి సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. దీనితో సబ్బుల నుంచి కార్లు, షాంపూలు, ట్రాక్టర్లు, ఏసీల వరకు 400 పైగా ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై పన్ను ఉండదు. విలాస వస్తువులతో పాటు కొన్ని ఉత్పత్తులకు 40 శాతం శ్లాబ్ ఉంటుంది.

సామాన్యులపై ఫోకస్ ..

ఒక దేశం, ఒకే పన్ను నినాదంతో 2017లో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన అనంతరం తాజాగా చేపట్టిన సవరణలు, అతి పెద్ద సంస్కరణలని నిర్మలా సీతారామన్ చెప్పారు. ప్రధానంగా సామాన్య ప్రజానీకం ప్రయోజనాలపై దృష్టి పెడుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. రోజువారీ ఉపయోగించే ఉత్పత్తులపై ప్రతి పన్నును లోతుగా సమీక్షించామని, చాలా మటుకు ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుతాయని మంత్రి వివరించారు. బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపులపరంగా ఇచ్చిన వెసులుబాటుతో ప్రజల చేతిలో మరింత డబ్బు మిగలనుండగా, తాజా జీఎస్‌టీ సంస్కరణల వల్ల ఉత్పత్తుల ధరలు తగ్గి వినియోగానికి ఊతం లభిస్తుందన్నారు. దీనితో కుటుంబాల నెలవారీ రేషన్, మెడికల్ బిల్లులు మొదలైన వాటి భారం తగ్గుతుందని చెప్పారు. జీఎస్‌టీ రేట్ల కోత ప్రయోజనాలను పర్యవేక్షించేందుకు పరిశ్రమ వర్గాలతో ఆర్థిక శాఖ సంప్రదింపులు జరుపుతోందని, దీనిపై సానుకూలత వ్యక్తమవుతోందని సీతారామన్ చెప్పారు.

వ్యాపారాల నిర్వహణ సులభతరం..

చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల కార్యకలాపాల నిర్వహణను సులభతరం చేసేందుకు కూడా జీఎస్‌టీ సంస్కరణలు తోడ్పడతాయని నిర్మలా సీతారామన్ చెప్పారు. నిబంధనల భారం సడలింపు, వేగవంతమైన రిఫండ్‌లు, సులభతరంగా రిజిస్ట్రేషన్ మొదలైన అంశాలన్నీ సంస్కరణల ప్యాకేజీలో భాగమేనని చెప్పారు. కొత్త విధానంలో 90 శాతం వరకు రిఫండ్‌లు నిర్దిష్ట కాలవ్యవధిలో ప్రాసెస్ అవుతాయని, కంపెనీల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మూడు రోజుల్లోనే పూర్తవుతుందని చెప్పారు. ఒకే తరహా ఉత్పత్తులను ఒకే శ్లాబ్ తేవడం వల్ల ఉత్పత్తుల వర్గీకరణపై నెలకొన్న గందరగోళం కూడా తొలగిపోతుందని మంత్రి చెప్పారు.

రాష్ట్రాలకు ధన్యవాదాలు..



జీఎస్‌టీ సంస్కరణలకు మద్దతునిచ్చిందుకుగాను రాష్ట్రాలకు సీతారామన్ ధన్యవాదాలు తెలిపారు. ప్రతిపాదిత సవరణలు సామాన్యుడికి ప్రయోజనం చేకూర్చేవేనని అంతిమంగా రాష్ట్రాలు అభిప్రాయపడినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతూ తాను లేఖలు రాసినట్లు చెప్పారు. రాష్ట్రాలు ఎల్లప్పుడూ రేట్ల కోతకు సుముఖంగానే ఉంటాయని, కానీ దానివల్ల రాబడికి కోత పడటంపైనే వాటికి ఆందోళన ఉంటుందని మంత్రి వివరించారు. 'అయితే, దీని వల్ల రాష్ట్రాలపైనే కాకుండా కేంద్రంపైనా ప్రభావం ఉంటుందని వారికి చెప్పాను. కాకపోతే రేట్లు తగ్గి, ప్రజలు మరింతగా కొనుగోళ్లు చేయడం వల్ల, ఆదాయ లోటు భర్తీ అవుతుందని వివరించాను. ఆ విధంగా ఏకాభిప్రాయం సాధించడం వీలైంది' అని ఆమె వివరించారు. జీఎస్‌టీ మండలిలో రాష్ట్రాలు నిర్మాణాత్మకంగా పాలుపంచుకున్నాయని మంత్రి కితాబిచ్చారు. పన్ను సంస్కరణల విషయంలో నిబద్ధతతో వ్యవహరించాయని పేర్కొన్నారు.

కార్ల ధరల తగ్గింపు షురూ...

- రూ.65 వేల నుంచి 1.45 లక్షల వరకు టాటా కార్ల రేట్లు తగ్గుదల
- మహీంద్రా వాహన ధరలు గరిష్టంగా రూ.1.56 లక్షల వరకు డౌన్
- టయోటా కార్లు గరిష్టంగా 3.34 లక్షల వరకు తగ్గింపు
- రూ.96 వేల వరకు తగ్గనున్న రెనో కార్ల రేట్లు



ముంబై: జీఎస్‌టీ క్రమబద్ధీకరణ ప్రయోజనాన్ని కస్టమర్లకు అందించేందుకు ఆటో కంపెనీలు సిద్ధమయ్యాయి. అందులో భాగంగా తమ వాహన ధరలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. పండుగ సీజన్ అమ్మకాలు పెంచుకునే లక్ష్యంలో భాగంగా మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రెనో ఇండియా, టయోటా కిర్లోస్కర్ ఇండియా, వాహన ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే టాటా మోటార్స్ తమ ప్యాసింజర్ వాహన ధరల్ని కనీసం రూ. 75 వేల నుంచి గరిష్టంగా రూ. 1.45 లక్షల వరకు తగ్గిస్తామని తెలిపింది. మరో వైపు సవరించిన జీఎస్‌టీ రేట్లకు అనుగుణంగా కార్ల ధరలను తగ్గించేందుకు కసరత్తు చేస్తున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్ సీ.భార్గవ చెప్పారు. మొత్తానికి ఈ పండుగ సీజన్‌లో వాహన విక్రయాలు దుమ్ము దులిపేస్తాయని ఆటో పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మహీంద్రా అండ్ మహీంద్రా: ఎక్స్‌యూవీ3ఎక్స్‌ఓ డీజిల్ మోడల్‌పై రూ.1.56 లక్షల వరకు, స్కార్పియో ఎన్ ధర రూ.1.45 లక్షలు వరకూ తగ్గించింది. ఎక్స్‌యూవీ700పై రూ.1.43 లక్షలు, ఎక్స్‌యూవీ3ఎక్స్‌ఓ పెట్రోల్ మోడల్‌పై రూ.1.40 లక్షల వరకు, థార్ 2డబ్ల్యూడీ (డీజిల్) వేరియంట్ రూ.1.35 లక్షల వరకు, థార్ 4డబ్ల్యూడీ డీజిల్ కార్లపై రూ.1.01 లక్షల వరకు, స్కార్పియో క్లాసిక్ రూ.1.01 లక్షల వరకు థార్ రోక్స్ పై రూ.1.33 లక్షల వరకు తగ్గింపు ప్రకటించింది. బొలెరో/నియోపై రూ.1.27 లక్షలు తగ్గించింది. జీఎస్‌టీ కొత్త రేట్లు సెప్టెంబర్ 22, 2025 నుండి అమల్లోకి రావాల్సి ఉంది. కానీ మహీంద్రా మాత్రం తక్షణమే వినియోగదారులకు లాభం చేకూర్చాలని నిర్ణయించింది. కంపెనీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తన సోషల్ మీడియా సందేశంలో, ''అందరూ సెప్టెంబర్ 22 కోసం ఎదురుచూస్తున్నారు. కానీ మేము ఇప్పుడే జీఎస్‌టీ ప్రయోజనాలను అందిస్తున్నాం. తక్షణమే (సెప్టెంబర్ 6 నుంచే) తగ్గింపు రేట్లను పొందండి'' అని పేర్కొన్నారు.

రెనో ఇండియా సైతం: తన మోడళ్లపై తగ్గింపులను జీఎస్టీ క్రమబద్ధీకరణకు అనుగుణంగా ప్రకటించింది. మోడళ్ల వారీగా తగ్గిన రెనో రేట్లను పరిశీలిస్తే.. ఎంట్రీ లెవల్ క్విడ్ మోడల్ ధర రూ.55,095 తగ్గింది. ట్రైబర్ మోడల్ రూ.80,195 వరకు చౌకగా మారుతుంది. కైగర్ మోడల్ రూ.96,395 వరకు ధర తగ్గింపుతో అందుబాటులోకి వస్తోంది. తగ్గింపు ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని కంపెనీ పేర్కొంది.

తగ్గింపు బాటలో టయోటో కిర్లోస్కర్: టయోటా కిర్లోస్కర్ మోటార్ సైతం జీఎస్‌టీ రేటు తగ్గింపు ప్రయోజనాలను పూర్తి స్థాయిలో కస్టమర్లకు బదిలీ చేస్తామని ప్రకటించింది. తమ కార్ల ధరలను గరిష్ఠంగా రూ.3.34 లక్షల వరకు తగ్గించనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 22 నుంచి చేసే అన్ని డెలివరీలపై ఈ తగ్గింపు వర్తిస్తుందని సంస్థ వెల్లడించింది. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం ... ఫార్చ్యూనర్ ధర రూ. 3.49 లక్షల వరకు తగ్గనుంది. వెల్‌ఫైర్ ధర రూ. 2.78 లక్షలు, హైలక్స్ ధర రూ.2.52 లక్షలు, కామ్రీ ధర రూ.1.01 లక్షల తగ్గనున్నాయి. కామ్రీ ధరలో రూ. 1.01 లక్షలు, లెజెండర్‌లో రూ. 3.34 లక్షలు, అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో రూ. 65,400, గ్లాంజాలో రూ. 85,300 తగ్గింపు ఉంటుంది. ''చారిత్రాత్మక సంస్కరణ చేపట్టిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఇది ఆటో సెక్టార్‌లో విశ్వాసాన్ని బలోపేతం చేస్తుంది. ఈ రాయితీలు కస్టమర్లకు కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు ఉపయోగపడతాయని టయోటో కిర్లోస్కర్ మోటార్ వైస్ ప్రెసిడెంట్ వరిందర్ వధ్వా తెలిపారు.

సిట్రోయెన్ 'బసాల్ట్ ఎక్స్' కార్లు

ధర రూ. 7.95 లక్షల నుంచి ప్రారంభం



కార్ల కంపెనీ సిట్రోయెన్ ఇండియా తాజాగా బసాల్ట్ ఎక్స్ శ్రేణి కార్లను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 7.95 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో దేశీయంగా తొలిసారి ఏఐ ఆధారిత వాయిస్ అసిస్టెంట్ 'కారా', ప్రీమియం ఇంటీరియర్స్, క్రూయిజ్ కంట్రోల్, 360 డిగ్రీ కెమెరా, రిమోట్ స్టార్ట్, ఆరు ఎయిర్ బ్యాగ్స్ తదితర ఫీచర్లు ఉన్నాయి. సెప్టెంబర్ మధ్య నుంచి ఇవి టెస్ట్ డ్రైవ్‌లకు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది.

ఫుడ్ ప్రాసెసింగ్ @ 535 బిలియన్ డాలర్లు

- 2025–26 ఆఖరు నాటికి అంచనాలు
- పరిశ్రమ నిపుణుల వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 2025–26 ఆఖరు నాటికి 535 బిలియన్ డాలర్లకు చేరనుంది. వినియోగం, ఎగుమతులు పెరుగుతుండటం, మేకిన్ ఇండియాపై ప్రభుత్వం మరింతగా దృష్టి పెడుతుండటంలాంటి అంశాలు ఇందుకు దోహదపడనున్నట్లు పరిశ్రమ నిపుణులు తెలిపారు. ఏఐ ఆటోమేషన్, స్మార్ట్ ప్యాకేజింగ్‌లో సరికొత్త మార్పులు వస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా ఆహారం, ప్యాకేజింగ్ మెటీరియల్స్ హబ్‌గా భారత్ ఎదిగే అవకాశం ఉందని పై ఇండియా, ప్రోప్యాక్ ఇండియా పేరిట ఇన్ఫోర్మా మార్కెట్స్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నిపుణులు చెప్పారు.

ప్రస్తుతం 1.9 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ సేంద్రియ ఆహార మార్కెట్ ఏటా 20.13 శాతం వృద్ధి రేటుతో 2033 నాటికి 10.8 బిలియన్ డాలర్లకు చేరగలదని వివరించారు. ఆహార రంగానికి వెన్నెముకగా ఉంటున్న ఆహార పదార్థాల మార్కెట్ ఏటా 7–8 శాతం పెరుగుతోందని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) చీఫ్ సైంటిస్ట్ మీనాక్షి సింగ్ తెలిపారు. ఆహార భద్రత, నాణ్యతను పరిరక్షించడంలో ప్యాకేజింగ్ పరిశ్రమ కూడా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ)లాంటి స్కీముల దన్నుతో పరిశ్రమ గణనీయంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. లేబులింగ్, సేంద్రియ ఆహార ప్రమాణాలు, వినియోగదారుల్లో అవగాహన పెంచడంలాంటి అంశాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠినంగా దృష్టి పెడుతుండటంతో పరిశ్రమ పాటించే విధానాల్లోనూ మార్పులు వస్తున్నాయని చాంబర్ ఆఫ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ స్మాల్, మీడియం బిజినెసెస్ ప్రెసిడెంట్ నీలేష్ లెలె తెలిపారు.

ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలపై ఆసక్తి..

భారతీయుల ఆహార అలవాట్లు (బాస్మతి బియ్యం లేదా ప్రాంతాలను బట్టి పచ్చళ్లలాంటివి), ప్రవాస భారతీయుల వినియోగ ధోరణుల్లోను మార్పులకు దారి తీయడం కొనసాగుతోంది. ఆరోగ్యంపై అవగాహన, సేంద్రియ.. మొక్కల ఆధారిత ఆహారానికి ప్రాధాన్యత పెరుగుతున్నందున భారతీయ ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ప్రస్తుతం పరివర్తనాత్మక దశలో ఉన్నట్లు ఇన్ఫోర్మా మార్కెట్స్ ఇన్ ఇండియా ఎండీ యోగేష్ ముద్రాస్ తెలిపారు. వినియోగదారులు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలకు కాస్త ఎక్కువ వెచ్చించేందుకు సిద్ధంగా ఉంటున్నారని వివరించారు. దీనితో పండ్లు, కూరగాయలు, మొక్కల ఆధారిత ఆహార ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోందని యోగేష్ చెప్పారు. 'సేంద్రియ ఆహార పరిశ్రమ ప్రస్తుతం 2 బిలియన్ డాలర్లుగా ఉండగా ఏటా 22 శాతం వృద్ధి చెందుతూ, 2033 నాటికి 10 బిలియన్ డాలర్లకు ఎగియనుంది. ఫుడ్ మార్కెట్లో ప్రస్తుతం సేంద్రియ ఆహారోత్పత్తుల వాటా స్వల్పస్థాయిలోనే ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైన, పర్యావరణహితమైన ఉత్పత్తుల కోసం 7–20 శాతం అధికంగా చెల్లించేందుకు కూడా వినియోగదారులు సిద్ధంగా ఉంటున్నారు' అని ఎన్విరోకేర్ ల్యాబ్స్ ఎండీ నీలేష్ అమృత్‌కర్ తెలిపారు. మూడు రోజులపాటు జరిగిన పై ఇండియా, ప్రోప్యాక్ ఇండియా కార్యక్రమంలో 50 పైగా దేశాల నుంచి 15,000 మంది పైచిలుకు నిపుణులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ రంగం పటిష్టం..

10 కోట్ల మంది డెయిరీ రైతులకు లబ్ధి

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం
- జీఎస్‌టీ తగ్గింపుపై నిపుణుల విశ్లేషణ



సాక్షి, న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా డెయిరీ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, కోఆపరేటివ్ రంగం బలోపేతం అవుతుందని కేంద్ర సహకార శాఖ వెల్లడించింది. పాల ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ యంత్రాలు, ఎరువులు, బయో–పెస్టిసైడ్లు, రవాణా వాహనాలపై పన్ను తగ్గింపుల వల్ల రైతులు, కోఆపరేటివ్ సంస్థలు, గ్రామీణ వ్యాపారాలు నేరుగా లాభపడనున్నాయి. ఈ నిర్ణయాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సంస్కరణల్లో భాగంగా పాలు, పనీర్‌పై జీఎస్‌టీని పూర్తిగా మినహాయించగా, వెన్న, నెయ్యిలపై పన్ను 12% నుంచి 5%కి తగ్గుతుంది. పాల డబ్బాల (ఇనుము, స్టీల్, అల్యూమినియం) పైన కూడా పన్ను తగ్గింపుతో పాల ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. దీని వలన డెయిరీ రైతులకు ఆదాయం పెరుగుతుందని, గ్రామీణ మహిళా స్వయంసహాయక సంఘాలకు ఇది పెద్ద ఊరట అవుతుందని నిపుణులు తెలిపారు. మొత్తం మీద, ఈ పన్ను తగ్గింపులు కోట్లాది గృహాలకు చౌకైన ఆహార ఉత్పత్తులు అందించడంతోపాటు, రైతుల ఆదాయాన్ని పెంచి, గ్రామీణ వ్యాపారాలు మరింత బలోపేతం కావడానికి దోహదం చేయగలవని పేర్కొన్నారు. 'నెక్స్‌జెన్ జీఎస్‌టీ సంస్కరణల'ను డెయిరీ కోఆపరేటివ్ రంగం స్వాగతించింది. అమూల్ వంటి ప్రముఖ కోఆపరేటివ్ బ్రాండ్లు దీనిని రైతు–గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా అభివర్ణించాయి.

ఆహార ప్రాసెసింగ్‌కి ఊతం: చీజ్, నమ్‌కీన్‌లు, పాస్తా, జామ్, జెల్లీ, ఫ్రూట్ జ్యూస్ డ్రింక్స్, భుజియా వంటి ఉత్పత్తులపై జీఎస్‌టీ 5 శాతానికి పరిమితం కానుంది. చాక్లెట్స్, కార్న్‌ఫ్లేక్స్, ఐస్‌క్రీమ్, బిస్కెట్లు, కాఫీ వంటి ఉత్పత్తులపై పన్ను 18% నుంచి 5%కు తగ్గించడం వల్ల ప్రజలపై భారం తగ్గనుంది. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగి, ఆహార ప్రాసెసింగ్ రంగం పుంజుకునే అవకాశం ఉంది.

రైతులకు ఉపశమనం: 1800 సీసీ లోపు ట్రాక్టర్లు, వాటి విడి భాగాలపై జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించడం, అలాగే ఎరువుల తయారీలో వాడే అమోనియా, సల్ఫ్యూరిక్ యాసిడ్, నైట్రిక్ యాసిడ్‌పై పన్ను 18% నుంచి 5 శాతానికి తగ్గించడం వంటి అంశాలు రైతులకు ప్రయోజనం చేకూర్చనున్నాయి. 12 రకాల బయో–పెస్టిసైడ్లు, మైక్రోన్యూట్రియెంట్లపై పన్ను తగ్గింపుతో సేంద్రియ వ్యవసాయానికి ఊతం లభిస్తుంది. ట్రక్కులు, డెలివరీ వ్యాన్లపై పన్ను 28% నుంచి 18%కి తగ్గించడంతో రవాణాకు సంబంధించి వాహనాలపరమైన భారం గణనీయంగా తగ్గనుంది. రైతుల ఉత్పత్తులు మార్కెట్లకు తక్కువ ఖర్చుతో చేరి, ఎగుమతుల పోటీ సామర్థ్యం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. గూడ్స్ క్యారేజ్ వాహనాల థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌పై పన్ను తగ్గించడం మరో ముఖ్యమైన నిర్ణయమని విశ్లేషకులు తెలిపారు.



పబ్లిక్ ఇష్యూకి టర్టిల్‌మింట్

న్యూఢిల్లీ: ఇన్సూరెన్స్ టెక్నాలజీ సంస్థ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ తాజాగా పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు సంబంధించిన పత్రాలను ప్రీ–ఫైలింగ్ విధానంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్, జెఫ్రీస్ ఇండియా తదితర సంస్థలు ఈ ఇష్యూకి మర్చంట్ బ్యాంకర్లుగా వ్యవహరిస్తున్నాయి. 2015లో ధీరేంద్ర మాహ్యావంశీ, ఆనంద్ ప్రభుదేశాయ్ కలిసి టర్టిల్‌మింట్‌ను ప్రారంభించారు. బీమా పాలసీల కొనుగోలు, నిర్వహణ ప్రక్రియను సరళతరం చేసే లక్ష్యంతో కంపెనీ ఏర్పాటైంది. అయిదు లక్షల మంది పైగా అడ్వైజర్లతో సంస్థ దాదాపు 1.6 కోట్ల పాలసీలను విక్రయించింది. ఇందులో అమాన్సా క్యాపిటల్, నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ మొదలైన సంస్థలు ఇన్వెస్ట్ చేశాయి.

రూ. 499 కోట్ల సుప్రీత్ కెమికల్స్ ఐపీవో

న్యూఢిల్లీ: సుప్రీత్ కెమికల్స్ సంస్థ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా రూ. 499 కోట్లు సమీకరించనుంది. ఇందుకోసం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవో పూర్తిగా తాజా షేర్ల జారీ రూపంలో ఉంటుందని కంపెనీ తెలిపింది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 310 కోట్లను కొత్త ప్రాజెక్టు ఏర్పాటుకు, మరో రూ. 65 కోట్ల మొత్తాన్ని రుణాలు చెల్లింపునకు సంస్థ వినియోగించుకోనుంది. 2025 మార్చి ఆఖరు నాటికి కంపెనీ మొతత్తం రుణభారం రూ. 200 కోట్లుగా ఉంది. ప్రీ–ఐపీవో ప్లేస్‌మెంట్ ద్వారా సుప్రీత్ కెమికల్స్ రూ. 99 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. అలా సమీకరిస్తే తాజా షేర్ల జారీ తగ్గుతుంది. గుజరాత్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సుప్రీత్ కెమికల్స్ ప్రధానంగా స్పెషాలిటీ కెమికల్ ఇంటర్మీడియట్స్‌ను తయారు చేస్తోంది. టెక్స్‌టైల్స్, ఫార్మా, ఆగ్రో–కెమికల్స్ తదితర పరిశ్రమలకు అవసరమయ్యే ఉత్పత్తులను అందిస్తోంది. 2024లో 1,309 బిలియన్ డాలర్లుగా ఉన్న గ్లోబల్ స్పెషాలిటీ కెమికల్స్ ఇంటర్మీడియట్స్ మార్కెట్ 2029 నాటికి 1,802 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి.



భారత్ 'ఎ' సారథిగా శ్రేయస్ అయ్యర్

ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో అనధికారిక టెస్టు సిరీస్

ముంబై: ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌కు ఎంపిక కాని టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్... భారత 'ఎ' జట్టుకు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఆస్ట్రేలియా 'ఎ'తో జరగనున్న రెండు మ్యాచ్‌ల అనధికారిక టెస్టు సిరీస్ కోసం సెలెక్టర్లు శనివారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. వచ్చే నెలలో వెస్టిండీస్‌తో టీమిండియా టెస్టు సిరీస్ ఆడనున్న నేపథ్యంలో... ఆస్ట్రేలియా 'ఎ'తో అనధికారిక మ్యాచ్‌లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత జట్టులో సుస్థిర స్థానం దక్కించుకోవాలని భావిస్తున్న ఆటగాళ్లకు ఈ మ్యాచ్‌లు కీలకం కానున్నాయి. ఆసియాకప్‌నకు కనీసం రిజర్వ్ ప్లేయర్‌గానూ ఎంపిక కాని శ్రేయస్ అయ్యర్... ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో వెస్ట్ జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. టీమిండియా ప్లేయర్లు కేఎల్ రాహుల్, మొహమ్మద్ సిరాజ్ రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నారు. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా మూడో మ్యాచ్ అనంతరం గాయపడిన ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కోలుకొని ఆసీస్ 'ఎ'తో మ్యాచ్‌లకు అందుబాటులోకి వచ్చాడు. భారత్ 'ఎ', ఆస్ట్రేలియా 'ఎ' **మధ్య ఈ నెల 16 నుంచి 19 వరకు తొలి అనధికారిక టెస్టు జరగనుంది. 23 నుంచి రెండో మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఈ** రెండు మ్యాచ్‌లు లక్నోలోనే జరగనున్నాయి. ఇంగ్లండ్‌తో చివరి టెస్టులో గాయపడిన సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ ఈ సిరీస్‌కు ఎంపిక కాకపోగా... ధ్రువ్ జురెల్ జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దులీప్ ట్రోఫీలో సౌత్ జోన్ తరఫున ఆకట్టుకుంటున్న జగదీశన్, ముంబై ఆల్‌రౌండర్ తనుశ్ కొటియాన్‌తో పాటు విదర్భ ప్లేయర్లు హర్ష్ దూబే, యశ్ ఠాకూర్‌కు జట్టులో చోటు దక్కింది. మరోవైపు ఆస్ట్రేలియా 'ఎ' జట్టులో సైతం పలువురు టెస్టు ఆటగాళ్లు ఉన్నారు. సామ్ కొన్‌స్టాస్, నాథన్ మెక్‌స్వీనీ, కూపర్ కానొలీ, టాడ్ మర్ఫీ వంటి వాళ్లు ఆసీస్ తరఫున బరిలోకి దిగనున్నారు.

భారత 'ఎ' జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, జగదీశన్, సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, దేవదత్ పడిక్కల్, హర్ష్ దూబే, ఆయుష్ బదోనీ, నితీశ్ కుమార్ రెడ్డి, తనుశ్ కొటియాన్, ప్రసిధ్ కృష్ణ, గుర్‌నూర్ బ్రార్, ఖలీల్ అహ్మద్, మానవ్ సుతార్, యశ్ ఠాకూర్.


సూర్య


పాండ్యా

జోరుగా టీమిండియా సాధన

దుబాయ్: ఆసియాకప్ టి20 టోర్నమెంట్ కోసం భారత జట్టు ముమ్మర సాధన చేస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ (యూఏఈ)లో మంగళవారం నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుండగా... బుధవారం ఆతిథ్య యూఏఈతో టీమిండియా తమ తొలి మ్యాచ్ ఆడనుంది. టోర్నీలో భాగంగా ఈ నెల 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న భారత జట్టు... ఐసీసీ అకాడమీలో జోరుగా ప్రాక్టీస్‌లో పాల్గొంది. ఫిట్‌నెస్ డ్రిల్స్ సందర్భంగా శుబ్‌మన్ గిల్ ఆకట్టుకోగా... సూర్యకుమార్ యాదవ్, సంజు సామ్సన్, జితేశ్ శర్మ, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ నెట్స్‌లో సుదీర్ఘంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. ఇంగ్లండ్ పర్యటన అనంతరం భారత జట్టు ఆడనున్న తొలి మ్యాచ్ ఇదే కాగా... భారత టెస్టు సారథి గిల్, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ వంటి వాళ్లు కాస్త విరామం అనంతరం మైదానంలోకి అడుగుపెట్టారు. గతేడాది టి20 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత బుమ్రా ఈ ఫార్మాట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. పేస్ ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, దూబే అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ శిక్షణను పర్యవేక్షించాడు. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో భారత జట్టు ఎనిమిది సార్లు ఆసియాకప్ ట్రోఫీ చేజిక్కించుకుంది.



వెర్‌స్టాపెన్‌కు 'పోల్'

మోన్జా (ఇటలీ): ఫార్ములావన్ ఇటాలియన్ గ్రాండ్ ప్రిలో వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) 'పోల్ పొజిషన్' సాధించాడు. ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్... శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రేసులో అగ్ర స్థానం దక్కించుకున్నాడు. హోరాహోరీగా సాగిన రేసులో ఈ రెడ్‌బుల్ డ్రైవర్ ల్యాప్‌ను 1 నిమిషం 18.792 సెకన్లలో పూర్తి చేసి 'టాప్'లో నిలిచాడు. ఈ క్రమంలో వెర్‌స్టాపెన్ కొత్త ల్యాప్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఇటాలియన్ గ్రాండ్ ప్రిలో పోల్ పొజిషన్ దక్కించుకోవడం వెర్‌స్టాపెన్‌కు ఇది రెండోసారి. ఈ సీజన్‌లో అతడికిది ఐదో 'పోల్' కాగా... ఓవరాల్‌గా 45వది. మెక్‌లారెన్ డ్రైవర్లు లాండో నోరిస్ (1 నిమిషం 18.869 సెకన్లు), ఆస్కార్ పియాస్ట్రి (1 నిమిషం 18.982 సెకన్లు) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. రేసు అనంతరం వెర్‌స్టాపెన్ స్పందిస్తూ... 'నమ్మశక్యంగా లేదు. కానీ సాధించా. సంతృప్తిగా ఉంది' అని అన్నాడు. ఫెరారీ డ్రైవర్లు చార్లెస్ లెక్‌లెర్క్ (1 నిమిషం 19.007 సెకన్లు), లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 19.124 సెకన్లు) వరుసగా నాలుగో, ఐదో స్థానాలు దక్కించుకున్నారు. కాగా... హామిల్టన్‌కు గ్రిడ్ పెనాల్టీ విధించడంతో ఆదివారం అతడు పదో స్థానం నుంచి రేసును ప్రారంభించనున్నాడు. సీజన్‌లో మరో తొమ్మిది రేసులు మిగిలుండగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్ రేసులో పియాస్ట్రి 309 పాయింట్లతో అగ్ర స్థానంలో దూసుకెళ్తున్నాడు. నోరిస్ (275 పాయింట్లు) రెండో స్థానంలో ఉండగా... నాలుగుసార్లు చాంపియన్ వెర్‌స్టాపెన్ (205 పాయింట్లు) మూడో 'ప్లేస్'లో ఉన్నాడు.

శ్రీలంక 80 ఆలౌట్

రెండో టి20లో జింబాబ్వే విజయం


సికందర్

హరారే: బౌలర్లు విజృంభించడంతో శ్రీలంకతో రెండో టి20లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో పోరులో జింబాబ్వే 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో సిరీస్ 1–1తో సమమైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 17.4 ఓవర్లలో 80 పరుగులకే ఆలౌటైంది. ఈ ఫార్మాట్‌లో శ్రీలంకకు ఇది రెండో అత్యల్ప స్కోరు. కెప్టెన్ చరిత అసలంక (18), కమిల్ (20), షనక (15) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. కుశాల్ మెండిస్ (1), పాథుమ్ నిశాంక (8), నువిందు ఫెర్నాండో (1), కమిందు మెండిస్ (0) విఫలమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (3/11), బ్రాడ్ ఇవాన్స్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. బ్లెస్సింగ్ ముజరబానీ రెండు వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో జింబాబ్వే... 14.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. ర్యాన్ బర్ల్ (22 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు), టషింగా ముసెకివా (14 బంతుల్లో 21 నాటౌట్; 3 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. లంక బౌలర్లలో దుష్మంత చమీర 3 వికెట్లు పడగొట్టారు.

రాణించిన ఉపేంద్ర, హర్ష్

తొలి ఇన్నింగ్స్‌లో 118 పరుగుల ఆధిక్యం

సెంట్రల్ జోన్ 556/8 • వెస్ట్‌జోన్‌తో దులీప్ ట్రోఫీ సెమీస్


ఉపేంద్ర, హర్ష్

బెంగళూరు: బ్యాటర్ల సమష్టిగా రాణించడంతో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సెంట్రల్ జోన్‌కు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వెస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో సెంట్రల్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 157 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 556 పరుగుల భారీస్కోరు చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్, కెప్టెన్ రజత్ పాటీదార్ (77; 14 ఫోర్లు) సహా ఉపేంద్ర యాదవ్ (87; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్ష్ దూబే (75; 13 ఫోర్లు) అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. దీంతో వెస్ట్‌జోన్ (438) తొలి ఇన్నింగ్స్ స్కోరును సెంట్రల్ అధిగమించింది. ప్రస్తుతం 118 పరుగుల ఆధిక్యంలో ఉన్న సెంట్రల్ చేతిలో ఇంకా 2 వికెట్లున్నాయి. వెస్ట్ బౌలర్లలో ధర్మేంద్రసింగ్ జడేజా 4 వికెట్లు తీశాడు.

నడిపించిన బ్యాటర్లు

సెంట్రల్ బ్యాటర్లంతా మూకుమ్మడిగా ఇన్నింగ్స్ బాధ్యతల్ని మోశారు. మూడో రోజు 229/2 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం ఆట కొనసాగించిన సెంట్రల్ ఇన్నింగ్స్‌కు మిడిలార్డర్ నుంచి టెయిలెండర్ల దాకా వెన్నెముకగా నిలిచారు. ప్రతీ ఒక్కరూ రాణించారు. ఓవర్‌నైట్ బ్యాటర్లలో రజత్ పాటీదార్ అర్ధసెంచరీ తర్వాత వేగంగా ఆడే క్రమంలో వికెట్‌ను కోల్పోయాడు. కానీ శుభమ్ శర్మ (241 బంతుల్లో 96; 11 ఫోర్లు) నింపాదిగా ఆడుతూ సెంచరీ దిశగా పయనించాడు. ఉపేంద్ర అతనికి అండగా నిలిచాడు. ఇద్దరి ఆటతో సెంట్రల్ 300 పరుగులు దాటింది. కాసేపటికి సెంచరీకి చేరువైన శుభమ్ 4 పరుగుల తేడాతో మూడంకెల స్కోరుకు దూరమయ్యాడు. అతను రనౌట్ కాగా, హర్ష్ దూబే వచ్చాక మళ్లీ వెస్ట్ బౌలర్లకు కష్టాలు మొదలయ్యాయి.

దూబే, ఉపేంద్ర ఫిఫ్టీ–ఫిఫ్టీ

క్రీజులో పాతుకుపోయిన హర్ష్, ఉపేంద్ర వెస్ట్ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. దీంతో యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్‌లు సహా ఏకంగా 8 మంది బౌలర్లను వెస్ట్‌జోన్ ప్రయోగించింది. కానీ దూబే, ఉపేంద్ర పరుగులు చక్కబెట్టే పనికి ఏ దశలోనూ ఇబ్బంది ఎదురు కాలేదు. ఇద్దరు అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. జట్టు స్కోరు కూడా చూస్తుండగానే వెస్ట్ తొలి ఇన్నింగ్స్ స్కోరు (438)ను దాటింది. బౌండరీలతో దూకుడుగా ఆడుతున్న హర్ష్ దూబేను ఎట్టకేలకు ధర్మేంద్రసింగ్ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 134 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపయ్యాక ములానీ బౌలింగ్‌లో ఉపేంద్ర కూడా అవుటయ్యాడు. వీరిద్దరిని పెవిలియన్‌కు చేర్చినప్పటికీ సెంట్రల్ ఆలౌట్ కాకుండా టెయిలెండర్లు సారాంశ్ జైన్ (83 బంతుల్లో 37 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్), దీపక్ చహర్ (52 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడారు.

శుభమ్ ఖజురియా అజేయ శతకం

- రాణించిన నిశాంత్
- నార్త్‌జోన్ 278/5
- దులీప్ ట్రోఫీ సెమీస్


నిశాంత్


శుభమ్

బెంగళూరు: ఓపెనర్ శుభమ్ ఖజురియా (245 బంతుల్లో 128 బ్యాటింగ్; 20 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో నార్త్‌జోన్ పోరాడుతోంది. దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్‌జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మూడో రోజు ఆట నిలిచే సమయానికి నార్త్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. మిడిలార్డర్‌లో నిశాంత్ సింధు (148 బంతుల్లో 82; 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. సౌత్‌జోన్ పేసర్ గుర్‌జప్‌నీత్ సింగ్ (3/67) టాపార్డర్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ప్రస్తుతం నార్త్‌జోన్ చేతిలో 5 వికెట్లున్నప్పటికీ ఇంకా 258 పరుగులు వెనుకబడి ఉంది. మ్యాచ్‌కు కేవలం చివరి రోజు ఆటే మిగిలుంది. ఈ నేపథ్యంలో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఫైనల్ చేరాలన్నా నార్త్‌జోన్ రోజంతా బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఓపెనర్ శుభమ్ మినహా స్పెషలిస్టు బ్యాటర్లెవరూ అందుబాటులో లేరు. ఇది నార్త్‌జోన్‌కు కష్టసాధ్యమైన సవాల్!

శతక్కొట్టిన ఖజురియా

తాజాగా మూడో రోజు ఆటలో తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన నార్త్‌కు ఆరంభంలోనే కష్టాలు ఎదురయ్యాయి. శుభమ్ కజురియాతో కలిసి ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన కెప్టెన్ అంకిత్ కుమార్ (6) ఆరో ఓవర్లోనే వికెట్‌ను పారేసుకున్నాడు. గుర్‌జప్‌నీత్ సింగ్ అతన్ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో 20 పరుగులకే తొలి వికెట్ కూలింది. ఈ గాయం నుంచి కోలుకోకముందే తన మరుసటి ఓవర్లో గుర్‌జప్‌నీత్ వన్‌డౌన్ బ్యాటర్ యశ్ ధుల్ (14)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో 38 పరుగులకే రెండు కీలక వికెట్లను నార్త్‌జోన్ కోల్పోయింది. ఈ దశలో శుభమ్‌కు జతయిన ఆయుశ్ బదోని (57 బంతుల్లో 40; 5 ఫోర్లు) చక్కని సహకారం అందించడంతో వికెట్ల పతనం కాసేపు ఆగిపోయింది. ఇద్దరు వికెట్‌ను కాపాడుకుంటూ పరుగులు జతచేశారు. వీరిద్దరి సమన్వయంతో జట్టు స్కోరు వందను దాటింది. ఈ భాగస్వామ్యం బలపడుతున్న క్రమంలో బదోనిని నిధీశ్ ఎల్బీగా పెవిలియన్ పంపాడు. 63 పరుగుల భాగస్వామ్యం ముగియగా... ఈ దశలో క్రీజులోకి వచ్చిన నిశాంత్ సింధు ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను తీసుకున్నాడు. నిశాంత్, కజురియా క్రీజులో పాతుకుపోవడంతో సౌత్‌జోన్ బౌలర్లు రెండో సెషన్‌లో శ్రమించాల్సి వచ్చింది. ఇద్దరూ కుదురుగా ఆడటంతో జట్టు స్కోరు 200 మార్క్‌ను దాటింది. బౌలింగ్‌లో 5 వికెట్లు పడగొట్టిన నిశాంత్ బ్యాటింగ్‌లోనూ రాణించి అర్ధసెంచరీ సాధించాడు. మరో వైపు ఓపెనర్ శుభమ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరి భాగస్వామ్యం దుర్భేధ్యంగా మారుతున్న దశలో మళ్లీ గుర్‌జప్‌నీత్ చావుదెబ్బ తీశాడు. నిశాంత్ సింధును అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 171 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.


సౌమ్య

తెలంగాణ శుభారంభం

నారాయణ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): సీనియర్ మహిళల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ రాజ్‌మాత జిజాబాయ్ ట్రోఫీలో తెలంగాణ జట్టు శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి పోరులో తెలంగాణ జట్టు 8–1 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై విజయం సాధించింది. తెలంగాణ జట్టు తరఫున రంజిత దేవి (36వ, 40వ, 51వ, 60వ నిమిషాల్లో) నాలుగు గోల్స్‌తో అదరగొట్టింది. గుగులోత్ సౌమ్య (6వ, 25వ నిమిషంలో), పుల్లూరి సోనీ (21వ, 67వ నిమిషంలో) చెరో రెండు గోల్స్‌తో సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున వ్యాసపురం నందిని (49వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది. మ్యాచ్ ఆరంభమైన ఆరో నిమిషంలోనే సౌమ్య గోల్‌తో ఖాతా తెరిచిన తెలంగాణ... ఇక ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అనుభవం ఉన్న సౌమ్య... రెండు గోల్స్ చేయడంతో పాటు జట్టుకు ఆధిక్యం దక్కడంలో కీలక పాత్ర పోషించింది. శనివారమే జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పశ్చిమ బెంగాల్ 7–0 గోల్స్ తేడాతో మేఘాలయపై, సిక్కిం 2–1తో రైల్వేస్‌పై, అస్సాం 7–0తో త్రిపురపై గెలుపొందాయి. ఛత్తీస్‌గఢ్, కర్ణాటక మధ్య మ్యాచ్ 1–1 గోల్స్‌తో 'డ్రా' కాగా... మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 0–0తో 'డ్రా'గా ముగిసింది. తదుపరి మ్యాచ్‌ల్లో సోమవారం ఛత్తీస్‌గఢ్‌తో తెలంగాణ... కర్ణాటకతో ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడనున్నాయి.



బెంగళూరు బోణీ

పట్నా పరాజయాల 'హ్యాట్రిక్' • ప్రొ కబడ్డీ లీగ్

విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్–12)లో మాజీ చాంపియన్ బెంగళూరు బుల్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. శనివారం జరిగిన పోరులో బెంగళూరు 38–30తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. పీకేఎల్‌లో అత్యధికంగా మూడు సార్లు విజేతగా నిలిచిన పట్నా పరాజయాల పరంపరలో 'హ్యాట్రిక్' నమోదు చేసింది. పైరేట్స్ ఆడిన మూడు ఓడగా... నాలుగో మ్యాచ్‌లో బుల్స్ తొలి విజయాన్ని సాధించింది. బెంగళూరు జట్టులో ఆల్‌రౌండర్ అలీరెజా మిర్జాయిన్ (10), రెయిడర్ ఆశిష్ మాలిక్ (8) అదరగొట్టారు. డిఫెండర్లు దీపక్ శంకర్ (4), యోగేశ్ (3), సత్యప్ప, సంజయ్ చెరో 2 పాయింట్లు చేశారు. పట్నా పైరేట్స్ జట్టులో రెయిడర్ అయాన్ (10) ఒంటరి పోరాటం చేశాడు. 15 సార్లు కూతకెళ్లిన అయాన్ పది పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా వారిలో సుధాకర్ (6), అంకిత్ కుమార్ (4) మెరుగ్గా ఆడారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో గుజరాత్ జెయంట్స్ 37–28తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. గుజరాత్ జట్టులో ఆల్‌రౌండర్లు నితిన్ పన్వార్ (8), మొహమ్మద్ రెజా (6) రాణించారు. రెయిడర్లు రాకేశ్ 6, హిమాన్షు సింగ్ 4 పాయింట్లు సాధించారు. తలైవాస్ జట్టులో కెప్టెన్ పవన్ సెహ్రావత్ (6), నితీశ్ కుమార్ (5), అర్జున్ దేశ్వాల్ (5) ఆకట్టుకున్నారు. నేడు ఆదివారం జరిగే మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్‌తో తెలుగు టైటాన్స్, దబంగ్ ఢిల్లీతో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడనున్నాయి.

ఆధిక్యంలో వైశాలి

ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆర్. వైశాలీ స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగుతోంది. వరుసగా మూడో రౌండ్లోనూ ఆమె ఆస్ట్రియాకు చెందిన ఓల్గా బెడెల్కాపై గెలుపొందడంతో 3 పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలోకి దూసుకొచ్చింది. ఈ మహిళల కేటగిరీలో మిగతా వారికి మాత్రం మూడో రౌండ్ కలిసిరాలేదు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక (1.5) చైనా ప్లేయర్ గువో కి (1.5)తో గేమ్‌ను డ్రా చేసుకోగా, వంతిక అగర్వాల్ (1.5)కు యుజిన్ సంగ్ (చైనా; 2.5) చేతిలో ఓటమి ఎదురైంది. ఓపెన్ కేటగిరీలో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ (2.5)... స్పెయిన్‌కు చెందిన డానిల్ యుఫా (1.5)పై గెలుపొందగా, ఇరిగేశి అర్జున్ (2.5)... అంటోన్ డెంచెంకో (స్లోవేనియా; 2)పై విజయం సాధించాడు. ఆర్. ప్రజ్ఞానంద (1.5)... మాజీ ప్రపంచ చాంపియన్ బోరిస్ గెల్‌ఫాండ్ (ఇజ్రాయెల్; 1.5)ను నిలువరించాడు. విదిత్ సంతోష్ గుజరాతీ (2)... అలెగ్జాండర్ ప్రెడ్కే (సెర్బియా; 2)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు.





ముంబైలో శనివారం గణేశ్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. జనం వేలాదిగా పాల్గొని బొజ్జ గణపయ్యలకు వీడ్కోలు పలికారు

అలహాబాద్ హైకోర్టు జడ్జీలుగా ఇద్దరు న్యాయవాదుల నియామకం

సాక్షి, న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరు న్యాయవాదుల నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. న్యాయవాదులు అమితాభ్ కుమార్ రాయ్, రాజీవ్ లోచన్ శుక్లాలను న్యాయమూర్తులుగా నోటిఫై చేస్తూ శనివారం కేంద్ర న్యాయశాఖ ఒక ప్రకటన జారీ చేసింది. సుప్రీంకోర్టు కొలీజియం మార్చి 25న ఇద్దరు న్యాయవాదుల పేర్లను న్యాయమూర్తులుగా సిఫార్సు చేసింది. అలహాబాద్ హైకోర్టులో గరిష్టంగా మొత్తంగా 160 న్యాయమూర్తుల పోస్టులకు రాజ్యాంగం అనుమతిస్తోంది. కానీ ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ భన్సాల్ సహా కేవలం 85 న్యాయమూర్తులే సేవలందిస్తున్నారు. దీంతో న్యాయ వితరణ తీవ్ర జాప్యం అవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం మొత్తం 26 మంది పేర్లను హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సిఫార్సు చేసింది. వీరిలో 14 మంది న్యాయాధికారులు కాగా, 12 మంది న్యాయవాదులు ఉన్నారు. అందులో నలుగురు మహిళలు సైతం ఉన్నారు

ఉప రాష్ట్రపతి ఎన్నికకు కసరత్తు షురూ!

బీజేపీ పార్టీ ఎంపీలకు ఓటింగ్ విధానంపై నేడు వర్క్‌షాప్ ● తొమ్మిదో తేదీన జరగనున్న ఎన్నిక

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికలకు గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి పక్షాలు తమ కసరత్తును వేగవంతం చేశాయి. తొమ్మిదో తేదీ జరగబోయే ఎన్నికల్లో తమతమ అభ్యర్థులను గెలిపించుకునే దిశగా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఓటింగ్ విధానం, పోలింగ్ సరళిపై పార్టీ ఎంపీలకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన ఆదివారం పార్టీ ఎంపీలకు పార్లమెంట్‌లోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఓటింగ్‌లో పాల్గొనడం, ఓటు వేసే విధానంపై వారికి అవగాహన, శిక్షణ కల్పిస్తారు. సోమవారం ఎన్డీఏ కూటమి పక్షాలతో కలిపి మరో వర్క్‌షాప్ ఏర్పాటు చేసింది. ఎంపీలకు ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం కొనసాగుతుంది. నిజానికి బీజేపీ ఎంపీలతో ఒకటి, ఎన్డీఏ పక్షాల ఎంపీలతో కలిపి మరో విందు భేటీలను ఏర్పాటు చేసినా, దేశవ్యాప్తంగా వరద పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విందు భేటీలను బీజేపీ రద్దు చేసింది. ఉప రాష్ట్రపతి పదవి కోసం ఎన్డీఏ పక్షాల తరఫున సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి పక్షాల తరఫున జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పోటీలో ఉన్న విషయం విదితమే. బ్యాలెట్ పత్రంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు ముందుగా ఉండగా, తర్వాత సీపీ రాధాకృష్ణన్ పేర్లు ఉన్నాయి. ప్రాధాన్యతల క్రమంలో ఓటు వేయాల్సి ఉండగా, తొలి ప్రాధాన్యత గుర్తించడం తప్పనిసరి కాగా, రెండో ప్రాధాన్యత ఐచ్ఛికం. ప్రాధాన్యతలను గుర్తించడానికి ప్రత్యేకమైన పెన్నులను ఎన్నికల కమిషన్ సరఫరా చేస్తుంది. బ్యాలెట్ పేపర్ అందజేసినప్పుడు నియమించబడిన అధికారి ఓటర్లకు ఈ పెన్నును అందజేస్తారు. ఓటర్లు బ్యాలెట్ పేపర్‌ను ఈ ప్రత్యేకమైన పెన్నుతో గుర్తించాలి. మరే ఇతర పెన్ను వాడరాదు. వీటన్నింటిపై ఎంపీలకు పార్టీ అవగాహన కల్పించనుంది.

8న ఇండియా కూటమి మాక్‌పోల్

ఇండియా కూటమి ఈ నెల 8న ఇండియా కూటమి పక్షాల ఎంపీలతో భేటీ కానుంది. ఓటింగ్‌లో పాల్గొనే విధానంపై ఈ సందర్భంగా మాక్‌పోల్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎంపీలకు విపక్షాల కూటమి సమాచారం అందించింది. లోక్‌సభ, రాజ్యసభలో కలిపి మొత్తం బలం 786 కాగా, ఇందులో ఆరు ఖాళీలు ఉన్నాయి. ఒక అభ్యర్థి గెలవాలంటే కనీసం 394 ఓట్లు అవసరం. 542 మంది సభ్యులున్న లోక్‌సభలో 293 మంది ఎంపీలు, 240 మంది సభ్యులున్న రాజ్యసభలో 129 మంది సభ్యుల మద్దతు అధికార కూటమికి ఉంది. 422 మంది ఎంపీల మద్దతుతో ఎన్డీఏ చాలా ముందంజలో ఉంది. విపక్ష ఇండియా కూటమికి 323 సభ్యుల మద్దతు ఉంది. తాజాగా ఆప్ సైతం మద్దతు ప్రకటించింది. ఈ లెక్కన ఆప్‌లోని 11 మంది ఎంపీల బలం కలిస్తే విపక్ష కూటమి బలం 334కు పెరగనుంది. ఇక తటస్థంగా ఉన్న కొన్ని పార్టీలు చివర్లో తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ఈ సంఖ్య కొంచెం అటు ఇటుగా మారనుంది.

వేరొకరితో సహజీవనం చేస్తే భరణం హక్కుండదు

ఒక విడాకుల కేసులో తీర్పు ఇచ్చిన ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: వేరే పురుషునితో సహజీవనం చేస్తూ భర్త నుంచి భరణం పొందేందుకు ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ ఫ్యామిలీ కోర్టు కొట్టివేసింది. మరో వ్యక్తితో ఆ మహిళ సహజీవనం చేస్తోందనే కారణంతో ఆమెకు భరణం హక్కు ఉండదని ఫ్యామిలీ కోర్టు స్పష్టం చేసింది. తన మాజీ భర్త చట్టపరంగా, నైతికంగానూ తనకు భరణం చెల్లించాల్సిన బాధ్యత ఉందని మహిళ వాదించినప్పటికీ కోర్టు ఆ వాదనలో పసలేదని తిరస్కరించింది. గతంలో జరిగిన విచారణలోనూ డీఎన్ఏ పరీక్ష ఫలితాల ప్రకారం ఆమె పిల్లల్లో ఒకరికి మాజీ భర్త తండ్రి కాదని నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె మరో వ్యక్తితో సహజీవనం చేస్తూ, అనేక ఆస్తుల నుంచి నిరంతరంగా ఆదాయం పొందుతున్న అంశాలను కోర్టు పరిగణనలోకి తీసుకుని తాజా పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంది. నేర శిక్షాస్మృతిలోని 125(4)సెక్షన్ ప్రకారం మరో వ్యక్తితో సహజీవనం చేస్తున్న భార్యకు భరణం పొందగోరే హక్కు ఉండదని ఫ్యామిలీ కోర్టు స్పష్టం చేసింది. ''డీఎన్ఏ రిపోర్ట్‌తో పాటు విడాకుల తీర్పును ఈ మహిళ ఎప్పుడూ సవాలు చేయలేదు. అంటే ఆ నిర్ణయాలను ఆమె అంగీకరించినట్లే. ముఖ్యంగా భరణం అడిగిన మహిళ ఆర్థికంగా స్వతంత్రురాలు. అనేక ఆస్తుల నుంచి ఆదాయం పొందుతున్నారు. కనీసం పిల్లల పోషణ బాధ్యత కూడా ఈమెకు లేదు. భర్తే పిల్ల బాధ్యతలు, ఖర్చులు చూసుకుంటున్నారుఉ. అత్త హత్య కేసులో నిందితురాలిగా నాలుగేళ్లపాటు ఈమె జైలులో ఉండి వచ్చారు. ఆమె తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారు. ఆ కేసు ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో ఉంది. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ఆమెకు భరణం ఇవ్వాల్సిన అవసరం లేదు'' అని ప్రిసైడింగ్ ఆఫీసర్ నమ్రత అగర్వాల్ తన తీర్పులో పేర్కొన్నారు.


చెయ్యి అడ్డు తియ్యకుంటే మరిన్ని దెబ్బలు..!

అమిటీ విద్యార్థికి 26 చెంపదెబ్బలు.. వీడియో వైరల్

లక్నో: యూపీ రాజధాని లక్నోలోని అమిటీ యూనివర్సిటీ లా కాలేజీ విద్యార్థిని క్లాస్‌మేట్స్ దూషిస్తూ దారుణంగా కొట్టారు. వర్సిటీ క్యాంపస్‌లోని పార్కు చేసి ఉన్న వాహనంలో ఆగస్టు 26వ తేదీన జరిగిన ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఓ మహిళ ఎడాపెడా చెంపదెబ్బలు కొడుతుండగా పక్కనే ఉన్న మరొకరు దూషణల పర్వం సాగిస్తున్నట్లుగా అందులో ఉంది. బాధిత విద్యార్థి శిఖర్ ముకేశ్ కేసర్‌వాని దెబ్బలను అడ్డుకునేందుకు ప్రయత్నించగా, 'చెంపకు చెయ్యి అడ్డు తియ్యి..లేకపోతే మరిన్ని దెబ్బలు తగులుతాయి'అన్న హెచ్చరికలు సైతం రికార్డయ్యాయి. ఒకటిన్నర నిమిషాల వ్యవధిలో కనీసం 25, 30 సార్లు బాధితుడి చెంపలను వాయించారు. దాదాపు ముప్పావు గంటపాటు శిఖర్‌పై దాడి కొనసాగిందని, ఆ దెబ్బలకు అతడు భయంతో అనారోగ్యం పాలై అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్నాడంటూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలేజీకి వస్తే చంపేస్తామని వాళ్లు బెదిరించారన్నారు. శిఖర్ ఫోన్‌ను కూడా పగులగొట్టారన్నారు. ఫిర్యాదు ఆధారంగా ఐదుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు కారణాలు తెలియరాలేదు. వర్సిటీ కూడా దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు.

హిమాచల్‌లో మళ్లీ విరిగిన కొండచరియలు

న్యూఢిల్లీ: భారీ వర్షాలు, వరదల ప్రభావం కొనసాగుతోంది. హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్‌లో శనివారం భారీ కొండచరియ విరిగిపడింది. సుమారు 200 మీటర్ల మేర విరిగి చొక్కర్ గ్రామంపై పడింది. ఘటనలో ఐదిళ్లు దెబ్బతిన్నాయి. భూగర్భ నీటి పైపులైను పగలడంతోనే ఘటన చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఇంటి గోడకూలిన ఘటనలో ఒక చిన్నారి సహా ఇద్దరు చనిపోయారు. 270 కిలోమీటర్ల పొడవైన జమ్మూకశ్మీర్ జాతీయ రహదారిని తిరిగి తెరిచేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. 250 మీటర్ల మేర పడిన కొండరాళ్లు, మట్టిని తొలగించే పనులు పూర్తవుతుండగానే మరోసారి భారీ వర్షం పడిందని అధికారులు తెలిపారు. దీంతో, మరోసారి రహదారిపైకి బురద మట్టి చేరిందన్నారు. ఆదివారం ఉదయం కల్లా రహదారిని క్లియర్ చేసే అవకాశాలున్నాయని వివరించారు. రాజస్తాన్‌కు చెందిన నలుగురు బీఈడీ విద్యార్థులు ఉత్తరాఖండ్‌లోని కొండచరియలు విరిగిపడిన మున్సియారీలోని పరీక్ష కేంద్రాన్ని చేరుకునేందుకు హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకున్నారు. భారీ వర్షాలతో రోడ్లు దెబ్బతినడంతో ఈ ఏర్పాటు చేసుకున్నామన్నారు.



అంబేడ్కర్ ఇంట్లో సీఎం స్టాలిన్

లండన్: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం లండన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హౌస్‌ను సందర్శించారు. ఒకప్పుడు బాబా సాహెబ్ లండన్‌లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ కాలేజీలో చదువుకునే సమయంలో ఈ ఇంట్లోనే ఉండేవారు. 'ఈ ఇంట్లో నడుస్తూ ఉంటే ఎంతో విస్మయం కలిగింది. భారత దేశంలో అణచివేతకు గురైన ఒక యువకుడు ఇక్కడ సంపాదించిన జ్ఞానంతో గౌరవాన్ని పొందాడు. భారత రాజ్యాంగ రూపకర్తగా మారాడు'అని నివాళులర్పించారు. అనంతరం లండన్‌లోనే ఉన్న కమ్యూనిస్ట్ సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ సమాధిని సందర్శించి, రెడ్ సెల్యూట్ సమర్పించినట్లు సీఎం స్టాలిన్ ఎక్స్‌లో వెల్లడించారు.

మేఘాలయలో హనీమూన్ హత్య ఛార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు

- రఘువంశీ భార్య సోనమ్, ఆమె ప్రియుడు కుష్వాహ సహా 8 మంది నిందితులు
- సోనమ్ సహా నిందితులందరికీ మరణ శిక్షే సరైందంటున్న రఘువంశీ కుటుంబం

షిల్లాంగ్/ఇండోర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇండోర్ వ్యాపారవేత్త రాజా రఘువంశీ హత్య కేసులో మేఘాలయ పోలీసులు శనివారం 790 పేజీల ఛార్జిషీట్‌ను కోర్టులో సమర్పించారు. రఘువంశీ భార్య సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహ సహా 8 మందిని ఈ కేసులో నిందితులుగా పేర్కొన్నారు. మే 21వ తేదీన భార్య సోనమ్‌తో రాజా రఘువంశీ మేఘాలయలో హనీమూన్‌కు వెళ్లి రఘువంశీ దారుణ హత్యకు గురవడం తెల్సిందే. హంతకుల కోసం అప్పట్లో పోలీసులు దేశవ్యాప్తంగా గాలింపు జరిపారు. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని సోహ్రా సబ్ డివిజన్ ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జిషీట్ వేసినట్లు ఈస్ట్ ఖాసీ హిల్స్ ఎస్పీ వివేక్ సియెమ్ చెప్పారు. సోనమ్, రాజ్, వారి మిత్రులు ఆకాశ్ సింగ్ రాజ్‌పుత్, విశాల్ సింగ్ చౌహాన్, ఆనంద్ కుర్మిలపై హత్య, నేరపూరిత కుట్ర అభియోగాలను మోపారు. పూర్తి సాక్ష్యాధారాలతో మొత్తం 790 పేజీలతో కూడిన ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. లోకేంద్ర తోమర్, బల్లా అహిర్వార్, షిలోమ్ జేమ్స్ అనే నిందితులపై సాక్ష్యాలను నాశనం చేసినట్లు ఆరోపణలు మోపారు. మే 21వ తేదీన రాజా తన భార్య సోనమ్‌తో కలిసి షిల్లాంగ్ మీదుగా సోహ్రా చేరుకున్నాడు. ఆ తర్వాత దంపతులు 26వ తేదీ నుంచి కనిపించకుండా పోయారు. వీరి జాడను కనుగొనేందుకు పెద్ద ఎత్తున అన్వేషణ సాగింది. పోలీసులతోపాటు ట్రెక్కింగ్ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌లను సైతం రంగంలోకి దించారు. చివరికి జూన్ 2వ తేదీన రాజా రఘువంశీ సోహ్రా సమీపంలోని వీ సాడాంగ్ జలపాతం వద్ద ఉన్న లోయలో విగతజీవిగా కనిపించాడు. తన తల్లిదండ్రులకు చెందిన కంపెనీలో పనిచేసే రాజ్ కుష్వాహ అనే ఉద్యోగితో సోనమ్ సంబంధం కొనసాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అందుకే భర్తను అడ్డుతొలగించుకునేందుకు రాజ్‌తో ఆమె కుట్ర పన్నింది. హనీమూన్ పేరుతో మేఘాలయకు తీసుకెళ్లింది. సోహ్రాలో సోనమ్ కళ్లెదుటే రాజ్ స్నేహితులైన ఆకాశ్, విశాల్, ఆనంద్‌లు రాజ్‌ను హత్య చేశారు. మృతదేహాన్ని లోయలో పడేశారు. అనంతరం, రాజ్‌తో కలిసి సోనమ్ వివిధ ప్రాంతాల్లో తిరిగింది. చివరికి యూపీలో పోలీసులకు లొంగిపోయింది. మిగతా నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

సోనమ్‌కు మరణ శిక్ష పడాలి

మేఘాలయ పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ వేసిన నేపథ్యంలో రాజా రఘువంశీ సోదరుడు విపిన్ రఘువంశీ స్పందించారు. 'మా కుటుంబం డిమాండ్ చేసేదొక్కటే. అదే..సోనమ్, కుష్వాహ సహా ఈ కేసులో నిందితులందరికీ మరణశిక్ష విధించడం'అని అన్నారు. ఛార్జిషీట్‌లోని పూర్తి వివరాలు తమకు తెలియలేదన్నారు. అయితే, పోలీసుల దర్యాప్తుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నిందితులపై ఆరోపణలకు తగ్గట్టుగా బలమైన ఆధారాలను సేకరించారని చెప్పారు. ఇలా ఉండగా, సోనమ్ అరెస్టయ్యాక ఆమె సోదరుడు గోవింద్ కుష్వాహ జూన్ 11వ తేదీన రాజా రఘువంశీ ఇంటికి వెళ్లాడు. జరిగిన ఘోరంపై కన్నీళ్లు పెట్టుకున్నాడు. నీచానికి పాల్పడిన తన సోదరితో తెగదెంపులు చేసుకున్నామని చెప్పాడు. రఘువంశీకి న్యాయం జరిగేందుకు సాయం అందిస్తానని మాటిచ్చాడు. దీనిపైనా విపిన్ రఘువంశీ స్పందించారు. అతడు కేవలం వ్యాపార ప్రయోజనాలను కాపాడుకునేందుకే అలా మాట్లాడాడన్నారు. రాజా రఘువంశీకి న్యాయం చేస్తానని చెప్పిన అతడు ఆ తర్వాత సోనమ్ తరఫున లాయర్‌ను నియమించాడని ఆరోపించారు. ఈ కేసులో తాము కూడా వేరుగా లాయర్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.

ఛాతీలో కత్తితో పోలీస్ స్టేషన్‌కు బాలుడు

న్యూఢిల్లీ: పదిహేనేళ్ల ఓ బాలుడిపై కొందరు కత్తితో దాడి చేశారు. ఛాతీలో దిగబడిన కత్తితో రక్తమోడుతూనే అతడు పోలీస్ ఠాణాకు చేరుకున్నాడు. వెంటనే పోలీసులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి, ఛాతీలో దిగి ఉన్న కత్తిని విజయవంతంగా తొలగించి, బాలుడి ప్రాణాలు కాపాడారు. విచారణ జరిపిన పోలీసులు నిందితులైన ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 4వ తేదీన ఢిల్లీలోని పహార్‌గంజ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సుమారు 15 రోజుల క్రితం నిందితుల్లో ఒకరిని కొందరు బాలురు కొట్టారు. దీని వెనుక ఉన్నది బాధిత బాలుడేనని నిందితుల అనుమానం. ఇదే కారణంతో ఆ బాలుడిని స్కూలు వద్ద ముగ్గురూ అడ్డుకున్నారు. పగిలిన బీర్ బాటిల్‌తో పొడుస్తానంటూ ఒకడు బెదిరించగా, అదే సమయంలో మరొకడు కత్తితో ఛాతీపై పొడిచాడు. ఆ వెంటనే బాలుడు పహార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు రాగా, పోలీసులు కేసు నమోదు చేశారు. మరికొన్ని గంటల్లో ఆరాంబాగ్ ప్రాంతంలో ఉన్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు వాడిన కత్తిని, పగిలిన బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

ముంబైలో ఉగ్ర బెదిరింపులు.. ఒకరు అరెస్ట్

ముంబై/నోయిడా: పాకిస్తాన్ నుంచి ప్రవేశించిన 14 మంది ఉగ్రవాదులు, 400 ఆర్డీఎక్స్‌తో ముంబైని వణికించేందుకు సిద్ధంగా ఉన్నారంటూ బెదిరింపు సందేశాన్ని పంపిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. యూపీలోని నోయిడాకు చెందిన అశ్వినీకుమార్ సుప్రా(50)ను నోయిడా సెక్టర్ 79లోని సొంతింట్లో ఉండగా అరెస్ట్ చేశారు. ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్‌కు గురువారం..'ముంబైలోకి 14 మంది ఉగ్రవాదులు ప్రవేశించారు. ఆత్మాహుతి బాంబర్లు, 34 వాహనాల్లో అమర్చిన 400 కిలోల ఆర్డీఎక్స్‌తో వీరు శనివారం ముంబైని వణికించేందుకు వచ్చారు'అంటూ ఓ మెసేజీ అందింది. దీనిపై వర్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. క్రైం బ్రాంచి పోలీసులు వెంటనే రంగంలోకి దిగి, సాంకేతిక ఆధారాలతో ఆ సందేశం గౌతమబుద్ధ నగర్ నుంచి వచ్చినట్లు కొనుగొన్నారు. అక్కడికి చేరుకున్న పోలీసు బృందం అశ్వినీ కుమార్‌ను అదుపులోకి తీసుకుని, ప్రశ్నించేందుకు ముంబైకి తీసుకువచ్చింది. కోర్టులో హాజరుపర్చిన అనంతరం, అతడిని ప్రశ్నిస్తామని పోలీసులు తెలిపారు.

ఈడీ కోర్టులో బెంగాల్ మంత్రి లొంగుబాటు

కోల్‌కతా: ప్రాథమిక పాఠశాలల్లో నియామకాల అవకతవకలకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న పశ్చిమ బెంగాల్ మంత్రి చంద్రకాంత్ సిన్హా శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న సిన్హా ఈడీ కోర్టులో హాజరై లొంగుపోతున్నట్లు ప్రకటించారని ఈడీ అధికారులు తెలిపారు. కేసు విచారణకుగాను ఆయన్ను ఈడీ కస్టడీ కోరగా కోర్టు తోసిపుచ్చింది. షరతులకు లోబడి రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తుపై మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోల్‌కతా లేదా సొంత నియోజకవర్గం వీడి వెళ్లరాదని సిన్హాను కోర్టు ఆదేశించిందన్నారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎంపీ రషీద్ ఓటేయొచ్చు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా లోక్‌సభ ఎంపీ ఇంజనీర్ రషీద్ ఈ నెల 9వ తేదీన జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికలో పాల్గొనేందుకు న్యాయస్థానం అంగీకరించింది. ఇందుకు సంబంధించి ఎంపీ రషీద్ పెట్టుకున్న పిటిషన్‌పై అడిషనల్ సెషన్స్ జడ్జి చందర్‌జిత్ సానుకూలంగా స్పందించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు జూలై 24-ఆగస్ట్ 4వ తేదీల మధ్య కోర్టు ఆయనకు కస్టడీ పెరోల్ మంజూరు చేయడం తెల్సిందే. అయితే, సమావేశాలప్పుడు పార్లమెంట్‌కు తరలించేందుకు అయిన లక్షల రూపాయల ఖర్చును ఎంపీ రషీదే చెల్లించాలంటూ అందిన నోటీసును సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై తీర్పు పెండింగ్‌లో ఉందని న్యాయవాది విఖ్యాత్ ఒబెరాయ్ చెప్పారు. ఆ తీర్పును బట్టే ఓటేయడానికి ఆయన పార్లమెంట్‌కు వెళ్లేదీ లేనిదీ నిర్ణయించుకుంటామన్నారు. 2017 నాటి ఉగ్ర నిధుల కేసులో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం కింద జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) 2019లో రషీద్‌ను అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి ఆయన తిహార్ జైలులోనే ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్తుత సీఎం ఒమర్ అబ్దుల్లాపై విజయం సాధించారు.

సాంకేతిక సమస్యతో తిరిగొచ్చిన విమానం

కొచ్చి: కొచ్చి-అబుదాబి ఇండిగో విమానం టేకాఫ్ తీసుకున్న రెండు గంటల అనంతరం సాంకేతిక లోపం కారణంగా తిరిగివచ్చింది. మొత్తం 186 మందితో శుక్రవారం రాత్రి 11.10 గంటలకు బయలుదేరిన 6ఈ-1403 విమానంలో సమస్య ఏర్పడింది. అధికారుల సూచనల మేరకు పైలట్ విమానాన్ని తిరిగి శనివారం ఉదయం 1.44 గంటలకు కొచ్చి విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అందులోని ప్రయాణికులతో 3.30 గంటల సమయంలో మరో విమానం అబుదాబి టేకాఫ్ తీసుకుందని ఇండిగో వర్గాలు తెలిపాయి. విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించి, సరిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించాయి.

ఆర్ఎస్ఎస్ జెండాతో పూలముగ్గు

ఆలయం వద్ద ఘటనపై కేరళ పోలీసుల కేసు

తిరువనంతపురం: కేరళలోని కొల్లంలోని పార్థసారథి ఆలయం వద్ద ఆర్ఎస్ఎస్ జెండా, ఆపరేషన్ సిందూర్ అని ఉన్న పూల ముగ్గు వేయడం వివాదానికి దారి తీసింది. ఇందుకు కారణమైన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించింది మాత్రం కాదని పోలీసులు తెలిపారు. ఓనమ్ సందర్భంగా ఆలయాల వద్ద జరిగే కార్యక్రమాల్లో రాజకీయపరమైన చిహ్నాలను వాడరాదన్న హైకోర్టు ఆదేశాల ప్రకారమే కేసు నమోదైందన్నారు. తమ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం సిగ్గు చేటని రాష్ట్ర బీజేపీ చీఫ్ రాజీవ్ చంద్ర శేఖర్ మండిపడ్డారు. పోలీసుల చర్య సాయుధ బలగాలను, ఉగ్ర బాధితులను అవమానించినట్లేనన్నారు.

చిన్నారి అనుమానాస్పద మృతి..

మూకదాడిలో దంపతులు హతం

కోల్‌కతా: కనిపించకుండా పోయిన చిన్నారి అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా మారగా..అతడి బంధువులు జరిపిన మూకదాడిలో దంపతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని నడియా జిల్లా నిశ్చింతపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన స్వర్ణభ మండల్ అనే మూడో తరగతి చదివే బాలుడు శుక్రవారం మధ్యాహ్నం ఆడుకునేందుకు వెళ్లి కనిపించకుండాపోయాడు. అప్పటి నుంచి కుటుంబీకులు రాత్రంగా వెదుకుతూనే ఉన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం ఆ ప్రాంతంలోని చెరువులో టార్పలిన్‌లో చుట్టి ఉన్న అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ ఘటనతో బాలుడి కుటుంబీకులు ఆగ్రహంతో రెచ్చిపోయారు. చెరువు పక్కనే నివాసం ఉండే ఉత్పల్ బిశ్వాస్, సోమా బిశ్వాస్ ఇంటిని ధ్వంసం చేశారు. ఒక గోదామును తగులబెట్టారు. ఆ దంపతులను బయటకు లాక్కొచ్చి దారుణంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఉత్పల్ కుటుంబానికి బాలుడి కుటుంబానికి ఎప్పటి నుంచో గొడవలున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. దాడి ఘటనలో కొందరు స్థానికులు సైతం ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదన్నారు. ఘటనలపై దర్యాప్తు మొదలు పెట్టినట్లు చెప్పారు.

యూపీ సీఎం యోగి నివాసం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

సకాలంలో అడ్డుకున్న పోలీసులు

లక్నో: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికార నివాసం ఎదుట శనివారం ఓ మహిళ ఒంటికి నిప్పంటించుకునేందుకు ప్రయత్నించింది. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే గమనించి, ఆమెను అడ్డుకున్నారు. హరియాణాకు చెందిన జానపద గాయకుడు ఉత్తమ్ 2నెలల క్రితం తనపై అత్యాచారం చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పోలీసులు ఆమెను షాలిమార్ స్టేషన్ పోలీసులకు అప్పగించారు. జూన్ 24వ తేదీన బాధిత మహిళ ఇక్కడే ఫిర్యాదు చేశారు. దాదాపు 25 రోజుల తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని ఆమె ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత విచారణ జరిపించాలని పదేపదే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం నాటి ఘటనకు ముందుగా ఆమె ఎక్స్‌లో..తన కేసు ముందుకు సాగకుంటే సీఎం యోగి నివాసం ఎదుట తీవ్ర చర్యకు దిగుతానని బెదిరించారు కూడా. ఆమెను ప్రశ్నించి, వాంగ్మూలం నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, తాజా పరిమాణం సున్నిత కేసులను డీల్ చేయడం, బాధ్యతగా వ్యవహరించడంలో పోలీసుల తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ఫజల్ అలీ కమిషన్‌లో ఎంతమంది సభ్యులు ఉన్నారు?

రాష్ట్రాల ఏర్పాటు

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఫజల్ అలీ కమిషన్

భాషాప్రయుక్త ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. దీంతో దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ప్రస్తావనకు వచ్చింది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ కమిషన్‌ను నియమించింది. కె.ఎం.ఫణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రు సభ్యులుగా ఉన్న ఈ కమిషన్‌కు ఫజల్ అలీ నేతృత్వం వహించారు. 1955 సెప్టెంబర్‌లో ఈ కమిషన్ నివేదిక సమర్పించింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటును ఫజల్ అలీ కమిషన్ సమర్థించింది. కానీ ఒక భాష -ఒక రాష్ట్రం అనే డిమాండ్‌ను తిరస్కరించింది.

ఫజల్ అలీ కమిషన్ ప్రతిపాదనలు..

- రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో దేశ ఐక్యతను, రక్షణను బలోపేతం చేసేలా చర్యలు ఉండాలి.
- భాష,సాంస్కృతికపరమైన సజాతీయత ఉండాలి.
- ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- జాతీయాభివృద్ధితోపాటు రాష్ట్రాల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్-ఎ, పార్ట్-బి, పార్ట్-సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ - పెద్ద మనుషుల ఒప్పందం

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

1948లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర సంస్థను స్థాపించారు. తెలుగు మాట్లాడే వారందరినీ కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనేది విశాలాంధ్ర ప్రధాన నినాదం. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విషయంలో నిర్ణయాన్ని హైదరాబాద్ రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి వదిలిపెట్టారు. హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీలో విశాలాంధ్ర ఏర్పాటు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, 103 మంది సభ్యులు అనుకూలంగా ఓటేశారు. 1956 ఫిబ్రవరి 20న తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన 8 మంది నాయకుల మధ్య ఢిల్లీలో ఒక ఒప్పందం కుదిరింది. దీన్నే 'పెద్ద మనుషుల ఒప్పందం' అంటారు. ఈ ఒప్పందంపై బూర్గుల రామకృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, జె.వి.నరసింగరావు, మర్రి చెన్నారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ, నీలం సంజీవరెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న సంతకాలు చేశారు.

1956 తర్వాత ఏర్పాటైన రాష్ట్రాలు

గుజరాత్ (1 మే, 1960): బొంబాయి రాష్ట్రాన్ని విడగొట్టి గుజరాత్‌ను 15వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. బొంబాయి రాష్ట్రం పేరును మహారాష్ట్రగా మార్చారు.

నాగాలాండ్ (1 డిసెంబర్, 1963): అస్సాం రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి నాగా కొండ ప్రాంతాలు, ట్యూన్‌సాంగ్ ప్రాంతాలతో నాగాలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇది 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

హర్యానా(1 నవంబర్, 1966): పంజాబ్‌ను పునర్ వ్యవస్థీకరించి హిందీ మాట్లాడే ప్రాంతాన్ని హర్యానా రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. షా కమిషన్ సూచన మేరకు చండీగఢ్‌ను పంజాబ్, హర్యానా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చేశారు. దీంతోపాటు చండీగఢ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా గుర్తించారు.

హిమాచల్ ప్రదేశ్ (25 జనవరి, 1971): పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలతో కలిపి కేంద్రపాలిత ప్రాంతమైన హిమాచల్‌కు రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 18వ రాష్ట్రం.

మణిపూర్ (21 జనవరి, 1972): ఈశాన్య రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రపాలిత ప్రాంతమైన మణిపూర్‌ను 19వ రాష్ట్రంగా మార్చారు.

త్రిపుర (21 జనవరి, 1972): కేంద్రపాలిత ప్రాంతమైన త్రిపురను 20వ రాష్ట్రంగా మార్చారు.

మేఘాలయ (21 జనవరి, 1972): అస్సాంలో ఉపరాష్ట్రంగా ఉన్న మేఘాలయను పూర్తి రాష్ట్రంగా మార్చారు. 1969లో మేఘాలయకు ఉపరాష్ట్ర హోదా కల్పించారు.

సిక్కిం (16 మే, 1975): 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక చరిత్ర ఉంది. 1947 వరకు సిక్కిం ఛోగ్యాల్ రాజవంశ పాలనలో ఉండేది. 1974లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు అసోసియేట్ రాష్ట్ర పతిపత్తి కల్పించారు. 10వ షెడ్యూల్‌లో నూతన ప్రకరణ 2ఎను చేర్చారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను సంపూర్ణ రాష్ట్రంగా గుర్తించారు. ఈ విధంగా సిక్కిం 22వ రాష్ట్రంగా ఏర్పాటైంది. 1974లో చేసిన 35వ రాజ్యాంగ సవరణను రద్దుచేశారు. ప్రకరణ 2ఎను, 10వ షెడ్యూల్‌లోని ప్రత్యేకతను తొలగించారు. ప్రకరణ 371ఎఫ్ ద్వారా సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక రక్షణ కల్పించారు.

మిజోరాం (20 ఫిబ్రవరి, 1987): కేంద్రపాలిత ప్రాంతమైన మిజోరాంకు 53వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 23వ రాష్ట్రంగా ఏర్పాటైంది.



అరుణాచల్ ప్రదేశ్ (20 ఫిబ్రవరి, 1987): 55వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన అరుణాచల్ ప్రదేశ్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదాను కల్పించారు. అరుణాచల్ ప్రదేశ్‌ను నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజెన్సీ (ఎన్ఈఎఫ్ఏ) అని పిలిచేవారు.

గోవా (30 మే, 1987): 56వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన గోవాకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. 1961లో పోర్చుగీసువారు గోవాను భారతదేశానికి అప్పగించారు. గోవా, డయ్యూ, డామన్‌లను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు. ఇందు కోసం 1962లో 12వ రాజ్యాంగ సవరణ చేశారు.

ఛత్తీస్‌గఢ్(1 నవంబర్, 2000): మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించి ఛత్తీస్‌గఢ్‌ను 26వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు.

ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000): ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఉత్తరాఖండ్ 27వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

జార్ఖండ్ (15 నవంబర్, 2000): బిహార్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించి 28వ రాష్ట్రంగా జార్ఖండ్‌ను ఏర్పాటు చేశారు.

తెలంగాణ (2 జూన్, 2014): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించి 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

వివరణ: 1954లో ఫ్రెంచివారు పాండిచ్చేరిని భారత్‌కు అప్పగించారు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా పాండిచ్చేరిలో 4 జిల్లాల(పాండిచ్చేరి, కరైకల్, మహే, యానాం)ను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు.

కేంద్రపాలిత ప్రాంతాలు- ఏర్పాట్లు

దాద్రానగర్ హవేలి: 1954 వరకు ఈ ప్రాంతం పోర్చుగీసు వారి ఆధీనంలో ఉండేది. 1961లో పదో రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు.

డామన్ - దయ్యూ: భారత ప్రభుత్వం 1961లో సైనిక చర్య ద్వారా ఈ ప్రాంతాలను పోర్చుగీసు వారి నుంచి స్వాధీనం చేసుకుంది. 12వ రాజ్యాంగ సవరణ ద్వారా 1962లో కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు. 1987లో గోవా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా కొనసాగించారు.

పాండిచ్చేరి: ఇది పుదుచ్చేరి, కరైకల్, మహే, యానాం అనే నాలుగు ప్రాంతాల కలయిక. 1964లో ఫ్రెంచి వారు ఈ ప్రాంతాలను భారత్‌కు అప్పగించారు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రాంతాలకు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

చండీగఢ్: 1966లో పంజాబ్ పునర్వ్యవస్థీకరణ ద్వారా హర్యానా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధాని అయిన చండీగఢ్‌కు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు - పాత పేర్లు - నూతన పేర్లు

సం.	పాత పేరు	కొత్తపేరు
1950	యునైటెడ్ ప్రావిన్స్	ఉత్తరప్రదేశ్
1956	ట్రావెన్‌కోర్	కొచ్చిన్ కేరళ
1959	మధ్యభారత్	మధ్యప్రదేశ్
1960	బొంబాయి	మహారాష్ట్ర
1968	మద్రాసు	తమిళనాడు
1973	మైసూరు	కర్ణాటక
1973	లక్కదీవి, మినికాయ్ అమిన్‌దీవి	లక్షదీవులు
2006	ఉత్తరాంచల్	ఉత్తరాఖండ్
2006	పాండిచ్చేరి	పుదుచ్చేరి
2007	అస్సాం	అసోం
2011	ఒరిస్సా	ఒడిశా
2011	పశ్చిమ బెంగాల్	పశ్చిమ బంగ

రాష్ట్రాలు - ప్రత్యేక హోదా

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ప్రత్యేక హోదా - చరిత్ర: అయిదో ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించే పద్ధతిని 1969లో ప్రవేశపెట్టారు. మొదట్లో అస్సాం, నాగాలాండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాలకు మాత్రమే ప్రత్యేక హోదా ఉండేది. తర్వాత అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కూడా వర్తింపజేశారు.

ప్రాతిపదిక: ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించేందుకు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అవి...

- పర్వత ప్రాంతాలు, రవాణాకు కష్టతరమైనవి
- తక్కువ జనసాంద్రత, అధిక గిరిజనులు ఉన్న ప్రాంతాలు
- సరైన మౌలిక సదుపాయాలు లేని ప్రాంతాలు
- ఆర్థికంగా పటిష్టంగా లేని రాష్ట్రాలు
- విదేశాలతో సరిహద్దులు ఉండి, వ్యూహాత్మకంగా ప్రాధాన్యమున్న రాష్ట్రాలు.

ప్రత్యేక హోదాను నిర్ణయించేది: ప్రధానమంత్రి అధ్యక్షుడిగా ఉన్న జాతీయాభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం(ప్రస్తుతం నీతి ఆయోగ్) సలహా మేరకు ప్రత్యేక హోదాపై నిర్ణయం తీసుకుంటారు. ప్రత్యేక హోదాకు నిధుల కేటాయింపులతో సంబంధం ఉండటం వల్ల కేంద్ర ఆర్థిక సంఘాన్ని కూడా సంప్రదించాలి.

ప్రయోజనాలు

- కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహాయాన్ని గ్రాంట్ల రూపంలో అందిస్తుంది.
- కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లో 30 శాతం నిధులను తొలుత ఈ రాష్ట్రాలకు కేటాయిస్తారు. మిగతా వాటాను ఇతర రాష్ట్రాలకు ఇస్తారు.
- కేంద్ర ప్రభుత్వ పథకాల్లో 90 శాతం నిధులను గ్రాంట్ల రూపంలో, 10 శాతం నిధులను రుణంగా ఇస్తారు.
- పన్నుల్లో మినహాయింపు ఉంటుంది.
- రుణాలు చెల్లింపును వాయిదా వేయడం, పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తారు.

గాడ్గిల్ - ముఖర్జీ ఫార్ములా

ప్రత్యేక హోదా లేని రాష్ట్రాలకు గాడ్గిల్ - ముఖర్జీ ఫార్ములా ప్రకారం నిధులను కేటాయిస్తారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డి.ఆర్. గాడ్గిల్ 1969లో ఈ ప్రతిపాదన చేశారు. 1990లో ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ మరికొన్ని మార్పులు సూచించారు. అందుకే దీన్ని గాడ్గిల్-ముఖర్జీ ఫార్ములా అంటారు. దీనికి అనుగుణంగా జాతీయాభివృద్ధి మండలి నూతన పద్ధతిని నిర్ణయించింది. దీని ప్రకారం రాష్ట్రాలకు ఈ కింది అంశాల ఆధారంగా నిధులను కేటాయిస్తారు.

ప్రాతిపదిక	శాతం
జనాభా	60 శాతం
తలసరి ఆదాయం	25 శాతం
ఆర్థిక నిర్వహణ	7.5 శాతం
ప్రత్యేక సమస్యలు	7.5 శాతం
మొత్తం	100 శాతం

దేశవ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్రాల కోసం జరుగుతున్న ఉద్యమాలు

అసోం	బోడోలాండ్, కర్బి, అంగ్లాంగ్
కర్ణాటక	కొడగు (కూర్గ్)
మహారాష్ట్ర	విదర్భ
గుజరాత్	సౌరాష్ట్ర
ఉత్తరప్రదేశ్	హరితప్రదేశ్, పశ్చిమ ప్రదేశ్, అవధ్ ప్రదేశ్, పూర్వాంచల్
మధ్యప్రదేశ్	వింధ్యప్రదేశ్, అవధ్
బిహార్, జార్ఖండ్	మిథిలాంచల్, కోసల్
కేరళ, కర్ణాటక సరిహద్దులో	తుళునాడు
పశ్చిమ బెంగాల్	గూర్ఖాలాండ్
ఒడిశా	కోసల్
జమ్మూ కశ్మీర్	లడక్
మేఘాలయ	గారోలాండ్
మణిపూర్	కుకీలాండ్

టెలివిజన్లను ఉత్పత్తి చేసే సంస్థ ఏది?

రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రభుత్వ రంగ సంస్థలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)

బీఈఎల్ మొదటి యూనిట్‌ను బెంగళూరులో 1954లో స్థాపించారు. ఇది రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. దీని 9వ యూనిట్‌ను 1986లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ రక్షణ శాఖకు అవసరమైన ఎలక్ట్రానిక్ అవసరాలను తీరుస్తోంది. దీనికి నవరత్న హోదా కల్పించారు.

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)

దేశంలో మొత్తం ఆరు బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. మెదక్ జిల్లాలోని రామచంద్రాపురంలో 1963లో బీహెచ్ఈఎల్‌ను స్థాపించారు. దేశంలోని అతి పెద్ద ఇంజనీరింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో ఇదొకటి. ఇక్కడ టర్బైన్లు, జనరేటర్లు, సర్క్యూట్ బ్రేకర్లు తయారవుతాయి. ఇది థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. దీనికి మహారత్న హోదా ఉంది.

ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ (ఐడీపీఎల్)

ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అతిపెద్ద ఫార్మా రంగ సంస్థ. దీన్ని 1961లో ఢిల్లీలో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు ఐడీపీఎల్ యూనిట్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ యూనిట్‌ను 1967లో బాలానగర్‌లో స్థాపించారు. అత్యవసర, జీవనాధార మందుల తయారీలో స్వయం సమృద్ధి సాధనకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది.

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)

1967 ఏప్రిల్ 11న హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేశారు. ఇది అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఎలక్ట్రానిక్ పరికరాల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల స్వయం సమృద్ధి సాధనలో కీలకపాత్ర పోషిస్తోంది.

దేశంలో తొలి డిజిటల్ కంప్యూటర్‌ను ఈసీఐఎల్ రూపొందించింది. దేశంలో తొలి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, మొదటి న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నియంత్రణ పరికర వ్యవస్థలను, టెలివిజన్లను ఈ సంస్థ రూపొందించింది.

ప్రాగా టూల్స్

దీన్ని 1959లో హైదరాబాద్‌లో స్థాపించారు. యంత్రాల విడి పరికరాలు, కట్టర్లు, టూల్స్, గ్రైండర్లు, త్రెడ్ రోలింగ్ మిషన్లు మొదలైన వాటిని ఇది రూపొందిస్తోంది.

ఇక్రిశాట్

రాష్ట్రంలో ఏర్పాటైన ఏకైక అంతర్జాతీయ పరిశోధనా సంస్థ ఇక్రిశాట్. దీన్ని 1972లో ఉమ్మడి మెదక్ జిల్లా పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేశారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో అర్ధశుష్క వాతావరణ పరిస్థితులను తట్టుకొని పెరిగే వంగడాలకు రూపకల్పన చేస్తోంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణనిస్తోంది. మెట్ట ప్రాంత వ్యవసాయ సాగుపై పరిశోధనలు చేస్తోంది. ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ ఎరిడ్ ట్రోపిక్స్‌కు సంక్షిప్త రూపమే ఇక్రిశాట్.

హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)

హెచ్‌సీఎల్‌ను రంగారెడ్డి జిల్లాలో, పశ్చిమ బెంగాల్‌లోని రూప్ నారాయణ్‌పూర్‌లో స్థాపించారు. ఇది భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో పని చేస్తోంది. హెచ్‌సీఎల్‌లో టెలికాం కేబుల్స్‌ను తయారు చేస్తున్నారు.

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)

భారత్‌లో హెచ్ఏఎల్‌కు ఆరు యూనిట్లు ఉన్నాయి. 1965లో రంగారెడ్డి జిల్లాలో హెచ్ఏఎల్ యూనిట్‌ను ప్రారంభించారు. దీనికి నవరత్న హోదా కల్పించారు. ఇందులో విమానయాన యంత్ర భాగాలను ఉత్పత్తి చేస్తున్నారు.

రేడియో అల్టీమీటర్ తయారీలో హెచ్ఏఎల్ హైదరాబాద్ డివిజన్‌ది కీలకపాత్ర. ఇది కమ్యూనికేషన్, నావిగేషన్లలో రక్షణ శాఖకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీ)

దీని దక్షిణ ప్రాంత మండల ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇది గ్రామీణ ప్రాంత విద్యుదీకరణకు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీనికి నవరత్న హోదా ఉంది.

హిందుస్తాన్ మెషిన్ టూల్స్ లిమిటెడ్ (హెచ్ఎంటీ)

దేశంలో ఆరు హెచ్ఎంటీ పరిశ్రమలున్నాయి. వాటిలో ఒకటి రంగారెడ్డి జిల్లాలో ఉంది. ఈ పరిశ్రమలో గడియారాలు, బల్బులు, లేత్, బోర్, మిల్లింగ్ యంత్రాలు తయారవుతాయి.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)

ఇది భారత ప్రభుత్వ పరిపాలన నియంత్రణ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. దీన్ని 1970లో ప్రారంభించారు. ఈ పరిశ్రమలో క్షిపణులను రూపొందిస్తారు. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్, మెదక్ జిల్లాలోని భానూర్‌లో దీని తయారీ కేంద్రాలున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో రెండు యూనిట్లను స్థాపించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్

దీన్ని 1973లో రంగారెడ్డి జిల్లాలో ప్రారంభించారు. పారిశ్రామికీకరణ వేగవంతమయ్యేందుకు తోడ్పడే లోహాలు, మిశ్రమ లోహాలు ముఖ్యంగా టైటానియం లాంటి లోహాల తయారీలో కీలక పాత్ర పోషిస్తోంది.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ (డీఆర్‌డీఎల్)

దీన్ని 1962లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. భారత రక్షణ వ్యవస్థను పటిష్టపర్చడంలో ఈ కంపెనీది కీలకపాత్ర. క్షిపణి వ్యవస్థ రూపకల్పన, క్షిపణుల తయారీ ప్రయోగాల్లో ఇది కృషి చేస్తోంది. ఈ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ఆకాశ్, నాగ్, పృథ్వీ, అగ్ని తదితర క్షిపణులు భారత సైన్యాన్ని పటిష్టం చేశాయి.

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ)

అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో మౌలాలీలో 1971లో దీన్ని ఏర్పాటు చేశారు. న్యూక్లియర్ ఫ్యూయల్ బండిల్స్, రియాక్టర్ కోర్ పదార్థాలను ఇది తయారు చేస్తోంది. యురేనియం ఇంధనం, జిర్కోనియం మిశ్రమ లోహ క్లాండింగ్‌ను రూపొందించింది.

భార జల కేంద్రం (హెవీ వాటర్ ప్లాంట్)

ఈ కేంద్రాన్ని ఖమ్మం జిల్లాలోని మణుగూరులో ఏర్పాటు చేశారు. దీనిలో డ్యూటీరియం ఆక్సైడ్ (D_2O) తయారు చేస్తున్నారు. అణు రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని స్థిరీకరించేందుకు భారజలాన్ని వాడతారు.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)

ఇది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ప్రపంచస్థాయి ఆయుధాల తయారీలో, స్వదేశీ పరిజ్ఞానం ద్వారా సైన్యానికి కావాల్సిన ఆయుధ సంపత్తిలో స్వయం సమృద్ధి సాధనకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ)

కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 1958లో ఎన్ఎండీసీని ఏర్పాటు చేశారు. ముడి ఇనుము, రాగి, డోలమైట్, టంగ్‌స్టన్ తదితర ఖనిజాలను వెలికి తీయడానికి, ముడి ఖనిజాలను వేరు చేయడానికి అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఈ సంస్థ అందిస్తోంది. ఖనిజ వనరులపై పరిశోధనా కార్యక్రమాలను చేపడుతోంది.

నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ

సికింద్రాబాద్‌లోని హకీంపేటలో ఏర్పాటు చేశారు. భారీ పరిశ్రమలకు సెక్యూరిటీ నిర్వహణ, విపత్తు నిర్వహణలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)

దీన్ని 1970లో సికింద్రాబాద్‌లోని సైనిక్‌పురిలో ఏర్పాటు చేశారు. భద్రతా దళాలు, సైన్యంలో మేనేజ్‌మెంట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలను పెంచడం కోసం ఇది కృషి చేస్తోంది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌కు మేనేజ్‌మెంట్ రంగంలో శిక్షణనిచ్చే ఆసియాలోని ఏకైక సంస్థ ఇది.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

మెదక్ జిల్లాలోని ఎద్దుమైలారంలో 1987లో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ యుద్ధ ట్యాంకు(ఐసీవీ)లను తయారు చేస్తున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. భారజల కర్మాగారం ఎక్కడ ఉంది?
   1) పటాన్‌చెరు 2) మణుగూరు
   3) రామగుండం 4) హైదరాబాద్
2. అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) మెదక్ 4) నల్లగొండ
3. తెలంగాణలో ఒక పరిశ్రమను మెగా పరిశ్రమగా గుర్తించాలంటే కనీసం ఎంత పెట్టుబడి పెట్టాలి?
   1) రూ. 250 కోట్లు 2) రూ. 200 కోట్లు
   3) రూ. 300 కోట్లు 4) రూ. 150 కోట్లు
4. ఇచ్చిన వాటిలో మహారత్న హోదా పొందిన సంస్థ?
   1) బీఈఎల్ 2) ఈసీఐఎల్
   3) ఐడీపీఎల్ 4) బీహెచ్ఈఎల్
5. ముల్కనూర్ మహిళా సహకార డైరీ ఏ జిల్లాలో ఉంది?
   1) వరంగల్ 2) ఆదిలాబాద్
   3) కరీంనగర్ 4) నల్లగొండ
6. ఇచ్చిన వాటిలో రక్షణ శాఖకు సంబంధించిన వస్తువులను ఉత్పత్తి చేసే సంస్థ?
   1) బీడీఎల్ 2) ఈసీఐఎల్
   3) హెచ్ఏఎల్ 4) హెచ్‌సీఎల్
7. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) ఎక్కడ ఉంది?
   1) మణుగూరు 2) పాల్వంచ
   3) రామచంద్రాపురం 4) మౌలాలీ
8. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) ఎక్కడ ఉంది?
   1) రామగుండం 2) రామచంద్రాపురం
   3) గచ్చిబౌలి 4) కొత్తగూడెం
9. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సంవత్సరం?
   1) 1970 2) 1963
   3) 1958 4) 1967
10. టెలివిజన్లను ఉత్పత్తి చేసే సంస్థ ఏది?
    1) ఎన్ఎఫ్‌సీ 2) బీడీఎల్
    3) ఈసీఐఎల్ 4) హెచ్‌సీఎల్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 4; 5) 3;
6) 1; 7) 4; 8) 2; 9) 3; 10) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

జిప్‌మర్‌లో ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-III పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-III పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 07.09.2025నాటికి 30ఏళ్లు ఉండాలి
» **వేతనం:** నెలకు రూ.33,600.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.09.2025
» **ఇంటర్వ్యూ తేది:** 09.09.2025.
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

మేనేజ్ హైదరాబాద్‌లో కన్సల్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్(ఫైనాన్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంకామ్, ఎంబీఏ లేదా సీఏ, ఐసీడబ్ల్యూఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** నోటిఫికేషన్ వెలువడిన తేదీ నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.45,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.09.2025.
» **వెబ్‌సైట్:** www.manage.gov.in

బ్రిక్-ఎన్ఐఐ, న్యూఢిల్లీలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్-II పోస్టులు

న్యూఢిల్లీలోని బ్రిక్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ(ఎన్ఐఐ) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ కోఆర్డినేటర్-II పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్ లేదా పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** pushkar@nii.ac.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.nii.res.in

భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?

బ్యాంకింగ్ రంగం

ఖాతాదారుల నుంచి డబ్బు స్వీకరించి భద్రపరచడం, వారికి అవసరానికి డబ్బు ఇవ్వడం, స్వీకరించిన ధరావతులకు కాలానుగుణంగా వడ్డీలు చెల్లించడం, అప్పులు ఇవ్వడం (వారి స్తోమతను బట్టి), తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లించడం లేదా వసూలు చేయడం తదితర ద్రవ్య సంబంధ కార్యకలాపాలను నిర్వహించే వ్యవస్థను బ్యాంకింగ్ రంగంగా నిర్వచిస్తాం. బ్యాంకింగ్ వ్యవహారాలు నిర్వర్తించే సంస్థనే బ్యాంకుగా గుర్తిస్తాం. చెక్కులు, డ్రాఫ్టులు, ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు లేదా ఒక స్థలం నుంచి మరో స్థలానికి ద్రవ్య బదలాయింపులు నిర్వహించడం ద్వారా ఇంకా మరెన్నో ద్రవ్య లావాదేవీలకు బ్యాంకులు ఆలవాలంగా ఉంటాయి. ద్రవ్య సేవల పరిశ్రమగా బ్యాంకును పేర్కొనవచ్చు. బ్యాంకులు లేనికాలంలో సామాన్యుడి నగదు లావాదేవీలు, రుణ అవసరాలను స్థానిక వడ్డీ వ్యాపారులు తీరుస్తుండేవారు.

భారతదేశంలో మొదటి బ్యాంకును 1786లో 'ది జనరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో నెలకొల్పారు. ఈస్ట్ ఇండియా కంపెనీ 1809లో 'ది బ్యాంక్ ఆఫ్ బెంగాల్'ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎన్నో ప్రెసిడెన్సీ బ్యాంకులు ఆవిర్భవించాయి. వీటన్నింటినీ బ్రిటిషర్లే నిర్వహించేవారు. స్వాతంత్ర్యానంతరం 1949లో భారత ప్రభుత్వం బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1965లో ఈ చట్టాన్ని సవరించింది. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు మొదటగా జాతీయ స్ఫూర్తితో 1953లో మొదలయ్యాయి. బ్రిటిష్ వారసత్వంగా వచ్చిన ఇంపీరియల్ బ్యాంక్‌ను.. 'భారతీయ స్టేట్ బ్యాంక్'గా మార్చి జాతీయం చేశారు. ఇందిరా గాంధీ హయాంలో 14 ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులను 1969 జూలై 19న జాతీయం చేశారు.

1980వ దశకం తర్వాత దశల వారీగా ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాల్సిన ఆవశ్యకత ఉందనే, ప్రభుత్వం తన పరిధిని తగ్గించుకోవడం అవసరం అనే ప్రతిపాదనలు వచ్చాయి. నరసింహన్ కమిటీ సిఫారసుల మేరకు 1993లో సవరించిన బ్యాంకుల క్రమబద్ధీకరణ చట్టం అమలైంది. ఈ చట్టం ద్వారా మరిన్ని ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులకు, పెట్టుబడులకు ద్వారాలు తెరిచినట్లైంది. ఈ దశను బ్యాంకింగ్ రంగంలో మూడో స్థాయి సంస్కరణగా చెప్పవచ్చు. ఇది విస్తృత స్థాయి స్థూల ఆర్థిక సరళీకరణ సంస్కరణల్లో భాగంగా గమనించవచ్చు. అంటే.. అన్ని రంగాలకు వర్తిస్తూ 1991-92ల్లో జరిగిన సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలో భాగంగానే బ్యాంకింగ్ సంస్కరణలను అర్థం చేసుకోవాలి. ఈ దశలోనే బ్యాంకింగ్ రంగం సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకుంది. బ్యాంకింగ్ రంగాన్ని కంప్యూటర్లతో అనుసంధానిస్తూ ఆన్‌లైన్ నగదు బదిలీలను, ప్లాస్టిక్ మనీ (క్రెడిట్ లేదా డెబిట్ కార్డులు)ని ప్రవేశపెట్టారు.



ప్రస్తుతం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నిర్మాణాన్ని కింది విధంగా పేర్కొనవచ్చు.

1. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
2. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు

ఇందులో పబ్లిక్ రంగ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ఉంటాయి. పబ్లిక్ రంగ బ్యాంకుల్లో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులు, ఇతర జాతీయ బ్యాంకులు ఉంటాయి.

3. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బీలు)
4. విదేశీ బ్యాంకులు
5. షెడ్యూల్డ్ సహకార బ్యాంకులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంకింగ్ వ్యవస్థకు అధిపతి కేంద్ర బ్యాంకు, భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) మన కేంద్ర బ్యాంకు. 1934 రిజర్వ్ బ్యాంక్ చట్టం ద్వారా 1935 ఏప్రిల్ 1న భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. మొట్టమొదట ఇది వాటాదారుల బ్యాంకుగా రూ. 5 కోట్ల మూలధనంతో ఏర్పాటైంది. 1949 జనవరి 1న ఆర్‌బీఐని జాతీయం చేశారు. ఆర్‌బీఐకి గవర్నర్, నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉంటారు. వీరితో పాటు ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఒక ప్రభుత్వ ప్రతినిధి, ప్రభుత్వంతో ప్రతిపాదితమైన వివిధ రంగాలను ప్రతిబింబించే పది మంది ప్రతినిధులు, స్థానిక బోర్డులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన డైరెక్టర్లు కలిసి సమగ్ర నిర్వహణ బాధ్యత పర్యవేక్షిస్తారు. ఈ స్థానిక బోర్డులు ముంబై, కోల్‌కతా, న్యూఢిల్లీ, చెన్నై ప్రధాన కేంద్రాలుగా పనిచేస్తాయి. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్ర.

ఆర్‌బీఐ లక్ష్యాలు- విధులు: కరెన్సీని క్రమబద్ధం చేయడం, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య స్థిరత్వాన్ని, సుస్థిరతను సాధించడం, పటిష్ఠమైన ద్రవ్య విధానాన్ని అమలు పరుస్తూ పరపతి నియంత్రణ చేయడం, దేశంలోని వాణిజ్య బ్యాంకులకు మార్గదర్శిగా వ్యవహరించడం, దేశవ్యాప్తంగా ఒకే రీతిలో పరపతి విధానాన్ని అమలు చేయడం ఆర్‌బీఐ ప్రధాన లక్ష్యాలు. దీంతోపాటు కరెన్సీ నోట్ల జారీ గుత్తాధిపత్యం కూడా ఆర్‌బీఐదే. ఇది 2, 5, 10, 20, 50, 100, 500, 1000 రూపాయల కరెన్సీ నోట్లను జారీచేస్తుంది. ఒక రూపాయి నోట్లను మాత్రం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది.

అలాగే రిజర్వ్‌బ్యాంక్ కేంద్ర ప్రభుత్వానికి బ్యాంకరుగా, ప్రతినిధిగా, సలహాదారుగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వానికి బ్యాంకింగ్ సౌకర్యాలను కల్పిస్తుంది. ద్రవ్య విధానాన్ని రూపొందించడం, ప్రభుత్వానికి సలహా ఇవ్వడమే కాకుండా అమలుపరిచే బాధ్యతను ఆర్‌బీఐ నిర్వహిస్తుంది. దీంతోపాటు బ్యాంకులకు బ్యాంకుగా వ్యవహరిస్తుంది అంటే.. వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలను నియంత్రిస్తుంది, పర్యవేక్షిస్తుంది. వాణిజ్య బ్యాంకుల అంతిమ రుణదాతగా వ్యవహరిస్తుంది. విదేశీ మారకంగా ఉపయోగించే బంగారం నిల్వలను, విదేశీ మారక ద్రవ్య నిల్వలను కూడా ఆర్‌బీఐ పరిరక్షిస్తుంది. వీటితోపాటు బ్యాంకింగ్ వ్యవస్థను అభివృద్ధి పరచడం, వ్యవసాయ పరపతిని ప్రోత్సహించడం, పారిశ్రామికాభివృద్ధికి పరపతిని అందించడం లాంటి అభివృద్ధిపరమైన విధులను కూడా భారతీయ రిజర్వ్‌బ్యాంక్ నిర్వహిస్తుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు

వాణిజ్య బ్యాంకులు.. షెడ్యూల్‌లో ఉన్నవి, షెడ్యూల్డ్ కానివి అని రెండు రకాలు. రిజర్వు బ్యాంకు 1934వ చట్టంలోని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్న బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు. ప్రైవేట్, పబ్లిక్ సెక్టారు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు.. అన్నీ షెడ్యూల్డ్ బ్యాంకులుగానే పరిగణిస్తారు. కానీ సహకార బ్యాంకులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. సహకార బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు కావు. షెడ్యూల్‌లో లేని బ్యాంకులన్నీ షెడ్యూల్డేతర వాణిజ్య బ్యాంకులు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (రీజినల్ రూరల్ బ్యాంక్స్) 1970లో స్థాపించారు. ఇవి వాణిజ్య బ్యాంకులు నిర్వహించే విధులన్నింటినీ నిర్వహిస్తాయి. వీటి కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నీ భారతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ నియంత్రణలో ఉంటాయి.

విదేశీ బ్యాంకులు

భారతదేశంలో విదేశీ బ్యాంకులు కొత్తగా వచ్చినవి కావు. బ్రిటిషర్ల పాలనకాలంలోనే విదేశీ బ్యాంకుల పరంపర ప్రారంభమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విదేశీ బ్యాంకుల కార్యకలాపాలు తగ్గించారు. 1950లలో విదేశీ బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా వాటి కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టం పరిధిలో పని చేస్తున్న విదేశీ బ్యాంకులకు స్వతహాగా తమ కార్యకలాపాలు నిర్వహించే స్వేచ్ఛను మన ప్రభుత్వం కల్పించలేదు. తర్వాత కాలంలో ప్రభుత్వం సరళీకరణ ప్రక్రియను చేపట్టి విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టాన్ని విదేశీ మారక నిర్వహణ చట్టంగా మార్చింది (ఫెరా చట్టం ఫెమాగా మారింది). ఆ చట్టంలో విదేశీ బ్యాంకులకు వెసులుబాటు కల్పించారు. ప్రపంచీకరణ తర్వాత విదేశీ బ్యాంకులకు భారత కార్యకలాపాల్లో ప్రాచుర్యం కల్పించారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం ప్రస్తుతం దేశంలో ఏబీఎన్-ఆమ్రో బ్యాంక్, ఏఎన్‌జెడ్ గ్రిండ్లేస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఎమిరేట్స్, బ్యాంక్ ఆఫ్ అబుదాబీ ప్రధానమైన విదేశీ బ్యాంకులు.

షెడ్యూల్డేతర బ్యాంకులు

1934లోని బ్యాంకింగ్ చట్టంలో రెండో షెడ్యూల్‌లో ప్రస్తావించని బ్యాంకులను షెడ్యూలేతర బ్యాంకులు అంటారు. వీటి ప్రాముఖ్యం అంతగా లేదు. అయితే షెడ్యూల్‌లో లేని బ్యాంకులు ప్రైవేట్ బ్యాంకులై కొన్ని లాభాపేక్ష కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయిలో వీటికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఇవి స్థానిక వ్యాపార కార్యకలాపాలకే పరిమితమైనట్లుగా భావించవచ్చు.

సహకార బ్యాంకులు

ప్రభుత్వ ప్రోత్సాహంతో, కొంతభాగం మూలధన పెట్టుబడి చేకూర్చడంతో ఈ సహకార బ్యాంకులను స్థాపించారు. ఇవి లాభాపేక్ష లేకుండా సహకార సూత్రంపై ఆధారపడి పనిచేస్తాయి. సహకార బ్యాంకుల నిర్మాణం నాలుగు స్థాయిల్లో ఉంటుంది. కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో జిల్లా సహకార బ్యాంకులు విధులు నిర్వహిస్తాయి. జిల్లా సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లోని గ్రామ ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తాయి.

బ్యాంకింగ్ రంగంలో ఉపయోగించే పదాలు..

ద్రవ్య విధానం, బ్యాంకింగ్ రంగం లోతరచూ ఉపయోగించే కొన్ని సాంకేతికపారిభాషిక పదాల గురించి తెలుసుకుందాం..

బ్యాంకు రేటు

రిజర్వ్ బ్యాంకు ఇతర బ్యాంకులకు రుణ సదుపాయం కోసం ఏర్పరిచే కనీస వడ్డీ రేటు.

నగదు నిల్వల నిష్పత్తి (క్యాష్ రిజర్వ్ రేషియో)

బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన నిర్దిష్ట నిధుల మొత్తం. ఆర్‌బీఐ సీఆర్ఆర్‌ను పెంచితే బ్యాంకుల వద్ద ఉండే ద్రవ్యం తగ్గిపోతుంది. షెడ్యూల్డ్ బ్యాంకులు కొంత నిర్దిష్ట ద్రవ్యాన్ని తప్పనిసరిగా ఆర్‌బీఐ వద్ద ఉంచాలి. దీన్నే సీఆర్ఆర్ అంటారు. సీఆర్ఆర్, వడ్డీ రేట్లు మార్కెట్‌లో చలామణిలో ఉన్న ద్రవ్య ప్రవాహ వేగాన్ని అడ్డుకట్ట వేయడానికి లేదా గతిశీలత పెంచడానికి ఉపయోగపడతాయి.

స్టాట్యూటరీ లిక్విడిటీ రేషియో (ఎస్ఎల్ఆర్)

వాణిజ్య బ్యాంకులు తమ రోజువారీ వ్యాపారంలో కాలానుగత రుణాలు, బంగారం, ధరావతులు లేదా సెక్యూరిటీస్.. అన్నీ ద్రవ్యత్వ సంపత్తిగా అంటే లిక్విడ్ అసెట్స్‌గా కలిగి ఉంటాయి. బిజినెస్ డే ముగిసే సరికి ప్రతి బ్యాంక్.. దాని రోజు వారీ నికర డిమాండ్, రుణాలు ద్రవ్యత్వ సంపత్తికి కనీస అనుపాతంలో ఉండేలా చూసుకోవాలి. ఈ కనీస అనుపాత రాశినే చట్టపర ద్రవ్యత్వ రాశి నిష్పత్తి (ఎస్ఎల్ఆర్)గా నిర్వచిస్తారు.

రెపో రేటు

వాణిజ్య బ్యాంకులకు ధరావతుల (సెక్యూరిటీస్) ఆధారంగా రిజర్వ్ బ్యాంక్ స్వల్పకాలిక అప్పుగా ఇచ్చే మొత్తంపై వసూలు చేసే వడ్డీ రేటును రెపో రేటు అంటారు.

రివర్స్ రెపో రేటు

వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకొనే అప్పుపై ఆర్‌బీఐ చెల్లించే వడ్డీ రేటును రివర్స్ రెపో రేటు అంటారు. వ్యవస్థలో అధిక ద్రవ్యం ఉన్నప్పుడు ఆర్‌బీఐ రివర్స్ రెపో రేటును పెంచి బ్యాంకులు తమ అనుత్పాదక ద్రవ్యాన్ని ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేసేలా చేస్తుంది.



Number of messages used per person?

BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The number of people (1)/ who fail each year (2)/ is now in (3)/ single figure. (4)/ no error (5)
2. The experiments (1)/ were carried out (2)/ under simulation (3)/ examination conditions. (4)/ no error (5)
3. The game will be (1)/ broadcasted (2)/ simultaneously (3)/ on TV and radio. (4)/ no error (5)
4. He seemed sincere (1)/ enough when (2)/ he said he (3)/ wants to help. (4)/ no error (5)
5. My teaching style (1)/ is similar (2)/ to that of most (3)/ other teacher. (4)/ no error (5)
6. A report showing (1)/ the company's current situation shows (2)/ how people are influenced by (3)/ TV advertisements. (4)/ no error (5)
7. Market research has shown (1)/ us people want quality, (2)/ not just (3)/ low prices. (4)/ no error (5)
8. Candidates which are (1)/ shortlisted for interview (2)/ will be contacted by the end (3)/ of the week. (4)/ no error (5)
9. If I was asked (1)/ to work (2)/ on Sundays, (3)/ I should resign. (4)/ no error (5)
10. Though many companies know the fact (1)/ that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ no error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. In order that training should be ______ it must be planned ______.
    1) affected…thoroughly
    2) affective…periodically
    3) executed…properly
    4) effective…systematically
    5) complete…beforehand
12. Terrorist groups ______ responsibility for the shootings and bomb ______.
    1) charged…blasts
    2) levied…plants
    3) claimed…attacks
    4) withdraw…pits
    5) involved…calls
13. She is very ______ to other people's feelings.
    1) sensible 2) sensibility
    3) sensation 4) sensitive
    5) sensitize
14. Paying children too much ______ when they misbehave can be self ______.
    1) pampering…appealing
    2) negligence…destruction
    3) attention…defeating
    4) care…appease
    5) love…developing
15. Market researches often segment the population on the ______ of age and ______ class.
    1) grade…economy
    2) rate…affluent
    3) unit…security
    4) track…wealthy
    5) basis…social

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) If you knew the improved card deal is better than other cards you have, you may want to consider keeping it and cancelling the other card instead. Otherwise, cancel the card that you had decided to give up.
B) The first step in cancelling a card is to contact the card issuer. Some issuers let you cancel an account by phone. You may be transferred to a customer care officer who will try to convince you to keep the card.
C) Be sure to ask your issuer to record that the account was "closed at customer's request."
D) Make a note of the day and time you called and the person you talked to for your records. A written confirmation that an account has been closed should be sent to you from the card issuer.
E) Go ahead and listen. They may be willing to lower your interest rate, waive an annual fee or upgrade your card. Some issues have been known to offer plane tickets or travel vouchers to customers who want to cancel a card.
F) Keep this notice carefully for your records. If anything goes wrong with the account at a later date, you've got proof that you closed it.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21 - 25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. We are concrete seeking new ways of expanding our membership.
    1) evidence
    2) fastly
    3) purposely
    4) currently
    5) no correction required
22. Rumours that he have flown from the country were promptly scotched by his wife.
    1) had to flow 2) had been flew
    3) had fled
    4) had been flowing
    5) no correction required
23. Coal is a natural resource, which constitutes approximately 85% of the total fossil fuel reservation in the world.
    1) reserves
    2) reserved
    3) reserve
    4) reserving
    5) no correction required
24. Even among the native users of English, plain and direct language is regarded as a virtue in communication.
    1) between a native
    2) between an native
    3) among a native
    4) among nativity
    5) no correction required
25. Professional person at the work place frequently dealing in material which he must understand and also remember for future use.
    1) dealt with material
    2) deal in material
    3) deals with materials
    4) deal among materials
    5) no correction required

Directions (Q. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The first commercial SMS message was sent over the Vodafone GSM network in the United Kingdom on 3 December 1992, from Neil Papworth of Sema Group to Richard Jarvis of Vodafone. The text of the message was "Merry Christmas." The first SMS typed on a GSM phone is claimed to have been sent by Riku Pihkonen, an engineer student at Nokia in 1993.

Initial growth was slow, with customers in 1995 sending on an average only 0.4 messages per GSM customer per month. By the end of 2000, the average number of messages per user reached 35.

Short message services are developing very rapidly throughout the world. In 2000, just 17 billion SMS messages were sent; in 2001 the number was up to 250 billion and 500 billion SMS messages in 2004. At an average cost of USD 0.10 per message, this generates revenues in excess of $50 billion for mobile telephone operators and represents close to 100 text messages for every person in the world.

SMS is particularly popular in Europe, Asia - excluding Japan, Australia and New Zealand. Popularity has grown to a sufficient extent that the term texting has entered the common **lexicon.** In China, SMS is very popular, and has brought service providers significant profit; it is also a very influential and powerful tool in the Philippines, where the average user sends 10-12 text messages a day. The Philippines alone sends on the average 400 million text messages a day, more than the annual average SMS volume of countries in Europe, and even China. SMS is hugely popular in India, where youngsters often exchange lots of text messages, and companies provide alerts, infotainment, news, cricket scores, railway/airline booking, mobile billing and banking services on SMS. In India, metropolitan media outlets often take real-time polls and audience opinion through SMS, via reserved 4-digit numbers that redirect the information to the respective aforementioned outlets based on designated prefix codes.

26. The Asian country where SMS is not very popular is
    1) Philippines 2) Japan
    3) Australia 4) China
    5) Europe
27. The number of messages that an average user sends in the Philippines is
    1) more than the annual average SMS volume of countries in Europe, and even China
    2) more than the annual average SMS volume of countries in India, and even China
    3) more than the annual average SMS volume of countries in Europe, Australia and even China
    4) more than or equal to the annual average SMS volume of countries in Europe, and even China
    5) less than the annual average SMS volume of countries in Europe, and even China
28. Services provided by SMS to Indian users include
    1) emergency services
    2) fire services
    3) mobile billing
    4) 108 services
    5) counseling
29. Average number of messages used per person
    1) 10-12 messages a day
    2) 400 million text messages a day
    3) 100 text messages
    4) 500 messages
    5) 2000 messages per day
30. Lexicon means
    1) glossary
    2) glossy
    3) lustrous
    4) inventory
    5) catalog

KEY

1) 4	2) 3	3) 2	4) 4
5) 4	6) 5	7) 2	8) 1
9) 1	10) 3	11) 4	12) 3
13) 4	14) 3	15) 5	16) 5
17) 5	18) 2	19) 1	20) 1
21) 4	22) 3	23) 1	24) 5
25) 3	26) 2	27) 1	28) 3
29) 1	30) 1		